

'అభివృద్ధి ఎంత ముఖ్యమో...
సంక్షేమమూ అంతే ముఖ్యం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 18
సంచిక: 57

సోమవారం 19-5-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



భద్రత భేష్.. వసతులు సూపర్


- సచివాలయం, కమాండ్ కంట్రోల్ సెంటర్లకు మిస్ వరల్డ్ పోటీదారులు

12లో

సచివాలయంలో ఏర్పాటు చేసిన తేనీటి విందులో మిస్ వరల్డ్ క్రిస్టినా, మంత్రి జూపల్లి, సీఎస్ తదితరులు



Cheil-26363/25



Own now at ₹ 3612/month*

HDFC BANK | BAJAJ FINSERV | IDFC FIRST Bank | TVS CREDIT | HDB FINANCIAL SERVICES | Samsung Finance+

samsung.com

Please dispose of e-waste and plastic waste responsibly. Customers can WhatsApp on 180057267864 for information on e-waste/plastic waste.

Image simulated for illustrative purpose only. Actual UX/UI may differ. Color subject to availability. Samsung login is required for certain AI features. Samsung does not make any promises, assurances or guarantees as to the accuracy, completeness or reliability of the output provided by AI features. Samsung promotes responsible use of Artificial Intelligence (AI) features. Gemini is a trademark of Google LLC. Results for illustrative purposes and may vary. Check responses for accuracy. Compatible with certain features and with certain accounts. Internet connection required. Available on select devices, languages, and countries. Only available to users 18 years and older. *T&C apply, ₹ 3612/month EMI computed on the price of ₹ 129999 for 1 Unit of Galaxy S25 Ultra 12GB|256GB with gross EMI tenure of 36 months and 12 months EMI as downpayment. Final price at sole discretion of dealer. Eligibility of EMI at the sole discretion of the financiers including those listed on Samsung Finance+ (Financier T&C applies). Samsung disclaims any liabilities with the same. Offer may be revised at any point of time. Samsung disclaims any liabilities thereof. All third party logos/brands are trademarks /registered trademarks of the respective brand/company.

Scan to experience

Or WhatsApp 'S25' to 9870 494949 to buy now at Samsung Experience Store

Cheil-26406/25

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 57

సోమవారం 19-5-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ఎన్ని కరువులనైనా ఎదుర్కోగలగాలి.. దీని కోసం ఆర్థికంగా ఎదగాలి'



గమ్యం చేరని నిఘా నేత్రం

విఫలమైన పీఎస్ఎల్వీ సీ–61 ప్రయోగం. కక్ష్యలోకి చేరుకోని ఉపగ్రహం -6లో



గుజరాత్ దర్జాగా...

ఐపీఎల్ టోర్నీలో 'ప్లే ఆఫ్స్'కు చేరిన గుజరాత్, పంజాబ్, బెంగళూరు. -14లో



140 మంది మృతి

ఇజ్రాయెల్ సైన్యం గాజాపై జరిపిన తాజా వైమానిక దాడుల్లో చిన్నారులు, మహిళలు సహా 140 మంది మృతిచెందారు.

వివరాలు 6లో ▸



లష్కరే కీలక నేత హతం

లష్కరే కీలక నేత రజావుల్లా నిజామనీ ఖలీద్ అలియాస్ అబూ సైఫుల్లా ఖలీద్ గుర్తు తెలియని వ్యక్తుల కాల్పుల్లో మృతిచెందాడు.

వివరాలు 6లో ▸



ట్రంప్ టీంలో మాజీ ఉగ్రవాదులు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సలహా సంఘంలో ఇద్దరు మాజీ ఉగ్రవాదులకు 'శ్వేతసౌధం' చోటుకల్పించింది.

వివరాలు 6లో ▸



సీజేఐకి ఇచ్చే గౌరవం ఇదేనా?

తొలిసారి స్వరాష్ట్రానికి వస్తే మహారాష్ట్ర ప్రభుత్వం ప్రొటోకాల్ పాటించకపోవడాన్ని సీజేఐ జస్టిస్ గవాయ్ తప్పుబట్టారు.

వివరాలు 6లో ▸

ఘోర అగ్నిప్రమాదం

17 మంది బలి



మృతుల్లో 8 మంది చిన్నారులు

అందరూ బంధువులే..

పాతబస్తీలోని గుల్జార్‌హౌస్‌లో పెను విషాదం



అయ్యో పాపం

- భవనంలో షార్ట్ సర్క్యూట్, ఉడ్ పార్టిషన్ గదులతో మంటల వ్యాప్తి.. పొగ పీల్చడం వల్లే ఎక్కువ మంది మృతి
- ఇరుకు మార్గాలు, మెట్ల మార్గానికి తాళంతో లోపల ఇరుక్కుపోయిన కుటుంబం.. లోపలన్నీ విషాద దృశ్యాలే
- పిల్లలను కాపాడటానికి యత్నించిన మహిళలు.. వారిని హత్తుకొని అపస్మారక స్థితిలో కనిపించిన వైనం
- రాష్ట్ర ప్రభుత్వం రూ. 5 లక్షల చొప్పున, కేంద్రం రూ. 2 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటన

ఎగసిపడుతున్న అగ్నికీలలను అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

సాక్షి, హైదరాబాద్/చార్మినార్/దూద్‌బౌలి: అది హైదరాబాద్ పాతబస్తీలోని ఓ భవనం. ముందు దుకాణాలు ఉంటే, వెనుక అంతస్తుల్లో ఇళ్లు ఉన్నాయి. తెల్లవారుజామున అకస్మాత్తుగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ చోటుచేసుకుంది. దీంతో మంటలు చెలరేగాయి. గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు మొదటి, రెండో అంతస్తుల్లోకి దట్టమైన పొగ, మంటలు విస్తరించాయి. గ్రౌండ్, మొదటి, రెండో అంతస్తులో నిద్రిస్తున్న 23 మందిని చుట్టుముట్టాయి. మంటల తీవ్రతతో పాటు పొగ పీల్చడంతో అపస్మారక స్థితికి చేరుకున్న నాలుగు కుటుంబాలకు చెందిన 8 మంది చిన్నారులు సహా 17 మంది ప్రాణాలు కోల్పోయారు. నలుగుర్ని అగ్నిమాపక సిబ్బంది కాపాడగా.. మంటల్ని తొలుత గమనించిన

మిగతా 2వ పేజీలో ▶

అడుగడుగునా నిర్లక్ష్యమే!

- గుల్జార్ హౌస్ ప్రమాద భవనంలో అన్నీ ఉల్లంఘనలే

సమగ్ర విచారణకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

నాసి రకం కేబుళ్లు.. అధిక వినియోగం!

గుల్జార్‌హౌస్ ఘటనపై రాష్ట్రపతి, ప్రధాని, సీఎం సహా ప్రముఖుల దిగ్భ్రాంతి

- వివరాలు 2,3 పేజీల్లో ▶

NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE | Venkys CHICKEN

Suggested Today's Eggs & Broiler Chicken Hyderabad Zone Rates

12 Eggs Retail Rate	Ex Farm Live Bird	125 kg	Dressed with Skin	213 kg
₹ 74	Retail Live Bird	147 kg	Skin Less	243 kg

Issued in the interest of consumers

ఉగ్రకుట్ర భగ్నం

హైదరాబాద్‌లో డమ్మీ బ్లాస్ట్‌లకు కుట్ర.. ఇద్దరు ఐసిస్ సానుభూతిపరుల అరెస్ట్

- విజయనగరంలో ఒకరు, హైదరాబాద్‌లో మరొకరు అదుపులోకి..
- తెలంగాణ కౌంటర్ ఇంటెలిజెన్స్, ఏపీ పోలీసుల జాయింట్ ఆపరేషన్
- పేలుళ్ల కోసం ప్రయోగాలు చేసేందుకు కెమికల్స్ కొన్న నిందితులు



సాక్షి, హైదరాబాద్/విజయనగరం/విజయనగరం క్రైమ్: తెలంగాణ కౌంటర్ ఇంటెలిజెన్స్, ఏపీ పోలీసులు జాయింట్ ఆపరేషన్‌తో ఉగ్రకుట్రను భగ్నం చేశారు. సౌదీ అరేబియా కేంద్రంగా పనిచేస్తున్న పాకిస్తాన్ ప్రేరేపిత హ్యాండ్లర్ నెట్‌వర్క్ గుట్టురట్టు చేశారు. బాంబు పేలుళ్ల ప్రయోగాల కోసం పేలుడు పదార్థాలు సేకరిస్తున్న ఇద్దరిని వేర్వేరు చోట్ల అరెస్ట్ చేశారు. హైదరాబాద్ పోలీసుల సమాచారంతో తొలుత ఏపీలో విజయనగరానికి చెందిన సిరాజ్ ఉర్ రెహ్మాన్(29)ను పోలీసులు అరెస్ట్ చేశారు. తర్వాత సిరాజ్ విచారణలో చెప్పిన సమాచారాన్ని ఏపీ పోలీసులు తెలంగాణ పోలీసులతో పంచుకున్నారు. దీంతో తెలంగాణ కౌంటర్ ఇంటెలిజెన్స్ పోలీసులు (సీఐ సెల్) హైదరాబాద్ బోయగూడలో ఉంటున్న సయ్యద్ సమీర్(28)ను అరెస్ట్ చేశారు. అనంతరం సమీర్‌ను విజయనగరం తరలించారు.

డమ్మీ బ్లాస్ట్‌లకు కుట్ర

విజయనగరానికి చెందిన సిరాజ్.. సయ్యద్ సమీర్ కలిసి 'అల్ హింద్ ఇత్తెహాబుల్ మిసిలెన' (ఏహెచ్ఐఎమ్) పేరుతో పలు కార్యకలాపాలు చేస్తున్నట్లు పోలీసులకు కీలక ఆధారాలు లభించాయి. సౌదీ అరేబియాలోని ఓ హ్యాండ్లర్ నుంచి హైదరాబాద్, ఏపీలోని సానుభూతిపరులకు ఆదేశాలు వస్తున్నట్లు గుర్తించారు. పేలుళ్ల కోసం ప్రయోగాలు చేసేందుకు సంబంధిత కెమికల్స్ కొనుగోలు చేసి హైదరాబాద్‌లో డమ్మీ బ్లాస్ట్‌లు చేయాలని ప్లాన్ చేస్తున్నట్లు ఆధారాలు సేకరించారు. ఇందుకోసం సిరాజ్ విజయనగరంలో పేలుడు పదార్థాలు కొనుగోలు చేసినట్లు సీఐ సెల్‌కు సమాచారం అందింది. దీంతో తెలంగాణ సీఐ సెల్ అధికారులు విజయనగరం

మిగతా 12వ పేజీలో ▶

సంగారెడ్డిలో ఉగ్ర కలకలం 12లో



నాసి రకం కేబుళ్లు.. అధిక వినియోగం!

పాత వైరింగ్.. సామర్థ్యానికి మించి ఎలక్ట్రిక్ పరికరాలు



ఒకే సాకెట్ నుంచి రెండు మూడు ఏసీలకు కనెక్షన్లు
ఓవర్ లోడు కారణంగా తలెత్తుతున్న షార్ట్ సర్క్యూట్‌లు
మొన్న అఫ్జల్‌గంజ్‌లోని మూడంతస్తుల రెసిడెన్షియల్ బిల్డింగ్‌లో..
నేడు గుల్జార్‌హౌస్, మైలార్‌దేవ్‌పల్లి నివాస భవనాల్లో అగ్ని ప్రమాదాలు

నిర్దేశిత లోడు కంటే ఎక్కువ కరెంట్‌ను వినియోగించడం..
ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన అంతర్గత కేబుళ్లను ఇప్పటికీ మార్చక పోవడం..
కేబుల్ సామర్థ్యానికి మించి ఎలక్ట్రికల్ పరికరాలు వాడటం..
వైర్ల మధ్య జాయింట్లు ఎక్కువగా ఉండటం..
సరఫరాలో హెచ్చుతగ్గుల సమస్య తలెత్తుతుండటం..
ఏసీలు, కూలర్లు, రిఫ్రిజిరేటర్లు, గీజర్లు, వాషింగ్ మెషీన్లు, మిక్సీలు, ఒవెన్‌లు, ఐరన్ బాక్సులు, కంప్యూటర్లు, టీవీలు, ఫ్యాన్లు, లైట్లు రోజంతా ఆన్‌లోనే ఉంచడం..
విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌లు సంభవించడానికి ఇవే కారణాలు. వీటివల్లనే కేబుళ్లు హీటెక్కి, మీటర్, జాయింట్ల వద్ద నిప్పు రవ్వలు (స్పార్క్‌లు) చెలరేగుతున్నాయి.

ఇలా విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌ల ఫలితంగా మాల్స్, దుకాణాలు, ఇళ్లలో అగ్నిప్రమాదాలు జరుగుతున్నాయి. పెద్దయెత్తున ఆస్తి నష్టం జరుగుతోంది. కొన్ని ఘటనల్లో అగ్నికీలల్లో చిక్కు కోవడం, పొగతో ఊపిరాడకపోవడం లాంటి కారణాలతో పలువురు ప్రాణాలు సైతం కోల్పోతున్నారు. హైదరాబాద్‌లో తరచూ ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎప్పటికప్పుడు లైన్లు, వైర్లు, ప్లగ్ లు, ఎంసీబీలు, ఎర్త్‌రాడ్‌ల పని తీరును పరిశీలించి, దెబ్బతిన్న కేబుళ్లను గుర్తించి, వాటి స్థానంలో కొత్తవి అమర్చుకోవాల్సి ఉన్నా వాణిజ్య, గృహ వినియోగదారులు పట్టించుకోవడం లేదు. పాతబస్తీలోని పురాతన భవనాల్లోనే కాకుండా, కొత్తగా సీఆజీజీ అనుమతి పొందిన హైరైజ్ భవనాల్లోనూ విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌లు జరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది.

సాక్షి, రంగారెడ్డి జిల్లా

పాతబస్తీ అయినా.. కొత్త హైరైజ్‌లైనా

పాతబస్తీలో ఏళ్ల క్రితం నిర్మించిన భవనాల్లోనే కాదు గచ్చిబౌలి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, కోకాపేట్, నార్సింగి, మణికొండ, నానక్‌రాంగూడల్లో కొత్తగా నిర్మించే హైరైజ్ బిల్డింగ్స్‌లోనూ విద్యుత్ లైన్లు సరిగా ఉండటం లేదు. భవిష్యత్తు అవసరాల మేరకు లోడు ఎంపిక మొదలు..లైన్ల ఏర్పాటు వరకు అన్నీ లోపభూయిష్టంగానే ఉంటున్నాయి. భవన నిర్మాణ సమయంలో ఉన్న ఆలోచనకు, అవసరాలకు భిన్నంగా ఆ తర్వాత ఇంట్లోకి అనేక విద్యుత్ పరికరాలు వచ్చి చేరుతున్నాయి. వాణిజ్య భవనాల్లో తక్కువ సామర్థ్యంతో లైన్లు, కేబుళ్లు వేయడం జరుగుతోంది. నిర్మాణ ఖర్చులు తగ్గించుకునే క్రమంలో కనీస అనుభవం, అర్హత లేని ప్రైవేటు విద్యుత్ కాంట్రాక్టర్లతో విద్యుత్ పనులు చేయిస్తున్నారు. వీరు భవిష్యత్తు అవసరాలను పరిగణనలోకి తీసుకోకుండా కేవలం తాత్కాలిక అవసరం కోసం లైన్లు ఏర్పాటు చేస్తున్నారు. నాసిరకం కేబుళ్లు, ఏబీ స్విచ్‌లు, ఎంసీబీలు వాడుతున్నారు. కంటికి కన్పించే ప్లగ్‌లు, స్విచ్ బోర్డులు, లైట్లు మినహా గోడలు, స్లాబులో వాడే వైర్లు నాసిరకంగా ఉంటున్నాయి. సరైన ఎర్తింగ్ ఉండటం లేదు. మరోవైపు ఒకే ప్లగ్/ వైరు నుంచి మల్టిపుల్ కనెక్షన్లు ఇస్తున్నారు. ఒకే సాకెట్ నుంచి ఒకటికి మించిన ఏసీ కనెక్షన్లు ఉంటున్నాయి. ఇలా సామర్థ్యానికి మించి ఏసీలు, వాషింగ్ మెషీన్లు, గీజర్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలకు విద్యుత్ ఎక్కువగా వినియోగించడం వల్ల బలహీనంగా ఉన్న కేబుళ్లు తట్టుకోలేకపోతున్నాయి. కేబుళ్ల జాయింట్ల వద్ద స్పార్క్‌లు చెలరేగుతున్నాయి.

పేలుతున్న ఏసీ కంప్రెషర్లు

ఒకప్పుడు ధనవంతుల ఇళ్లల్లో మాత్రమే కన్పించే ఏసీలు, కూలర్లు, వాషింగ్ మెషీన్లు, గీజర్లు...ప్రస్తుతం సాధారణ మధ్య తరగతి ప్రజల ఇళ్లలోనూ దర్శనమిస్తున్నాయి. మారుతున్న జీవనశైలి ఇందుకు దోహదపడుతోంది. ప్రతిఒక్కరూ సౌకర్యాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. అందుకు తగినట్టుగా తయారీ కంపెనీలతో పాటు పలు బ్యాంకులు జీరో వడ్డీ రుణాలు ఇస్తున్నాయి. వాయిదా పద్ధతుల్లో చెల్లించే అవకాశం కల్పిస్తున్నాయి. దీంతో సాధారణ ప్రజలు కూడా విలువైన ఎలక్ట్రానిక్ పరికరాలను కొనుగోలు చేస్తున్నారు. హైదరాబాద్‌లోని చాలాచోట్ల 60 నుంచి 100 గజాల స్థలంలోనూ ఐదారు అంతస్తుల్లో భవనాలు నిర్మిస్తున్నారు. కొందరు కింద షాపులను ఏర్పాటు చేసి, పైన నివాసానికి వీలుగా చిన్న చిన్న గదులను నిర్మిస్తున్నారు. నివాసితులు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలతో పాటు ఏసీలూ వినియోగిస్తున్నారు. ఒక ఇంట్లోనే రెండు, మూడు ఏసీలు ఉంటున్నాయి. అయితే ఇరుకు గదుల్లో గాలి, వెలుతురు కూడా సరిగా ఉండటం లేదు. వైరింగ్ సరిగా లేకపోవడం, సామర్థ్యానికి మించి కరెంటు వాడటం, మండే ఎండల్లో రోజంతా ఏసీలు ఆన్‌లో ఉంటుండటం వల్ల కంప్రెషర్లు పేలిపోతున్నాయి.

బయటకు రాలేక, మంటల్లో చిక్కుకుని..



కిటికీ, డోర్ కర్టెన్లు, పరుపులు, దుస్తువులకు నిప్పు అంటుకుని వేగంగా మంటలు వ్యాపిస్తున్నాయి. ఆ సమయంలో బయటికి వెళ్లేందుకు ఇరుకైన దారి ఉండటం, తలుపులకు తాళాలు వేసి ఉండటం, ఇతరత్రా కారణాలతో బయటకు వెళ్లలేక కొన్ని సందర్భాల్లో ప్రాణాలు కోల్పోవాల్సి వస్తోంది. మొన్న అఫ్జల్‌గంజ్‌లోని మూడంతస్తుల భవనం, తాజాగా చార్మినార్ సమీపంలోని గుల్జార్‌హౌస్, మైలార్‌దేవ్‌పల్లిలో జరిగిన అగ్ని ప్రమాదాలకు ఇలాంటి పరిస్థితులే కారణమని స్పష్టమవుతోంది.



బాధితులను బయటకు తీసుకువస్తున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది



ప్రమాద బాధితులను అంబులెన్స్‌లో తరలిస్తున్న స్థానికులు



పరిస్థితిని సమీక్షిస్తున్న పోలీసులు

ఇలా చేస్తే సేఫ్...

- బీఐఎస్ ప్రమాణాలతో తయారు చేసిన ఎలక్ట్రిక్ ఉపకరణాలనే భవనాల్లో ఉపయోగించాలి.
- విద్యుత్ మరమ్మతులు క్వాలిఫైడ్ ఎలక్ట్రీషియన్‌తో మాత్రమే చేయించాలి.
- అతుకుల తీగలు, లూజ్ వైరింగ్ ప్రమాదకరం.
- విద్యుత్ ద్వారా నడిచే రిఫ్రిజిరేటర్, ఓవెన్లను గాలి, వెలుతురు బాగా వచ్చే చోట ఉంచాలి.
- అధిక ఓల్టేజీ ఉన్న ఉపకరణాలకు ఎర్తింగ్ ఉన్న 3 పిన్ సాకెట్లను వాడాలి.
- ల్యాప్‌టాప్, మొబైల్ చార్జింగ్ బెడ్ దగ్గర పెట్టకూడదు.
- విద్యుత్ పరికరాలకు నిప్పు అంటుకుంటే నీళ్లతో ఆర్పవద్దు. దీని వల్ల కరెంట్ షాక్ తగిలి ప్రాణాపాయం కలగొచ్చు.
- వెంటనే విద్యుత్‌ను ఆఫ్‌చేసి, పొడి ఇసుకతో లేదా కార్బన్ డయాక్సైడ్ ఎక్స్టింగ్విషర్‌తో మంటలను ఆర్పాలి.
- ఎత్తయిన భవన నిర్మాణాలకు స్థానిక అగ్నిమాపకశాఖ అధికారి నుంచి అనుమతి తప్పనిసరి. హైడ్రెంట్లు, ఫైర్ ఎగ్జిట్లు, స్ప్రింక్లర్లు, పంప్ రూమ్ వంటివి ఏర్పాటు చేయాలి.
- ప్రతి అంతస్తులో ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, భద్రతపై సైన్ బోర్డులు ప్రదర్శించాలి. స్మోక్ అలారం ఏర్పాటు చేయడంతోపాటు ఏటా భద్రతా తనిఖీలు నిర్వహించాలి.
- ప్రతి అంతస్తులో ఫైర్ ఎక్స్టింగ్విషర్లు ఉండాలి. మూడు నెలలకోసారి ఫైర్ డ్రిల్స్ నిర్వహించాలి.
- అగ్నిప్రమాదాలు జరిగితే కంగారుపడకుండా ఫైర్ అలారం మోగించి అప్రమత్తం చేయాలి. లిఫ్టులకు బదులు మెట్ల మార్గాన్ని వినియోగించాలి.
- మంటలు ఎక్కువగా ఉన్న సమయంలో నడవకుండా ముఖానికి గుడ్డ కప్పుకొని, పాకుతూ అక్కడి నుంచి బయటికి రావాలి.
- మంటల్లో చిక్కుకుంటే బిగ్గరగా అరుస్తూ, చేతి రుమాలును కిటికీ లేదా బాల్కనీ నుంచి ఊపుతూ బయట ఉన్న వాళ్లకు సమాచారం ఇవ్వాలి.

ఘోర అగ్నిప్రమాదం 17 మంది బలి

మొదటి పేజీ తరువాయి

ఇద్దరు మహిళలు బయటకు పరుగులు తీసి ప్రాణాలు దక్కించుకున్నారు. మృతుల్లో కొందరికి కాలిన గాయాలయ్యాయి. ఆదివారం ఉదయం 5.30–6.00 గంటల సమయంలో చార్మినార్ సమీపంలోని గుల్జార్ హౌస్‌లో ఈ ఘోర అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. హైదరాబాద్ నగర చరిత్రలో ఒకే అగ్ని ప్రమాదంలో ఇంత మంది చనిపోవడం, అంతా బంధువులే కావడం ఇదే తొలిసారి.

అంతా బంధువులే...

రాజస్తాన్‌కు చెందిన అన్నదమ్ములు ప్రహ్లాద్ మోడీ, రాజేందర్ మోడీ, బంకట్ మోడీ, దేవనాథ్ మోడీ, సునీల్ మోడీ ఏళ్ల క్రితం నగరానికి వలసవచ్చి బంగారం, వెండి, ముత్యాల వ్యాపారం చేస్తున్నారు. ప్రహ్లాద్ మోడీ, రాజేందర్ మోడీ, బంకట్ మోడీ తమ కుటుంబాలతో గుల్జార్ హౌస్‌లోని చార్మినార్ రోడ్డులో ఉన్న భవనంలో నివసిస్తున్నారు. దీని ముందు భాగంలో శ్రీకృష్ణ పెరల్స్, మోడీ పెరల్స్ పేరుతో వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. సునీల్ మోడీ అత్తాపూర్, దేవనాథ్ మోడీ హిమాయత్ నగర్‌లో ఉంటున్నారు. గుల్జార్ హౌస్‌లోని దుకాణాల (జీ ప్లస్ వన్) వెనుక ఉన్న రెండు అంతస్తుల భవనం గ్రౌండ్ ఫ్లోర్‌లో గోదాములు, షాపులు, కార్ఖానాలు ఉండగా..మొదటి, రెండో అంతస్తుల్లో ప్రహ్లాద్, రాజేందర్, బంకట్ కుటుంబాలు ఉంటున్నాయి. రాజస్తాన్‌లో ఉండే సునీల్ బంధువులు వేసవి సెలవులు కావడంతో అత్తాపూర్‌కు వచ్చారు. వారాంతం నేపథ్యంలో శనివారం కొందరు బంధువులు గుల్జార్ హౌస్‌లోని ముగ్గురు అన్నదమ్ముల ఇళ్లకు వచ్చారు. ఇలా మొత్తం 23 మంది ఆ భవనంలో శనివారం రాత్రి నిద్రపోయారు.

మీటర్ వద్ద మొదలైన మంటలు

ఈ భవనం గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న కరెంట్ మీటర్లతో పాటు సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కూడా కొన్ని రోజులుగా నిప్పు రవ్వలు ఎగిసిపడుతున్నాయి. ఈ క్రమంలోనే ఆదివారం తెల్లవారుజామున గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న కరెంట్ మీటర్ల వద్ద షార్ట్ సర్క్యూట్ జరిగింది. దీంతో అక్కడ మొదలైన మంటలు మొదటి, రెండో అంతస్తులకు విస్తరించాయి. మంటలకు ఫస్ట్ ఫ్లోర్‌లో ఉన్న ఏసీ కంప్రెషర్ పేలడంతో అగ్ని కీలలు మరింత ఎగిశాయి. ఉదయం సుమారు 6.15 గంటల సమయంలో వీటిని గుర్తించిన గ్రౌండ్ ఫ్లోర్‌లోని ఇద్దరు మహిళలు బయటకు పరిగెత్తుకుంటూ వచ్చారు. మంటలు అంటుకున్న విషయాన్ని అక్కడి వారికి చెప్పారు. ఉదయం 6.16 గంటలకు అగ్నిమాపక శాఖకు సమాచారం అందింది. 6.20 గంటలకు మొఘల్‌పుర నుంచి మొదటి ఫైర్ ఇంజన్ ఆ ప్రాంతానికి చేరుకుంది. అదే సమయంలో మక్కా మసీదులో ప్రార్థనలు ముగించుకుని బయటకు వచ్చిన ఐదుగురు యువకులు ఈ భవనం వద్దకు చేరుకున్నారు. అప్పటికే మంటలు, దట్టమైన పొగ ఆ భవనాన్ని చుట్టేశాయి. రోడ్డు పైన ఉన్న ఇద్దరు మహిళలు భవనంలో తమ కుటుంబీకులు ఉన్నారని, వారిని కాపాడాలని ఆర్తనాదాలు చేస్తున్నారు. దీంతో అగ్నిమాపక శాఖ అధికారులతో పాటు ఐదుగురు యువకులూ ఇంట్లోకి వెళ్లే మార్గాల కోసం అన్వేషించారు.

అపస్మారక స్థితిలో.. సెల్‌ఫోన్ లైట్ వెలుగుతూ..

సహాయ చర్యల సందర్భంగా భవనం మొదటి అంతస్తులోని గదుల్లో అత్యంత హృదయ విదారక దృశ్యాలు కన్పించినట్లు అధికారులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. లోపల నుంచి గడియ పెట్టి ఉన్న ఓ గదిలో ఓ మహిళతో పాటు నలుగురు చిన్నారులు ఒకేచోట పడిపోయి ఉన్నారు. ఇంకో గదిలో మరో నలుగురు చిన్నారులతో పాటు ఉన్న మహిళ ఓ మూలన అపస్మారక స్థితిలో కూర్చుని ఉంది. అయితే ఆమె చేతిలో ఉన్న సెల్‌ఫోన్ లైట్ వెలుగుతూ కన్పించింది. చిన్నారులు కూడా అపస్మారక స్థితిలోనే ఉన్నారు. దొంగల భయంతో భవనం టెర్రస్ పైకి వెళ్లే స్టెయిర్ కేస్‌కు గేటు ఏర్పాటు చేసుకున్న మోడీ కుటుంబీకులు దానికి తాళం వేశారు. గేటుకు తాళం వేయడంతో పొగలో రెండో అంతస్తులో ఉన్న వాళ్లు పైకిగానీ, కిందికి గానీ వెళ్లడానికి వీల్లేకుండా పోయింది.

భవనానికి 3 అడుగులు, 1 అడుగు మార్గాలే..

మోడీ కుటుంబాలు నివసించే ఈ భవనం ముందు రోడ్డు వైపు శ్రీకృష్ణ, మోడీ పెరల్స్‌తో పాటు ఇతర దుకాణాలు ఉన్నాయి. వెనుక వైపు ఉన్న నివాస భవనంలోకి వెళ్లడానికి ఓ చోట మూడు అడుగులు, మరోచోట అడుగు వెడల్పుతో ఉన్న మార్గాలే ఉన్నాయి. భవనం గ్రౌండ్ ఫ్లోర్ నుంచి మొదటి, రెండో అంతస్తులకు వెళ్లడానికి కేవలం రెండున్నర అడుగుల వెడల్పుతో ఉన్న ఒకే ఒక్క మెట్లగది (స్టెయిర్ కేస్) ఉంది. మూడు అడుగుల వెడల్పు మార్గం ఉత్తర దిక్కున ఉండగా.. ఈ మెట్లు దక్షిణ దిక్కున ఉన్నాయి. దీంతో వ్యాపించిన మంటలు, పొగలో ఆ మెట్ల వద్దకు చేరుకోవడం సాధ్యం కాలేదు. భవనంలో ఎక్కువగా వుడ్ (చెక్క) పార్టిషన్‌తో ఉన్న గదులు ఎక్కువగా ఉండటం మంటలు త్వరగా వ్యాపించడానికి కారణమైంది.

గోడలకు రంధ్రాలు చేసి లోపలకు..

పక్కన ఉన్న మరో భవనం మొదటి అంతస్తుకు చేరిన యువకులు, అగ్నిమాపక అధికారులు అక్కడ ఉన్న, ఈ భవనంలోని మరో గోడకు రంధ్రాలు చేసి ఇంట్లోకి నీళ్లు చిమ్మారు. మంటలు కొద్దిగా అదుపులోకి వచ్చాక మొదటి అంతస్తులోకి వెళ్లిన అధికారులు, యువకులు అక్కడ దాదాపుగా అపస్మారక స్థితిలో ఉన్న 17 మందితో పాటు రెండో అంతస్తు నుంచి టెర్రస్ పైకి వెళ్లి పొగతో ఉక్కిరిబిక్కిరైన నలుగురిని బయటకు తీసుకువచ్చారు. అపస్మారక స్థితిలో ఉన్న 17 మందిని వివిధ ఆస్పత్రులకు తరలించగా వారు చనిపోయినట్లు వైద్యవర్గాలు ప్రకటించాయి.

భార్య, పిల్లల కోసం లోపలికి వెళ్లి..

ప్రహ్లాద్ మోడీ పెద్ద కుమారుడైన పంకజ్ మోడీ అగ్ని ప్రమాదాన్ని గుర్తించి మొదటి అంతస్తులోని గదిలోంచి బయటికి వచ్చి పోలీసు, ఫైర్ విభాగాలకు సమాచారం ఇచ్చారు. ఆపై తన భార్య, పిల్లల్ని రక్షించడం కోసం మళ్లీ గదిలోకి వెళ్లారు. ఇంతలో దట్టమైన పొగలు, మంటలు వ్యాపించాయి. భార్య పిల్లలతో సహా పంకజ్ మోడీ కూడా వాటిల్లో చిక్కుకుని బయటకు రాలేకపోయారు. తాను తప్పించుకునే అవకాశం వచ్చినా కుటుంబ సభ్యులను కాపాడాలని ప్రయత్నించి మృత్యువాతపడ్డాడు.

ప్రహ్లాద్ కుటుంబం అంతా మృత్యువాత

ఈ ప్రమాదంలో ప్రహ్లాద్ మోడీ కుటుంబంలోని అంతా చనిపోయారు. ప్రహ్లాద్ మోడీకి ఇద్దరు కుమారులు, నలుగురు కుమార్తెలు. వేసవి సెలవులకు తన తండ్రి ప్రహ్లాద్ మోడీ ఇంటికి వచ్చిన కుమార్తెలు వారి చిన్నారులు మృతి చెందారు. ప్రహ్లాద్ మోడీ మరో సోదరుడైన బంకట్ మోడీ టెర్రస్ పైకి వెళ్లి ప్రాణాలు రక్షించుకున్నారు. అయితే ఆయన కుమారుడు అభిషేక్ మోడీ, ఆయన భార్య మృతి చెందారు. బంకట్ మోడీతో పాటు రాజేందర్ మోడీతో పాటు ఆయన భార్య, మరో వ్యక్తి టెర్రస్ పైకి వెళ్లడంతో బతికిపోయారు. గోవింద్ మోడీ కుటుంబ సభ్యులు అత్తాపూర్‌లో నివసిస్తుండడంతో ప్రమాదం నుంచి బయటపడ్డారు. ప్రహ్లాద్ మోడీ కుటుంబ సభ్యులతో పాటు షోరూంల్లో పనిచేసే సిబ్బంది సైతం ఇదే భవనంలో నివసిస్తుంటారు. వేసవి కాలం కావడంతో ఆ పని వారంతా టెర్రస్ పైన పడుకోవడంతో మృత్యువు నుంచి తప్పించుకున్నారు.

మృతులు వీరే

ప్రహ్లాద్ మోడీ(70), మున్ని (70), రాజేందర్ మోదీ (25), సుమిత్ర (60) హామీ (7), అభిషేక్ (31), శీతల్ (35), ప్రియాంచ్ (4), ఇరాజ్ (2), అరుషి (3), రిషబ్ (4), ప్రథం (ఒకటిన్నర ఏళ్లు), అనియాన్ (3), వర్ష (35), పంకజ్ (36), రజని (32) ఇద్దూ (4).

కిషన్‌రెడ్డి, పొన్నం, డీజీపీ సందర్శన

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, డీజీపీ జితేందర్, నగర సీపీ సీవీ ఆనంద్, అగ్నిమాపక శాఖ డీజీ వై.నాగిరెడ్డి, హైడ్రా కమిషనర్ రంగనాథ్, మేయర్ విజయలక్ష్మి, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, ఎమ్మెల్యేలు మీర్ జుల్ఫికర్ అలీ, అహ్మద్ బలాల, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఘటనా స్థలాన్ని సందర్శించారు.

అగ్నిమాపక శాఖపై కిషన్‌రెడ్డి ఫైర్

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అగ్నిమాపక శాఖపై ఆరోపణలు చేశారు. ఫైర్ ఇంజన్లు అర్ధగంట ఆలస్యంగా వచ్చాయన్నారు. అధికారుల వద్ద ప్రత్యేక, ఆధునిక అగ్నిమాపక ఉపకరణాలు లేవని మండిపడ్డారు. దీనివల్లే రెస్క్యూ ఆపరేషన్ ఆలస్యమై ప్రాణ నష్టం పెరిగిందని అన్నారు. ఈ ఆరోపణల్ని అగ్నిమాపక శాఖ డీజీ ఖండించారు. తమకు ఉదయం 6.16 గంటలకు కాల్ వచ్చిందని, మొఘల్‌పుర నుంచి 6.17కు బయలుదేరిన మొదటి ఫైరింజన్ 6.20 గంటలకు ప్రమాద స్థలికి చేరిందని స్పష్టం చేశారు. వెంటనే తీవ్రతను అంచనా వేసి మరో పది ఫైరింజన్లు, 70 మంది సిబ్బందిని మోహరించామని వివరించారు. ఆ భవనానికి ఒకే ఒక స్టెయిర్ కేస్ ఉండటం, అదీ ఇరుకైనది కావడంతో పాటు ఇతర కారణాలు ప్రమాద తీవ్రతను పెంచాయని అన్నారు. కాగా అగ్ని ప్రమాదంపై చార్మినార్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది.

మానసిక స్థితి సరిగా లేని వ్యక్తి చూపించాడు..

"ప్రతిరోజూ తెల్లవారుజామున ప్రార్థనల కోసం మక్కా మసీదుకు వస్తుంటాం. ఆదివారం ఉదయం ప్రార్థనలు ముగించుకుని బయటకు వచ్చా. ఆ సమయంలో మసీదు గేటు వద్ద నిలుచుని ఉన్న మానసిక స్థితి సరిగ్గా లేని వ్యక్తి డబ్బు అడగటంతో రూ.10 ఇచ్చా. అతడే గుల్జార్‌హౌస్ వద్ద పొగలు వస్తున్న భవనాన్ని చూపించాడు. నేను వెంటనే మరో నలుగురితో కలిసి అక్కడకు పరిగెత్తుకుంటూ వెళ్లా. గోడలకు రంధ్రాలు చేసి అగ్నిమాపక సిబ్బందితో కలిసి లోపలకు వెళ్లాం. అయినా 17 మంది ప్రాణాలు కోల్పోవడం చాలా బాధ కలిస్తోంది."

- మీర్ జాహెద్, గుల్జార్ హౌస్ వద్ద గాజుల వ్యాపారి

సరదాగా వెళ్లారు.. శవాలై వచ్చారు

అగ్ని ప్రమాదంలో రాజీవ్‌నగర్‌కు చెందిన ముగ్గురు మృతి

రహమత్‌నగర్ (హైదరాబాద్): బంధువులతో సరదాగా గడపాలని వెళ్లారు. శవాలుగా తిరిగొచ్చారు. ఒకే కుటుంబంలో ముగ్గురు మృత్యువాత పడటం ఎర్రగడ్డ డివిజన్ రాజీవ్‌నగర్ బస్తీ వాసులను కలచివేసింది. గుల్జార్ హౌస్ అగ్ని ప్రమాదంలో రాజీవ్‌నగర్‌కు చెందిన తల్లి, కొడుకు, కుమార్తె మృతి చెందారు. ఆటో మొబైల్స్ వ్యాపారం చేసే రాజేష్ జైన్ రాజీవ్‌నగర్‌లో ఉంటున్నారు. ఆయనకు భార్య శీతల్ (35), ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కాగా శనివారం ఉదయం శీతల్ తన తండ్రి ఇంటికి పిల్లల్ని తీసుకుని వెళ్లింది. అయితే పెద్ద కుమార్తె రాశి తాను చదువుకోవాలంటూ శనివారం సాయంత్రమే రాజీవ్‌నగర్‌లోని తమ నివాసానికి తిరిగి వచ్చింది. అక్కడే ఉండిపోయిన శీతల్, అరుషి, రిషబ్ మాత్రం ప్రమాదంలో చనిపోయారు.

పుట్టింటికి వెళ్లి మృత్యువాత



రజనీ అగర్వాల్

సనత్‌నగర్: వేసవి సెలవులు కదా..? పిల్లలను తీసుకుని ఇంటికి రా..తల్లీ! అని ఆ తండ్రి ఆశగా అడగడంతో కొడుకును తీసుకుని తన పుట్టిల్లు అయిన గుల్జార్‌హౌస్‌కు వెళ్లింది. అదృష్టవశాత్తూ తండ్రి పిలుపు మేరకు కొడుకు ముందు రోజు రాత్రే వెళ్లిపోగా, తల్లి అగ్ని ప్రమాదంలో మృత్యువాత పడింది. దీంతో ఆ కుటుంబం విషాదంలో మునిగిపోయింది. వస్త్ర వ్యాపారి వినోద్‌కుమార్ అగర్వాల్ తన భార్య రజనీ అగర్వాల్ (45), కొడుకు కుషాల్ అగర్వాల్, కుమార్తె తనూలతో కలిసి సనత్‌నగర్‌లో ఉంటున్నాడు. కుమార్తె ముంబైలో ఎంబీఏ చదువుతుండగా, కుమారుడు కుషాల్ ఇంటర్మీడియెట్ చదువుతున్నాడు. ఈ క్రమంలో కుమారుడు కుషాల్‌ను తీసుకుని రజని గుల్జార్ హౌస్‌కు వెళ్లింది. అయితే కుషాల్ ముందు రోజు రాత్రి ఇంటికి వచ్చేశాడు. అక్కడే ఉన్న రజని మాత్రం ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో మరణించింది.



మున్నీ, ప్రహ్లాద్ మోదీ



పంకజ్ మోదీ, వర్ష



అభిషేక్



సుమిత్ర, రాజేంద్ర మోదీ



పిల్లలతో వర్షా మోదీ

పది మందికి ఒకేసారి అంత్యక్రియలు

రాజేంద్రనగర్/మణికొండ/బంజారాహిల్స్: ఆదివారం ఉదయం గుల్జార్‌హౌస్ అగ్నిప్రమాదంలో మృతిచెందిన 17 మందిలో 10 మృతదేహాలకు ఆదివారం సాయంత్రం ఒకేసారి అంత్యక్రియలు నిర్వహించారు. కుటుంబ పెద్ద ప్రహ్లాద్ మోదీ, ఆయన భార్య మున్నీ, కుమారుడు పంకజ్, కోడలు వర్ష, తమ్ముడు రాజేందర్ మోదీ, మరదలు సుమిత్ర, తమ్ముని కుమారుడు అభిషేక్, మనుమలు, మనమరాళ్లు అనుయాన్, ఇదిక, ఐరాజ్‌ల మృతదేహాలను ఉస్మానియా ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం పురానాపూల్‌లోని శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. కాగా, ఈ ప్రమాదంలో బంజారాహిల్స్ రోడ్ నెం.3లో నివసించే ఏడేళ్ల బాలిక హర్షాలి గుప్తా కన్నుమూశారు. ఆమె శరీరం పూర్తిగా కాలిపోవటంతో కుటుంబ సభ్యులు అస్తికలకు ఆదివారం మధ్యాహ్నం పంజాగుట్ట స్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.



..ఎవరి మధ్యవర్తిత్వం అవసరం లేదట వెళ్లండి!



ఆదివారం ఘటన స్థలంలో సహాయక చర్యలు చేపడుతున్న అగ్నిమాపక సిబ్బంది



ఘటనా స్థలంలో వివరాలు తెలుసుకుంటున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

అడుగడుగునా నిర్లక్ష్యమే

సాక్షి, హైదరాబాద్/చార్మినార్: హైదరాబాద్ పాతబస్తీలోని గుల్జార్‌హౌస్ వద్ద ఆదివారం భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకున్న భవనం నిబంధనల ఉల్లంఘనకు నిలువెత్తు నిదర్శనంగా ఉంది. 'మోదీ పెరల్స్, శ్రీకృష్ణ పెరల్స్'సహా మొత్తం తొమ్మిది దుకాణాలు, నివాస గృహాలతో కూడిన ఈ భవనంలో అడుగడుగునా ఫైర్ సేఫ్టీ నిబంధనలు అతిక్రమించినట్లు స్పష్టంగా తెలుస్తోంది. ఎలాంటి ప్రమాద హెచ్చరిక వ్యవస్థలు లేకపోవటం వల్లనే నిప్పంటుకున్న విషయాన్ని అందులోనివారు సకాలంలో గుర్తించలేకపోయారు. నగరంలో ఇలాంటి నివాస గృహాలతో కూడిన మార్కెట్లు చాలా ఉన్నాయి. ఈ ప్రమాదం నేపథ్యంలో వాటి పరిస్థితి ఏంటనే ఆందోళన నెలకొంది. నిబంధనల ప్రకారం ఇలాంటి వాణిజ్య, నివాస సముదాయాల్లో ఉండాల్సిన వ్యవస్థలు, అగ్నిప్రమాదం జరిగిన భవనం వద్ద ఉన్న పరిస్థితి ఇదీ..

1 అగ్నిప్రమాదం జరిగిన భవనంలోని కమర్షియల్ భాగం గ్రౌండ్ ప్లస్ వన్‌గా, రెసిడెన్షియల్ కమ్ కమర్షియల్ భాగం గ్రౌండ్ ప్లస్ టూ విధానంలో విడివిడిగా నిర్మితమైంది. మొత్తం భవన విస్తీర్ణంలో 1/3 వంతు ఖాళీ స్థలం ఉండాలి. కానీ, ఖాళీ స్థలం మాట అటుంచితే కనీసం రాకపోకలు సాగించడానికి అవసరమైన స్థాయిలో దారి, మెట్లు కూడా లేవు.

2 భవనం చుట్టూ అగ్నిమాపక శకటాలు స్వేచ్ఛగా తిరిగేలా ఖాళీ స్థలం ఉండాలి. కానీ, ముందు వైపు ఉన్న ప్రధాన రహదారి తప్ప మరెక్కడికీ ఫైర్ ఇంజిన్ కాదు కదా.. ద్విచక్ర వాహనం కూడా పోలేని విధంగా ఉంది.

గుల్జార్‌హౌస్ ప్రమాద భవనంలో అన్నీ ఉల్లంఘనలే

- భారీ భవనంలోకి వెళ్లటానికి ఉన్నది ఒకే ఒక్క ఇరుకు దారి
- మూడు వైపుల ద్విచక్ర వాహనం కూడా వెళ్లలేని పరిస్థితి
- పాతబస్తీలో చాలాప్రాంతాల్లో అనుమతి లేకుండా నిర్మాణాలు
- 10–20 గజాల్లో సెల్లార్ సహా నాలుగైదు అంతస్తులు

3 ప్రమాదం జరిగితే బయటపడానికి వెలుపలి వైపు కూడా మెట్లు ఉండాలి. ఈ భవనానికి ప్రధానంగా ఒకే ప్రవేశ, నిష్క్రమణ మార్గం ఉంది. మరొకటి ఉన్నప్పటికీ అది కేవలం ఒక అడుగు వెడల్పుతో ఉంది. ఇవి తప్ప మరో మార్గం లేదు.

4 మంటలార్పేందుకు భవనంలో ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు ఉండాలి. ఈ భవనంలో కనీసం ఇసుక బక్కెట్లు కూడా లేవు.




కేవలం ఒక అడుగు వెడల్పుతో ఉన్న మార్గం

ఇక్కడ అనుమతులు ఉండవు

హైదరాబాద్‌లోని పాతబస్తీలో భవన నిర్మాణాల్లో చాలావరకు భద్రతా చర్యలు పాటించరనే అపవాదు ఉంది. 10–20 గజాల్లో అగ్గిపెట్టె లాంటి గృహ నిర్మాణాలు ఉంటాయి. జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అనుమతులు అసలే ఉండవు. అగ్ని ప్రమాదం సంభవిస్తే అగ్నిమాపక వాహనాలు వెళ్లేందుకు దారులు కూడా సక్రమంగా ఉండవు. దీంతో శకటాలను ప్రధాన రోడ్లపైనే దూరంగా నిలిపి సందుల్లోకి పైపులతో నీటిని తరలించాల్సి వస్తోంది. 10–20 గజాల్లో ఐదారు అంతస్తుల వరకు భవనాలను నిర్మించటంతోపాటు.. ఎలాంటి అనుమతులు లేకుండా సెల్లార్లను సైతం నిర్మించి వ్యాపార అవసరాలకు వినియోగిస్తున్నారు. గుల్జార్ హౌస్, పటేల్ మార్కెట్, ఘాన్సీ బజార్, కోకర్ వాడి, మీరాలం మండి, పురానీ హవేలి, కోట్లాఅలీజా, రైన్ బజార్, డబీర్ పురా, తలాబ్ కట్ట, భవానీనగర్, గంగానగర్, యశ్రబ్ నగర్, నర్కీపూర్‌బాగ్, సుల్తాన్ షాహి, అల్ జుబేర్ కాలనీ, హఫీజ్ బాబానగర్, చాంద్రాయణగుట్ట, ఫలక్‌నుమా, బహదూర్‌పురా, కోకాకి తట్టి, దూద్ బౌలి, పురానాపూల్ తదితర ప్రాంతాల్లో ప్రధాన రోడ్ల వరకే అగ్నిమాపక యంత్రాలు వెళ్లడానికి వీలుంటోంది. దీంతో ప్రమాదాల తీవ్రత పెరుగుతోంది.

5 భవనంలో విద్యుత్ ఫైర్ అలారం, మాన్యువల్ ఫైర్ అలారం తప్పనిసరి. ఇక్కడ ఈ రెండూ కనిపించట్లేదు.



గుల్జార్ హౌస్ ఘటనపై ప్రముఖుల దిగ్భ్రాంతి

అత్యంత బాధాకరం

'హైదరాబాద్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో మహిళలు, పిల్లలుసహా అనేక మంది మరణించడం తీవ్ర బాధాకరం. తమ ప్రియమైన వారిని కోల్పోయిన వారి బాధలో నా ఆలోచనలు ఉన్నాయి. గాయ పడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నా'.

– రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

తీవ్ర వేదనకు గురిచేసింది

'అగ్నిప్రమాదంలో ప్రాణనష్టం తీవ్ర వేదనకు గురిచేసింది. మృతులకు నా ప్రగాఢ సంతాపం. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాను. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50 వేలు పీఎంఎన్ఆర్ఎఫ్ నుంచి అందజేస్తాం'

– ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ

త్వరగా కోలుకోవాలి..

'గుల్జార్ హౌస్ అగ్నిప్రమాదంలో అనేకమంది చనిపోవడం చాలా బాధాకరం. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతిని తెలుపుతున్నా. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆశిస్తున్నా'.

– లోక్‌సభలో ప్రతిపక్షనేత, రాహుల్ గాంధీ

అగ్నిప్రమాదం అత్యంత బాధాకరం

గుల్జార్‌హౌస్ అగ్నిప్రమాదం తీవ్రంగా కలిచివేసింది. ప్రమాదంలో మరణించిన వారి ఆత్మకు శాంతి కలగాలి. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి. బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం చేసి అండగా నిలవాలని ప్రభుత్వాన్ని కోరతున్నా.

– మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్

దుర్ఘటన అత్యంత బాధాకరం

గుల్జార్‌హౌస్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో పలువురు ప్రాణాలు కోల్పోవడం దిగ్భ్రాంతి కలిగించింది. ఈ దుర్ఘటన అత్యంత బాధాకరం. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలి. మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి.

– ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

అగ్నిమాపక సిబ్బంది సేవలు ఆలస్యమయ్యాయి. వెంటనే ఘటన స్థలానికి చేరుకొని ఉంటే బావుండేది. అగ్నిమాపక సిబ్బందికి మెరుగైన శిక్షణ అవసరం. విషయాన్ని ప్రధాని నరేంద్ర మోదీ దృష్టికి తీసుకువెళ్లి అధునాతన పరికరాల కొనుగోలుకు సహకరిస్తా. కేంద్ర ప్రభుత్వం ద్వారా మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేస్తాం.

– జి కిషన్ రెడ్డి, కేంద్ర మంత్రి

బాధితులకు అండగా నిలవాలి..

అగ్నిప్రమాద బాధితులకు అండగా ఉండాలి. ఇంత పెద్దఎత్తున మృతులు ఉండటం బాధాకరం. విషయం తెలిసిన వెంటనే మా ఎమ్మెల్యేలు సహాయక చర్యలను పర్యవేక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతగా కుటుంబాలను ఆదుకోవాలి.

– హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ

హృదయ విదారకరమైన ఘటన

గుల్జార్‌హౌస్ ప్రమాదం హృదయవిదారకరమైన ఘటన. అగ్నిప్రమాద ఘటన వివరాలు తెలిసి అత్యంత షాక్‌కు గురయ్యాను. ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు నా సంతాపం. బాధిత కుటుంబాలకు తగిన నష్టపరిహారం ప్రకటించాలి.

– బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

అగ్నిప్రమాదంలో మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలి. ప్రమాదాలపై ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోవడంలో దారుణంగా విఫలమవుతోంది.

– మాజీ మంత్రి హరీశ్‌రావు

ఘటన కలచివేసింది..

గుల్జార్ హౌస్‌లో జరిగిన భారీ అగ్ని ప్రమాదంలో 17 మంది మృత్యువాత పడటం బాధాకరం. ఇది హృదయాలను కలచివేసే దుర్ఘటన. మరణించిన వారి కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి.

–బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం

గుల్జార్‌హౌస్ అగ్ని ప్రమాద మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది. సహాయక చర్యలలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలి.

– టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్

బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి

గుల్జార్‌హౌస్ ఘటన బాధాకరం. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి. సిబ్బంది సకాలంలో వచ్చి ఉంటే ప్రాణనష్టం తగ్గేదేమో. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వం జాగ్రత్తలు చర్యలు తీసుకోవాలి.

– సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

హుటాహుటిన సిబ్బందిని తరలించాం

అగ్ని ప్రమాద ఘటన బాధాకరం. విషయం తెలిసిన వెంటనే పోలీసు సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని అవసరమైన సహాయక చర్యలు చేపట్టారు. బాధితులను ఆస్పత్రులకు తరలించి మంటలను అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశాం.

– డీజీపీ జితేందర్

భవనం పటిష్టతను పరీక్షించాలన్న ఎంపీ అసద్



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ గుల్జార్ హౌస్‌లో అగ్ని ప్రమాదం సంభవించిన భవనాన్ని పరిశీలించారు. ప్రమాదానికి కారణాలు, ఇతర వివరాలు అగ్నిమాపక శాఖ డీజీ నాగిరెడ్డిని అడిగి తెలుసు కున్నారు. ఆ భవనం నివాస యోగ్యమా, కాదా? అంటూ ప్రశ్నించారు. భవనం పటిష్టతను పరీక్షించాలని సూచించారు. ఆ కుటుంబీకులు ఎవరైనా మళ్లీ అదే భవనంలో ఉండటానికి ప్రయత్నిస్తే, జరగరానిది జరిగితే భారీ ప్రాణనష్టం సంభవిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో విషయాన్ని జీహెచ్ఎంసీ అధికారుల దృష్టికి తీసుకువెళ్తామని నాగిరెడ్డి చెప్పారు.

ఊపిరాడకే మృతి చెందారు

- సమాచారం అందిన 3 నిమిషాల్లోనే ఫైర్ టెండర్లు ఘటనా స్థలికి వెళ్లాయి
- రెండు గంటల్లోనే మంటలు అదుపులోకి తెచ్చాం
- 'సాక్షి'తో ఫైర్ డీజీ నాగిరెడ్డి



సాక్షి, హైదరాబాద్: పాతబస్తీలోని గుల్జార్ హౌస్ వద్ద జరిగిన అగ్ని ప్రమాదంలో దట్టంగా కమ్ముకున్న పొగను పీల్చడంతో ఊపిరి ఆడకే 17 మంది మృత్యువాత పడినట్టుగా ప్రాథమికంగా నిర్ధారించినట్టు తెలంగాణ అగ్నిమాపక శాఖ డీజీ వై.నాగిరెడ్డి తెలిపారు. అగ్ని ప్రమాదం జరిగినట్టుగా సమాచారం అందిన తర్వాత మూడు నిమిషాల వ్యవధిలోనే మొఘల్‌పురా వాటర్ టెండర్, దాని సిబ్బంది సంఘటనా స్థలానికి వెళ్లారని తెలిపారు. కాగా ప్రమాదం జరిగిన తర్వాత చేపట్టిన రెస్క్యూ ఆపరేషన్, ప్రమాద స్థలంలో గుర్తించిన లోపాలు తదితర అంశాలను నాగిరెడ్డి 'సాక్షి'కి వివరించారు. 'అగ్ని ప్రమాదం గ్రౌండ్ ఫ్లోర్‌లో ప్రారంభమై పై అంతస్తులకు విస్తరించింది. ప్రమాదం జరిగిన భవనంలో పై అంతస్తులకు వెళ్లేందుకు కేవలం ఒకే ఒక మెట్ల మార్గం ఉంది. అది కూడా ఒక మీటరు కన్నా తక్కువ వెడల్పుతో భవనం మధ్యలో ఉంది. మెట్లు సమీపంలోనే మంటలు చెలరేగడంతో పొగ, వేడి తీవ్రంగా వ్యాపించింది. భవనం గ్రౌండ్ ఫ్లోర్‌లో బైకులు పార్క్ చేసి ఉండటం వల్ల కూడా లోపలికి ప్రవేశించడం దాదాపు అసాధ్యమైంది. రోడ్డు వైపు ఉండాల్సిన కిటికీలు, ద్వారాలు లేకపోవడం వల్ల హైడ్రాలిక్ ప్లాట్‌ఫామ్ వినియోగంలో ఆటంకం ఏర్పడింది. మొత్తం మీద రెండు గంటల్లోనే మంటల్ని అదుపులోకి తీసుకువచ్చాం. చివరకు గోడలకు రంధ్రాలు వేసి క్షతగాత్రులను బయటికు తీసుకువచ్చాం. మొత్తం 11 ఫైరింజన్లు వినియోగించాం. ఫైర్ రోబోట్‌ను కూడా మోహరించాం. కానీ దాని అవసరం పడలేదు. రెండు నిచ్చెనలు కూడా ఉపయోగించాం. మొత్తం 70 మంది అగ్నిమాపక సిబ్బంది, 17 మంది అధికారులు సహాయక చర్యల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ డీఎఫ్ఓ–1 వెంకన్నకు గాయాలు కావడంతో ఆస్పత్రిలో చేర్చాం. అగ్నిమాపక శాఖ సకాలంలో స్పందించి చర్యలు తీసుకున్నందునే పక్కనే ఉన్న భవనాలకు మంటలు వ్యాపించలేదు. ఫలితంగా ప్రాణ, ఆస్తినష్టం తగ్గింది..' అని నాగిరెడ్డి తెలిపారు.

అగ్ని ప్రమాదంపై సమగ్ర విచారణ

- సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ పాతబస్తీలోని గుల్జార్ హౌస్‌లో జరిగిన అగ్ని ప్రమాద ఘటనపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమగ్ర విచారణకు ఆదేశించారు. ఈ ప్రమాదానికి దారి తీసిన అసలైన కారణాలపై లోతుగా దర్యాప్తు చేయాలని ఆదివారం ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రమాదంలో 17 మంది మృతి చెందడంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తరపున రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. ఆదివారం ఉదయం ఘటన గురించి తెలిసిన వెంటనే ఆయన హుటాహుటిన సంబంధిత అధికారులను సంప్రదించి మంటల్లో చిక్కుకున్న కుటుంబాలను కాపాడేందుకు అవసరమైన అన్ని చర్యలను చేపట్టాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు పోలీస్, ఫైర్ విభాగాల ఉన్నతాధికారులతో మాట్లాడుతూ సహాయక చర్యలు జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌తోనూ మాట్లాడారు. కాగా ఫైర్ సిబ్బంది సకాలంలో స్పందించటంతో భారీ ప్రాణనష్టం తప్పిందని రేవంత్ అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి దుర్ఘటనలు జరగకుండా నివారణ చర్యలను చేపట్టాలని, ప్రజలను అప్రమత్తం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రమాదానికి గురైన వారి కుటుంబాలతో ఫోన్‌లో మాట్లాడి పరామర్శించారు. దీంతో పాటు మధిర పర్యటనలో ఉన్న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో మాట్లాడిన సీఎం.. వెంటనే వచ్చి పరిస్థితులను సమీక్షించాల్సిందిగా ఆదేశించారు. సీఎం సూచనల నేపథ్యంలో వెంటనే హైదరాబాద్‌కు వచ్చిన భట్టి ప్రమాద స్థలిని, ఉస్మానియా ఆసుపత్రిని సందర్శించారు.

సీఎంకు ఖర్గే ఫోన్

సీఎం రేవంత్‌రెడ్డికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆదివారం ఫోన్ చేశారు. గుల్జార్ హౌస్ అగ్ని ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. కాగా ఎప్పటికప్పుడు సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నామని, మంత్రులు కూడా ఘటనా స్థలిలోనే ఉండి సమన్వయం చేస్తున్నారని సీఎం తెలి పారు.

కేంద్రం ఎక్స్‌గ్రేషియా

ప్రధాన మంత్రి నేషనల్ రిలీఫ్ ఫండ్ (పీఎంఎన్ఆర్ఎఫ్) నుంచి గుల్జార్ హౌస్ మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50 వేల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందిస్తున్నట్లు పీఎంఓ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

- అగ్నిప్రమాద ఘటన స్థలాన్ని సందర్శించిన భట్టి విక్రమార్క
- మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం ప్రకటన



ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న భట్టి, పొన్నం, షబ్బీర్ అలీ తదితరులు

అఫ్జల్‌గంజ్/చార్మినార్/దూద్‌బౌలి/రాజేంద్రనగర్/మణికొండ: గుల్జార్‌హౌస్‌లో జరిగిన అగ్ని ప్రమాద ఘటన బాధాకరమని, మృతుల కుటుంబాలకు ప్రభు త్వం అన్ని విధాలా అండగా ఉంటుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. గుల్జార్ హౌజ్ వద్ద జరిగిన భారీ అగ్ని ప్రమాదంలో 17 మంది మరణించడం బాధాకరమన్నారు. ఆదివారం సాయంత్రం ఘటన స్థలాన్ని ఆయన హైదరాబాద్ ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ జీహెచ్ఎంసీ నిబంధనలను పాటించాలని కోరారు. అనంతరం ఉస్మానియా ఆసుపత్రిలో మృతుల కుటుంబీకులను పరామర్శించారు. ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపిస్తామని, మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తరపున రూ.5 లక్షల చొప్పున పరిహారం ఇస్తామని తెలిపారు. ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపించి మరోసారి ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామని మంత్రి డి.శ్రీధర్‌బాబు అన్నారు. ఉప్పర్‌పల్లిలోని గౌతమ్‌నగర్ కాలనీలో మృతదేహాలకు నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

ఆలస్యంగా అంబులెన్స్



సంఘటన స్థలం నుంచి గుల్జార్ హౌస్ ఫౌంటెయిన్ వరకు బాధితుడిని స్ట్రెచర్‌పై తీసుకువెళ్తున్న పోలీసులు

సాక్షి, హైదరాబాద్: అగ్ని ప్రమాదం జరిగిన గుల్జార్ హౌస్ భవనం వద్దకు అంబులెన్స్ ఆలస్యంగా వచ్చిందని బాధిత కుటుంబాల వారు, స్థానికులు ఆరోపించారు. పైగా భవనం వద్దకు రాలేదని, గుల్జార్ హౌస్ ఫౌంటెయిన్ వద్ద దాన్ని నిలిపి బాధితులన్ని స్ట్రెచర్‌పై అక్క డివరకు తీసుకెళ్లారని చెప్పా రు. తీరా ఆ అంబులెన్సులో సరైన వైద్య పరికరాలు కూడా అందుబాటులో లేవంటూ బాధి తుల కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక దశలో అంబులెన్స్ సిబ్బందిపై దాడి చేసే ప్రయత్నం కూడా చేశారు.

హైదరాబాద్ చరిత్రలో అతిపెద్ద అగ్ని ప్రమాదం

ప్రాణ నష్టం పరంగా గుల్జార్‌హౌస్ ప్రమాదమే పెద్దది

- 2002లో శాంతి ఫైర్‌వర్క్స్ ప్రమాదంలో 12 మంది మృతి
- 2022లో న్యూ బోయిగూడలోని స్క్రాప్ గోదాంలో 11 మంది
- నివాస–వ్యాపార సమ్మిళిత ప్రాంతాల్లో జాగ్రత్తలు అవసరం
- అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ వై నాగిరెడ్డి

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ నగరంలోని దుకాణాలు, కంపెనీలు, గోదాముల్లో ఏటా అగ్నిప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అయితే, భారీ ప్రాణనష్టాలతో కూడినవి మాత్రం తక్కువే. 2002లో ఉస్మాన్‌గంజ్‌లోని శాంతి ఫైర్ వర్క్స్‌లో జరిగిన అగ్నిప్రమాదం ప్రాణ నష్టం పరంగా ఇప్పటివరకు ప్రథమ స్థానంలో ఉండేది. ఆదివారం పాతబస్తీలోని గుల్జార్‌హౌస్ వద్ద 'మోదీ ఇంట్లో'జరిగిన ప్రమాదం దాన్ని దాటేసింది. ఒకే ప్రమాదంలో 17 మంది మృతిచెందటంతో నగర చరిత్రలో అతిపెద్ద అగ్ని ప్రమాదంగా రికార్డుల్లోకి ఎక్కింది. మృతులంతా ఒకే కుటుంబానికి చెందిన వారు కావడం కూడా ఇదే తొలిసారి. గతంలో నగరంలో చోటుచేసుకున్న భారీ అగ్నిప్రమాదాల్లో కొన్ని ఇవీ...

23.10.2002:

ఉస్మాన్‌గంజ్‌లోని శాంతి ఫైర్ వర్క్స్‌లో చోరీ చేయడానికి వచ్చిన దొంగ మారుతి నయీం.. అందులో నగదు లభించకపోవడంతో నిప్పు పెట్టాడు. ఈ ఉదంతంలో ఫైర్‌వర్క్స్ పై అంతస్తులో ఉన్న కార్తికేయ లాడ్జిలో బస చేసిన కస్టమర్లు, సిబ్బంది మొత్తం 12 మంది చనిపోయారు.



న్యూ బోయిగూడలోని స్క్రాప్ గోదాంలో ప్రమాద దృశ్యం (ఫైల్)

21.10.2006:

సోమాజిగూడలోని మీనా జ్యువెలర్స్ నిర్మాణ పనులు జరుగుతుండగా, పెయింటింగ్ పని చేయడానికి వచ్చిన వలస కార్మికులు పై అంతస్తులో నిద్రించారు. కింది ఫ్లోర్‌లో జరిగిన అగ్నిప్రమాదంతో పెయింట్లకు నిప్పంటుకొని విడుదలైన విషవాయువుల ప్రభావానికి ముగ్గురు చనిపోయారు.

24.11.2012:

పుప్పాలగూడలోని బాబానివాస్ అపార్ట్‌మెంట్‌లో భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో మొత్తం ఎనిమిది మంది చనిపోయారు. వాచ్‌మన్‌తో పాటు స్థానికుల అప్రమత్తత కారణంగా మరో పదిమంది ప్రాణాలతో బయటపడ్డారు.

22.02.2017:

అత్తాపూర్‌లోని ఒక చిన్నతరహా పరిశ్రమలో అగ్నిప్రమాదం జరిగింది. కూలర్లు తయారుచేసే ఈ పరిశ్రమలో మంటలు చెలరేగడంతో ఒడిశాకు చెందిన ఆరుగురు వలస కార్మికులు చనిపోయారు.

23.02.2022:

న్యూ బోయగూడ వద్ద శ్రావణ్ ట్రేడర్స్ పేరుతో ఉన్న స్క్రాప్ గోదాంలో అగ్నిప్రమాదం జరిగింది. ఈ దుర్ఘటనలో బీహార్ నుంచి వచ్చిన వలస కార్మికులు 11 మంది చనిపోయారు.

16.05.2023:

సికింద్రాబాద్‌లోని స్వప్నలోక్ కాంప్లెక్స్‌లో అగ్నిప్రమాదం జరిగింది. ఇందులో క్యూ నెట్ అనుబంధ సంస్థ విహాన్ డైరెక్ట్ సెల్లింగ్‌లో పని చేసే ఆరుగురు మరణించారు.

13.11.2023:

నాంపల్లిలోని బజార్‌ఘాట్‌లో ఉన్న నాలుగంతస్తుల భవనం అగ్నికి ఆహుతైంది. ఈ ప్రమాదంలో తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయారు. భవనం కింది అంతస్తులో ఉన్న కార్ఖానాలో మంటలు చెలరేగి భవనం మొత్తం కాలిపోయింది.

ఆ భవనాల్లో మరిన్ని జాగ్రత్తలు అవసరం

ఫైర్ సేఫ్టీ విషయంలో వాణిజ్య భవనాలకు ఇచ్చిన ప్రాధాన్యం నివాస భవనాలకు ఇవ్వట్లేదు. వ్యాపార సంస్థలు, గృహాలు కలిసి ఉన్న భవనాల విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలి. ప్రస్తుతం మార్కెట్‌లో తక్కువ ధరకే ఫైర్ అలారమ్స్, అగ్నిమాపక పరికరాలు లభిస్తున్నాయి. వీటిని ఇళ్లలోనూ ఏర్పాటు చేసుకుంటే దుర్ఘటనలు తగ్గుతాయి. ప్రమాదం జరిగినా ప్రాణ, ఆస్తి నష్టాలను గణనీయంగా తగ్గించుకోవచ్చు.

– వై.నాగిరెడ్డి, రాష్ట్ర అగ్నిమాపక శాఖ డీజీ





మనిషి తన రూపంలోనే దేవుడిని సృజించాడు.
- జెనోఫనీజ్

సాక్షి

సోమవారం, 19 మే 2025

చీకటి వెలుగులు

ప్రపంచవ్యాప్తంగా ఎన్నో ఆలయాలు ఉన్నాయి. ఎన్నో మతాలు ఉన్నాయి. ఎన్నో ఆరాధనా పద్ధతులు ఉన్నాయి. ఆలయాల తొలి ఆనవాళ్లు క్రీస్తుపూర్వం పన్నెండువేల ఏళ్లనాటివి. దాదాపు అన్ని మతాలూ దైవభక్తిని ప్రబోధించేవే! జ్ఞానమార్గాన్ని బోధించిన మతాలు లేకపోలేదు గాని, జనాలను భక్తిపారవశ్యం ఆకట్టుకున్నంతగా జ్ఞానం ఆకట్టుకున్న దాఖలాలు తక్కువ. భాషలు పుట్టి, లిపులు ఏర్పడి, సమాచారాన్ని శిలల మీద, మట్టి పలకల మీద, లోహపు రేకుల మీద, ఆకుల మీద నిక్షిప్తం చేయడం మొదలుపెట్టిన తర్వాత గాని ప్రపంచంలో జ్ఞానవ్యాప్తి మొదలు కాలేదు. మనుషులకు అక్షరజ్ఞానం అబ్బిన తర్వాత తమకు తెలిసిన సమాచారాన్ని తమకు దొరికిన సాధనాలను ఉపయోగించుకుంటూ లిఖితపూర్వకంగా నిక్షిప్తం చేయడం మొదలుపెట్టారు. చరిత్రలో తొలినాటి రచనల ఆనవాళ్లు క్రీస్తుపూర్వం నాలుగో సహస్రాబ్ది నాటివి. మానవాళి జ్ఞానయానానికి అవి తొలి మైలురాళ్లు.

భక్తిపారవశ్యం ఒకవైపు, జ్ఞానయానం మరోవైపు మానవాళి మనుగడను ఆది నుంచి నిర్దేశిస్తూనే ఉన్నాయి. సామాజిక, తాత్త్విక, శాస్త్ర, సాంకేతిక పురోగతికి ఎందరో జ్ఞానులు బాటలు వేశారు. లోకమంతటా తమ జ్ఞానకాంతులను ప్రసరించారు. వినువీథిలో ఒకవైపు సూర్యుడు సహా అసంఖ్యాక నక్షత్రాలు నిరంతరం వెలుగులను వెదజల్లుతున్నా, మరోవైపు చీకటి నిండిన కృష్ణబిలాలు కూడా ఉన్నాయి. అలాగే ఈ లోకంలో ఒకవైపు జ్ఞానులు ప్రసరించిన జ్ఞానకాంతులు ఉన్నా, మరోవైపు మౌఢ్యాంధకారం కూడా అంతే గాఢంగా ఉంది. మానవాళిలో మౌఢ్య నిర్మూలనమనేది ఇప్పటికీ నెరవేరని కలగానే మిగిలింది. 'మతములన్నియు మాసిపోవును/ జ్ఞానమొక్కటి నిలిచి వెలుగును' అని గురజాడ ఆకాంక్షించారు. ఇప్పటి పరిస్థితులను గమనిస్తే, ఆయన ఆకాంక్ష నెరవేరడానికి ఇంకెన్ని యుగాలు పడుతుందో చెప్పడం కష్టం.

ఆరాధించే వాటికి ఆలయాలను నిర్మించుకోవడం అనాది సంస్కృతి. దేవాలయాలను, ప్రార్థనాలయాలను నిర్మించుకున్న మనుషులు అక్కడితో ఆగిపోలేదు. ఆరాధ్య నటీనటులకు, నాయకులకు సైతం ఆలయాలను నిర్మించే స్థాయికి పరిణామం చెందారు. ప్రపంచంలో మౌఢ్యం శ్రుతిమించి మితిమీరిన కాలాల్లో సమాజాన్ని సంస్కరించడానికి ఎందరో సంస్కర్తలు ప్రయత్నించారు. జ్ఞానకాంతులతోనే మౌఢ్యాంధకారం పటాపంచలవుతుందని గ్రహించి, జ్ఞానవ్యాప్తికి కృషి చేశారు. ఒక తరం నుంచి మరో తరానికి జ్ఞానసంపదను అందించడానికి గ్రంథాలయాలను నెలకొల్పారు.


ప్రపంచంలోని తొలి గ్రంథాలయం క్రీస్తుపూర్వం మూడో సహస్రాబ్దిలో ఏర్పడింది. ఇప్పటి సిరియాలోని టెల్ మార్డిక్ గ్రామంలో ఉందది. 'ది రాయల్ లైబ్రరీ ఆఫ్ ఎబ్లా' అనే ఈ గ్రంథాలయం తొలి జ్ఞాననిధి. ఇందులో ఇరవైవేల మట్టిపలకలపై ఉన్న రాతలు చెక్కుచెదరకుండా ఉన్నాయి. ఇది ద్విభాషా గ్రంథాలయం కావడం ఇంకో విశేషం. సుమేరియన్, ఎబ్లాయిట్ భాషలలో చిత్రలిపిలో రాసిన రాతలు ఆనాటి సామాజిక, వాణిజ్య, విద్యాపరమైన పరిస్థితులకు సాక్షీభూతంగా నిలిచి ఉన్నాయి. ఈ మట్టిపలకల్లో కొన్ని ఇప్పుడు సిరియాలోని డెమాస్కస్, అలెప్పో తదితర నగరాల్లోని మ్యూజియంలలో ఉన్నాయి. ప్రాచీనకాలంలో మన ఉపఖండ భూభాగంలోనూ నలంద, తక్షశిల విశ్వవిద్యాలయాల్లో గ్రంథాలయాలు ఉండేవి. ఇప్పుడు వాటి శిథిలావశేషాలు తప్ప ఆనాటి జ్ఞానసంపద ఏదీ మిగిలి లేదు. పురాతన గ్రంథాలయాలు ఏర్పడిన కాలంలోనే ప్రపంచవ్యాప్తంగా మూఢాచారాలు కూడా విస్తృతంగా ఉండేవి.

ఆ తర్వాత కాలంలో చాలా మార్పులు జరిగాయి. జాన్ గూటెన్‌బర్గ్ రూపొందించిన ముద్రణ యంత్రం పుస్తకాల రూపురేఖలను మార్చేసింది. ఆధునిక పుస్తకాలకు అంకురారోపణ చేసింది. పారిశ్రామిక విప్లవ కాలంలో పుస్తకాల ముద్రణ పెరగడం మొదలైంది. వలస పాలనలు మొదలవడంతో ప్రజలకు బహుభాషా పరిచయం ఏర్పడి, సమాచార ఆదాన ప్రదానాలు ఊపందుకున్నాయి. బ్రిటిష్ హయాంలో మన దేశంలో నాటి కలకత్తా నగరంలో 'ఏషియాటిక్ సొసైటీ లైబ్రరీ' పేరుతో తొలి ఆధునిక గ్రంథాలయం 1781లో ఏర్పడింది. అప్పటికి సతీసహగమన దురాచారంపై ఇంకా నిషేధం విధించలేదు. మన తెలుగునేల మీద 1886లో తొలి ఆధునిక గ్రంథాలయాన్ని విశాఖపట్నంలో మంతిన సూర్యనారాయణమూర్తి నెలకొల్పారు. అప్పటికి కన్యాశుల్కం దురాచారం తీవ్రంగా ఉండేది. స్వాతంత్ర్యోద్యమ కాలంలోనే అయ్యంకి వెంకటరమణయ్య నేతృత్వంలో గ్రంథాలయోద్యమం కూడా మొదలైంది.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక అనేక మార్పులు జరిగాయి. ఎంతో అభివృద్ధి జరిగింది. ప్రజల్లో అక్షరాస్యత పెరిగింది. పత్రికలు, అధునాతన ప్రసార మాధ్యమాలు విస్తృతంగా అందుబాటులోకి వచ్చాయి. అయినా, జనాల్లో మౌఢ్యం పూర్తిగా అంతరించలేదు. ఇప్పటికీ మన దేశంలో గ్రంథాలయాల కంటే దేవాలయాలు, ప్రార్థనాలయాలే ఎక్కువ. వైజ్ఞానికాభివృద్ధి ఫలితంగా అందివచ్చిన సాంకేతికత సాధనాలను కూడా వ్యర్థవినోదానికి వినియోగించుకోవడంలో మన జనాలు అపార ప్రజ్ఞాధురీణులు. మౌఢ్య ప్రాబల్యం ఎంతగా పెరుగుతున్నా, జ్ఞానారాధకులు అంతరించిపోలేదు. అందుకు నిదర్శనమే కేరళలోని కాసర్‌గోడ్ జిల్లా కంబళూరులో వెలసిన పుస్తకాలయం. పుస్తకమే ఇందులోని దేవత. పుస్తకాలే ప్రసాదం. 'జ్ఞానమొక్కటి నిలిచి వెలుగును' అనే ఆకాంక్షను వెలిగించడానికి ఇదొక ఆశాదీపం.

ఇండియా ఇంత బలహీనమైనదా?

అభిప్రాయం



ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్

ఈ మధ్య కాలంలో ప్రపంచం యుద్ధాల భూమిగా మారింది. గత నాలుగేళ్ళుగా ఉక్రెయిన్ – రష్యా యుద్ధం తీవ్ర విధ్వంసానికి దారి తీసింది. ఏడాదిన్నర నుండి ఇజ్రాయెల్ – పాలస్తీనా యుద్ధం భీకర నష్టానికి కారణమైంది. ఏప్రిల్ 22న అమాయక భారతీయులను కశ్మీర్‌లో టెర్రరిస్టులు దారుణంగా హత్య చెయ్యడంతో దేశం ఉడికిపోయింది. మే 7న పాక్‌లోని టెర్రరిస్టు క్యాంపు మీద ఇండియా దాడి చేసింది. అది ఒక మినీ వార్‌కు దారి తీసింది. అందులో రెండు యుద్ధాలు టెర్రరిస్టులు అమాయక ప్రజలను నిర్దాక్షిణ్యంగా కాల్చి చంపడంతో మొదలయ్యాయి. ఒకటి భూభాగ సమస్యగా మొదలైంది.

టెర్రరిజంపై యుద్ధాలు

గత కొన్ని దశాబ్దాలుగా టెర్రరిస్టులు ప్లాన్ చేసి అమాయక ప్రజలను చంపడంతో దేశాల మధ్య యుద్ధాలు జరుగుతున్నాయి. అవి దేశాలను సైతం ధ్వంసం చేయడానికి దారి తీస్తున్నాయి. ఇప్పుడు ఇండియా–పాకిస్తాన్ మధ్య అటువంటి టెర్రరిస్టు దాడి వల్ల నాలుగు రోజులు కాల్పులు జరిగాయి. చివరికి మే 12న విరమణ జరిగింది. అయితే దీన్ని ఇండియా–పాకిస్తాన్ అధికారులు ప్రకటించకముందే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. అదీ యుద్ధం విరమించకపోతే ఈ రెండు దేశాలతో వ్యాపార సంబంధాలు ఉండవని చెప్పాననీ, అందువల్ల వారు వెంటనే ఆపడానికి అంగీకరించారనీ అన్నారు. ఇది చాలా తీవ్రమైన ప్రకటన.

అంతేకాదు, ఆ రెండు దేశాలు ఒక తటస్థ ప్రదేశంలో కశ్మీర్ సమస్యను చర్చించి, పరిష్కరించుకోవడానికి అంగీకరించారని కూడా ట్విట్టర్ ద్వారా వెల్లడించారు. అంతటితో ఆగకుండా ఆ రెండు దేశాల మధ్య అణుయుద్ధం జరిగే ప్రమాదాన్ని ఆపానని కూడా అన్నారు. ట్రంప్ ప్రకటనలు పాక్ కంటే ఎక్కువగా ఇండియాను ఇరకాటంలో పెట్టాయి. అయితే పాక్ కూడా ట్రంప్ మధ్యవర్తిత్వానికి పాకులాడి ఎందుకు లొంగిపోయిందని చైనా నిలదీస్తున్నది. చైనా పాకిస్తాన్‌కు చాలా ఆయుధాలను ఇచ్చిందనేది తెలిసిందే. ఈ నాలుగు రోజుల ఇండియా–పాకిస్తాన్ ఉద్రిక్తతలు... చైనా, యూరప్, అమెరికా ఆయుధాల అమ్మకపు మార్కెట్ బలాబలాలను మార్చేసింది అనే చర్చ ప్రపంచమంతటా జరుగుతోంది.

దౌత్య విలువలను మంటగలిపిన ట్రంప్

ట్రంప్ భారత ప్రభుత్వానికి దగ్గరి మిత్రుడని బీజేపీ, ముఖ్యంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పదేపదే చెబుతూ వచ్చారు. కానీ ట్రంప్ రెండోసారి గెలిచాక భారత్‌ను అవమానపరిచే అనేక ప్రకటనలు చేస్తున్నారు, చర్యలు తీసుకుంటున్నారు. ఆయన అధికారంలోకి వచ్చిన కొద్ది రోజులకే ప్రధాని మోదీ వాషింగ్టన్ పర్యటనలో ఉండగానే మన దేశ పౌరులను అక్రమ వలసదారులు అనే నెపంతో చేతులకు బేడీలు వేసి, మిలిటరీ విమానంలో చండీగఢ్ విమానాశ్రయంలో వదిలారు.

అలాగే ఇండియా–పాక్ రెండు దేశాలనూ అవమానపరిచేలా, ఆ యా ప్రభుత్వాలు ప్రజలకు చెప్పకముందే తాను చేయబట్టే యుద్ధం ఆగిపోతోంది అని ట్వీట్ చేశారు. ఇది అన్ని విధాలుగా



అంతర్జాతీయ దౌత్య విలువలకూ, యుద్ధ నీతికీ వ్యతిరేకం. ఆ యా ప్రభుత్వాలు చెప్పాల్సిన విషయమది.

ప్రపంచంలో ఏ రెండు దేశాల మధ్య యుద్ధం జరిగినా దాన్ని ఆపేందుకు అటు ఐక్యరాజ్యసమితి(యూఎన్‌ఓ), లేదా ఇతర దేశాలు రాయబారాలు జరిపి రెండు దేశాలనూ ఒప్పించి యుద్ధం ఆగేట్లు చూడటం దౌత్య నీతిలో భాగమే. అందులో ఇండియా–పాక్ న్యూక్లియర్ ఆయుధాలు కలిగి ఉన్న దేశాలు కనుక ప్రపంచ దేశాలన్నీ ఈ యుద్ధం ఆపాలని చూడటం అవసరం. కానీ మొన్న యూఎన్‌ఓ ఎక్కడా కనిపించలేదు. అది నిజానికి ఉక్రెయిన్ – రష్యా, ఇజ్రాయెల్ – పాలస్తీనా యుద్ధాలను ఆపడానికి కొన్ని ప్రయత్నాలు చేసింది. కానీ, ఇండియా–పాక్ ఉద్రిక్తతల సమయంలో దాని ఉనికి కనిపించలేదు. యూరోపియన్ దేశాలు కూడా ఇండియా–పాక్ ఉద్రిక్తతలను ఇజ్రాయెల్–పాలస్తీనా యుద్ధంలాగా ఘోరంగా అమాయక ప్రజలను టెర్రరిస్టులు చంపడంతో మొదలైనా పెద్దగా పట్టించుకోలేదు. రష్యా కూడా బహిరంగంగా ఇండియాకు మద్దతు పలుకలేదు. చైనా, టర్కీ, ఇరాన్... పాకిస్తాన్‌కు అండగా ఉన్నాయనేది స్పష్టంగానే కనిపించింది. వీటన్నింటినీ మించి యూఎస్, ముఖ్యంగా ట్రంప్ పాత్ర అన్ని యుద్ధ సమయపు దౌత్య విలువలనూ నాశనం చేసింది.

అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి. వాన్స్ కొద్ది రోజుల ముందే ఇండియా వచ్చి మిత్రగానం చేసి 'ఆ యుద్ధంలో జోక్యం చేసుకోవడం మా పని కా'దన్నాడు. కానీ పాక్‌కు 2.3 బిలియన్ డాలర్లు ఐఎంఎఫ్ ద్వారా ఇప్పించారు. పైగా ట్రంప్ కశ్మీర్‌ను మళ్ళీ చర్చల తెర మీదకి తెచ్చి ఒక తటస్థ స్థలంలో 'వెయ్యి ఏండ్ల' సమస్యగా ఉన్న కశ్మీర్ సమస్యను పరిష్కరిస్తామనడం, కాల్పుల విరమణను వాణిజ్య లావాదేవీలతో ముడిపెట్టి ప్రకటించడం చూస్తే, అతిపెద్ద ప్రజాస్వామ్యమైన భారతదేశాన్ని తన డొమినియన్ స్టేట్‌గా భావిస్తున్నట్టు కనబడుతుంది.

ఈ ప్రశ్నలకు జవాబుందా?

భారతదేశం నుండి అమెరికా వెళ్ళి చదువుకుంటున్న వేలాది మంది విద్యార్థులు వేల కోట్ల రూపాయలు అక్కడ ఫీజులుగా చెల్లిస్తున్నారు. వారికి వర్క్ పర్మిట్‌లో 3–5 సంవత్సరాల వరకు వీసాలిచ్చి వారినందరినీ ట్రంప్ దిక్కులేని వారిగా చేశారు. అక్కడి

- ప్రభుత్వం ప్రజలకు చెప్పకముందే, కాల్పుల విరమణ తనవల్లే జరిగినట్టుగా చెప్పి ట్రంప్ ఈ దేశం పరువు తీశారు. ఇటువంటి దౌత్య అనైతికతను ఈ దేశం ఎదిరించలేదా?
- అమెరికాలో చదువుతున్న భారత విద్యార్థుల జీవితాలను ట్రంప్ ఛిన్నాభిన్నం చేశారు. అయినా భారత ప్రభుత్వం అమెరికాను నిలదీసింది లేదు.
- ట్రంప్ అధికారంలోకి వచ్చాక ఏ ఇతర దేశ పౌరుల్నీ మన పౌరుల్లాగా చేతులకు బేడీలు వేసి యుద్ధ విమానాల్లో వెనక్కి పంపలేదు. అమెరికా మద్దతు లేకపోతే భారత దేశం బతకలేదు అనే స్థితి ఎందుకొచ్చింది?

నాణ్యత లేని విద్యా సంస్థల్లో కూడా భారతీయ విద్యార్థులు చేరింది ఉద్యోగం ఆశతో! ఒక ప్రభుత్వ కాలంలో నిర్ణయాలు మార్చదల్చుకుంటే రాబోయే విద్యార్థులకు మార్చాలి. కానీ ఆయన గెలిచే నాటికే ఆ దేశంలో ఉన్న విద్యార్థుల జీవితాలను ఛిన్నాభిన్నం చేస్తున్నారు. విచిత్రమేమంటే భారత ప్రభుత్వం వీటి మీద అంతర్జాతీయ విధానాలతో, చట్టపరమైన విధానాలతో అమెరికాను నిలదీసింది లేదు. పైగా కాల్పుల విరమణ పేరుతో ట్రంప్ ఈ దేశం పరువు తీశారు. ఇటువంటి డిప్లమాటిక్ ఇమ్మోరాలిటీని ఈ దేశం ఎదిరించలేదా? భారతదేశం ఇంత బలహీనమైనదా?

జాతీయవాదం, ఆత్మగౌరవం అని చెప్పే, బలమైన ఆర్థిక వ్యవస్థగా యుద్ధశక్తిగా ఎదుగుతున్నామని చెప్పే బీజేపీ/ఆరెస్సెస్ ట్రంప్‌కు ఎందుకు భయపడుతున్నాయి? అమెరికా మద్దతు లేకపోతే దేశం బతకలేదు అనే స్థితి ఎందుకొచ్చింది? భారతదేశంలోని పెద్ద వ్యాపారులందరికీ అమెరికన్ ఆర్థిక పెట్టుబడులతో ఉన్న అనుబంధంతో ఈ స్థితి వచ్చిందా? అయినా ఈ సంక్షోభ సమయంలో అమెరికా, ముఖ్యంగా ట్రంప్ పాకిస్తాన్‌కే ఎక్కువ మేలు చేసినట్టు కనిపించింది కదా! టెర్రరిజాన్ని పోషించే పాక్‌కు ఇన్ని దేశాలు మద్దతు ఇస్తున్నాయి అంటే అర్థమేమిటి?

గత పదేళ్ళుగా బీజేపీ/ఆరెస్సెస్ గ్లోబల్ డిప్లమసీలో మన దేశాన్ని గొప్ప స్థానంలో పెట్టామని చెబుతూ వచ్చాయి కదా! అమెరికాలోని ఆరెస్సెస్ అనుబంధ సంస్థలు ట్రంప్‌కు ఎంతో సపోర్టు చేస్తూ వచ్చాయి కదా! మరి ట్రంప్ అధికారంలోకి వచ్చాక ఏ ఇతర దేశ పౌరుల్నీ మన పౌరుల్లాగా చేతులకు బేడీలు వేసి యుద్ధ విమానాల్లో వెనక్కి పంపలేదే! ఆఖరికి పాక్ అక్రమ వలసదారులకు కూడా ఆ స్థితి వచ్చిన దాఖలాలే లేవే! ఇప్పుడు బీజేపీ/ఆరెస్సెస్ 370 ఆర్టికల్‌ను రద్దు చేసి కశ్మీర్‌ను సంపూర్ణంగా దేశంలో విలీనం చేశామని చెబుతుంటే ట్రంప్ ఆ సమస్యను మళ్ళీ ప్రపంచ సమస్య చేశారు కదా! ఇది కూడా ఆరెస్సెస్/బీజేపీ అనుకూల అంశమేనా? ఇది కూడా ఈ దేశ సమగ్రతను కాపాడే చర్యయేనా? ఈ ప్రశ్నలకు సమాధానాలు ఉన్నాయా?

వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక విశ్లేషకుడు

సోషల్ మీడియా

కఠిన వాస్తవికత



తాలిబన్‌ను ఇండియా కౌగిలించుకుంటోంది. సిరియా టెర్రరిస్టు చీఫ్‌ను యూఎస్ కౌగిలించుకుంటోంది. పాకిస్తాన్ ఉగ్రవాదానికి చైనా మద్దతుగా నిలుస్తోంది. భౌగోళిక రాజకీయ వాస్తవికతను మరీ ఇంత వాస్తవికంగా మార్చాల్సిన పనిలేదు!

- సందీప్ మనుధానె, విద్యావేత్త

ఆ రోజు రానుందా?



సిరియా నాయకుడు అహ్మద్ అల్–షరా గురించి డోనాల్డ్ ట్రంప్: 'గొప్ప, లేత, ఆకర్షణీయమైన దృఢమైన అబ్బాయి.' ఇక తర్వాతేమిటి? 'ఒసామా, మంచి గడ్డం, మంచి వ్యవహర్త, విమానాల మీద మంచి పట్టుంది'.

- మార్గరీటా సిమోన్యన్, సంపాదకురాలు

బలపడటమే దారి!



ఎప్పటినుంచో ఇండియాకు ఉన్న అనుమానాన్ని 'ఆపరేషన్ సిందూర్' నగ్నంగా చూపించింది. ఒక నిర్ణయాత్మక స్థితి అంటూ వచ్చినప్పుడు, మనం ఒంటరులం. అందుకే ఇండియా అవలంబించాల్సిన ఏకైక దారి – ఆర్థికంగా, సైనికపరంగా, కథనరీత్యా బలపడటం. ఇది మన విచారానికి కారణం కాకుండా ప్రేరణ కావాలి.

- అశ్విన్ సంఘీ, కాలమిస్ట్

అదే అడ్డు



మారుతున్న ప్రపంచ భౌగోళిక రాజకీయ క్రమంలో సరైన ఎంపికలతో ఇండియా వ్యవహరించదు అనడానికి ఒక పెద్ద కారణం: వ్యూహాత్మక అహంకారం.

- ప్రవీణ్ సహానీ, ఆర్మీ మాజీ ఉన్నతాధికారి

తెలియట్లేదా?



ఏఐ రాసిన పరిశోధన పేపర్‌ను సమర్పించిన ఒక విద్యార్థిని నేను ఫెయిల్ చేశాను. దానికి బదులుగా ఆమె మళ్లీ ఏఐ రాసిన క్షమాపణను పంపింది, తన గ్రేడ్‌ను మెరుగుపరుచుకోవడానికి ఏదైనా చేయగలనా అంటూ! జనులారా! ఇదొక విపరీత పరిస్థితి.

- స్టీఫెన్ సిసిరెల్లి, ప్రొఫెసర్

ఇన్ బాక్స్

జాగ్రత్త సుమీ!

ఈ మధ్య కాలంలో ఓ మహిళా వైద్యురాలు 53 గ్రాముల కొకైన్‌తో పట్టుబడి వార్తలకెక్కడంతో కొకైన్‌పై చర్చ మరోసారి బయలుదేరింది. కొకైన్ డోస్ 30 నుంచి 70 మిల్లీగ్రాములు తీసుకుంటే చాలు, రెండు లేదా మూడు నిమిషాల్లో మెదడులో స్వైరకల్పనలు మొదలై ఎక్కడికో వెళ్ళిపోతుంది. పోను పోనూ అలవాటు ముదిరితే 1 గ్రాము వరకు ఒకేసారి తీసుకోగలరు. అంతకుమించి 2 గ్రాముల వరకు ఒకేసారి తీసుకుంటే చావు–బ్రతుకుల మధ్య ఉన్నట్లే అంటున్నారు శాస్త్రవేత్తలు.

ప్రతిరోజూ 5 గ్రాముల దాకా విడతలు, విడతలుగా తీసుకునే వారి శరీరంలో అనేక అవయవాలు దెబ్బతింటాయి. కిడ్నీలు, ప్రేవులు, ఊపిరితిత్తులు నాశనమవుతాయి. కేంద్ర నాడీమండల వ్యవస్థ పాడై మానసిక భ్రాంతులు కలగడం, వణుకు రావడం, ఊపిరి పీల్చడంలో ఇబ్బందులు... ఇలా ఎన్నో రుగ్మతలు వస్తాయి. సాధారణంగా కొకైన్‌ని ముక్కుతో పీల్చడం, ఇంజెక్ట్ చేసుకోవడం, సిగరెట్లలో పెట్టి కాల్చడం వంటి పద్ధతుల్లో తీసుకుంటారు. తీసుకున్న తర్వాత ఒక్కొక్కరికి రకరకాల తేడాలతో భ్రాంతులు కలుగుతాయి.


కోకా ఆకులు నుంచి కొకైన్‌ని తయారు చేస్తారు. కొలంబియా, పెరూ, బొలీవియా వంటి దేశాల్లో ఈ కోకా పంట విరివిగా పండుతుంది. మొట్టమొదట స్థానికులు అజీర్ణానికి, చురుకుగా ఉండటానికి ఈ ఆకుల్ని మందుగా నమిలేవారు. అయితే జర్మన్ రసాయన శాస్త్రవేత్త ఆల్బర్ట్ నీమన్ ఒకసారి ఈ ఆకుల్ని నమలగా విచిత్ర అనుభూతి కలిగింది. దాంతో ఆయన కోకా ఆకుల్లో నుంచి రసాన్ని పిండి, దానికి కొన్ని రసాయనాలు కలిపి కొకైన్ అనే తెల్లటి పదార్థాన్ని 1860లో తయారు చేశాడు. ఆ విధంగా ఇప్పుడు మనం చూసే కొకైన్ పుట్టింది.

ఒక కిలోగ్రామ్ కొకైన్ తయారు చేయాలంటే వెయ్యి కిలోగ్రాముల కోకా ఆకులు కావాలి. దానికి మరిన్ని రసాయనాలు కలుపుతారు. ప్రపంచంలోని మొత్తం కొకైన్‌లో 70 శాతం పైగా ఒక్క కొలంబియాలోనే తయారవుతుంది. ఆ తర్వాత స్థానం పెరూ, బొలీవియా దేశాలది. కేవలం ఈ కొకైన్ వల్లనే కొలంబియా దేశం వారానికి 400 మిలియన్ డాలర్లు ఆర్జిస్తోంది. ప్రస్తుతం ఈ కొకైన్ డ్రగ్ మాఫియా ప్రపంచంలోని చాలా దేశాలకు విస్తరించింది.

- మూర్తి కేవీవీఎస్ । 78935 41003

పీడిత ప్రజాపక్షాన అరుణారుణ వేగుచుక్క

సందర్భం



జూలకంటి రంగారెడ్డి

నెల్లూరు జిల్లా అలగానిపాడు గ్రామంలో 1913 మే 1న పుచ్చలపల్లి సుందరయ్య ఒక ధనిక రైతు కుటుంబంలో పుట్టారు. 13వ ఏట నుంచే ఆయన వెట్టి చాకిరీ, అంటరానితనం వంటి సామాజిక దురాచారాలను నిరసించేవారు. తొలుత మహాత్మా గాంధీ నుంచి ఉత్తేజం పొందిన తను 14 ఏళ్ల వయసులో మద్రాస్‌లో జరిగిన కాంగ్రెస్ మహాసభకు హాజరైనారు. సైమన్ గో బ్యాక్ ఆందోళనలో పాల్గొన్నారు. 1930లో మహాత్మా గాంధీ ఇచ్చిన పిలుపుకు స్పందించి ఆయన చదువు మధ్యలో ఆపేసి స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారు. ఈ క్రమంలో ఆయన రెండేళ్ల జైలు శిక్ష అనుభవించారు.

బ్రిటిష్ వలస పాలనను అంతమొందించేందుకు ఏర్పడిన కాంగ్రెస్ (సోషలిస్టు గ్రూపు)లో పని చేస్తూనే పుచ్చలపల్లి సుందరయ్య కామ్రేడ్ అమీర్ హైదర్ ఖాన్ మార్గదర్శకత్వంలో కమ్యూనిస్టు పార్టీలో చేరారు. ఆ సమయంలో కమ్యూనిస్టు పార్టీపై బ్రిటిష్ వారు నిషేధం విధించారు. అలాంటి పరిస్థితుల్లో కూడా ఆంధ్ర, తమిళనాడు, కేరళ, కర్ణాటకలలో పార్టీ నిర్మాణ బాధ్యతలు చేపట్టారు.

ఇ.ఎం. ఎస్ నంబూద్రిపాద్, పి. కృష్ణ పిళ్ళై, ఎ .కె గోపాలన్ తదితర జాతీయస్థాయి నాయకులు పార్టీలోకి రావడానికి ఆయన కీలక పాత్ర పోషించారు. 1936లో వివిధ కమ్యూనిస్టు గ్రూపులు విలీనమై, ఒక అఖిల భారత కేంద్రం ఏర్పడినప్పుడు ఆయన కేంద్ర కమిటీ సభ్యుడు అయ్యారు. అదే సంవత్సరం ఆయన అఖిల భారత కిసాన్ సభ స్థాపించి, దానికి అఖిల భారత సహాయ కార్యదర్శిగా పనిచేశారు. ఇచ్ఛాపురం నుంచి మద్రాస్ వరకు 1500 మైళ్ళ దూరం రైతు రక్షణ యాత్ర జరిపి 1500 గ్రామాలలో రైతాంగంలో చైతన్యం పెంచేందుకు కృషి చేశారు. పోలీసులు వేటాడుతున్న క్రమంలో 1939 నుంచి 1942 మధ్య సుందరయ్య అజ్ఞాత జీవితం గడిపారు. 1943లో కమ్యూనిస్టు పార్టీ పై నిషేధం తొలగించిన తర్వాత బొంబాయిలో జరిగిన తొలి మహాసభలో ఆయన కేంద్ర కమిటీకి ఎన్నికయ్యారు.

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట సారథి

దేశంలో బ్రిటిష్ వలస పాలన వ్యతిరేకంగా పోరాటం జరుగుతుంటే, నిజాం స్టేట్‌లో దేశ్‌ముఖ్‌ల పీడనకు, వెట్టి చాకిరికి వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో ప్రజలు పోరాటానికి సన్నద్ధమయ్యారు. ఉధృతమైన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని కామ్రేడ్ సుందరయ్య పర్యవేక్షించడం జరిగింది. తుపాకులు గురిపెట్టడం, కాల్చడం, డైనమెట్లు వాడటం, నాటు బాంబులను తయారు చేయడం వంటివి ఆయన మార్గదర్శకత్వంలో



(నేడు పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి)

నేర్పించడం జరిగింది. 10 లక్షల ఎకరాల భూమిని దొరల కబంధహస్తాల నుంచి విడిపించి పేదలకు పంపిణీ చేయడం జరిగింది. వేలాది గ్రామాల్లో స్థానిక గ్రామ ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. నిజాం స్టేట్ భారత్ యూనియన్ లో విలీనం నేపథ్యంలో, 1948 సెప్టెంబర్ 13న సైన్యాలు తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో ప్రవేశించే వరకు కూడా దళాల ఎదురు దాడి కొనసాగింది. ఈ పోరాట క్రమంలో కమ్యూనిస్టు పార్టీలో భిన్నాభిప్రాయాలు ఏర్పడ్డాయి. అనివార్యంగా పోరాట విరమణ స్థితి నెలకొంది.

ఉత్తమ పార్లమెంటేరియన్ సుందరయ్య

1952 సాధారణ ఎన్నికల తర్వాత సుందరయ్య మద్రాస్ అసెంబ్లీ నుంచి రాజ్యసభకు ఎన్నికైనారు. పార్లమెంట్ లో కమ్యూనిస్టు గ్రూపు నాయకుడిగా వివిధ ప్రజా సమస్యలూ అంశాల వారీగా గణాంకాలతో పదునైన ప్రసంగాలు చేశారు. నిశిత విమర్శలతో పాటు నిర్మాణాత్మక సూచనలు అందించి సభా కార్యక్రమాల నాణ్యతను ఇనుమడింపచేశారు.

1955 నుంచి 1967 వరకు తిరిగి 1978 నుంచి 1983 వరకు రాష్ట్ర శాసనసభ సభ్యుడిగా ఉన్నారు. సభ్యుడిగా ఆయన రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన అనేక కార్యక్రమాలకు పథకాలకు రూపురేఖలు ఇచ్చారు. పార్లమెంట్ సమావేశాలకు ఆయన సైకిల్ మీద వెళ్లేవారు. సుందరయ్య కేవలం రాజకీయ నాయకుడు మాత్రమే కాదు, గొప్ప అధ్యయనశీలి. యువకుడుగా ఉన్నప్పుడు ఆయనపై కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావు, కొమర్రాజు లక్ష్మణరావు వంటి సంస్కర్తల ప్రభావం ఉంది. 'వీర తెలంగాణ సాయుధ పోరాటం: అనుభవాలు గుణపాఠాలు, విశాలాంధ్రలో ప్రజారాజ్యం, ఆంధ్రప్రదేశ్‌లో సమగ్ర నీటి పథకం' వంటి పుస్తకాలు రాశారు. మహారాష్ట్రకు చెందిన లీలను నిరాడంబరంగా వివాహమాడి వ్యక్తిగత జీవితంలోనూ ఆదర్శంగా నిలిచారు.

1930 నుంచి మొదలుకొని సైద్ధాంతిక విభేదాలతో సిపిఎం ఏర్పడిన తర్వాత గానీ 1985 మే 19న ఆయన మరణించినంత వరకు పార్టీ కేంద్ర కమిటీ సభ్యునిగా (1964 నుండి1976 వరకు సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శిగా) 50 సంవత్సరాల పైగా సుదీర్ఘమైన కమ్యూనిస్టు నిర్మాణం అనుభవం సుందరయ్యకుంది. సైద్ధాంతిక విభేదాలతో పార్టీ నుంచి విడివడి వేరే కమ్యూనిస్టు భావజాల నిర్మాణాలు చేసుకున్న వాళ్ల ఆచరణతో విభేదించినప్పటికీ – వారి పట్ల సానుభూతి, గౌరవభావం వ్యక్తపరిచేవారు. సుందరయ్య అంటే ఒక చైతన్య ఝరి. వర్తమాన మతోన్మాద ఫాసిస్టు రాజకీయ నేపథ్యంలో ఆయన జీవితం, ఆచరణ శ్రామిక వర్గానికి వెలుగు రేఖ.

వ్యాసకర్త రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు
సీపీఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ

శాంతమే వివేకం

జ్యోతిర్మయం

పూర్వం మందర పర్వతం మీద భృగుడనే యోగి జీవిస్తూ ఉండేవాడు. అతడికి శుక్రుడనే కొడుకు ఉన్నాడు. నిత్యం యోగ సమాధిలో మునిగి ఉండే తండ్రికి అవసరమైన సపర్యలు చేస్తూ కాలం వెళ్ళబుచ్చేవాడు. అలా రోజులు గడుస్తూ ఉండగా, ఒకనాడు ఆకాశమార్గంలో విహరిస్తూ వెళుతున్న విశ్వాచి అనే ఒక దేవకన్యను చూశాడు శుక్రుడు. ఆమె అందానికి పరవశుడయ్యాడు. ఆమెపట్ల మోహంతో మానుష శరీరాన్ని తండ్రి చెంతనే వదిలి, యోగబలంతో దివ్యాంగ ధారణ చేసి ఆమె వెంటపడి వెళ్ళిపోయాడు. ఆమెతో కూడి సర్వ సౌఖ్యాలూ అనుభవించడంలో ఎంతో కాలం గడిచిపోయింది. అయినా భృగుడి తపోబలం కారణంగా, శుక్రుడు వదిలి వెళ్ళిపోయిన మానవ శరీరం చెడిపోకుండా, అలాగే ఉంది. కొన్ని వందల సంవత్సరాల వ్యవధి తరువాత, సమాధిలోంచి బయటకు వచ్చాడు భృగుడు. కాళ్ళ చెంతనే పడి ఉన్న పుత్రుడి ప్రాణం లేని శరీరం చూసి దుఃఖంలో మునిగాడు. ఆ తీరని బాధలో మరణానికి కారకుడైన యముడిని శపించడానికి పూనుకున్నాడు. వెంటనే యముడు ప్రత్యక్షమై 'జరిగిందేమిటో తెలుసుకోకుండా క్రోధం నిండిన చిత్తంతో నీవు నన్ను శపించడానికి పూనుకుంటే, ప్రతిగా నేను నిన్ను శపించవలసి ఉంటుంది. నేను శాసకుడిని సుమా!' అని తన తాహతును గుర్తు చేశాడు. మడికి సింగన 'వాసిష్ఠ రామాయణము' తృతీయాశ్వాసంలోని ఈ కథలో కోపంలో ఉన్న భృగుడితో యముడు ఇలా అన్నాడు.

కం. ఇంత తపంబొనరించియు
శాంతస్వాంతుడవు గావు, సమచిత్తుడవై
చింతింపుము; నీయభిమత
మంతయు నెఱిగింతు; క్రోధమడపు మునీంద్రా!

'ఇంత తపస్సు తరువాత కూడా నీవు శాంత స్వభావుడవు కాలేదు. సమచిత్తంతో ఆలోచించు. నీ కుమారుడి గురించి నేను చెబుతాను. కోపం తగ్గించుకో మునీంద్రా!' అన్న యముడి మాటలలో కోపాన్ని అణచుకుని ఆలోచించడం వివేకవంతుడి లక్షణం అన్న భావం అంతర్లీనంగా ఉండడం గమనించవచ్చు.

- భట్టు వెంకటరావు

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, **తిథి:** బ.సప్తమి రా.1.34 వరకు, తదుపరి అష్టమి, **నక్షత్రం:** శ్రవణం ప.3.54 వరకు, తదుపరి ధనిష్ఠ, **వర్జ్యం:** రా.7.51 నుండి 9.26 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.21 నుండి 1.13 వరకు, తదుపరి ప.2.56 నుండి 3.48 వరకు, **అమృతఘడియలు:** తె.5.14 నుండి 6.51 వరకు (తెల్లవారితే మంగళవారం); **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 5.31, **సూర్యాస్తమయం:** 6.21.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 425 9899

నల్ల చట్టాలకు వ్యతిరేకంగా ఐక్య పోరాటం

- మజ్లిస్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ



వరంగల్ సభలో మాట్లాడుతున్న అసదుద్దీన్

న్యూశాయంపేట/రామన్నపేట: అంబేడ్కర్ రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ అధికార దాహంతో ప్రధాని నరేంద్ర మోదీ తీసుకువస్తున్న నల్లచట్టాలకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో సెక్యులర్ పార్టీలను కలుపుకొని ఐకమత్యంతో ముందుకు సాగుదామని ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ అన్ని వర్గాలతో కలిసి ముస్లింలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఆదివారం రాత్రి వరంగల్‌లోని ఇస్లామియా గ్రౌండ్‌లో ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆధ్వర్యంలో వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. మదర్సాలు, ఈద్గాలు, మసీదులు, ఖబరస్తాన్‌లను గుంజుకోవడానికే వక్ఫ్ సవరణ చట్టం తెరపైకి తెచ్చారని మండిపడ్డారు. దేవాదాయ శాఖలో ఇతర మతస్తులను ఎందుకు నియమించడం లేదని ప్రశ్నిస్తూ.. తమ వక్ఫ్‌బోర్డులో ఇతర మతస్తులకు ఎలా స్థానం కల్పిస్తారని ప్రశ్నించారు. రాజ్యాంగ విరుద్ధంగా తీసుకువచ్చిన ఈ వక్ఫ్ సవరణ చట్టాన్ని కేంద్రం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు జాతీయ అధ్యక్షుడు ఖాలీద్ సయిపుల్లా రహమానీ తదితరులు పాల్గొన్నారు.

సీఎంతో హరియాణా గవర్నర్ భేటీ

- తన ఆత్మకథ పుస్తకావిష్కరణకు ఆహ్వానం



సీఎం రేవంత్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న దత్తాత్రేయ. చిత్రంలో దత్తాత్రేయ కుమార్తె విజయలక్ష్మి


సాక్షి, హైదరాబాద్: హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారు. జూబ్లీహిల్స్‌లోని రేవంత్ నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిసిన దత్తాత్రేయ.. త్వరలోనే హైదరాబాద్‌లో జరగనున్న తన ఆటోబయోగ్రఫీ 'ప్రజల కథే నా ఆత్మకథ' పుస్తకావిష్కరణకు హాజరు కావాలని ఆహ్వానించారు. దత్తాత్రేయ ఆత్మకథ హిందీ వెర్షన్ 'జన్తాకీ కహానీ, మేరీ ఆత్మకథ'ను ఇటీవల ఢిల్లీలో ఆవిష్కరించారు. దత్తాత్రేయ వెంట ఆయన కుమార్తె విజయలక్ష్మి కూడా ఉన్నారు.

నేడు ఎంపీహెచ్‌ఏ (ఫిమేల్) ఫలితాల విడుదల

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నిర్వహించిన మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ (ఎంపీహెచ్‌ఏ) – ఫిమేల్ పరీక్ష ఫలితాలు సోమవారం విడుదల కానున్నాయి. 2023లో ఇచ్చిన ప్రాథమిక షెడ్యూల్ ప్రకారం.. 2024 నవంబర్ 9న జరగాల్సిన ఈ పరీక్షను.. అదే సంవత్సరం డిసెంబర్ 29న నిర్వహించారు. మొత్తం 1931 మహిళా ఎంపీహెచ్‌ఏ పోస్టులకు నిర్వహించిన పరీక్ష (కంప్యూటర్ బేస్డ్ టెస్ట్)ను 20,600 మంది అభ్యర్థులు రాశారు. ఈ ఫలితాలతో ఎంపికయ్యే 1,931 మంది ఎంపీహెచ్‌ఏలు.. కమ్యూనిటీ హెల్త్ నర్సింగ్, హెల్త్ ప్రమోషన్, ప్రైమరీ హెల్త్ కేర్ నర్సింగ్, చైల్డ్ హెల్త్ నర్సింగ్, మిడ్‌వైఫరీ, హెల్త్ సెంటర్ మేనేజ్‌మెంట్ తదితర విభాగాల్లో విధులు నిర్వహించనున్నారు. కాగా మరో వారం రోజుల్లో 1,284 ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుల ఫలితాలు కూడా విడుదలయ్యే అవకాశం ఉన్నట్లు మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు అధికారి ఒకరు తెలిపారు.

సమాజ సేవకే కమ్యూనిస్టులు అంకితం

- సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు



రఘుపాల్ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న బీవీ రాఘవులు తదితరులు

బీబీనగర్: కమ్యూనిస్టులు ఊపిరి ఉన్నంత వరకు సమాజ సేవకే అంకితమవుతారని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలం బొందుగుల గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు గంగసాని రఘుపాల్ (84) మృతి చెందడంతో.. ఆయన మృతదేహాన్ని ఆదివారం బీబీనగర్ ఎయిమ్స్ వైద్య కళాశాలకు అప్పగించారు. రఘుపాల్‌కు నివాళులర్పించిన అనంతరం బీవీ రాఘవులు మాట్లాడారు. రఘుపాల్ చిన్న వయసు నుంచే ఎర్రజెండా కింద పనిచేస్తూ.. హైదరాబాద్‌లో పార్టీ కార్యదర్శిగా ఎన్నో సేవలు అందించారని కొనియాడారు.

గతంలో అడిగిన ప్రశ్నలే

తేలికగానే జేఈఈ అడ్వాన్స్‌డ్

- స్వల్ప మార్పులతో ఇచ్చారని విద్యార్థుల వెల్లడి
- తెలుగు రాష్ట్రాల నుంచి పరీక్ష రాసిన 40 వేల మంది
- దేశవ్యాప్తంగా ప్రశాంతంగా ముగిసిన పరీక్ష
- జూన్ 2న ఫలితాలు... 3 నుంచి జోసా కౌన్సెలింగ్



సాక్షి, హైదరాబాద్: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)ల్లో ప్రవేశానికి నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్ష జేఈఈ అడ్వాన్స్‌డ్–2025 ఆదివారం దేశవ్యాప్తంగా ప్రశాంతంగా ముగిసింది. రెండు సెషన్లుగా నిర్వహించిన ఈ పరీక్ష కోసం తెలుగు రాష్ట్రాల నుంచి 40 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఐఐటీలు, ఎన్‌ఐటీలు, కేంద్ర ప్రభుత్వ నిధులతో నడిచే విద్యా సంస్థల్లో ప్రవేశానికి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) జనవరి, ఏప్రిల్ నెలల్లో రెండు దఫాలుగా జేఈఈ మెయిన్ పరీక్షలు నిర్వహించింది. దాదాపు 12 లక్షల మంది ఈ పరీక్షలు రాశారు. వీరిలో మెరిట్ ఆధారంగా 2.5 లక్షల మందిని అడ్వాన్స్‌డ్ కోసం ఎంపిక చేశారు. దేశంలోని దాదాపు 17 వేల ఐఐటీ సీట్లను అడ్వాన్స్‌డ్ ర్యాంకు ఆధారంగానే భర్తీ చేస్తారు. ఈసారి అడ్వాన్స్‌డ్‌ను కాన్పూర్ ఐఐటీ నిర్వహించింది.

పాత ప్రశ్నలే అటు ఇటుగా మార్చి..

అడ్వాన్స్‌డ్ పరీక్షపై విద్యార్థులు సంతృప్తి వ్యక్తం చేశారు. గత ఐదేళ్లలో నిర్వహించిన జేఈఈ పరీక్షల పేపర్ల నుంచే ఎక్కువ ప్రశ్నలు వచ్చాయని నిపుణులు చెబుతున్నారు. ఐఐటీ కోసం కోచింగ్ తీసుకున్న విద్యార్థులు ఈ పరీక్ష తేలికగానే రాయగలిగారు. ఈసారి నెగెటివ్ మార్కులను తగ్గించుకోవడానికి వీలుందని విద్యార్థులు తెలిపారు. మేథ్స్ విభాగంలో కొన్ని ప్రశ్నలు సుదీర్ఘంగా ఉన్నా, చాలా వరకు తేలికగానే ఉన్నాయని చెప్పారు. వెక్టార్స్, ఆల్‌జీబ్రా, ఇంటిగ్రల్ కాలిక్యులేషన్స్, సెట్స్, రిలేషన్స్ అండ్ ఫంక్షన్స్, ట్రిగ్నామెట్రీ, ప్రాబబులిటీ అండ్ స్టాటిస్టిక్స్, మేట్రిక్స్, అనలిటిక్స్ జామెంట్రీ, డిఫరెన్షియల్ కాలిక్యులేషన్స్ నుంచి ప్రశ్నలు ఇచ్చారు. ఆల్‌జీబ్రా, మేట్రిక్స్ నుంచి ప్రశ్నలు చాలా తేలికగా ఉన్నాయని విద్యార్థులు వెల్లడించారు. ఫిజిక్స్ విభాగంలో ఎక్కువగా ఆప్టిక్స్, ఎలక్ట్రిసిటీ మ్యాగ్నటిజం, మోడ్రన్ ఫిజిక్స్, మెకానిక్స్, థర్మల్ ఫిజిక్స్ నుంచి గత కొన్నేళ్లలో అడిగిన ప్రశ్నలనే స్వల్ప మార్పులతో ఇచ్చారని నిపుణులు తెలిపారు. అయితే, కొన్ని ప్రశ్నలు గందరగోళంలో పడేశాయని విద్యార్థులు చెప్పారు. కెమిస్ట్రీ విభాగంలో అన్ని ప్రశ్నలు తేలికగానే ఉన్నాయని వివరించారు. మూలకాలు, సిద్ధాంతాల ఆధారంగా ప్రశ్నలు వచ్చినట్టు తెలిపారు.

జూన్ 2న ఫలితాలు... 3 నుంచి జోసా కౌన్సెలింగ్

జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష ఫలితాలను జూన్ 2వ తేదీన విడుదల చేస్తామని కాన్పూర్ ఐఐటీ ప్రకటించింది. అదే రోజు ర్యాంకులు ప్రకటిస్తామని పేర్కొంది. రిజర్వేషన్ పద్ధతి కూడా ఇందులో పాటించాల్సి ఉంటుంది. దీంతో కటాఫ్ గతం మాదిరిగానే ఉంటుందని భావిస్తున్నారు. ఫలితాలు వెలువడిన వెంటనే జూన్ 3న జాయింట్ సీట్ అలొకేషన్ అథారిటీ (జోసా) కౌన్సెలింగ్ చేపడుతుందని అధికారులు తెలిపారు. ఐఐటీలు, ఎన్‌ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, కేంద్ర ప్రభుత్వ నిధులతో నడిచే సంస్థలకు సంబంధించిన సీట్లను జోసా కౌన్సెలింగ్ ద్వారా చేపడతారు. కౌన్సెలింగ్ ఐదు విడతలుగా ఉండే అవకాశం ఉంది.

భారత్‌కు హాని చేస్తే ఎవరినీ వదిలిపెట్టం

- కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్
- వన్ నేషన్ వన్ ఎలక్షన్ మా నినాదం
- పదే పదే ఎన్నికలతో డబ్బు, సమయం వృథా
- బ్రిటిష్ చట్టాలను మార్చుకోవాలి: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: భారత్ అత్యంత శాంతిప్రియ దేశమని, ఎవరికీ హానితలపెట్టదని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ అన్నారు. కానీ భారత్‌కు హాని చేసినవారిని ఎట్టిపరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోదని, ప్రధాని నరేంద్ర మోదీ విధానం కూడా ఇదేనని స్పష్టం చేశారు. ఆదివారం సోమాజిగూడలోని ఓ హోటల్‌లో జరిగిన 'ప్రొఫెషనల్స్ ఫర్ వన్ నేషన్ వన్ ఎలక్షన్'కార్యక్రమంలో ఆయన వర్చువల్ పద్ధతిలో పాల్గొని మాట్లాడారు. కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదులు.. పర్యాటకుల మతం అడిగి మరీ హతమార్చారని, ఇంతటి ఘోరానికి కారకులైన ఉగ్రవాదులను మట్టుబెట్టాలనే లక్ష్యంతో ప్రధాని మోదీ సాహసోపేత నిర్ణయాలు తీసుకున్నారని చెప్పారు. పాకిస్తాన్‌లో ఉగ్ర వాదుల స్థావరా లను వెతికి మరీ నేల మట్టం చేశామని తెలిపారు. ఇదిలా ఉండగా దేశంలో నాలుగైదు నెలలకు ఒకసారి ఏదోఒకచోట ఎన్నికలు జరుగుతున్నాయని, ఇలా ఎన్నికలు జరగడంతో దేశానికి ఆర్థికంగా ఎంతో నష్టం కలుగుతోందని పేర్కొన్నారు. అధికారులు ఎప్పుడూ ఎన్నికల పనే చేస్తుంటే మిగతా పనుల సంగతేంటని, ప్రజలకు సేవ చేసేదెప్పుడని ప్రశ్నించారు. ఎక్కడైతే ఎన్నికలు జరుగుతాయో అక్కడ కేవలం స్థానిక అధికారులే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా అధికారులు వెళ్లి పని చేస్తారని, ఈ పరిస్థితిని అధిగమించి మెరుగైన పాలనను అందించాలంటే వన్ నేషన్ వన్ ఎలక్షన్ ఉండాల్సిందే అని స్పష్టం చేశారు. 1951, 52 సంవత్సరాల్లో ఎన్నికల ఖర్చు రూ.11 వేల కోట్లు అయిందని, 2019 లోక్‌సభ ఎన్నికలకు రూ.60 వేల కోట్లు, 2024లో లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు రూ.1.35 లక్షల కోట్లు ఖర్చయిందని వివరించారు. ఎన్నిసార్లు ఎన్నికలు జరిగితే అంత ఖర్చు అవుతుందన్నారు. లోక్ సభ, విధాన సభలకు ఎందుకు వేరు వేరు ఎన్నికలు జరగాలని ప్రశ్నించారు. రెండు ఎన్నికలు ఒకేసారి జరిగితే ఖర్చు భారీగా తగ్గుతుందన్నారు. ఇలా ఐదేళ్లకొకసారి మాత్రమే ఎన్నికలు జరగాలన్నారు. అనంతరం కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ఒకే దేశం ఒకే ఎన్నికపై అవగాహన కల్పించేందుకే ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా ఇప్పటికీ బ్రిటీష్ విధానాలనే అనుసరిస్తున్నామని, ప్రస్తుతం దేశంలో ఉన్న వర్తమాన రాజకీయ, ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా చట్టాలను మార్చుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఇందులో భాగంగానే వన్ నేషన్ వన్ ఎలక్షన్ ఆవశ్యకతను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యపరుస్తున్నామన్నారు.



మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

నేడు నాగర్‌కర్నూల్ జిల్లాకు సీఎం రేవంత్

- మాచారంలో సౌర వికాసం పథకం ప్రారంభం
- లబ్ధిదారులకు సోలార్ పంపుసెట్ల పంపిణీ



మాచారంలో చెంచుల పోడుభూముల్లో నాటిన మొక్కలు

సాక్షి, హైదరాబాద్/ సాక్షి, నాగర్‌కర్నూల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లాలో పర్యటించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిర సౌర గిరిజనుల వికాసం (ఐఎస్‌జీజీవీ) పథకాన్ని ప్రారంభించేందుకు ముఖ్యమంత్రి సోమవారం ఉదయం హైదరా బాద్ నుంచి బయలుదేరి అమ్రాబాద్ మండలం మాచారం గ్రామానికి చేరుకుంటారని సీఎంవో కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. అక్కడ చెంచు రైతుల పోడు భూముల్లో సోలార్ ఆధారిత బోరును ఆన్‌చేసి ఈ పథకాన్ని ప్రారంభిస్తారు. ఇప్పటికే గ్రామంలోని చెంచుల పోడు భూములను చదును చేసి 16 బోర్లు, సోలార్ విద్యుత్ సౌకర్యం కల్పించారు. వారి భూముల్లో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో వివిధ మొక్కలు నాటించారు. ఈ పథకం కింద రాష్ట్రంలోని గిరిజనుల పోడు భూముల్లో ఉచితంగా బోర్లను తవ్వి, సోలార్‌విద్యుత్, మోటారును ఏర్పాటు చేయనున్నారు. పథకం ప్రారంభం సందర్భంగా లబ్ధిదారులకు సీఎం సోలార్ పంపుసెట్లను పంపిణీ చేస్తారు. అనంతరం సీతారామాంజనేయస్వామి ఆలయాన్ని దర్శించుకుని గ్రామంలో బహిరంగ సభకు హాజరవుతారు. ఈ సభలో ప్రసంగించిన అనంతరం తన స్వగ్రామమైన వంగూరు మండలం కొండారెడ్డిపల్లెకు వెళ్తారు. అక్కడ నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. తర్వాత సాయంత్రం హైదరాబాద్‌కు తిరిగి వస్తారు.

జీర్లను, బార్లను నమ్ముకొని పాలన సాగిస్తారా?

- మాజీ మంత్రి హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: పాలన గాలికి వదిలి, సంక్షేమ పథకాలను అటకెక్కించి కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్సైజ్ శాఖపైనే ప్రధానంగా దృష్టి పెట్టిందని సిద్దిపేట ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు ధ్వజమెత్తారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు మద్యంపై రాద్ధాంతం చేసిన వాళ్లే, ఇప్పుడు మద్యం ధరలు పెంచి వేల కోట్ల రాబడిని సమకూర్చుకోవాలనుకోవడం సిగ్గుచేటని ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఇప్పటికే బీర్ల ధరలను 15 శాతం పెంచిన ప్రభుత్వం, ఇప్పుడు లిక్కర్ ధరలు పెంచి, పేద, మధ్యతరగతి ప్రజల నడ్డి విరుస్తోందన్నారు. ఒకవైపు మద్యం ధరలు పెంచడం, మరోవైపు విక్రయాలను రెండింతలు చేయాలని అధికారులను ఆదేశించడంతోనే ప్రభుత్వ ఆంతర్యం స్పష్టమవుతోందన్నారు. ఎన్నికల ముందు సుద్దపూస మాటలు చెప్పి అధికారంలోకి రాగానే అడ్డగోలుగా మద్యం ధరలు పెంచుతున్నారని విమర్శించారు. ప్రభుత్వ చర్యలతో ఆర్థిక ప్రగతి క్షీణిస్తుందని, ఆ లోటును భర్తీ చేసుకునేందుకు మద్యం ధరలు పెంచుతున్నారని హరీశ్ ఆరోపించారు. బెల్ట్ షాపులను రద్దు చేస్తామని గతంలో హామీ ఇచ్చారని, ఇప్పుడు ఎక్సైజ్ ఆదాయంపైనే ఆధారపడుతున్నారని విమర్శించారు.

అరటిగెలల మాటున పశువుల తరలింపు



పోలీసులు పట్టుకున్న నిందితులు

- పంతంగి టోల్‌ప్లాజా వద్ద పట్టుకున్న పోలీసులు
- ఇద్దరిపై కేసు నమోదు

చౌటుప్పల్ రూరల్: అరటి గెలల మాటున ఆవులతో పాటు ఎద్దులను అక్రమంగా కబేళాలకు తరలిస్తున్న డీసీఎంను ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా పిఠాపురం సంత నుంచి 16 ఆవులు, 12 ఎడ్లను అక్రమంగా హైదరాబాద్‌లోని కబేళాలకు తరలిస్తున్నారు. డీసీఎం లోపల పశువులను పెట్టి అవి కనిపించకుండా వాటిపైన అరటి గెలలు వేశారు. అరటి గెలల లోడ్ పేరుతో అక్రమంగా ఆవులను తరలిస్తున్నారన్న సమాచారంతో చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. డీసీఎంను తనిఖీ చేయగా అరటి లోడ్ కింద 28 పశువులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. రంగారెడ్డి జిల్లా మంచాల మండలం చెన్నారెడ్డిగూడేనికి చెందిన డీసీఎం డ్రైవర్ రమావత్ శరత్‌కుమార్ (25), ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలానికి చెందిన దాసరి భగవాన్ (27)లను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు చౌటుప్పల్ సీఐ జి.మన్మథకుమార్ తెలిపారు. పట్టుకున్న పశువులను హైదరాబాద్‌లోని గోశాలకు తరలించినట్లు పేర్కొన్నారు.

యువతకు ఉద్యోగ కల్పనే లక్ష్యం

- సింగరేణి సీఎండీ బలరాం
- గోదావరిఖనిలో మెగా జాబ్‌మేళా



ఉద్యోగ నియామకపత్రం అందిస్తున్న సీఎండీ బలరాం, రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా సింగరేణి యాజమాన్యం ముందుకు సాగుతోందని ఆ సంస్థ సీఎండీ ఎన్.బలరాం, రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్‌రావు అన్నారు. పెద్దపల్లి జిల్లా రామగుండం నగరంలోని సింగరేణి జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో సింగరేణి, నోబెల్ ఎడ్యుకేషన్, ఎంపవర్‌మెంట్ ఆధ్వర్యంలో చేపట్టిన మెగా జాబ్‌మేళాను ఆదివారం వారు ప్రారంభించి మాట్లాడారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో తిలక్‌నగర్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ద్వారా వివిధ కోర్సులు నిర్వహించి వంద మందికిపైగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించామని అన్నారు. వోల్వో ఆపరేటర్ శిక్షణ ఇచ్చి మరో 150 మంది అభ్యర్థులకు ఉపాధి అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. ఇంటర్వ్యూ ఆధారంగా వివిధ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు సీఎండీ బలరాం, ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ నియామక పత్రాలను అందజేశారు. సింగరేణి డైరెక్టర్లు డి.సత్యనారాయణరావు, కె.వెంకటేశ్వర్లు నోబెల్ ఎడ్యుకేషన్ అండ్ ఎంపవర్‌మెంట్ వ్యవస్థాపకుడు సురేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. కాగా, మెగా జాబ్‌మేళాలో వంద కంపెనీలు పాల్గొన్నాయని, 3,029 మందికి ఉద్యోగాలు లభించినట్లు సింగరేణి యాజమాన్యం ప్రకటించింది.

పదవి ఇప్పిస్తానని లైంగిక దాడికి యత్నం

- దళిత నాయకురాలిపై కాంగ్రెస్ కార్పొరేటర్ నరేందర్ ఆగడం



ఖిలా వరంగల్: కాంగ్రెస్ పార్టీలో రాష్ట్ర పదవి ఇప్పిస్తానంటూ ఓ దళిత నాయకురాలిని.. అదే పార్టీ కార్పొరేటర్ ఇంటికి పిలిపించుకొని లైంగిక దాడికి యత్నించి.. కులం పేరుతో దూషించాడు. బాధితురాలు, పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేందర్.. అదే డివిజన్‌కు చెందిన ఒక కాంగ్రెస్ దళిత నాయకురాలిని ఆదివారం ఉదయం 9 గంటలకు ఇంటికి పిలిపించుకున్నాడు. పార్టీలో రాష్ట్రస్థాయి పదవి ఇప్పిస్తానంటూ మభ్యపెట్టి అసభ్యకరంగా ప్రవర్తించాడు. లైంగిక దాడికి యత్నించడమే కాకుండా కులం పేరుతో దూషించాడు. దీంతో బాధితురాలు అక్కడి నుంచి తప్పించుకుని 100 నంబర్‌కు డయల్ చేసింది. అనంతరం మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని కార్పొరేటర్ గుండేటి నరేందర్‌పై ఫిర్యాదు చేసింది. దీంతో నిందితునిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, అత్యాచారయత్నం కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం తెలిపారు. వయసులో పెద్దవాడని కార్పొరేటర్‌ను గౌరవించానని.. అది అలుసుగా చేసుకుని బలవంతంగా లొంగదీసుకోవడానికి ప్రయత్నించేవాడని బాధితురాలు వాపోయింది. కార్పొరేటర్ నరేందర్‌ను అదుపులోకి తీసుకుని.. ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నంతో కలిసి ఏసీపీ నందిరామ్ నాయక్ విచారిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. నిందితుడిని ఆదివారం సాయంత్రం ఇద్దరి పూచీకత్తుపై తాత్కాలికంగా వదిలిపెట్టినట్లు తెలిసింది. నరేందర్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేయగా.. కక్ష సాధింపుగానే అక్రమ కేసులు పెట్టారని కాంగ్రెస్ నాయకులు, పద్మశాలి కుల సంఘాల నాయకులు ఆందోళన చేపట్టారు.

కొండా దంపతుల వల్లే..: కొండా దంపతుల వల్లే తాను బలయ్యానని 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేందర్ ఆరోపించారు. దళిత నాయకురాలిపై లైంగిక దాడి కేసులో.. సొంత పూచీకత్తుపై విడుదలైన తర్వాత ఆదివారం రాత్రి ఆయన విలేకరులతో మాట్లాడారు. తనపై పెట్టిన అక్రమ కేసును ప్రజలు, కుల సంఘాలు, రాజకీయ పక్షాలు పార్టీలకు అతీతంగా ఖండించడం వల్లే కేసును తాత్కాలికంగా పక్కన పెట్టారని.. అందుకే బయటకు వచ్చానని స్పష్టం చేశారు. కొండా దంపతుల ఒత్తిడితోనే పోలీసులు కేసు పెట్టారని ఆరోపించారు.

పొంగులేటి పట్టుతో 'పాలేరుకు మున్నేరు'

- 10 టీఎంసీల వరద నీటిని ఒడిసిపట్టే ప్రణాళిక
- మున్నేరు నుంచి పాలేరు రిజర్వాయర్‌కు గ్రావిటీ ద్వారా నీరు తరలింపు
- రూ.162.54 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు
- రేవంత్, ఉత్తమ్‌లకు కృతజ్ఞతలు తెలిపిన మంత్రి పొంగులేటి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చొరవతో ఖమ్మం జిల్లాలో మరో కెనాల్ కార్యరూపం దాల్చనుంది. మున్నేరు నుంచి పాలేరు రిజర్వాయర్‌కు వరద నీటిని తరలించేందుకు వీలుగా మున్నేరు–పాలేరు లింక్ కెనాల్‌కు రూ.162.54 కోట్ల నిధులు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మున్నేరు నుంచి నేరుగా వెళ్లి సముద్రం పాలవుతున్న దాదాపు 10 టీఎంసీల నీటిని ఒడిసిపట్టే ఈ ప్రణాళికను మంత్రి పొంగులేటి పట్టువదలని విక్రమార్కుడిలా సాధించుకున్నారు. వరద నీటిని గ్రావిటీ కెనాల్ ద్వారా తరలించడం వల్ల పాలేరు రిజర్వాయర్ పరిధిలోని 2.54 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరగనుండగా, ఇందులో మంత్రి పొంగులేటి ప్రాతినిధ్యం వహిస్తున్న పాలేరు నియోజకవర్గంలోనే 1.30 లక్షల ఆయకట్టుకు ప్రయోజనం చేకూరనుంది. మున్నేరు–పాలేరు లింక్ కెనాల్‌కు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం పట్ల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ నీరు ఖమ్మం జిల్లాలో సాగునీటి అవసరాలతో పాటు సూర్యాపేట, మహబూబాబాద్, ఖమ్మం జిల్లాలకు తాగునీరు, డోర్నకల్ నియోజకవర్గం పరిధిలోని పది చెరువుల కింద సాగునీటి కోసం ఉపయోగపడుతుందని వెల్లడించారు. ప్రతి సంవత్సరం వర్షాకాలంలో వృథాగా పోయే ఈ నీటిని రైతులకు ఉపయోగకరంగా మళ్లించాలన్న ఆలోచన గత పదేళ్ల బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ఏనాడూ రాలేదని ఆయన విమర్శించారు. ఇందిరమ్మ ప్రభుత్వంలో ఈ నీటిని ఒడిసిపట్టి రైతుల భూములకు మళ్లించాలన్న సంకల్పంతో లింక్ కెనాల్ మంజూరు చేయించుకున్నామని, నిర్దిష్ట సమయంలోగా ఈ ప్రాజెక్టును పూర్తి చేస్తామని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.

నక్ష, రికార్డులు లేని గ్రామాలే లక్ష్యంగా..

- ఈ వారం నుంచే ప్రయోగాత్మకంగా ఐదు గ్రామాలలో భూముల రీసర్వే
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: నిజాం కాలం నుంచి సర్వే జరగని, నక్షలతో పాటు సర్వే రికార్డులు లేని గ్రామాలే లక్ష్యంగా భూముల రీసర్వే నిర్వహిస్తున్నట్టు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. రాష్ట్రంలోని 413 గ్రామాల్లో నక్షలతో పాటు సర్వే రికార్డులు లేవని, ప్రస్తుతం వీటిలో ఐదింటిని ఎంపిక చేసి ఈ వారం నుంచే సర్వేను నిర్వహిస్తామని తెలిపారు. ఈ సర్వే కోసం సలార్‌నగర్ (గండీడ్ మండలం), కొమ్మనాపల్లి (భీర్పూర్), ములుగుమడ (ఎర్రుపాలెం), నూగూరు (వెంకటాపురం), షాహిద్‌నగర్ (వట్పల్లి) గ్రామాలను పైలెట్ పథకం కింద ఎంపిక చేశామని, ఈ గ్రామాల్లో ఎంపిక చేసిన సంస్థల ఆధ్వర్యంలో సర్వే శాఖ సహకారంతో రీసర్వే జరుగుతుందని ఆదివారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం ఆర్వీ అసోసియేట్స్, మార్వెల్ జియో స్పేషియల్, ఐఐసీ టెక్నాలజీస్, నియోజియో, డ్రోగో డ్రోన్ సంస్థలను ఎంపిక చేసినట్టు వెల్లడించారు. గతంలో పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ఆ 413 గ్రామాల్లోని రెవెన్యూ సమస్యలను పరిష్కరించలేకపోయిందని, అయితే సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ఈ గ్రామాల్లో భూముల సమస్యకు పరిష్కారం చూపాలని నిర్ణయించిందని తెలిపారు. ఏరియల్/డ్రోన్ లేదా ప్యూర్ గ్రౌండ్ ట్రూతింగ్ పద్ధతుల్లో సర్వే చేసి జియో రెఫరెన్స్, క్యాడస్ట్రల్ మ్యాప్‌లు, భూహక్కుల నమోదు పత్రాలను తయారు చేస్తామని తెలిపారు. ఈ గ్రామాల్లో అనుభవాల ఆధారంగా మిగిలిన గ్రామాల్లోనూ ఈ సర్వే చేస్తామని మంత్రి పొంగులేటి ఆ ప్రకటనలో స్పష్టం చేశారు.

మద్యం ధరల పెంపు

- క్వార్టర్ బాటిల్‌పై రూ.10.. హాఫ్‌కు 20, ఫుల్ బాటిల్‌పై రూ.40 పెరిగిన ధరలు
- నేటి నుంచి అమల్లోకి..

సాక్షి, హైదరాబాద్: మందు బాబులకు సర్కార్ షాక్ ఇచ్చింది. ఇటీవల బీర్ల ధరలను పెంచిన ఎక్సైజ్ శాఖ.. తాజాగా లిక్కర్ ధరలను కూడా పెంచేసింది. అధికారికంగా ఎలాంటి ప్రకటనా రాకపోయినప్పటికీ సోమవారం నుంచి పెరిగిన ధరలు అమల్లోకి రానున్నాయి. ఆదివారం మద్యం డిపోలకు సెలవు కారణంగా ధరల పెంపు విషయాన్ని ఎక్సైజ్ అధికారులు సోమవారమే ప్రకటిస్తారని తెలుస్తోంది. ఎక్సైజ్ వర్గాల నుంచి అందిన సమాచారం ప్రకారం ప్రతి బ్రాండ్ మద్యం క్వార్టర్ బాటిల్‌పై రూ.10 ధర పెరగనుంది. అదే విధంగా హాఫ్ బాటిల్‌పై రూ.20, ఫుల్ బాటిల్‌పై రూ.40 చొప్పున ధరలు పెరుగుతాయి. గతంలో ఎక్సైజ్ సెస్సును తగ్గించడంతో లిక్కర్ ధరలు తగ్గాయని, ఇప్పుడు మళ్లీ ఎక్సైజ్ సెస్‌ను సవరించడంతో ఈ మేరకు ధరలు పెరిగాయి. ఈ పెంపు కారణంగా ప్రభుత్వ ఖజానాకు ఏటా రూ.1,500 కోట్ల అదనపు ఆదాయం సమకూరుతుందని తెలుస్తోంది. అయితే, చీప్‌లిక్కర్ ధర మాత్రం పెరిగిందా లేదా అన్నది సోమవారం ఎక్సైజ్ శాఖ అధికారిక ప్రకటన అనంతరం స్పష్టత రానుంది.

TELANGANA CO-OPERATIVE MARKETING FEDERATION LTD.
Email: proc.tsmarkfed2018@gmail.com,
Ph.No.040-2460 7108, Fax: 040-2460 7100
Rc.No./P&M/Disposal of Soyabean Vanakalam 2024-25 Date: 17-05-2025
TENDER FOR SALE OF SOYABEAN PROCURED BY TG MARKFED DURING VANAKALAM 2024-25
TG MARKFED invites online e-auction bids for the sale of the entire quantity of 590.067 MTs of Soyabean procured during Vanakalam 2024-25 in a single lot, without a base price. Online e-auction starts on dated 28-05-2025 from 11:00 AM to 02:00 PM through e-procurement.telangana.gov.in or https://auction.telangana.gov.in/ i.e. Telangana e-procurement portal (Applications in e-procurement portal will be available from 19-05-2025 AN). EMD Submission end date: 27-05-2025. For Online registration and further technical support please contact Service Providers Ph: 7337445546, 7337445545 & 6309339690, 9912756216. For further details please Contact: Ph: 7288879806 and 7288879829.
DIPR RO No.2039-PP/CL/Advt/1/2025-26, Dt: 17-05-2025 Sd/- Managing Director

తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ
'వేర్‌హౌసింగ్ సదన్', నాంపల్లి, హైదరాబాద్ -500001
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
తెలంగాణ రాష్ట్రంలోని దిగువ ప్రదేశాల వద్ద TGSWC యొక్క వివిధ కేంద్రాలలో పనుల కొరకు సమర్థిత సివిల్ కాంట్రాక్టర్ల నుండి మేనేజింగ్ డైరెక్టర్, TGSWC, హైదరాబాద్ వారి ద్వారా ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి -1) TGSWC, జగ్గాపూర్, సిద్దిపేట జిల్లా వద్ద అనుబంధ పనులతో సహా 3400 M.T. సామర్థ్యం గోదాము నిర్మాణం, 2) TGSWC ... (గ్రా & మం), నిర్మల్ జిల్లా వద్ద అనుబంధ పనులతో సహా 1700 M.T. సామర్థ్యం గోదాము నిర్మాణం, 3) TGSWC ... (గ్రా), ... (మం), మహబూబాబాద్ జిల్లా వద్ద అనుబంధ పనులతో సహా 20,000 M.T. సామర్థ్యం గోదాము నిర్మాణం 4) TGSWC ..., ... (మం), జయశంకర్ భూపాలపల్లి జిల్లా వద్ద అనుబంధ పనులతో సహా 10,000 M.T. సామర్థ్యం గోదాము నిర్మాణం, 5) TGSWC ... (గ్రా), గద్వాల జిల్లా వద్ద అనుబంధ యూనిట్‌తో సహా 20,000 M.T. సామర్థ్యం గోదాము నిర్మాణం.6) TGSWC, ... (గ్రా), ... (మం), ఖమ్మం జిల్లా వద్ద అనుబంధ యూనిట్‌తో సహా 15,000 M.T. సామర్థ్యం గోదాము నిర్మాణం, 7) TGSWC M ..., ఖమ్మం జిల్లాకు 9700 M.T. సామర్థ్యం కోల్డ్ స్టోరేజ్ యూనిట్ నిర్మాణం. అన్ని పనుల కొరకు ప్రారంభ మరియు ముగింపు తేదీలు: 19-05-2025 నుండి 26-05-2025. ఏదైనా ఇతర సమాచారాన్ని https://tender.telangana.gov.in నుండి లేదా TGSWC కార్యాలయం, హైదరాబాద్ నుండి పొందవచ్చును.
DIPR RO No.2068-PP/CL/Advt/1/2025-26, Dt: 17-05-2025 సం/- మేనేజింగ్ డైరెక్టర్

CHHATTISGARH STATE MINOR FOREST PRODUCE CO-OPERATIVE FEDERATION, LTD
Van Dhan Bhavan, Sector 24, Atal Nagar, Raipur (C.G.)
Phone : 0771-2513100 to 2513110
E-Email: mfpfed.cg@nic.in Website : www.cgmfpfed.org
GST No. 22AABAC5137E2ZC
Tender notice dated 16.05.2025
Online e-tender is being invited in 02 cycles through Notification No. T.P. (Terminated)/2023-2024/XXVIII Dated 16.05.2025 for sale of Tendu Leaves (Terminated Lots) of Collection Season 2023 and 2024.
Detailed information regarding e-tender can be seen on the Federation's Website : www.cgmfpfed.org and online e-tender portal https://cgmfpfedtenders.abcprocure.com.
Managing Director
Samvad-43889/3



గమ్యం చేరని నిఘానేత్రం

విఫలమైన పీఎస్ఎల్వీ-సీ61 ప్రయోగం

కక్ష్యలోకి చేరని ఈఓఎస్-09 ఉపగ్రహం

శ్రీహరికోట: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీఎస్ఎల్వీ-సీ61 ప్రయోగం లక్ష్యాన్ని సాధించకుండానే అర్ధాంతరంగా ముగిసింది. నిఘా అవసరాలకు ఉద్దేశించిన ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్ (ఈఓఎస్-09)ను నిర్దేశిత కక్ష్యలో ప్రవేశపెట్టడంలో రాకెట్ విఫలమైంది. ప్రయోగంలో తొలి రెండు దశలు విజయవంతమైనా మూడో దశలో సాంకేతిక సమస్య తలెత్తింది. ఇస్రో అమ్ములపొదిలో కీలక అస్త్రంగా భావించే పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (పీఎస్ఎల్) విఫలం కావడం అత్యంత అరుదు. ఇస్రో చరిత్రలో శ్రీహరికోట నుంచి జరిగిన ఈ 101 ప్రయోగం అనుకున్న ఫలితం ఇవ్వకపోవడం శాస్త్రవేత్తలను తీవ్రంగా నిరాశపర్చింది. ఈ వైఫల్యం నేపథ్యంలో మరిన్ని ప్రయోగాలు వాయిదా పడే అవకాశాలున్నాయి. 2018–2023 మధ్య ప్రపంచవ్యాప్తంగా 74 శాతం రాకెట్ ప్రయోగాల వైఫల్యానికి ప్రొపల్షన్, స్టేజ్-సపరేషన్ అంశాలే కారణమని గణాంకాలు చెబుతున్నాయి.

గతి తప్పిన రాకెట్

శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్-షార్ మొదటి ప్రయోగ వేదిక నుంచి ఆదివారం ఉదయం 5.59 గంటలకు పీఎస్ఎల్వీ-సీ61 రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. 110 సెకండ్ల వ్యవధిలో తొలి దశలో 70 కిలోమీటర్లు ఎత్తుకు, 261.8 సెకండ్లలో రెండో దశలో 232 కిలోమీటర్ల ఎత్తుకు వెళ్లింది. 262.9 సెకండ్లకు మూడో దశలో ఘన ఇంధన మోటార్ మండించే సమయంలో రాకెట్ గతి తప్పింది. సరిచేసేందుకు మిషన్ కంట్రోల్ సెంటర్ సిబ్బంది ప్రయత్నించినా లాభం లేకపోయింది. రాకెట్ సముద్రంలో పడిపోయి ఉంటుందని ఇస్రో రిటైర్డ్ అధికారి ఒకరు చెప్పారు. ప్రయోగం విఫలమైనట్లు ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ ప్రకటించారు. మోటార్ కేస్‌లోని చాంబర్ ప్రెషర్‌లో లోపం తలెత్తినట్లు వెల్లడించారు.

విచారణకు కమిటీ

పీఎస్ఎల్వీ-సీ61 వైఫల్యానికి కారణాలు తెలిస్తేనే భావి ప్రయోగాల విషయంలో మరిన్ని జాగ్రత్తలకు ఆస్కారముంటుంది. అందుకే ఇస్రో నిపుణులు, ఇంజనీర్లు, సైంటిస్టులు, మిషన్ స్పెషలిస్టులతో తొలుత ఫెయిల్యూర్ అనాలిసిస్ కమిటీ(ఎఫ్ఏసీ)ని వేయనున్నారు. ప్రయోగ డేటాను ఇది క్షుణ్నంగా సమీక్షించి వైఫల్యానికి కారణాలను తేలుస్తుంది. కారణం సాంకేతికమా, మానవ తప్పిదమా, ప్రతికూల వాతావరణం వంటి బాహ్య అంశాలా అనేది నిర్ధారిస్తుంది. అవి పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన చర్యలను సిఫార్సు చేస్తుంది.

కారణం అదేనా?

పీఎస్ఎల్వీ-సీ 61 వైఫల్యానికి కారణంపై ఇస్రో దృష్టి సారించింది. ప్రొపల్షన్ సిస్టమ్‌లో ఫ్లెక్స్ నాజిల్ కంట్రోల్ వ్యవస్థ సరిగా పనిచేయకపోవడం వల్లే రాకెట్ కూలినట్లు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. నాజిల్‌ను సరిచేసి ఇంధనాన్ని మండించడంలో ఈ వ్యవస్థదే కీలక పాత్ర. దీన్ని పొరలతో కూడిన ఎలాస్టోమెరిక్ మెటీరియల్స్‌తో తయారు చేస్తారు. ప్రయోగం మూడో దశలో హైడ్రాక్సిల్-టెర్మినేటెడ్ పాలీబ్యుటాడీన్ (హెచ్‌టీపీబీ) ఇంధనాన్ని ఉపయోగించారు. ఇది 240 కిలోన్యూటన్ థ్రస్టును ఉత్పన్నం చేయగలదు.

ఇస్రో గెలుపుగుర్రం

పీఎస్ఎల్వీ ఉపగ్రహ వాహక నౌక ఇస్రోకు అత్యంత నమ్మకమైనది. ఎర్త్ అబ్జర్వేషన్, జియో-స్టేషనరీ, నావిగేషన్ అనే మూడు రకాల పేలోడ్లను నింగిలోకి పంపేలా పీఎస్ఎల్వీని ఇస్రో అభివృద్ధి చేసింది. దీని ఎత్తు 44.5 మీటర్లు, వ్యాసం 2.8 మీటర్లు. ఒకేసారి 1,750 కిలోల పేలోడ్‌ను మోసుకెళ్లగలదు. భూమి నుంచి 600 కిలోమీటర్ల ఎత్తులో ఉన్న సన్ సింక్రనస్ పోలార్ ఆర్బిట్‌కు చేరుకోగలదు. ఈ వాహక నౌక ఇస్రోకు ఎన్నో విజయాలు అందించి గెలుపు గుర్రంగా గుర్తింపు పొందింది. 2008లో చంద్రయాన్-1, 2013లో మార్స్ ఆర్బిటార్ స్పేస్‌క్రాఫ్ట్, 2023లో ఆదిత్య ఎల్1 మిషన్‌లను పీఎస్ఎల్వీ ద్వారానే ప్రయోగించారు. పీఎస్ఎల్వీ శ్రేణిలో ఇప్పటిదాకా చేపట్టిన 63 ప్రయోగాల్లో ఇది కేవలం మూడో వైఫల్యం. 1993 సెప్టెంబర్‌లో పీఎస్ఎల్వీ-డీ1 రాకెట్ ఐఆర్ఎస్-1ఈ ఉపగ్రహాన్ని, 2017 ఆగస్టులో పీఎస్ఎల్వీ-సీ39 రాకెట్ ఇండియన్ రీజినల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్(ఐఆర్ఎన్ఎస్ఎస్)ను కక్ష్యలోకి ప్రవేశపెట్టలేకపోయాయి.



ప్రమాదం తర్వాత వంతెన సమీపంలో నౌక (ఇన్‌సెట్‌లో) బ్రిడ్జి కిందిభాగాన్ని ఢీకొంటున్న తెరచాపలు

బ్రూక్లిన్ వంతెనను ఢీకొన్న నౌక

న్యూయార్క్‌లో తప్పిన ప్రమాదం ● ఇద్దరు సిబ్బంది మృతి, 19 మందికి గాయాలు

న్యూయార్క్: అమెరికా వాణిజ్య రాజధాని న్యూయార్క్‌లో ఘోర ప్రమాదం త్రుటిలో తప్పింది. మెక్సికో నావికా దళానికి చెందిన ఓ నౌక నగరంలోని ప్రఖ్యాత బ్రూక్లిన్ వంతెనను ఢీకొట్టింది. శనివారం రాత్రి న్యూయార్క్ ఈస్ట్ రివర్‌లో ప్రయాణిస్తూ 8.20 గంటల సమయంలో హఠాత్తుగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో అదుపు తప్పింది. నిర్దేశిత మార్గంలో కాకుండా వేరే మార్గంలో బ్రూక్లిన్ వంతెన వైపు వేగంగా దూసుకొచ్చింది. నౌకలోని మూడు తెరచాప స్తంభాలు వంతెనను ఢీకొని ఒకదాని తర్వాత ఒకటి విరిగిపడ్డాయి. నౌకలో ఆ స్తంభాల పక్కనే ఉన్నవారు గాయపడ్డారు. ఇద్దరు సిబ్బంది మృతి చెందగా 19 మంది గాయపడ్డారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు న్యూయార్క్ మేయర్ ఎరిక్ ఆడమ్స్ చెప్పారు. ప్రమాదంలో వంతెనకు పెద్దగా నష్టం వాటిల్లలేదని ఆదివారం సోషల్ మీడియాలో ఆయన పోస్టు చేశారు. బ్రిడ్జి పిల్లర్లను ఢీకొంటే నష్ట తీవ్రత చాలా ఎక్కువగా ఉండేదని చెబుతున్నారు. బ్రిడ్జిని నౌక ఢీకొట్టిన దృశ్యాలను స్థానికులు చిత్రీకరించారు. కాహ్‌టెమోక్ అని పిలిచే ఈ నౌకలో ప్రమాద సమయంలో 277 మంది ప్రయాణిస్తున్నారు. 91 మీటర్ల పొడవు, 12 మీటర్ల వెడల్పున్న ఈ నౌకను నావికా సిబ్బందికి శిక్షణ కోసం ఉపయోగిస్తున్నారు. 490 మీటర్ల పొడవుండే బ్రూక్లిన్ బ్రిడ్జి 1883లో ప్రారంభమైంది. న్యూయార్క్‌లోని ప్రధాన పర్యాటక ఆకర్షణల్లో ఒకటి. దీనిపై నిత్యం లక్ష వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రోజూ 32 వేల మందికి పైగా పాదచారులు నడుస్తుంటారు. నౌక ఢీకొట్టాక వంతెనపై రాకపోకలను కాసేపు నిలిపేసి తర్వాత పునరుద్ధరించారు.

లష్కరే కీలక నేత హతం

పాక్‌లో కాల్చేసిన గుర్తు తెలియని వ్యక్తులు ● భారత్‌లో పలు ఉగ్రదాడులకు సూత్రధారి



ఇస్లామాబాద్: కరడుగట్టిన ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబా అడ్డా పాకిస్తాన్. సొంత గడ్డపైనే ఆ సంస్థకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. సింధూ ప్రావిన్స్‌లో గుర్తు తెలియని వ్యక్తులు లష్కరే కీలక నేత రజావుల్లా నిజామనీ ఖలీద్ అలియాస్ అబూ సైఫుల్లా ఖలీద్‌ను ఆదివారం కాల్చి చంపారు. పహల్గాం దాడికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ జరిగిన కొన్ని రోజులకే ఈ పరిణామం చోటుచేసుకోవడం విశేషం. భారత్‌లో పలు ఉగ్రదాడుల వెనుక సైఫుల్లా హస్తముంది. 2005లో బెంగళూరులో ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌లో, 2006లో నాగపూర్‌లో ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయంపై, 2008లో సీఆర్పీఎఫ్ రాంపూర్ క్యాంపుపై జరిగిన దాడులకు అతడు ప్రధాన సూత్రధారి. భారత్‌లో లష్కరే తోయిబా నెట్‌వర్క్ బలంగా విస్తరించినట్లు ఆ దాడులతోనే నిర్ధారణ అయింది. వాటిలో పలువురు మరణించగా చాలామంది గాయపడ్డారు. వినోద్ కుమార్, మొహమ్మద్ సలీం, రజావుల్లా వంటి మారుపేర్లతో సైఫుల్లా కొన్నేళ్లు నేపాల్‌లో పాగా వేశాడు. అక్కడి నుంచే కార్యకలాపాలు సాగించాడు. నగ్మా బాను అనే స్థానిక మహిళను పెళ్లి చేసుకున్నాడు. లష్కరేలో కొత్త సభ్యులను చేర్పించడంలో, ఆయుధాలు, నిధులు సేకరించడంలో చురుగ్గా పనిచేశాడు. నేపాల్‌లో ఉంటూ భారత్‌పై దాడులకు పథక రచన సాగించాడు. ఇటీవలే పాక్‌లో సింధూ ప్రావిన్స్‌లోని బదీన్ జిల్లా మాట్లీ ప్రాంతానికి తన స్థావరం మార్చేశాడు. అక్కడి నుంచే లష్కరే కార్యకలాపాలు కొనసాగిస్తున్నాడు. గత వారం జమ్మూ కశ్మీర్‌లో వేర్వేరు ఎన్‌కౌంటర్లలో ముగ్గురు లష్కరే ఉగ్రవాదులు షహీద్ కుట్టే, అద్నాన్ షఫీ, అహసన్ ఉల్ హక్ షేక్ హతమైన సంగతి తెలిసిందే.

భారత్ అడుగుజాడల్లో...

ఇస్లామాబాద్: ఆపరేషన్ సిందూర్, పరస్పర సైనిక చర్యల తర్వాత ప్రతి అంశంలో భారత్‌ను పాకిస్తాన్ అనుసరిస్తోంది. పాక్ వైఖరిని అంతర్జాతీయంగా ఎండగట్టేందుకు అన్ని పార్టీల ఎంపీలు తదితరులతో ఏడు బృందాలను పలు దేశాలకు పంపుతుండటం తెలిసిందే. పాక్ కూడా అదే తరహాలో పలు దేశాలకు ఎంపీల బృందాలను పంపుతున్నట్టు హడావిడిగా ప్రకటించింది. పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ చీఫ్ బిలావల్ భుట్టో, పలువురు మంత్రులు, మాజీ మంత్రులు వాటికి సారథ్యం వహిస్తారని చెప్పుకొచ్చింది. దీనిపై సోషల్ మీడియాలో మీమ్స్ వెల్లువెత్తుతున్నాయి. ''సొంత ఆలోచనే లేకుండా భారత్ ఏం చేస్తే పాక్ అదే చేస్తోంది. మక్కికి మక్కి పాలసీని అలవర్చుకుంది. 'కాపీక్యాట్ పాక్'' అంటూ నెటిజన్లు ఎగతాళి చేస్తున్నారు. ఇందుకు పలు ఉదంతాలను ఉదాహరణలుగా చూపిస్తున్నారు.

దౌత్య బృందాలను పంపుతున్న పాక్
ప్రతిదాన్నీ కాపీ కొడుతున్న దాయాది

బహిష్కరణల నుంచి బృందాల దాకా..

పహల్గాం ఉదంతం తర్వాత భారత్ వెంటనే భారత్‌లోని పాకిస్తాన్ రాయబార కార్యాలయంలోని సిబ్బందిని భారీగా కుదించింది. వాళ్లను తక్షణం భారత్‌ను వీడాలని ఆదేశించింది. పాకిస్తాన్‌లోని భారతీయ హైకమిషన్‌లోనూ కొంత సిబ్బందిని వెనక్కివచ్చేయాలని సూచించింది. పాక్ కూడా అచ్చం అవే చర్యలకు దిగింది. మనం ఆపరేషన్ సిందూర్ అని పేరు పెడితే తానూ 'ఆపరేషన్ బున్యాన్ మోఅల్ మర్సూస్' అని నామకరణం చేసింది.

మోదీ బాటలో షహబాజ్...

ఆపరేషన్ సిందూర్‌లో కీలక పాత్ర పోషించిన ఎయిర్‌ఫోర్స్ బలగాలను మెచ్చుకునేందుకు ప్రధాని మోదీ పంజాబ్‌లోని ఆదంపూర్ వైమానిక స్థావరాన్ని సందర్శించారు. సుదర్శన చక్ర(ఎస్-400) గగనతల రక్షణ వ్యవస్థ ఎదుట ఎయిర్‌ఫోర్స్ క్యాప్ ధరించి జవాన్లనుద్దేశిస్తూ ప్రసంగించారు. మర్నాడే పాక్ ప్రధాని షహబాజ్ షరీఫ్ కూడా అచ్చం ఇలాగే చేశారు. సియాల్‌కోట్‌లోని పస్రూర్ కంటోన్మెంట్‌లో యుద్ధట్యాంక్‌పై నిలబడి సైనిక యూనిఫామ్‌లో జవాన్లనుద్దేశించి ప్రసంగించారు. గూఢచర్యం ఆరోపణలపై ఢిల్లీలోని పాక్ హై కమిషన్ ఉద్యోగిని బహిష్కరిస్తే మర్నాడే పాక్ కూడా అదే పనిచేసింది. నిజానికి ఆ భారత ఉద్యోగిని కేంద్రం అప్పటికే వెనక్కి రప్పించడం ఇందులో కొసమెరుపు!

ఆపరేషన్ సిందూర్‌పై వ్యాఖ్యల వివాదం
అసోసియేట్ ప్రొఫెసర్ అరెస్టు



సోనిపట్ (హరియాణా): ఆపరేషన్ సిందూర్‌పై అశోకా యూనివర్సిటీ రాజనీతి శాస్త్ర విభాగాధిపతి అలీ ఖాన్ మహ్మూదాబాద్ సామాజిక మాధ్యమాల్లో పెట్టిన పోస్టులు వివాదాస్పదంగా మారాయి. హరియాణా మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రేణు భాటియా, మరొకరి ఫిర్యాదు మేరకు ఆయనపై రెండు నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేశారు. దేశ సమగ్రతకు, సార్వభౌమత్వానికి భంగం కలిగించారంటూ ఆదివారం ఢిల్లీలో అదుపులోకి తీసుకున్నారు. ప్రొఫెసర్ ఖాన్‌కు నోటీసులు కూడా ఇవ్వకుండానే అరెస్టు చేశారని ఆయన లాయర్ చెప్పారు. ప్రొఫెసర్ ఖాన్ మహిళా ఆర్మీ అధికారులను అవమానించేలా ఈ నెల 7న పోస్టులు చేశారని రాష్ట్ర మహిళా కమిషన్ పేర్కొంది. ''కల్నల్ సోఫియా ఖురేషీని ప్రశంసిస్తున్న మితవాదులు మూక హత్యల బాధితులకు, బుల్‌డోజర్లతో ధ్వంసమయ్యే ఆస్తులకు రక్షణ కల్పించాలని కూడా డిమాండ్ చేయాలి. ఆపరేషన్ సిందూర్ విషయంలో కల్నల్ ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ మీడియాకు వెల్లడించిన వివరాలు క్షేత్రస్థాయిలో కన్పించాలి. లేదంటే వంచనే అవుతుంది'' అని వాటిలో పేర్కొన్నట్టు తెలిపింది. దీన్ని సుమోటోగా స్వీకరించి మే 12న ఖాన్‌కు నోటీసులిచ్చింది. తన వ్యాఖ్యలను కమిషన్ తప్పుగా అర్థం చేసుకుందని, పరిధిని అతిక్రమించి జోక్యం చేసుకుందని ప్రొఫెసర్ పేర్కొన్నారు. ఆయన అరెస్టును విపక్షాలు తీవ్రంగా తప్పుబట్టాయి. ఒక బీజేపీ కార్యకర్త ఫిర్యాదుపై చర్యలు తీసుకుంటారా అని మజ్లిస్ నేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ప్రశ్నించారు. ఆయన పోస్టులో దేశానికి, మహిళలకు వ్యతిరేకంగా ఎలాంటి వ్యాఖ్యలు లేవన్నారు. అలీఖాన్ అరెస్టుపై కోర్టుకు వెళ్తామని టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రా తెలిపారు. జవహర్‌లాల్ నెహ్రూ వర్సిటీ టీచర్ల సంఘం కూడా ప్రొఫెసర్ అరెస్టును ఖండించింది.

ట్రంప్ సలహా సంఘంలో
మాజీ ఉగ్రవాదులు

లష్కరే, హమాస్‌లతో సంబంధాలున్న వారికి చోటు

వాషింగ్టన్: కరడుగట్టిన అల్‌కాయిదా, లష్కరే తోయిబా ఉగ్రసంస్థలకు చెందిన మాజీ ఉగ్రవాదులకు ఏకంగా అమెరికా అధ్యక్షుని సలహా సంఘంలో చోటు దక్కింది! వారిలో ఒకరు ఉగ్రవాదం, సంబంధిత కేసుల్లో దోషిగా జైలుశిక్ష అనుభవించి విడుదలైన ఇస్మాయిల్ రాయర్ కాగా మరొకరు హమాస్, ముస్లిం బ్రదర్‌హుడ్‌లతో సంబంధాలున్న మాజీ ఉగ్రవాది షేక్ హమ్జా యూసుఫ్. వారిని రిలీజియస్ లిబర్టీ కమిషన్ ఆధ్వర్యంలో పనిచేసే అడ్వైజరీ బోర్డ్ ఆఫ్ లే లీడర్స్‌లో సభ్యులుగా ట్రంప్ సర్కారు ఎంపిక చేసింది. వారిద్దరూ అమెరికాలో ఇస్లామిక్ బోధనల్లో ప్రముఖులుగా మంచిపేరు తెచ్చుకున్నారని చెప్పుకొచ్చింది. కరడుగట్టిన ఉగ్ర చరిత్ర ఉన్న మాజీలను సలహా సంఘంలోకి కూర్చోబెడతారా అని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ట్రంప్ రెండో హయాంలో అమెరికాలో నెలకొన్న అవ్యవస్థకు ఇది మరో నిదర్శనమంటూ పలువురు మండిపడుతున్నారు. ఈ సలహా సంఘం మతస్వేచ్ఛ, మత విశ్వాసాలకు అనుగుణంగా విధాన నిర్ణయాల్లో అధ్యక్షుడికి సలహాలిస్తుంది.

ఎవరీ ఇస్మాయిల్?



ఇతను అమెరికా జాతీయుడు. అసలు పేరు ర్యాండల్ టోడ్ రాయర్. 1992లో ఇస్లాం స్వీకరించి ఇస్మాయిల్‌గా పేరు మార్చుకున్నాడు. లష్కరే తోయిబా, ఈజిప్టులోని ముస్లిం బ్రదర్‌హుడ్, 'వర్జీనియా జిహాద్ నెట్‌వర్క్', పాలస్తీనాలోని హమాస్ ఉగ్ర సంస్థతో సత్సంబంధాలున్నాయి. ప్రత్యేక ఉగ్రశిక్షణ కోసం 2000లో పాక్ వెళ్లాడు. అమెరికాపై యుద్ధం కోసం పలువురికి ఉగ్ర తర్ఫీదు ఇచ్చేలా ప్రణాళికలు వేశాడు. జమ్మూ కశ్మీర్‌లో సైనిక స్థావరాలపై రాకెట్ ప్రొపెల్డ్ గ్రనేడ్ దాడికి సహచర ఉగ్రవాదికి శిక్షణ ఇచ్చాడు. అల్‌ఖయిదా, లష్కరేలకు సాయపడ్డ నేరానికి 2003లో ఇస్మాయిల్‌పై కేసు నమోదైంది. దోషిగా తేలడంతో 20 ఏళ్ల జైలుశిక్ష పడ్డా సత్ప్రవర్తన కారణంగా 2017లో విడుదలయ్యాడు. అమెరికాలోని రిలీజియస్ ఫ్రీడం ఇన్‌స్టిట్యూట్‌లో డైరెక్టర్‌గా ఉన్నాడు.

ఎవరీ షేక్ హమ్జా యూసుఫ్?



అమెరికాలో తొలి ముస్లిం లిబరల్ ఆర్ట్స్ కాలేజీ అయిన జేతునా కాలేజ్ సహవ్యవస్థాపకుడు. ఈ కాలేజీలో షరియా చట్టాలను బోధిస్తారు. యూసుఫ్‌కు ముస్లిం బ్రదర్‌హుడ్, హమాస్‌లతో లింకులున్నట్టు తేలింది. వాటితో ఇప్పటికీ సంబంధాలు కొనసాగిస్తున్నట్టు చెబుతారు. ఇతని బోధనలకు పలువురు ఉగ్రవాదులు ఆకర్షితులైనట్టు స్పష్టమైంది. అమెరికా జాత్యహంకార దేశమంటూ వ్యాఖ్యలు చేశాడు. 1990ల నాటి శకంలో న్యూయార్క్ బాంబు దాడుల కేసు నిందితుడు షేక్ ఒమర్ అబ్దుల్ రహ్మాన్‌పై దర్యాప్తులో అమెరికా ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించడం లేదని విమర్శలు గుప్పించాడు. అమెరికా పోలీస్ ఉన్నతాధికారిని హత్య చేసిన జమీల్ అల్ అమీన్ అనే వ్యక్తికి మద్దతుగా యూసుఫ్ ప్రసంగించాడు. తర్వాత రెండు రోజులకే అమెరికాపై 9/11 దాడి జరిగింది. దాంతో అతన్ని ఎఫ్‌బీఐ విచారించింది. ముస్లిం దేశాల్లో అత్యంత ప్రముఖ ఇస్లామిక్ విద్యావేత్తగా పేరొందాడు.

పాక్‌కు ఐఎంఎఫ్ మరో 11 షరతులు

భారత్‌తో పెట్టుకుంటే మీకే సమస్య అంటూ చురకలు

ఇస్లామాబాద్: పాకిస్తాన్‌కు బెయిల్ ఔట్ ప్యాకేజీ నిధులు విడుదల చేసే విషయంలో అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ(ఐఎంఎఫ్) 11 కొత్త షరతులు విధించింది. అలాగే భారత్‌తో ఉద్రిక్తతలు పెంచుకోవడం తగదని హితవు పలికింది. ఉద్రిక్తతలు పెంచుకొంటే మీకే ఎక్కువ సమస్యలు వస్తాయని తేల్చిచెప్పింది. ఆర్థికంగా మరిన్ని ఇబ్బందులు తలెత్తుతాయని, సంస్కరణ లక్ష్యాలను సాధించడం కష్టమవుతుందని తేల్చిచెప్పింది. బిలియన్ డాలర్ల(రూ.8,540 కోట్లు) రుణానికి సంబంధించిన నిధులు పొందాలంటే షరతులకు కట్టుబడి ఉండాల్సిందేనని తేల్చిచెప్పింది. తాజాగా విధించిన 11 షరతులతో కలిపి పాకిస్తాన్‌పై విధించిన ఐఎంఎఫ్ షరతుల సంఖ్య 50కి చేరుకోవడం గమనార్హం. రూ.17.6 ట్రిలియన్ల బడ్జెట్‌కు పార్లమెంట్ ఆమోదం తెలపాలని, విద్యుత్ బిల్లులపై రుణ సర్వీసింగ్ సర్‌చార్జి పెంచాలని, మూడేళ్లు దాటిన పాత కార్ల దిగుమతిపై ఆంక్షలు ఎత్తివేయాలని ఐఎంఎఫ్ పేర్కొంది. మొత్తం బడ్జెట్‌లో రూ.1.07 ట్రిలియన్ల సొమ్మును అభివృద్ధి కోసం కేటాయించాలని నిర్దేశించింది. పాక్‌లోని నాలుగు ప్రావిన్సుల్లో కొత్త వ్యవసాయ ఆదాయపు పన్ను చట్టాలని అమలు చేయాలని తేల్చిచెప్పింది.

సుప్రీంకు రాష్ట్రపతి లేఖను వ్యతిరేకిద్దాం

బీజేపీయేతర సీఎంలకు స్టాలిన్ లేఖ

సాక్షి, చెన్నై: పార్లమెంట్ ఆమోదం పొందిన బిల్లుల ఆమోదం విషయంలో తనకు గడువు విధించడంపై రాష్ట్రపతి ముర్ము సుప్రీంకోర్టుకు లేఖ రాయడాన్ని ఐకమత్యంతో వ్యతిరేకిద్దామంటూ తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆదివారం బీజేపీయేతర పాలిత రాష్ట్రాల సీఎంలకు లేఖలు రాశారు. రాజ్యాంగాన్ని రక్షించుకునేందుకు, సమన్వయంతో కూడిన చట్టపరమైన వ్యూహం రూపొందించుకుందామని పిలుపునిచ్చారు. ''తమిళనాడు ప్రభుత్వం వర్సెస్ గవర్నర్ కేసులో సుప్రీంకోర్టు తీర్పును ప్రశ్నించడమే రాష్ట్రపతి లేఖ ఉద్దేశం. అత్యున్నత న్యాయస్థానం చరిత్రాత్మక తీర్పును ధిక్కరించలేమని తెలిసి కూడా రాష్ట్రపతిపై ఒత్తిడి తెచ్చి కేంద్రమే ఆమెతో లేఖ రాయించింది. దీని వెనుక మోదీ ప్రభుత్వ దురుద్దేశం వెల్లడవుతోంది'' అంటూ పశ్చిమ బెంగాల్, కర్నాటక, హిమాచల్‌ప్రదేశ్, తెలంగాణ, కేరళ, జార్ఖండ్, పంజాబ్, జమ్మూకశ్మీర్ సీఎంలను స్టాలిన్ కోరారు.

సీజేఐకి ఇచ్చే గౌరవం ఇదేనా?

సీఎస్, డీజీపీ ఆహ్వానం పలకరా?

- మహారాష్ట్ర ప్రభుత్వ తీరుపై జస్టిస్ గవాయ్ అసంతృప్తి
- మూడు వ్యవస్థలు పరస్పర గౌరవించుకోవాలంటూ హితవు



బాంబే హైకోర్టు చీఫ్ జస్టిస్ ఆరాధేతో సీజేఐ జస్టిస్ గవాయ్

ముంబై: మహారాష్ట్ర ప్రభుత్వ తీరుపై సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ తీవ్ర అసంతృప్తి వెలిబుచ్చారు. సీజేఐగా బాధ్యతలు చేపట్టాక ఆదివారం ఆయన తొలిసారి తన సొంత రాష్ట్రం మహారాష్ట్రలో పర్యటించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రొటోకాల్ పాటించకపోవడాన్ని తీవ్రంగా ఆక్షేపించారు. సీజేఐ తొలిసారి అధికారిక పర్యటనకు వస్తే ప్రొటోకాల్ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో పాటు డీజీపీ లేదా నగర పోలీసు కమిషనర్ స్వాగతం పలకాల్సి ఉంటుంది. ఈ నెల 14న సీజేఐగా బాధ్యతలు స్వీకరించిన జస్టిస్ గవాయ్‌ని మహారాష్ట్ర, గోవా బార్ కౌన్సిల్ సన్మానించింది. ఆ కార్యక్రమం నిమిత్తం ఆయన ఆదివారం ముంబై చేరుకున్నారు. సీఎస్, డీజీపీ, పోలీసు కమిషనర్ స్వాగతం పలకకపోవడం చర్చనీయాంశంగా మారింది. అనంతరం సన్మాన కార్యక్రమంలో జస్టిస్ గవాయ్ దీన్ని ఎత్తిచూపారు. ''నేను మహారాష్ట్రలోనే పుట్టి పెరిగా. సీజేఐ హోదాలో తొలిసారి సొంత రాష్ట్రానికి వస్తే ప్రొటోకాల్ ప్రకారం ఆహ్వానించకపోవడం ఏ మేరకు సబబో సీఎస్, డీజీపీ ఆలోచించుకోవాలి. నేనేమీ ప్రొటోకాల్ కోసం బలవంతం చేయడం లేదు. ఇలాంటి చిన్నచిన్న విషయాలు పట్టించుకోను. కాకపోతే ప్రజాస్వామ్యంలో ఒక వ్యవస్థ మరో వ్యవస్థకు ఇవ్వాల్సిన గౌరవం గురించి మాత్రమే మాట్లాడుతున్నా. ప్రజలకు తెలియాలన్న ఉద్దేశంతోనే దీన్ని ప్రస్తావిస్తున్నా'' అని వివరించారు. ''ఇక్కడ నా స్థానంలో మరొకరు ఉండి ఉంటే రాజ్యాంగంలోని ఆర్టికల్ 142ను ప్రయోగించేవారు'' అని జస్టిస్ గవాయ్ సరదాగా వ్యాఖ్యానించారు.

రాజ్యాంగమే అత్యున్నతం

ప్రజాస్వామ్యంలో రాజ్యాంగమే అత్యున్నతమని సీజేఐ గవాయ్ స్పష్టం చేశారు. శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థలు కలిసికట్టుగా పనిచేయాలని పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని సవరించే అధికారం పార్లమెంట్‌కు ఉన్నప్పటికీ రాజ్యాంగ మౌలిక నిర్మాణాన్ని మాత్రం అది మార్చలేదని తేల్చిచెప్పారు. ప్రజాస్వామ్య వ్యవస్థ గొప్పతనం ఇదేనన్నారు. తాను వెలువరించిన 50 కీలక తీర్పులతో కూడిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. నేరగాళ్ల ఇళ్లను కూల్చడం (బుల్డోజర్ న్యాయం) కూడదంటూ తానిచ్చిన తీర్పు గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు.

గాజాలో 140 మంది మృతి

డెయిర్ అల్-బలాహ్: ఇజ్రాయెల్ సైన్యం బాంబు దాడులను యథేచ్ఛగా సాగిస్తోంది. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు గాజాపై కొనసాగించిన వైమానిక దాడుల్లో 140 మంది ప్రాణాలు కోల్పోయారు. ఖాన్‌యూనిస్ నగరం చుట్టుపక్కల ప్రాంతాలపై ఇళ్లు, శరణార్థులున్న టెంట్లపై జరిగిన దాడుల్లో 48 మంది చనిపోయారు. వీరిలో సగం మంది మహిళలు, చిన్నారులేనని నాసెర్ ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. జబాలియాలోని తాత్కాలిక శరణార్థి శిబిరంపై దాడిలో కుటుంబంలోని 9 మంది మృత్యువాతపడ్డారు. జబాలియాలోనే మరో నివాసంపై జరిగిన దాడిలో ఏడుగురు చిన్నారులు, ఒక మహిళ సహా పది మంది విగతజీవులయ్యారని గాజా అత్యవసర సేవల విభాగం వివరించింది. ఉత్తరగాజా ప్రాంతాలపై జరిగిన దాడుల్లో మరో 43 మంది చనిపోయారు. వీరిలో 15 మంది చిన్నారులు, 12 మంది మహిళలు ఉన్నట్లు షిఫా ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. సెంట్రల్ గాజాపై జరిగిన దాడుల్లో మరో 12 మంది ప్రాణాలు కోల్పోయారు. ఆపరేషన్ 'గిడియన్స్ చారియట్స్'లో భాగంగా ఉత్తర, దక్షిణ ప్రాంతాల్లో వేలాది మంది సైనికులతో భూతల పోరాటాన్ని ప్రారంభించినట్లు ఇజ్రాయెల్ ఆర్మీ ఆదివారం తెలిపింది. ఆ రెండు ప్రాంతాలను పూర్తి స్థాయిలో స్వాధీనం చేసుకోవడమే లక్ష్యమని పేర్కొంది. అక్కడి వారందరినీ బలవంతంగా పంపించేందుకు దాడులను తీవ్రతరం చేసింది.

ధన్‌ఖడ్‌కు రాష్ట్రపతి బర్త్ డే విషెస్

న్యూఢిల్లీ/బెంగళూరు: ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్‌కు ఆదివారం 74వ పుటిన రోజు జరుపుకున్నారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయురారోగ్యాలతో దేశ సేవలో కొనసాగాలని ఆకాంక్షించారు. జేడీఎస్ చీఫ్, మాజీ ప్రధాని దేవెగౌడకు కూడా మోదీ శుభాకాంక్షలు తెలిపారు. దేవెగౌడ ఆదివారం 92వ పుట్టిన రోజు జరుపుకున్నారు. ఆయన రాజనీతిజ్ఞుడంటూ మోదీతో పాటు పలువురు నేతలు ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

బంగ్లాదేశ్‌లో నటి ఫరియా అరెస్ట్



ఢాకా: ప్రముఖ బంగ్లాదేశ్ నటి నుస్రత్ ఫరియా(31) ఆదివారం అరెస్టయ్యారు. షేక్ ముజిబుర్ రహ్మాన్ జీవిత చరిత్ర ఆధారంగా తీసిన సినిమా 'ముజిబ్: ది మేకింగ్ ఆఫ్ ఏ నేషన్'లో పదవీచ్యుత ప్రధాని షేక్ హసీనా పాత్రను ఈమె పోషించారు. గతేడాది జూలైలో షేక్ హసీనాకు వ్యతిరేకంగా పెల్లుబికిన ప్రజాగ్రహం సమయంలో హత్యాయత్నం చేశారన్న ఆరోపణపై పోలీసులు ఆదివారం ఉదయం థాయ్‌లాండ్‌కు వెళ్లేందుకు రాగా ఢాకా విమానాశ్రయంలో అదుపులోకి తీసుకున్నారు. ఢాకాలోని వటారా పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దివంగత శ్యామ్ బెనగల్ దర్శకత్వం వహించిన 'ముజిబ్: ది మేకింగ్ ఆఫ్ ఏ నేషన్'సినిమా భారత్, బంగ్లాదేశ్ సంయుక్తంగా నిర్మించాయి. బంగ్లాదేశీ, భారతీయ సినిమాల్లో ఫరియా నటించారు. బంగ్లాదేశ్-భారత్ సంయుక్తంగా నిర్మించిన ఆషికి: ట్రూ లవ్ సినిమాతో 2015లో కెరీర్ ప్రారంభమైంది.

తుర్కియేతో సంబంధాలకు ఐఐటీ బాంబే కటీఫ్

ముంబై: పాకిస్తాన్‌కు మద్దతు తెలుపుతున్న తుర్కియే వర్సిటీలతో ఉన్న అన్ని ఒప్పందాలను రద్దు చేసుకుంటున్నట్లు బాంబే ఐఐటీ ప్రకటించింది. తదుపరి నోటీసు ఇచ్చే వరకు ఈ నిర్ణయం అమల్లో ఉంటుందని ఆదివారం 'ఎక్స్'లో తెలిపింది. ప్రస్తుత భౌగోళిక రాజకీయాల్లో తుర్కియే వైఖరి అనుసరిస్తున్న వైఖరికి నిరసనగా ఈ చర్య తీసుకుంటున్నట్లు వివరించింది. తుర్కియేలోని కొన్ని విద్యా సంస్థలతో బాంబే ఐఐటీకి అధ్యాపక సిబ్బంది మార్పిడులకు సంబంధించిన అంగీకార ఒప్పందాలున్నాయి.

సాక్షి
హైదరాబాద్
సోమవారం, 19, మే, 2025



పెట్రోల్ ట్యాంకర్‌కు మంటలు
ప్రమాదవశాత్తు పెట్రోల్ ట్యాంకర్‌కు మంటలంటుకున్న సంఘటన ఆదివారం చర్లపల్లి పారిశ్రామికవాడలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వద్ద చోటు చేసుకుంది. -8లో



పీస్ ఆఫ్ మైండ్ @పెట్స్
నగరంలో శునకాల పెంపకంపై శ్రద్ధ పెరుగుతోంది. విదేశాల నుంచి తెప్పించుకుని మరీ వాటిని పెంచుకుంటున్నారు. ఇక సెలబ్రిటీలు వాటిని స్టేటస్ సింబల్‌గా చూస్తున్నారు. - సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
33.0/26.0

వాతావరణం
నగరంలో సోమవారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్టంగా 33, కనిష్టంగా 26 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.


విషణ్ణవదనంతో బంధువులు


భవనంపై కమ్ముకున్న పొగ


మృతదేహాల తరలింపు..


ఉస్మానియా మార్చురీ వద్ద భట్టి, దామోదర, అసద్

హృదయ విదారకం..


పాతబస్తీలో అంతులేని విషాదం



అగ్నిప్రమాదంతో ఉలిక్కిపడిన జనం

ఏకంగా 17 మంది మృత్యువాతతో సర్వత్రా ఆవేదన

మంటలు తీవ్రంగా అంటుకోకున్నా...దట్టమైన పొగతో అధిక ప్రాణనష్టం


ప్రమాదం జరిగిన భవనం... (గూగుల్ చిత్రం)

ఆదమరచి నిద్రపోయిన ఆ కుటుంబ సభ్యులకు అదే శాశ్వత నిద్ర అని తెలియలేదు. రోజు మాదిరిగానే నిద్రపోయినా...రోజు మాదిరిగా నిద్ర లేవలేదు. ఎగసిన అగ్నికీలలు..ఉక్కిరిబిక్కిరి చేసిన పొగతో నిద్ర నుంచి మేల్కొన్నా.. ఏం జరిగిందో తెలియక..ఎటు వెళ్లాలో అర్థంకాక..అంటుకున్న మంటలతో కాలిన గాయాలై కొందరు, దట్టమైన పొగతో ఊపిరాడక మరికొందరు మృత్యు ఒడికి చేరిపోయారు. ఆదివారం తెల్లవారు జామున పాతబస్తీ గుల్జార్ హౌస్ సమీపంలోని ఓ భవనంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన అగ్నిప్రమాదంలో నాలుగు కుటుంబాలకు చెందిన ఎనిమిది మంది చిన్నారులు సహా 17 మంది మృతిచెందడం పాతబస్తీలో తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ఘటనలో మంటల కంటే పొగపీల్చి ఎక్కువ మంది కన్నుమూశారు. విషయం తెలుసుకున్న స్థానికులు పెద్ద ఎత్తున సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కుటుంబాలకు కుటుంబాలే అగ్నికి ఆహుతి అవడం వారిని తీవ్రంగా కలచివేసింది. ఒక అగ్నిప్రమాదంలో ఇంత పెద్ద సంఖ్యలో చనిపోవడం నగర చరిత్రలోనే మొదటిసారని తెలిసి..'అయ్యో ఇలా జరిగిందేంటి' అనుకుంటూ స్థానికులంతా సానుభూతి వ్యక్తం చేశారు. మృతదేహాలను తరలిస్తున్న హృదయ విదారక దృశ్యాలు చూసి కన్నీరుపెట్టారు.

- చార్మినార్



ప్రభుత్వం అండగా ఉండాలి
బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉండాలి. వారికి అవసరమైన అన్ని వైద్య సేవలను అందిస్తూనే ఆర్థికంగా సహాయ సహకారాలు అందజేయాలి. రాజకీయాలకతీతంగా వ్యవహరించాలి. ఇలాంటి సంఘటనలు జరగకుండా ఉండాలంటే సేఫ్టీ మెజర్స్ పాటించాలి.

- తలసాని శ్రీనివాస్ యాదవ్, మాజీ మంత్రి



తీవ్ర బాధాకరం
ఒకే కుటుంబానికి చెందిన 17 మంది మృతి చెందడం బాధాకరం. సేఫ్టీ మెజర్స్ లేకపోవడమే అగ్ని ప్రమాదానికి ప్రధాన కారణం. తప్పించుకునే మార్గం లేకనే ఇంత మంది మృత్యువాత పడ్డారు. ఇలాంటి సంఘటనలు మనల్ని మానసికంగా కృంగదీస్తాయి.

- ఏవీ రంగనాథ్, హైడ్రా కమిషనర్



వెంటనే స్పందించాం..
అగ్ని ప్రమాదం సమాచారం తెలిసిన వెంటనే దక్షిణ మండలం పోలీసులు వెంటనే స్పందించారు. అగ్నిమాపక సిబ్బందితో కలిసి సహాయక చర్యల్లో పాల్గొన్నారు. విషయం తెలిసిన వెంటనే నేను కూడా సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించా.

- సీవీ ఆనంద్, నగర పోలీస్ కమిషనర్



సహాయక చర్యలు చేపట్టాం
ఇలాంటి సంఘటనలు బాధాకరం. తీవ్రంగా కలచివేశాయి. అగ్నిప్రమాదం విషయం తెలిసిన వెంటనే సహాయక చర్యలు చేపట్టాం. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా జీహెచ్‌ఎంసీ తరఫున తగిన సేఫ్టీ మెజర్స్ పాటించే విధంగా చర్యలు చేపడతాం. ఈమేరకు సంబంధిత భవన యజమానులకు సూచనలు చేసి భవిష్యత్తులో పునరావృతం కాకుండా చూస్తాం.

- విజయలక్ష్మి, నగర మేయర్

రద్దీ పెరిగితే.. ముప్పు పెరిగేది!

సాక్షి, సిటీబ్యూరో: దివాన్ దేవిడీలోని మదీనా అండ్ అబ్బాస్ టవర్స్... దిల్‌సుఖ్‌నగర్‌లోని చందనా బ్రదర్స్... కోఠిలోని పుష్పాంజలి కాంప్లెక్స్... బషీర్‌బాగ్‌లోని మొఘల్ కోర్ట్‌లో ఉన్న నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ... నెక్లెస్‌రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా... పంజాగుట్టలోని మీనా జ్యువెలర్స్... ఇలా నగరంలో చోటు చేసుకున్న భారీ అగ్నిప్రమాదాలన్నీ రాత్రి వేళల్లో చోటు చేసుకున్నాయి. ఫలితంగా అగ్నిమాపక శకటాలు హుటాహుటిన ఘటనాస్థలికి వచ్చి మంటలను అదుపు చేయగలిగాయి. పాతబస్తీలో ఆదివారం నాటి 'మోదీ ఇంట్లో' ఉదంతం కూడా తెల్లవారుజామున జరిగింది. మరికొంత ఆలస్యంగా జరిగి ఉంటే చార్మినార్‌తో పాటు ఆ చుట్టు పక్కల ప్రాంతాలు జనసమర్థంగా మారేవి. రోడ్లన్నీ వాహనాలతో నిండేవి. ఒకవేళ రోడ్లు రద్దీగా ఉండే పగటి వేళ ఇలాంటి ప్రమాదాలు జరిగితే... నష్టం అపారంగా ఉంటుందని అధికారులు చెప్తున్నారు. పాతబస్తీ లాంటి ప్రాంతాల్లో ఉండే రోడ్లు, నిర్మాణాలు, ట్రాఫిక్ నేపథ్యంలో పరిస్థితి మరింత దారుణంగా మారిపోతుంది. నిబంధనల ప్రకారం ఉండాల్సిన విధంగా ఫైర్ స్టేషన్లు, ఫైర్ ఇంజన్లు లేకపోవడమే దీనికి కారణం. ఈ అంశంలో 2016 నాటి ఫైర్ అడ్వైజరీ కౌన్సిల్ సిఫార్సులు ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉన్నాయి.

నిబంధనలు... వాస్తవాలు...

- నిబంధనల ప్రకారం నగరంలో ప్రతి 5 చదరపు కిమీలకు ఒక అగ్నిమాపక శకటం అందుబాటులో ఉండాలి. కానీ ప్రస్తుతం 15 నుంచి 20 చదరపు కిమీకి ఒకటి చొప్పున అందుబాటులో ఉన్నాయి.
- ప్రతి 50 వేల మంది రక్షణకు ఓ అగ్నిమాపకశకటం అవసరం. ఈ రకంగా చూస్తే గ్రేటర్‌లో కనీసం 250 ఫైర్ ఇంజన్లు అవసరం. ఇప్పుడు ఇందులో కనీసం సగం కూడా అందుబాటులో లేవు.
- అగ్నిమాకప శకటం గంటకు 100 కిమీ వేగంతో ప్రయాణించగలగాలి. ఇటీవల విడుదలైన టామ్ టామ్ నివేదిక ప్రకారం చూసినా ప్రస్తుతం నగరంలో వాహనాల సరాసరి వేగం 20 నుంచి 25 కిమీ మించట్లేదు.
- ఏదైనా అగ్నిప్రమాదం సంభవించినప్పుడు గరిష్టంగా 15 నిమిషాల్లో అగ్నిమాపక శకటం అక్కడకు చేరాలి. అయితే ప్రస్తుతం నగర రోడ్ల పరిస్థితిని బట్టి రద్దీ వేళల్లో ఏ వాహనమైనా ఎక్కడ నుంచి ఎక్కడికైనా వెళ్లాలంటే కనీసం 30 నిమిషాల సమయం పడుతుంది.
- బహుళ అంతస్తు భవనాల్లో మంటల్ని ఆర్పడానికి ఉపకరించే హైడ్రాలిక్ ఫైరింజన్ కేవలం సికింద్రాబాద్‌లోనే ఉంది. వీటికి తోడు అగ్నిమాపక శాకలో ఉండాల్సిన మౌలిక సదుపాయాల కొరత, సిబ్బంది సంఖ్యతో ఇబ్బంది ఉండనే ఉన్నాయి.
- 2016లో పార్లమెంట్ అన్ని రాష్ట్రాల భాగస్వామ్యంతో స్టాండింగ్ ఫైర్ అడ్వైజరీ కౌన్సిల్ ఏర్పాటు చేసింది. దీని అధ్యయనం ప్రకారం పరిధిని బట్టి కాకుండా సమాచారం తెలిసిన తర్వాత ఘటనాస్థలికి చేరడానికి పట్టే సమయం (రెస్పాన్స్ టైమ్) ఆధారంగా ఫైర్ స్టేషన్లు ఉండాలని సిఫార్సు చేసింది.
- ఈ రెస్పాన్స్ టైమ్ నగరాలు, పట్టణాల్లో ఐదు నుంచి ఏడు నిమిషాలు, గ్రామీణ ప్రాంతాల్లో గరిష్టంగా 20 నిమిషాలుగా నిర్ధారించింది. ఈ స్థాయిలో ఫైర్‌స్టేషన్ల ఏర్పాటు కోసం కేంద్రం చర్యలు తీసుకోవాలని, రాష్ట్రాలకు అవసరమైన నిధులు కేటాయించాలని సిఫార్సు చేసింది. ఇవన్నీ ఇప్పటికీ ఫైళ్లకే పరిమితమయ్యాయి.


అగ్నిప్రమాదం జరిగిన భవనం లోపలి దృశ్యం

పేరులోనే ఫైర్!

- కోరల్లేని రాష్ట్ర అగ్నిమాపక సేవల చట్టం
- అభియోగాల నమోదు పెద్ద ప్రహసనమే
- నామమాత్రపు జరిమానాలు, శిక్షలతోనే సరి
- దీంతో ఉల్లంఘనదారుల్లో కనిపించని భయం
- మళ్లీ మళ్లీ చోటుచేసుకుంటున్న అగ్నిప్రమాదాలు

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర అగ్నిమాపక సేవల చట్టం కోరల్లేని పాములాగా తయారైంది. తరచుగా భారీ అగ్నిప్రమాదాలు జరుగుతున్నా ఉల్లంఘనదారుల్లో భయం కనిపించడంలేదు. ఈ చట్టం కింద అభియోగాలు నమోదు చేసే ప్రక్రియ ఓ ప్రహసనంగా మారింది. ఒకవేళ నేరం రుజువైనా పెద్దగా శిక్షలు లేకపోవడం , నామమాత్రపు జరిమానాలే ఉండటం ఇందుకు కారణం. అగ్నిమాపక, విపత్తు నిర్వహణ శాఖకు ఉన్న ఒకే ఒక్క ఆధారం ఏపీ ఫైర్ సర్వీసెస్ యాక్ట్. 1999లో రూపొందించిన ఈ కోరలు లేని చట్టమే ఇప్పటికీ వినియోగంలో ఉండటమే ప్రధాన కారణం. పోలీసులు ఐపీసీ, సీఆర్పీసీ సెక్షన్ల కింద కేసు నమోదు చేస్తే తప్ప నిందితులను అరెస్టు చేసే అవకాశం లేకపోవడంతో అగ్ని మాపక సేవల చట్టం నామమాత్రంగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. అగ్నిమాపక శాఖ ఏదైనా ఎస్టాబ్లిష్మెంట్ ఉల్లంఘనలు గుర్తించినా నేరుగా చర్యలు తీసుకునే అవకాశం లేకుండాపోయింది. పలు మార్లు నోటీసులు జారీ చేసి.. గడువిచ్చాక డీజీ అనుమతి మేరకు విచారణకు అవకాశం ఉంటుంది. ఆ తర్వాత కేసు నమోదు చేసి నివేదికను న్యాయస్థానంలో సమర్పిస్తారు. ఏళ్ల తరబడి విచారణ జరిగిన తర్వాత చాలా కేసులు సరైన ఆధారాల్లేక వీగిపోతుంటాయి. ఒకవేళ కేసు రుజువైనా అగ్నిమాపక సేవల చట్టం ప్రకారం పడే జరిమానా రూ.వేలల్లోనే ఉంటుంది.



ఏళ్లుగా నిరీక్షణ..
తెలంగాణ అగ్నిమాపక శాఖ 2020 జూన్‌లో అగ్ని మాపక చట్టానికి పలు సవరణలు సూచిస్తూ ఆమోదం కోసం ప్రభుత్వానికి పంపించింది. భారీ జరిమానాలు, జప్తు చేయడం తదితర కఠిన నిబంధనలు ఇందులో చేర్చారు. వీటికి ఆమోదం లభిస్తే ఢిల్లీ తర్వాత దేశంలోనే బలమైన చట్టం గల రాష్ట్రంగా తెలంగాణ అవతరిస్తుందని ఆ శాఖ ఉన్నతాధికారులు అభిప్రాయపడ్డారు. రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి అగ్నిమాపక శాఖ నమోదు చేసిన కేసుల్లో అత్యధికంగా హైదరాబాద్‌కు సంబంధించినవే ఉన్నాయి. గత దశాబ్ద కాలంలో నగరం శరవేగంగా అభివృద్ధి చెందింది. ఆకాశహర్మ్యాలు, వాణిజ్య భవనాలు కోకొల్లలుగా వెలిశాయి. ఈ స్థాయిలో అగ్నిమాపక శాఖ కూడా అప్‌గ్రేడ్ కావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆధునిక యంత్రాలు, రోబోలతో పాటు చట్ట సవరణ చేయాల్సిన అవసరం ఉంది. తెలంగాణ అగ్నిమాపక శాఖ 2020 జూన్‌లో అగ్నిమాపక చట్టానికి పలు సవరణలు సూచిస్తూ ఆమోదం కోసం ప్రభుత్వానికి పంపించింది. భారీ జరిమానాలు, జప్తు చేయడం తదితర కఠిన నిబంధనలు ఇందులో చేర్చారు. వీటికి ఆమోదం లభిస్తే ఢిల్లీ తర్వాత దేశంలోనే బలమైన చట్టం గల రాష్ట్రంగా తెలంగాణ అవతరిస్తుందని ఆ శాఖ ఉన్నతాధికారి ఒకరు అభిప్రాయపడ్డారు.

శిక్షలు తక్కువే..
ఏదైనా నేరానికి సంబంధించి పోలీసు విభాగం ఐపీసీ కింద కేసు నమోదు చేస్తుంటుంది. నేరం, నేరగాడి తీరుతెన్నుల్ని బట్టి అరెస్టుపై నిర్ణయం తీసుకుంటుంది. ఆపై జైలు, బెయిలు, కోర్టులో కేసు విచారణ తదితరాలు ఉంటాయి. అదే ఫైర్ సర్వీసెస్ యాక్ట్ వద్దకు వచ్చేసరికి ఆ చట్టం, అగ్నిమాపక శాఖకు ఉన్న అధికారాలు వేరు. వీళ్లు ఫైర్ సేఫ్టీ ఉల్లంఘనలకు సంబంధించి కేసు నమోదు చేసినప్పటికీ నోటీసుల జారీ మినహా అరెస్టుకు ఆస్కారం లేదు. ఈ కేసు కోర్టు వరకు వెళ్లినా సాధారణ కేసుల్లా విచారణ ఉండదు. అది ఎందరి ప్రాణాలు తీసిన ఉదంతం, ఎంత తీవ్రమైన ఉల్లంఘన అయినప్పటికీ ఇదే పరిస్థితి. ఈ కేసుల విచారణ సివిల్ కోర్టుల్లో సమరీ ట్రయల్ విధానంలో జరుగుతుంది. ఈ చట్టంలోని అనేక సెక్షన్లు ఉన్నప్పటికీ శిక్షలు మాత్రం చాలా తక్కువ. దాదాపు 90 శాతం ఉల్లంఘనలకు జరిమానా మాత్రమే విధించే ఆస్కారం ఉంది. మిగిలిన వాటిలోనూ గరిష్ట శిక్ష కేవలం 3 నెలలు మాత్రమే. ఈ సెక్షన్లకు సంబంధించిన ఉల్లంఘనల్లోనూ పెనాల్టీ విధించే ఆస్కారం ఉంది. కఠినమైన శిక్షలు, భారీ జరిమానాలు లేకపోవడంతో ఉల్లంఘనదారుల్లో భయం లేదని అభిప్రాయం వెల్లడవుతుంది.

ఘరానా సూడోలు!

- సిటీ సీపీ అవతారం ఎత్తిన పాతబస్తీ వాసి
- ఢిల్లీ జర్నలిస్టు నుంచి సమాచారం కోసమే
- సీఎం ఓఎస్డీగా చెప్పుకుంటున్న మరో వ్యక్తి
- ఈ రకంగా ఆర్థిక సాయం కోసం ప్రయత్నాలు
- వేర్వేరుగా కేసులు నమోదు చేసిన సైబర్ కాప్స్
- ఒకరు అరెస్టు, మరొకరి ఆచూకీ కోసం దర్యాప్తు

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ పోలీసు కమిషనర్ అని చెప్పుకుంటూ ఢిల్లీ జర్నలిస్టు నుంచి సున్నిత సమాచారం సేకరించాలని భావించిన పాతబస్తీ వాసితో పాటు సాక్షాత్తు ముఖ్యమంత్రి ఓఎస్డీ (ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ) అవతారం ఎత్తి ఆర్థిక సాయం కోసం బడా వ్యాపారవేత్తలను టార్గెట్ చేసిన గుర్తుతెలియని వ్యక్తిపై సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు రెండు వేర్వేరు కేసులు నమోదు చేశారు. వీటిని సాంకేతికంగా దర్యాప్తు చేసిన అధికారులు సూడో సీపీని అరెస్టు చేయగా...సీఎం నకిలీ ఓఎస్డీ వివరాలు కోసం ఆరా తీస్తున్నారు.

ఢిల్లీలో నమోదైన కేసు వివరాల కోసం...
ఓ కీలకాంశంపై గత ఏడాది ఢిల్లీలో ఓ కేసు నమోదైంది. దీన్ని అక్కడి స్పెషల్ సెల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆ కేసులో నిందితుడిగా ఉన్న జునైద్ పాషాకు చార్మినార్ వద్ద మటన్‌షాపు నిర్వహించే మహ్మద్ అబ్దుల్ జావేద్ ఖాద్రీ స్నేహితుడు. తనపై నమోదైన కేసుకు సంబంధించిన ఎఫ్ఐఆర్‌తో పాటు ఇతర వివరాలు సేకరించడానికి జునైద్ చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఈ విషయాన్ని అతడు జావేద్‌కు చెప్పి, అవి సేకరించడానికి మార్గాలు చెప్పాలని కోరాడు. దీంతో జావేద్ సూడో సీపీ అవతారం ఎత్తాలని పథక రచన చేశాడు. మూడేళ్ల క్రితం రాష్ట్ర పోలీసు విభాగం ఫోన్ నెంబర్లు మారాయి. గతంలో '9490' సిరీస్ ఉండగా... అది '8712'కు మారింది. అప్పట్లో హైదరాబాద్ పోలీసు కమిషనర్ '9490616000' నెంబర్ వాడేవారు. 2023 ఏప్రిల్ నుంచి ఈ నెంబర్ జావేద్ వద్ద ఉంది.



ఆ నెంబర్‌ను దుర్వినియోగం చేస్తూ...
పోలీసు విభాగం విడిచిపెట్టిన సిరీస్ నెంబర్లకు టెలికం సంస్థ వేరే వారికి ఎటాచ్ చేయడంతో ఇలా జరిగింది. ఈ నెంబర్‌ను దుర్వినియోగం చేస్తూ సమాచారం సేకరించాలని జావేద్ పథకం వేశాడు. ఢిల్లీకి చెందిన ఓ రాజకీయ పోర్టల్‌లో పని చేసే జర్నలిస్టు నెంబర్‌ను ఇంటర్‌నెట్ ద్వారా సేకరించాడు. తాను హైదరాబాద్ పోలీసు కమిషనర్‌ని అంటూ వాట్సాప్ ద్వారా అతడికి సందేశం పంపాడు. ఫలానా కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు, పత్రాలు సేకరించి పంపాలని కోరాడు. ఇతడి వ్యవహారశైలిపై సదరు జర్నలిస్టుకు అనుమానం వచ్చింది. దీంతో ఆయన ఈ విషయంపై హైదరాబాద్ కమిషనర్ కార్యాలయానికి ఈ-మెయిల్ ద్వారా సమాచారం ఇచ్చారు. దీంతో కేసు నమోదు చేసుకున్న సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు జావేద్‌ను అరెస్టు చేశారు. కోర్టు అనుమతితో కస్టడీలోకి తీసుకుని విచారించాలని నిర్ణయించారు.

ముఖ్యమంత్రి ఓఎస్డీ పేరుతో మరో కథ...
ముఖ్యమంత్రి కార్యాలయంలో సీఎం స్పెషల్ సెక్రటరీగా పని చేస్తున్న బి.అజిత్‌రెడ్డి ఫిర్యాదుతో మరో కేసు నమోదైంది. ఓ ఫోన్ నెంబర్‌తో పాటు జీమెయిల్‌లో ఓఎస్డీ అంటే ఈ-మెయిల్ క్రియేట్ చేసిన వ్యక్తి వీటిని వినియోగించి పథక రచన చేశాడు. పలువురు బడా వ్యాపారవేత్తలకు ఫోన్‌కాల్స్, ఈ-మెయిల్స్ చేస్తూ ఆర్థిక సహాయం చేయాలని కోరుతున్నాడు. ఇతడి నుంచి ఈ-మెయిల్ వెళ్లిన వారిలో ర్యాపిడో ఎండీ అరవింద్ , గుప్తా రియాల్టీ ఛైర్మన్ శ్రీనివాస్ గుప్త, బేకెమ్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ ఎండీ బొలినేటి కృష్ణమోహన్, కంట్రీ డిలైట్ నిర్వాహకులు చక్రధర్, నితిన్ తదితరులు ఉన్నారు. వీరందరి నుంచి కేటుగాడు ఆర్థిక సాయం కోరుతుండటంతో అనుమానించారు. దీనిపై ముఖ్యమంత్రి కార్యాలయాన్ని అప్రమత్తం చేయడంతో కేసు నమోదైంది. ఓవీవీ సత్యనారాయణ అనే పేరుతో మరోపక్క మంత్రి శ్రీధర్‌బాబు జారీ చేసినట్లు ఉన్న లేఖల్ని చూపించి మోసాలకు ప్రయత్నించిన ఓ వ్యక్తిపై ఇటీవల సైఫాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మంత్రి ఓఎస్డీ ఫిర్యాదుతో ఇది రిజిస్టరైంది.







సండే సండడి..

కోలాహలంగా ట్యాంక్ బండ్ పరిసర ప్రాంతాలు | **అట్టహాసంగా ప్రారంభమైన సండే ఫండే వేడుకలు**

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు | **నోరూరించే ఫుడ్ స్టాల్స్**

హైదరాబాద్ నగరంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 72వ ప్రపంచ అందాల పోటీల సందర్భంగా ట్యాంక్ బండ్‌పై ఆదివారం సాయంత్రం సండే ఫండే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రపంచ సుందరీమణుల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా కార్యక్రమాలను తిలకించేందుకు భారీ ఎల్‌ఈడీ స్క్రీన్‌లను ఏర్పాటు చేశారు. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

కవాడిగూడ:








మీ ఆప్తుల అంత్యక్రియలు, శ్రద్ధాంజలి, నిర్యాణం, వర్ధంతి, జయంతిల ప్రకటనల కోసం సంప్రదించండి.

Ph: 040-23256000 Ext: 6344, 9912220352

రూ.3.60 లక్షల విలువైన విదేశీ మద్యం పట్టివేత

- 52 మద్యం బాటిళ్లు స్వాధీనం..
- ముగ్గురి పై కేసు నమోదు, ఇద్దరి అరెస్ట్

సాక్షి, సిటీబ్యూరో: అక్రమంగా తరలిస్తున్న 52 విదేశీమద్యం బాటిళ్లను ఎక్సైజ్ పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.3.60 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. ఆదర్శనగర్‌లో ఓ కారులో మద్యం బాటిళ్లను తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎక్సైజ్ పోలీసులు దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనలో ముగ్గురిపైన కేసులు నమోదు చేసిన పోలీసులు కుమార్ అగ్రవాల్, రోహిత్‌కుమార్ అనే వ్యక్తులను అరెస్ట్‌చేశారు. ఇన్నోవా కారును సీజ్ చేశారు.

మెట్రోస్టేషన్‌లో ప్రకటనల టెలివిజన్ చోరీ..

సనత్‌నగర్: మెట్రో స్టేషన్‌లో ప్రకటనలు డిస్‌ప్లే చేసే టీవీ చోరీకి గురైన సంఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ జయచందర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి..పరేడ్‌గ్రౌండ్స్ మెట్రో స్టేషన్‌లోకి గత నెల 19న ఉమామహేశ్వర్, అశోక్ అనే ఇద్దరు టెక్నీషియన్స్‌గా పనిచేసేందుకు వచ్చారు. అయితే స్టేషన్ కంట్రోలర్‌కు తెలియకుండానే స్టేషన్‌లోని ఓడీయూ గదిని యాక్సెస్ చేశారు. అందులోని సైక్వర్త్ టెలివిజన్ సెట్‌ను విప్పదీసుకుని వెళ్లారు. ఈ సంఘటన మొత్తం స్టేషన్ సీసీ టీవీ కెమెరాల్లో నమోదైంది. టెలివిజన్ చోరీ అయిన విషయాన్ని గుర్తించిన మెట్రో అధికారులు, అంతర్గత విచారణ అనంతరం బేగంపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉప్పల్ మెట్రో డిపోలో పనిచేస్తున్న కృషా దర్శని ఫిర్యాదు మేరకు శనివారం బేగంపేట పోలీసులు ఉమామహేశ్వర్, అశోక్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బ్రిడ్జిపై నుంచి పడి వ్యక్తి మృతి

కాచిగూడ: రైల్వే ఫుట్‌ఓవర్ బ్రిడ్జిపై నుంచి దిగుతుండగా ప్రమాదవశాత్తు కిందపడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... గుర్తుతెలియని వ్యక్తి (35) ఉందానగర్ రైల్వే స్టేషన్‌లో ఫుట్ ఓవర్ బ్రిడ్జిపై దిగుతుండగా కిందపడి తలకు తీవ్రంగా గాయాలై మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

■ Last Chance 10th. Inter Direct Degree (Dist), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT,B.Tech,Diploma MA,M.Com,M.Sc, MBA MCA Regular/ Lateral Entry Ph: 9490577501 [H-783374]

■ Join Online / Distance / Regular Degree & PG BA, B.COM, BSC, BCA, BBA, B.TECH, MBA, MSC, M.TECH from UGC, AICTE, DEB Recognized Universites Ph :- 9885566683 [HA-1333]

Real Estate

PLOT FOR SALE

■ Pay 50% Reg, Emi 2500 near Intl Airport Shadnagar DTCP 5500 Shankarpally, Sangareddy, Choutuppal near Gajwel 4000 Ph : 8978181683 [H-800531]

■ Koheda 264 Sqyd Main Road 2nd Commercial Plot 33 Feet Road For Sale Per Ad: 22,000/- Total 58Lakhs Only. Call : 9393000323 [HA-1334]

Services

BUSINESS SERVICE

■ మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్: 9100329739 [H-800533]

■ మీ బంగారం మణప్పురం ముత్తూట్, మార్వాడీ షాప్స్ ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్నా మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 91600 77916 స్పాట్ క్యాష్ [H-783415]

BUSINESS OFFER

■ ITR/Salary Slip లేకుండా 48 గంటల్లో హోమ్‌లోన్ పొందడం కష్టం కాదు. Home First మీకు సహాయం చేయడానికి, సలహాలకి కాల్ చేయండి : 7406393937 [HA-462]

PERSONAL CARE

CHANGE OF NAME

■ I, Amtul Jameel Jawaria R/o 254 Srt Chandulal Baradari Colony Bahadurpura have changed my minor daughter's name from Mariya to Mariya Abdul Moiz. [DA-43102]

■ I, Janaki W/o. Vishal Krishna Bellam R/o 8-3-224/6/4/2, G-32, 33, 34, Jupiter Towers, Flat-106, Madhura Nagar, S R Nagar, Hyderabad - 500038 have changed my name to Sai Prasanna for all purposes. [DA-14205]

OLD AGE HOME

■ వృద్ధులు, NRI'S లగ్జరీ రూమ్స్, లిఫ్ట్ @ మేడిపల్లి. దీర్ఘకాలిక మంచాన ఉన్న వారికి 24/7 మెడికల్, ఉప్పల్ & చీర్యాల్. మీన్స్ భోజన వసతి. 7981467036, 9391039990, 6281125552 [H-783376]

Wanted

■ ఒమేగా హోంకేర్‌లో వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం. జీ: 20K. ఫోన్: 8977639663, 8977639662 [SCA25003891]

■ ఘట్‌కేసర్‌లో ఇంజినీరింగ్ కాలేజీ నందు కాలేజీ బస్సులు నడుపుటకు 5 సం॥లు హెవీ లైసెన్స్ గల డ్రైవర్లు వెంటనే కావలెను. కొండా పూర్, బోడుప్పల్, అజీజ్ నగర్, ఘట్‌కేసర్ ప్రాంతాల వారికి ప్రాధాన్యత. ఫోన్: 9551530159 [HA-161]

■ ITC డిస్ట్రిబ్యూటర్స్ నందు సిగరెట్ సేల్స్ చేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ (జెంట్స్) కావలెను. 2 వీలర్ కల్గి ఉండాలి. ఫోన్: 9866070957 [SCA25003840]

■ HYDలో పని చేయుటకు సెక్యూరిటీ ఆఫీసర్ (M)–1, సెక్యూరిటీ సూపర్‌వైజర్స్ (M)–2, రిసెప్షనిస్ట్(F)–1 కావలెను. Study Any Degree. Cell: 8019384141. [WA-6598]

■ గుంటూరు లోని ప్రముఖ కంపెనీకి కారు డ్రైవర్ కావలెను. కనీసం 10 సం.ల నుండి 15 సం.ల అనుభవం కలిగి హైఎండు కారు నడుపగల డ్రైవర్ కావలెను. సంప్ర: 91333 99257 [G-073]

■ Wanted Lady Helpers For Xerox & Computer work (2) Q: 10th/Inter-Below 30yrs, Slry: 13000,+Acco & food Madhapur, Hyd 8143089949 [SCA25003724]

■ A Reputed Real Estate Company Requires Female Receptionist with Digital Experience, Marketing Executives work at Madhapur. Good Salary +Incentives&Commission. Ph:9666639222 [HA-4086]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు — జోన్ సెంటర్స్

సాక్షి క్లాసిఫైడ్స్

3+2 3 ప్రకటనలకు చెల్లించండి, 2 ప్రకటనలు ఉచితంగా పొందండి

దిల్‌సుఖ్‌నగర్	9912348016	రాజేంద్రనగర్	9010202372
ఎల్.బి.నగర్	9912225475	కూకట్‌పల్లి	9912225476
తార్నాక	9010202751	బాలానగర్	9951602997
సికింద్రాబాద్	9010299013	మల్కాజ్‌గిరి	9505507562
చిక్కడపల్లి	9912225453	మెహదీపట్నం	9912225468
అబిడ్స్	9705144457	చందానగర్	9912225453
అమీర్‌పేట్	9505507563	ఉప్పల్	7095250115

హైదరాబాద్ సిటీ ఎడిషన్‌లో 5 ప్రకటనలకు రూ. 2280/- (4 లైన్లు). ప్రతి అదనపు లైనుకు రూ. 540/-

గమనిక: జనపై మీరు ఇచ్చే అన్ని ప్రకటనలపై 5% GST అదనం

వివరాలకు : 6-2-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34

Ph: 040-2325 6000, Ext : 6235 Cell : 9912225453

పెట్రోల్ ట్యాంకర్‌కు మంటలు

- ట్రయల్ రన్ చేస్తుండగా ప్రమాదం..
- తప్పిన పెను ప్రమాదం..





చర్లపల్లి పారిశ్రామికవాడలో అగ్నిప్రమాద దృశ్యాలు..

కుషాయిగూడ: ప్రమాదవశాత్తు పెట్రోల్ ట్యాంకర్‌కు మంటలంటుకున్న సంఘటన ఆదివారం చర్లపల్లి పారిశ్రామికవాడలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వద్ద చోటు చేసుకుంది. డ్రైవర్ అప్రమత్తతో పాటు ఫైర్ సిబ్బంది సకాలంలో స్పందించడంతో పెను ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళితే.. కొన్నాళ్లుగా నిలిచిపోయిన ట్యాంకర్ లారీని రిపేరు చేస్తూ ట్రయల్‌రన్ చేస్తున్న క్రమంలో చర్లపల్లి పారిశ్రామికవాడలోని ఐఓసీఎల్ వద్ద ట్యాంకర్ నుంచి ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. అప్రమత్తమైన మెకానిక్, ఇతర డ్రైవర్లు వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారమివ్వడంతో ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ క్రమంలో పక్కనే ఉన్న మరో ట్యాంకర్‌కు మంటలు వ్యాపించడంతో అందరూ భయంతో పరుగులు తీశారు. అప్రమత్తమైన ఫైర్ సిబ్బంది చాకచక్యంగా వ్యవహరించి మంటలను అదుపు చేశారు. పక్కనే పార్కు చేసి ఉన్న సిలిండర్ల ట్రక్కుకు మంటల వ్యాపిస్తే పెనుప్రమాదం జరిగి ఉండేదన్నారు. ఈ విషయమై చర్లపల్లి ఇన్‌స్పెక్టర్ రవికుమార్‌ను వివరణ కోరగా చాలా రోజులుగా నిలిచిపోయిన ట్యాంకర్ ట్రయల్‌రన్ వేస్తున్న క్రమంలోనే ప్రమాదం జరిగిందన్నారు. విచారణ చేపడతామని పేర్కొన్నారు.

డీసీఎంను ఢీకొట్టిన కారు.. ఒకరికి గాయాలు..



ధ్వంసమైన కారు ముందు భాగం..



కారులో దొరికిన మద్యం బాటిళ్లు..

దుండిగల్: మద్యం మత్తులో కారు నడిపి రోడ్డుపై నిలిచి ఉన్న డీసీఎంను ఢీకొట్టడంతో ఓ వ్యక్తి గాయపడిన ఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. జీడిమెట్ల కళావతినగర్‌కు చెందిన రమేష్ శనివారం సాయంత్రం తన డీసీఎంను బహదూర్‌పల్లిలోని మేకల వెంకటేశం ఫంక్షన్ హాల్ ఎదుట పార్కు చేశాడు. గండిమైసమ్మ నుంచి జీడిమెట్ల వైపు వెళుతున్న కారు వేగంగా వచ్చి డీసీఎంను ఢీకొట్టింది. ఈ ఘటనలో డీసీఎం వెనుక భాగం దెబ్బతినగా, కారు ముందు భాగం ధ్వంసమైంది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కారులో ప్రయాణిస్తున్న వారిని పటాన్‌చెరువు సాయిరామ్ కాలనీకి చెందిన అక్షిత్ రెడ్డి, సిద్దిపేట జిల్లా చిట్యాల గ్రామానికి చెందిన అభినవ్ లుగా గుర్తించారు. కాగా వారు ఇద్దరూ మద్యం సేవించినట్లు తెలుస్తోంది. వారి కారులో లభించిన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు గాయపడిన అభినవ్‌ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. డీసీఎం యజమాని రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ టైర్‌కు చీరకొంగు చుట్టుకుని..

- మహిళ మృతి

కేశంపేట: సహాయం కోరి బైక్‌పై వెళ్తున్న మహిళ చీర.. బైక్ టైర్‌కు చుట్టుకొని మృతి చెందింది. ఈ సంఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మంగళిగూడ గ్రామానికి చెందిన యాదయ్య, బాలమణి(40) కూలీ పనులు చేసుకుంటు మహేశ్వరంలో నివసిస్తున్నారు. వీరికి 8 సంవత్సరాల కూతురు ఉంది. ఆదివారం నిర్దవెల్లి గ్రామంలో బంధువుల ఇంటికి వెళ్లేందుకు కూతురుతో పాటు బస్టాప్‌వద్ద బస్సు కోసం వేచి ఉన్నారు. బస్సు రాకపోవడంతో భర్త యాదయ్య.. ఓ బైక్‌ను ఆపి భార్య, కూతురును కొత్తపేట గ్రామంలో వదిలి పెట్టాలని వాహనదారుడిని కోరాడు. ఈ క్రమంలో బైక్‌పై వెళ్తుండగా.. బాలమణి చీర కొంగు టైర్‌కు చుట్టుకొని కొత్తపేట గ్రామ శివారులో కిందపడింది. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించగా 108 సిబ్బంది.. చికిత్స నిమిత్తం బాధితురాలిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఫాస్ట్‌ట్యాగ్‌ల చోరీ

- క్యాబ్‌లకు విక్రయం
- ట్రైనీ కానిస్టేబుల్ అరెస్ట్



నిందితుడు నిసార్ అహ్మద్



స్వాధీనం చేసుకున్న క్యాబ్‌లు

శంషాబాద్: పోలీసు వాహనాల ఫాస్ట్‌ట్యాగ్‌లను చోరీ చేసి విక్రయిస్తున్న ట్రైనీ కానిస్టేబుల్ ఆర్‌జీఐఏ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే.. గతంలో హోంగార్డుగా పనిచేసి ప్రస్తుతం శిక్షణ పొందుతున్న నిసార్ అహ్మద్ (28) అనే వ్యక్తి పోలీసు వాహనాలకు ఉన్న ఫాస్ట్‌ట్యాగ్‌లను చోరీ చేసి వాటిని క్యాబ్ డ్రైవర్లకు విక్రయించాడు. దీంతో సంబంధిత వాహనాలకు సంబంధించిన టోల్‌చార్జీలు పోలీసుల వాహనాలకు వెళుతున్నాయి. వీటిని విక్రయించిన నిసార్ అహ్మద్ వారి నుంచి నెలవారిగా ఒక్కో వాహనం నుంచి డబ్బులు వసూలు చేస్తున్నాడు. టోల్ సిబ్బంది సమాచారం ఆధారంగా కేసు నమోదు చేసిన దర్యాప్తు చేపట్టిన ఆర్‌జీఐఏ పోలీసులు నిసార్ అహ్మద్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అతడు విక్రయించిన ఫాస్ట్‌ట్యాగ్‌లను వినియోగిస్తున్న మూడు క్యాబ్‌లను స్వాధీనం చేసుకున్నారు.

డివైడర్ ఎక్కిన ఆర్టీసీ బస్సు



షాద్‌నగర్: ముందు వెళ్తున్న వాహనం సడెన్ బ్రేక్ వేయడంతో ఆర్టీసీ బస్సు డివైడర్ ఎక్కిన ఘటన షాద్‌నగర్ పరిధిలోని 44వ జాతీయ రహదారిపై రాయికల్ టోల్ ప్లాజా వద్ద చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఆదివారం సాయంత్రం సుమారు 40 మంది ప్రయాణికులతో మహబూబ్‌నగర్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తోంది. బస్సు షాద్‌నగర్ పరిధిలోని రాయికల్ టోల్ ప్లాజా వద్దకు రాగానే ముందు వెళ్తున్న వాహన డ్రైవర్ సడెన్ బ్రేక్ వేశారు. దీంతో బస్సు డ్రైవర్ వెంటనే అప్రమత్తమై బ్రేక్ వేయడంతో జాతీయ రహదారిపై ఉన్న డివైడర్‌పైకి ఎక్కి కొంత దూరం వెళ్లి ఆగింది. బస్సులో ఉన్న ప్రయాణికులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. కొంత మందికి స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ప్రయాణికులను మరో బస్సులో తరలించారు.

నిశ్చితార్థ వేడుకకు సీఎం



శంకర్‌పల్లి: జన్వాడ శివారులోని నియో కన్వెన్షన్‌లో ఆదివారం సాయంత్రం నార్సింగి ఏసీపీ రమణగౌడ్ కుమారుడు పవన్‌రాజ్, సాయిశృతి నిశ్చితార్థ వేడుకకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరయ్యారు. త్వరలో పెళ్లి చేసుకోబోతున్న జంటను ఆశీర్వదించారు. నార్సింగి ఏసీపీ రమణగౌడ్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ బావబావమరుదులు అవుతారు. నిశ్చితార్థ వేడుకలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఐసీసీ సెంటర్... ముద్దుగుమ్మలతో అట్రాక్షన్.!



బంజారాహిల్స్ రోడ్ నం.12లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ఆదివారం సాయంత్రం అందాల ముద్దుగుమ్మలతో కలర్‌ఫుల్‌గా కనువిందు చేసింది. సాయంత్రం 3 గంటలకు ముద్దు గుమ్మలంతా బస్సు దిగి కమాండ్ కంట్రోల్ సెంటర్ ఆవరణలో నడిచి వెళ్తున్న దృశ్యాలను బయట ప్రజలు, లోపల ఉద్యోగులు తిలకించారు. వీరిని చూసేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో ఐసీసీ సెంటర్ వద్దకు విచ్చేశారు. 107 దేశాల మిస్ వరల్డ్ పోటీదారులు కమాండ్ కంట్రోల్ సెంటర్ ఆవరణలో కొద్దిసేపు సెల్ఫీలు తీసుకొని సందడి చేశారు.

– బంజారాహిల్స్



ఆర్టీసీ బస్సులో చోరీ

అమీర్‌పేట: ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ఓ యువకుడి బంగారు గొలుసు చోరీకి గురైంది. ఎస్‌ఆర్‌నగర్ పోలీసులు తెలిపిన మేరకు.. ఒంగోలు జిల్లా కేంద్రానికి చెందిన ఈశ్వర్ వెంకటసాయి అత్తాపూర్ హైదర్‌గూడ ఈశ్వర్ థియేటర్ సమీపంలో స్నేహితులతో కలిసి ఉంటున్నాడు. మర్రి లక్ష్మారెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్ మేనేజ్‌మెంట్‌లో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల 16న సాయంత్రం 4 గంటల ప్రాంతంలో కళ్యాణ్‌నగర్‌లో ఆర్టీసీ బస్సులో వెళ్లి మైత్రివనమ్ చౌరస్తాలో దిగాడు.కొద్ది సేపటికి తన మెడలో ఉన్న 12 గ్రాముల బంగారు గొలుసు కనిపించ లేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

పార్కు చేసిన బైక్ మాయం

సనత్‌నగర్: మెట్రో స్టేషన్ వద్ద పార్కు చేసిన బైక్ చోరీకి గురైన సంఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు..బాలానగర్ రాజుకాలనీకి చెందిన నర్సింగ్‌రావు తన పల్సర్ బైక్ ను గత నెల 19న మధ్యాహ్నం ఒంటి గంటకు భరత్‌నగర్ మెట్రోస్టేషన్ పిల్లర్ నెంబర్ 929 వద్ద పార్కు చేసి మియాపూర్ వెళ్లాడు. అదే రోజు సాయంత్రం 4 గంటలకు తిరిగి వచ్చి చూడగా బైక్ కనిపించలేదు. చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించినా ఫలితం లేదు. దీంతో బాధితుడు సనత్‌నగర్ పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి సేవిస్తున్న ఆరుగురి అరెస్టు

సనత్‌నగర్: గంజాయి సేవిస్తున్న ఆరుగురిని సనత్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐగా విధులు నిర్వర్తిస్తున్న రాధాకృష్ణ తన సిబ్బందితో కలిసి శనివారం రాత్రి ఫతేనగర్ పిట్టల బస్తీలో పెట్రోలింగ్ నిర్వర్తిస్తున్నారు. వీరు విధులు నిర్వర్తిస్తున్న సమయంలో పిట్టల బస్తీ ప్రాంతంలో ఆరుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. పోలీసు వాహనాన్ని చూడగానే పారిపోవడానికి ప్రయత్నిస్తుండగా పట్టుకుని వివరాలు తెలుసుకునే క్రమంలో వారి నుంచి గంజాయి వాసన వస్తుండడాన్ని గమనించారు. తమదైన శైలిలో అడగ్గా తాము గంజాయి సేవించినట్లుగా అంగీకరించారు. ఈ మేరకు గంజాయి సేవించిన ఫిలింనగర్ ఎంసీఆర్ కాలనీకి చెందిన కసుకుర్తి రేవంత్ (22), సికింద్రాబాద్ బొల్లారానికి చెందిన హౌస్ కీపింగ్ సూపర్‌వైజర్ ఠాకూర్ దేవరాజ్ సింగ్ జితేందర్ (26), పిట్టల బస్తీకి చెందిన విద్యార్థి చౌకట్ల శాంతిబాబు (18), ఫిలింనగర్ దిల్దేనగర్‌కు చెందిన అలకుంట రాజేష్ (19), వరంగల్ జిల్లా పాకాల్ అశోక్‌నగర్‌కు చెందిన వడ్లకొండ సాయి (25), ఫిలింనగర్‌కు చెందిన గొల్ల పరశురామ్‌లు గంజాయి సేవించినట్లు ఒప్పుకున్నారు. గుర్తుతెలియని వ్యక్తి వద్ద నుంచి గంజాయి కొనుగోలు చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఈ మేరకు పోలీసులు వారిని అరెస్టు చేసి వారి నుంచి ఆరు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అమ్మవారి దేవాలయంలో చోరీ

బన్సీలాల్‌పేట్: న్యూబోయిగూడలోని అమ్మవారి దేవాలయంలో చోరీ జరిగింది. గాంధీనగర్ ఇన్‌స్పెక్టర్ బోస్ కిరణ్ తెలిపిన మేరకు.. న్యూబోయిగూడలోని గంగమ్మ దేవాలయంలో ఆదివారం ఉదయం ఓ అగంతకుడు చొరబడి అమ్మవారి బంగారు పుస్తెల తాడును ఎత్తుకెళ్లిపోయాడు. దేవాలయం కమిటీ సభ్యులు గాంధీనగర్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇన్‌స్పెక్టర్ బోస్ కిరణ్, క్రైమ్ ఇన్‌స్పెక్టర్ సైదులేశ్వర్ తదితరులు క్లూస్ టీమ్‌తో దేవాలయానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. దొంగతనం జరిగిన తీరుతెన్నులను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఎవరూ లేని సమయంలో ఆగంతకుడు గుట్టుచప్పుడు కాకుండా అమ్మవారి దేవాలయంలోకి వెళ్లి అమ్మవారి మెడలోని బంగారు పుస్తెల తాడును అపహరించాడు. గాంధీనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

స్పెషల్ క్లాస్‌లు స్పందన కరువు

పది ఫెయిలైన వారు సప్లిమెంటరీలో ఉత్తీర్ణులయ్యేలా ప్రత్యేక తరగతులు

- ఉపాధ్యాయులు వచ్చినా తరగతులకు రాని విద్యార్థులు
- అందరికీ ఒకేచోట క్లాస్‌లు నిర్వహించాలంటున్న తల్లిదండ్రులు

బంజారాహిల్స్: పదో తరగతి పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని విద్యాశాఖ అధికారులు వారం క్రితం ఆదేశాలు జారీ చేయడమే కాకుండా తగిన ప్రణాళికలు సైతం విడుదల చేశారు. ఈ మేరకు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పది విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సబ్జెక్టు టీచర్లు యోచిస్తుండగా విద్యార్థుల నుంచి ఆదరణ కరువవుతోంది. జూన్ 3వ తేదీ నుంచి సప్లిమెంటరీ పరీక్షలు జరగనున్నాయి. ఉపాధ్యాయులు బోధనా సామర్థ్యాన్ని మెరుగుపరచుకోవడానికి ప్రస్తుతం శిక్షణలో ఉండగా ఇదే సమయంలో ప్రత్యేక తరగతులు కూడా తీసుకోవాలని ఆదేశాలు అందాయి.



బంజారాహిల్స్ రోడ్‌నం.12లోని ఎన్‌బీటీనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల

17 పాఠశాలల్లో 175మంది ఫెయిల్..

విద్యాశాఖ ఖైరతాబాద్ జోన్ పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, షేక్‌పేట, సోమాజిగూడ, ఖైరతాబాద్, యూసుఫ్‌గూడ, వెంగళరావునగర్, రహమత్‌నగర్, బోరబండ, ఎర్రగడ్డ, అమీర్‌పేట డివిజన్ల పరిధిలో ఉన్న 17 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఇటీవల విడుదలైన పది పరీక్షా ఫలితాల్లో 1285 విద్యార్థులకు గాను 1110 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. 90.5 శాతం ఉత్తీర్ణత ఈ జోన్ పరిధిలో నమోదైంది. 175 మంది విద్యార్థులు ఫెయిలయ్యారు. ఒక్కో పాఠశాలలో 10 నుంచి 12 మంది విద్యార్థులు ఒకట్రెండు సబ్జెక్టుల్లో ఫెయిలయ్యారు.

ప్రత్యేక తరగతులు విద్యార్థులు...

సబ్జెక్టు టీచర్లు ఫెయిలైన వారికి ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు తీసుకోవాలని అధికారులు ఆదేశించారు. అయితే సబ్జెక్టుకు ఒకరు, ఇద్దరు మాత్రమే ఫెయిల్ కాగా వారిని క్లాస్‌లకు రమ్మని పిలిస్తే స్పందించడం లేదు. దీంతో పాఠశాలలకు తాళాలు పడుతున్నాయి. ఫెయిలైన విద్యార్థులందరూ పాసయ్యేలా చూసే బాధ్యత ఉపాధ్యాయులపై ఉండగా విద్యార్థులు మాత్రం స్పందించడం లేదు.

- ఫెయిలైన విద్యార్థులంతా ఉత్తీర్ణులయ్యేలా కార్యాచరణ రూపొందించాలని కొంతమంది తల్లిదండ్రులు కోరుతుండగా.. ఆ మేరకు ప్రణాళికలు రూపొందించినా విద్యార్థులు రావడం లేదు. ఏ సబ్జెక్టులో ఫెయిల్ అయ్యాడో ఆ విద్యార్థిని సంబంధిత ఉపాధ్యాయుడితో కో–ఆర్డినేట్ చేస్తున్నారు.

ఇంత వరకు బాగానే ఉన్నా ప్రత్యక్ష తరగతులకు విద్యార్థులు గైర్హాజరవడం గమనార్హం. కనీసం ఆన్‌లైన్ తరగతులు వినాలని అవగాహన కలిగిస్తున్నట్లు ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.

ఒకే చోట తరగతులు నిర్వహిస్తే బాగుండేది..

ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఖైరతాబాద్ జోన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రతి పాఠశాల నుంచి 10–12 మంది విద్యార్థులు ఫెయిలయ్యారు. చాలా పాఠశాలల్లో ఒక్కో సబ్జెక్టుకు ఒకరిద్దరు మాత్రమే ఫెయిలయ్యారు. ఒక్క విద్యార్థికి ప్రత్యేక తరగతులు నిర్వహించడానికి పాఠశాలకు ప్రత్యేకంగా ఉపాధ్యాయులు రావాల్సి వస్తుంది. అలా కాకుండా ఖైరతాబాద్ జోన్ పరిధిలోని ఒకే పాఠశాలలో ప్రత్యేక తరగతులు ఏర్పాటుచేసి జోన్ పరిధిలో ఒక సబ్జెక్టులో ఫెయిలైన విద్యార్థులందరినీ ఆ పాఠశాలకు రప్పించి ఒక్కో పాఠశాల నుంచి ఒక్కో టీచర్‌ను కేటాయించి బోధిస్తే బాగుండేదని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.

పరీక్షలకు మరో 15రోజులే...

- మరో 15 రోజులు సమయం ఉన్న నేపథ్యంలో విద్యాశాఖ ఉన్నతాధికారులు ఈ దిశగా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. అన్ని పాఠశాలలకు కలిపి సైన్స్‌లో 30 మంది ఫెయిల్ కాగా, ఈ 30 మందిని ఒక పాఠశాలకు పంపించి అక్కడ తరగతులు నిర్వహించి ఉంటే బాగుంటుందని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రభుత్వం వెంటనే సినిమా పాలసీని ప్రకటించాలి

డాక్టర్ పసునూరి రవీందర్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణలో సినిమాలను ప్రోత్సహించడానికి ప్రభుత్వం వెంటనే ప్రత్యేక పాలసీని ప్రకటించాలని ప్రముఖ రచయత డాక్టర్ పసునూరి రవీందర్ డిమాండ్ చేశారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో 'తెలంగాణ సినిమా రంగం అభివృద్ధి – అవరోధాలు' అనే అంశంపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పసునూరి రవీందర్ మాట్లాడుతూ... తెలంగాణ సినిమా నిర్మాణానికి ప్రభుత్వం అన్ని రకాల సహాయ సహకారాలు అందించాలన్నారు. అందులో భాగంగా సినిమాలకు పన్నుల మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

తెలంగాణ ఫిలిం చాంబర్‌ను ఏర్పాటు చేయాలి

ప్రత్యామ్నాయ సినిమా పరిశ్రమను ఏర్పాటు చేసేందుకు తెలంగాణ ఫిలిం చాంబర్‌ను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 11 ఏళ్లు పూర్తయినప్పటికీ సినిమా రంగం ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం దృష్టిని సారించడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సినిమా రంగాన్ని ప్రోత్సహించడానికి తగిన నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీ దర్శకులు, రచయితలు ఇనుముల ప్రేమ్‌రాజ్, సయ్యాద్ రఫీ, ప్రస్సేన్, ప్రవీణ్ చందర్, మన్సూర్ , పెద్దింటి అశోక్‌కుమార్, చల్లా శ్రీనివాస్, అక్షరకుమార్, రమేష్, కిషన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ పసునూరి రవీందర్

భవానీనగర్‌లో నీటి ఎద్దడి



ఖాళీ బిందెలతో నీటి కోసం అవస్థలు పడుతున్న దుర్గాభవానీనగర్ బస్తీవాసులు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని జూబ్లీహిల్స్ రోడ్ నం.5/7లో ఉన్న దుర్గాభవానీనగర్ బంజారాబస్తీలో మంచినీటి సమస్య తీవ్రరూపం దాల్చింది. గత శుక్రవారం నుంచి నల్లా రాకపోవడంతో బస్తీ ప్రజలు నీటి కోసం ఖాళీ బిందెలతో రోడ్డున పడ్డారు. బిందెడు నీటి కోసం దూర ప్రాంతాలకు వెళ్లి బతిమిలాడుకోవాల్సిన పరిస్థితులు తలెత్తాయి. మంచినీటి సమస్య పరిష్కరించాలంటూ బస్తీ అధ్యక్షుడు వి.గౌడ్‌నాయక్, జనరల్ సెక్రటరీ వి.జానీనాయక్‌లు జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్‌కు సమాచారం ఇచ్చారు. జలమండలి అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించాలని కోరారు. ఇదిలా ఉండగా మంచినీటి సమస్యపై మహిళలు ఆందోళనకు దిగారు.

గాయత్రిహిల్స్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీ



బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ డివిజన్ గాయత్రిహిల్స్ కాలనీ సంక్షేమ సంఘం ఎన్నికలు ఆదివారం కాలనీలో జరిగాయి. ఈ ఎన్నికల్లో మూడోసారి కొమ్మినేని రాఘవులు అధ్యక్షుడిగా ఎన్నికై సంచలనం సృష్టించారు. మొత్తం 282 ఓట్లు పోల్ కాగా అందులో కొమ్మినేని రాఘవులు 176 ఓట్లు సాధించి 71 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఎంవీ సుబ్బారావు అధ్యక్ష పదవిలో 105 ఓట్లు వచ్చాయి. మరో వైపు ప్రధాన కార్యదర్శిగా కీర్తి లీలా రమేష్ 142 ఓట్లతో గెలుపొందారు. 4 ఓట్ల తేడాతో లీలా రమేష్ గెలవడం విశేషం . జనరల్ సెక్రటరీ పోటీలో 138 ఓట్లతో వి.సుబ్బారావు వచ్చి నాలుగు ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఈ కమిటీ రెండు సంవత్సరాల పాటు పదవిలో ఉంటుందని ఈ సందర్భంగా కమిటీ సభ్యులు తెలిపారు.

నాన్నను గెలిపించిన కొడుకు...

ఈ ఎన్నికల్లో అధ్యక్ష పదవికి పోటీ చేసిన కొమ్మినేని రాఘవులు వారం రోజుల క్రితమే నామినేషన్ వేసి అమెరికాకు వెళ్లిపోయారు. రాఘవులు గాయత్రిహిల్స్‌లో సుపరిచితుడు కావడంతో పాటు మంచి పేరు ఉండటంతో ఈ ఎన్నికల భారాన్ని మొత్తం ఆయన కుమారుడు కొమ్మినేని శివ తన భుజాలపై వేసుకొని ఇంటింటి ప్రచారం చేశాడు. ఏ ఎన్నికల్లో నైనా అభ్యర్థులు అందుబాటులో ఉండి ఎన్నికల్లోకి వెళ్తారు. కానీ మేం చేసిన మంచి పనులే మమ్మల్ని గెలిపిస్తాయంటూ ధీమాగా రాఘవులు నామినేషన్ వేసి అమెరికాకు వెళ్లారు. ఇప్పుడు ఈ గెలుపు నియోజకవర్గంలో హాట్ టాపిక్‌గా మారింది.

చాలెంజ్‌గా తీసుకున్నప్పుడే ఉత్తమ ఫలితాలు

హిమాయత్‌నగర్: మనిషి జీవితంలో వృత్తిని చాలెంజ్‌గా తీసుకున్నప్పుడే మంచి ఫలితాలు వస్తాయని మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో సమాచార హక్కు వికాస సమితి రాష్ట్ర గౌరవ అధ్యక్షులు, కాచం ఫౌండేషన్ వ్యవస్థాపకులు కాచం సత్యనారాయణ గుప్తా సారథ్యంలో నిర్వహిస్తున్న విశ్వంభర సంస్థ మొదటి వార్షికోత్సవానికి ఆయన హాజరై మాట్లాడారు. వృత్తిని ఎంచుకునే ముందు ఆ వృత్తిపట్ల ఉన్న అవగాహనను పరిగణలోకి తీసుకోవాలని అప్పుడే ఏ రంగంలోనైనా రాణించగలుగుతారన్నారు. రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కే.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ సోషల్ మీడియా ఎంత అభివృద్ధి చెందినా పత్రికలకు ఆదరణ తగ్గలేదన్నారు. ప్రజలు పత్రికలు చదివేలా అన్ని ప్రాంతాల్లో గ్రంథాలయాలు అందుబాటులో ఉంచాలని కోరారు.



మాట్లాడుతున్న మధుసూదనాచారి

ఎర్రగడ్డ రైతుబజార్ కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: టమాట రూ.13, నల్లవంకాయ.18, పొడుగు వంకాయ.18, బెండకాయ.35, పచ్చిమిర్చి.35, బజ్జీమిర్చి.30, క్యాప్సికం.47, పచ్చికాకర.32, పందిరి బీర.35, క్యాబేజీ.12, క్యారెట్.28, దొండకాయ.19, గుండు బీన్నీస్.95, గింజచిక్కుడు.55, గోకరకాయ.40, కీర.18, దోసకాయ.18, బీట్‌రూట్.17, ఉల్లిగడ్డ.16, ఆలుగడ్డ.25, చామగడ్డ.35, మొరంగడ్డ.19, కందగడ్డ.75, క్యాలీఫ్లవర్ 23, సొరకాయ.10, పొట్లకాయ.18, అరటికాయ.11, మునగకాయ.4, మామిడికాయ.55, ముల్లంగి.4–5, ఉల్లిపొరక.45. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

మెట్రో చార్జీలు తగ్గించాలి

లిబర్టీ: పెంచిన మెట్రో చార్జీలను తగ్గించాలని లోక్‌దళ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు పి.వి.రాజేశ్వరరావు కోరారు. ఇప్పటికే పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలతో పేద, మధ్య తరగతి ప్రజలు సతమతమవుతుంటే మెట్రో చార్జీలు భారంగా మారాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెట్రో నష్టాల్లో నడుస్తుందని నష్టాల పేరుతో మెట్రో రైల్ చార్జీలు పెంచి భారం మోపుతారా అని ప్రశ్నించారు. ప్రస్తుతం ప్రైవేటు భాగస్వామ్యంలో నడుస్తున్న మెట్రోకు ఇతర ఆదాయం కూడా వస్తుందని వాణిజ్య ప్రకటనలు మెట్రో రైలు కూడా ఉన్నాయని అంతేకాకుండా వాటి ద్వారా కూడా ఆదాయం వస్తుందని అన్నారు. పెంచిన చార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు.

ఇస్లాం మత గురువు హైదర్‌పాషా కన్నుమూత

గోల్కొండ: ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, ముస్లిం మత పెద్ద మౌలానా సయ్యద్ నూర్ అలీషా ఖాద్రి హైదర్‌పాషా(89) మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శనివారం రాత్రి గోల్కొండ రిసాలబజార్‌లోని తన స్వగృహంలో మృతి చెందారు. ఆల్ ఇండియా ఖీరత్ కమిటీ అధ్యక్షుడు, కుతుబ్ షాహీ ఈద్గా హకీబ్ మౌలానా కారీ సయ్యద్ మతీన ఆలీషా ఖాద్రీకి స్వయాన తండ్రి. ఆయన అంత్యక్రియలు ఆదివారం మధ్యాహ్నం జమాలికుంట ముస్లిం శ్మశాన వాటికలో జరిగాయి.

యువతితో అసభ్య ప్రవర్తన

బాధితురాలి ఫిర్యాదు.. నిందితుడి రిమాండ్

ఫిలింనగర్: జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆస్పత్రిలో పని చేస్తున్న యువతి పట్ల అసభ్యంగా ప్రవర్తించడమే కాకుండా ఆమె రాకపోకలపై,కదిలికలపై నిఘా పెట్టి దారికాచి ఇబ్బందులకు గురిచేస్తూ వేధిస్తున్న అదే ఆస్పత్రిలో హౌజ్ కీపింగ్ చేస్తున్న నిందితుడిని ఫిలింనగర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.ఒడిశాకు చెందిన బికాస్ గడాయ్(33) కొంతకాలంగా అపోలో ఆస్పత్రిలో హౌజ్ కీపింగ్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. హౌజ్ కీపింగ్‌లో పని చేస్తున్న యువతి పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ ప్రేమిస్తున్నానంటూ వెంటపడుతున్నాడు. దారి కాచి ఆమెను ఇబ్బందులకు గురి చేయసాగాడు.దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.



నిందితుడు బికాస్ గడాయ్

అంకితభావంతో సంగీతాన్ని అభ్యసించాలి

హిమాయత్‌నగర్ : అంకితభావంతో సంగీతం అభ్యసించి ప్రామాణిక స్థాయికి చేరాలని ఆంధ్ర మహిళాసభ సంగీత కళాశాల ప్రిన్సిపాల్, ప్రముఖ కర్ణాటక సంగీత కళాకారిణి డా.ఎర్రమిల్లి రమాప్రభ పేర్కొన్నారు. సంగీత వార్షికోత్సవం సందర్భంగా రాగ తరంగిణి మ్యూజిక్ స్కూల్ ఆధ్వర్యంలో ఆదివారం హిమాయత్‌నగర్‌లోని సరేగ స్టూడియోలో గురు తరంగిణి శిష్యులు సాన్వీ సిద్ధి, ప్రేక్షారెడ్డి, శ్రేష్ట బైరెడ్డి, కర్ణాటక సంగీతాన్ని శ్రావ్యంగా ఆలపించి ప్రేక్షకులను అలరించారు. ముఖ్య అతిథిగా రమాప్రభ హాజరై కర్ణాటక సంగీతాన్ని ఆలపించిన గాయకులను అభినందించారు. చిన్నారులు ఆలపించిన మహా గణపతిం, అన్నమాచార్య, శ్రీ త్యాగరాయ స్వామి కీర్తనలు, దేవి స్తుతి, ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.



రమాప్రభను సత్కారిస్తున్న కళాకారులు

ఫుట్‌పాత్.. చెత్తకు స్పాట్

శ్రీనగర్‌కాలనీ నుంచి అమీర్‌పేట వేళ్లే పాత బిగ్‌బజార్ గల్లీకి వెళ్లే మలుపు దారిలో భారీగా చెత్త, వ్యర్థాలు పేరుకుపోయాయి. పాదచారుల సౌకర్యార్థం నిర్మించిన ఫుట్‌పాత్‌పై చెత్త వేస్తుండటంతో రాకపోకలు సాగించలేని దుస్థితి నెలకొంది. సంబంధిత సిబ్బంది స్పందించి వ్యర్థాలను ఎప్పటికప్పుడు తరలించాలని స్థానికులు కోరుతున్నారు.

– శ్రీనగర్‌కాలనీ



లాడ్జీలో సెల్‌ఫోన్లు తస్కరణ

- అడ్డొచ్చిన మేనేజర్‌పై బ్లేడ్‌తో దాడి
- నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు

బంజారాహిల్స్: లాడ్జీలో కష్టమర్ల కళ్లుగప్పి సెల్‌ఫోన్లు తస్కరించడానికి యత్నించడమే కాకుండా అడ్డు వచ్చిన లాడ్జీ మేనేజర్‌పై బ్లేడ్‌తో దాడి చేసిన ఘటనలో జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. శ్రీకృష్ణానగర్‌లో అంజి హాస్టల్‌లో ఉంటున్న ఆనంద్‌కుమార్ కొంత కాలంగా సినిమా షూటింగ్‌లలో పని చేస్తున్నాడు. బ్యాచిలర్స్ ఉండే హాస్టళ్లు, లాడ్జీలు లక్ష్యంగా చేసుకొని సెల్‌ఫోన్ దొంగతనాలకు యత్నిస్తున్నాడు. ఈ క్రమంలో కృష్ణానగర్‌లో శీతల్ లాడ్జీలో సెల్‌ఫోన్ దొంగిలించేందుకు యత్నిస్తుండగా అక్కడ కష్టమర్లు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. లాడ్జీ మేనేజర్ షేక్ మున్నా నిందితుడిని పట్టుకునేందుకు ప్రయత్నించగా తనతో పాటు తెచ్చుకున్న బ్లేడ్‌తో చేతులపై గాట్లు పెట్టాడు. పరారయ్యేందుకు యత్నిస్తుండగా అక్కడున్న వారంతా పట్టుకొని పోలీసులకు అప్పగించారు. జూబ్లీహిల్స్ పోలీసులు ఆదివారం నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.



నిందితుడు ఆనంద్‌కుమార్

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220379
9640081203

ప్రైవేటు బస్సులకు పన్ను మినహాయింపు ఇవ్వండి



మంత్రి రామలింగారెడ్డిని సత్కరిస్తున్న ముత్యాల గోవింద్‌రాజ్ తదితరులు

అబిడ్స్: ప్రైవేటు బస్సులకు పన్ను మినహాయింపు ఇవ్వాలని తెలంగాణ ఆపరేటర్స్ హైదరాబాద్, సికింద్రాబాద్ క్యారేజ్ కాంట్రాక్ట్ బస్సు ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ముత్యాల గోవింద్‌రాజు అన్నారు. తెలంగాణ ప్రైవేటు బస్సులకు కర్ణాటకతోపాటు ఇతర రాష్ట్రాల్లో వసూలు చేస్తున్న పన్నును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కర్ణాటక రవాణ శాఖ మంత్రి రామలింగారెడ్డిని కలిసి ఘనంగా సత్కారం చేశారు. ఈ సందర్భంగా పన్నును మినహాయించాలని మెమోరాండం అందజేశారు. అనంతరం జరిగిన సమావేశంలో గోవింద్‌రాజు మాట్లాడుతూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, పాండిచ్చేరి రాష్ట్రాల్లో ప్రైవేటు బస్సులపై పన్నులను రద్దు చేస్తే వాహన యజమానులకు ఎంతో ఊరట కలుగుతుందన్నారు. ఈ మేరకు మంత్రి రామలింగారెడ్డి సానుకూలంగా స్పందించినట్లు గోవింద్‌రాజు తెలిపారు. త్వరలోనే పన్ను మినహాయింపు నిర్ణయానికి కృషి చేస్తామని వెల్లడించినట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో రోడ్డు రవాణా గ్యారేజ్ బస్సు ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నటరాజన్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

అందంగా... ఆహ్లాదంగా...

ఆధునిక హంగులతో ముస్తాబైన బేగంపేట్ రైల్వేస్టేషన్

- ప్రాంగణంలో కొలువుదీరిన తెలంగాణ పాలపిట్ట
- రూ.26.55 కోట్లతో పునరాభివృద్ధి
- అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద అభివృద్ధి పనులు
- ఈ నెల 22వ తేదీన వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని



సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ సంస్కృతికి ప్రతిబింబంగా.. ఆధునిక సదుపాయాల నెలవుగా.. అందంగా, ఆకర్షణీయంగా బేగంపేట రైల్వేస్టేషన్ సరికొత్తగా రూపుదిద్దుకుంది. ఆధునిక హంగులతో సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఈ నెల 22వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కరీంనగర్, వరంగల్ స్టేషన్లతోపాటు బేగంపేట్ స్టేషన్‌ను కూడా వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. లిఫ్టులు, ఎస్కలేటర్లు, విశ్రాంతి గదులు, ఆధునిక టాయిలెట్లు, దివ్యాంగుల కోసం ప్రత్యేక సదుపాయాలను ఏర్పాటు చేశారు. స్టేషన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన తెలంగాణ రాష్ట్ర పక్షి పాలపిట్ట ప్రత్యేక ఆకర్షణగా ఉంది. ఆకట్టుకొనే విద్యుత్ కాంతులు, జలపాతాలు, పచ్చదనం వంటివి ప్రయాణికులకు సరికొత్త అనుభూతిని ఇవ్వనున్నాయి. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద రైల్వే శాఖ గత ఏడాది ఫిబ్రవరిలో సుమారు రూ.26.55 కోట్లతో బేగంపేట్ రీడెవలప్‌మెంట్ పనులను చేపట్టింది. ఏడాది వ్యవధిలోనే అన్ని పనులను పూర్తిచేసి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావడం విశేషం. నగరంలో సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ, చర్లపల్లి స్టేషన్ల తరువాత బేగంపేట్ రైల్వే స్టేషన్ నుంచే ఎక్కువ మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. ఫలక్‌నుమా నుంచి లింగంపల్లికి రాకపోకలు సాగించే ఎంఎంటీఎస్ రైళ్లతోపాటు వివిధ మార్గాల్లో నడిచే ప్రధాన రైళ్లు కూడా బేగంపేట్ నుంచి అందుబాటులో ఉన్నాయి. ఇక్కడి నుంచి ప్రతిరోజు సుమారు 15 వేల మంది ప్రయాణిస్తున్నారు. సికింద్రాబాద్–పుణె శతాబ్ది ఎక్స్‌ప్రెస్, గోరఖ్‌పూర్, హుస్సేన్‌సాగర్, గరీబ్‌రథ్, పల్నాడు ఎక్స్‌ప్రెస్, గౌతమి, రాయలసీమ, కోకోనాడ, కోణార్క్, రాజ్‌కోట్, అజంతా, సికింద్రాబాద్–పోర్‌బందర్, బీదర్–హైదరాబాద్ ఇంటర్‌సిటీ తదితర రైళ్లకు బేగంపేట్‌లో హాల్టింగ్ సదుపాయం ఉంది.

లేడీస్ స్పెషల్ స్టేషన్...

బేగంపేట్ స్టేషన్ పూర్తిగా మహిళా అధికారులు, మహిళా ఉద్యోగుల నిర్వహణలో కొనసాగుతోంది. స్టేషన్ మాస్టర్‌తోపాటు టికెట్ బుకింగ్ సిబ్బంది, టికెట్ కలెక్టర్లు, క్లర్క్‌లు, ఆర్పీఎఫ్ కానిస్టేబుళ్లు తదితర అన్ని విభాగాలకు చెందిన వాళ్లు మహిళలే కావడం గమనార్హం. గత ఆరేళ్లుగా మహిళలు ఈ స్టేషన్‌లో విజయవంతంగా విధులు నిర్వహిస్తున్నారు. మహిళా ప్రయాణికుల భద్రతపట్ల ప్రత్యేక నిఘా వ్యవస్థ కొనసాగుతోంది. స్టేషన్ రీడెవలప్‌మెంట్‌లో భాగంగా 2 లిఫ్టులు, 4 ఎస్కలేటర్లు, ప్రయాణికులకు తేలిగ్గా తెలిసేవిధంగా సైన్‌బోర్డులు, ప్లాట్‌ఫాం షెల్టర్లు, విశాలమైన, అత్యాధునిక సదుపాయాలతో కూడిన వెయిటింగ్‌హాళ్లు ఏర్పాటు చేశారు.



ఇవీ ప్రత్యేకతలు...

- అమృత్ భారత్ కింద తెలంగాణలో రూ.2,750 కోట్లతో 40 రైల్వేస్టేషన్ల పునరాభివృద్ధి చేపట్టారు. నగరంలో హైటెక్‌సిటీ, మలక్‌పేట్, ఉందానగర్, హఫీజ్‌పేట్, యాఖుత్‌పురా, మల్కాజిగిరి తదితర స్టేషన్ల రీడెవలప్‌మెంట్ కొనసాగుతుంది. హైటెక్ సిటీ, మల్కాజిగిరి, బేగంపేట్ పూర్తయ్యాయి. కొన్ని స్టేషన్లలో పనులు వివిధ దశల్లో ఉన్నాయి.
- బేగంపేట్‌లో 12 మీటర్ల నిడివి కలిగిన ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని నిర్మించారు. ప్రయాణికులు ప్లాట్‌ఫామ్‌లకు తేలిగ్గా చేరుకొనే విధంగా ఇది దోహదం చేయనుంది.
- ప్లాట్‌ఫాం షెల్టర్లు, ఆధునిక టాయిలెట్లు, రెండో ప్రవేశద్వారం, లిఫ్టులు, ఎస్కలేటర్లు ఏర్పాటు చేశారు.
- స్టేషన్ ప్రధాన ముఖద్వారాన్ని అందంగా తీర్చిదిద్దారు.
- తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేవిధంగా ప్రాంగణంలో తెలంగాణ రాష్ట్ర పక్షి పాలపిట్ట శిల్పంతో అందంగా అలంకరించారు.

నగరంలో నేడు

- మిస్ వరల్డ్ ప్రారంభ వేడుకల్లో భాగంగా గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో వేసవి సెలవుల సందర్భంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సమ్మర్ ఆర్ట్ క్యాంప్ జరుగుతుంది.
- మైలార్‌దేవ్‌పల్లి గణేష్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉదయం 8 గంటల నుంచి ఉదయం 11 గంటల వరకు ఉచిత వేసవి శిక్షణ శిబిరం జరుగుతుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో సెవెన్ విజన్స్ పేరిట చిత్ర ప్రదర్శన ఉదయం 10.30 నుంచి రాత్రి 7 గంటల వరకు ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

స్టోర్‌కు చేర్చాల్సిన దుస్తులతో క్యాబ్ డ్రైవర్ పరారీ

బంజారాహిల్స్: స్టోర్‌కు చేర్చాల్సిన ఖరీదైన దుస్తులను తీసుకుని ఓ క్యాబ్ డ్రైవర్ ఉడాయించాడు. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం ...జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్–10లోని తలాష స్టోర్ యజమానురాలు, ఫ్యాషన్ డిజైనర్ సోఫియా బేగంపేట శ్రీస్వామి హ్యాండ్‌లూమ్స్ నుంచి ఖరీదైన ఫ్యాబ్రిక్‌ను స్టోర్‌కు తీసుకురావాల్సిందిగా క్యాబ్ బుక్ చేసింది. బేగంపేటలో ఉబర్ క్యాబ్ డ్రైవర్ ప్రసాద్ ఫ్యాబ్రిక్‌ను తీసుకుని బయలుదేరాడు. బంజారాహిల్స్‌లోని టీవీ 9 ఆఫీసు దాకా సదరు క్యాబ్ డ్రైవర్ ఫ్యాషన్ డిజైనర్ సోఫియాతో టచ్‌లోనే ఉన్నాడు. ఆ తర్వాత కొద్ది సేపటికి ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. స్టోర్‌కు ఫ్యాబ్రిక్ తీసుకురాకుండా ఉడాయించడంతో ఫ్యాషన్ డిజైనర్ సదరు ఉబర్ ఆఫీసు హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేసింది. సంబంధిత డ్రైవర్ నెంబర్ ఊబర్ కార్యాలయానికి ఇచ్చినా స్పందించలేదు. దీంతో బాధిత ఫ్యాషన్ డిజైనర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు క్యాబ్ డ్రైవర్ ప్రసాద్‌పై కేసు నమోదు చేసి గాలింపు చేపట్టారు.

ఖరీదైన చీరలతో ఉడాయించిన ర్యాపిడో డ్రైవర్

బంజారాహిల్స్: ఓ ర్యాపిడో డ్రైవర్ ఖరీదైన డిజైనర్ చీరలతో ఉడాయించాడు. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం... వెస్ట్ మారేడ్‌పల్లి నుంచి ఐదు డిజైనర్ చీరలను బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–4లోని రాధిక అట్టిరె డిజైనర్ షోరూంకు పంపించేందుకు షోరూం యజమాని అశీష్ అగర్వాల్ ర్యాపిడో బుక్ చేశాడు. ర్యాపిడో డ్రైవర్ చీరల ప్యాకింగ్‌తోపాటు మనోజ్ పాశ్వాన్ అనే షోరూం హెల్పర్‌ను తీసుకొని బయలుదేరాడు. షోరూం వద్దకు వచ్చిన తర్వాత మనోజ్ కారు దిగి బిల్లు చెల్లించేందుకు డబ్బులు లెక్కిస్తుండగా క్షణాల్లోనే ర్యాపిడో డ్రైవర్ చీరలను తీసుకొని అక్కడి నుంచి పరారయ్యాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని ర్యాపిడో డ్రైవర్ కోసం గాలింపు చేపట్టారు.

ప్రభుత్వ స్థలం కబ్జా.. తండ్రీకొడుకులపై కేసు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–10లోని బసవ తారకం కేన్సర్ ఆస్పత్రి ఎదురుగా తట్టిఖానా వాటర్ సెక్షన్ కార్యాలయాన్ని ఆనుకుని ఉన్న మూడున్నర ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసేందుకు యత్నించిన తండ్రికొడుకులైన పార్థసారథి, విజయభార్గవ్‌పై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. సదరు ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేయడమే కాకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి హెచ్చరిక బోర్డు తొలగించి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని షేక్‌పేట తహసీల్దార్ వై.అనితారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీరిద్దరిపై గతంలో కూడా ఇదే ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేస్తున్న కారణంగా 2021లో రెండు సార్లు, 2022లో రెండు సార్లు కబ్జా కేసులు నమోదయ్యాయని, ఇంత జరుగుతున్నా తండ్రీ కొడుకులు ఆక్రమణలను ఆపడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. వీరిద్దరూ కరుడుగట్టిన భూ కబ్జాదారులని, ఖాళీ ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తున్నారని ఆమె ఆరోపించారు. తాము ఏర్పాటుచేసిన గేటును కూడా బద్దలుకొట్టి అర్ధరాత్రి లోనికి ప్రవేశించడమే కాకుండా రౌడీలతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు.

కంటి కేన్సర్‌పై అవగాహనకు 'వైట్‌థాన్'

జెండా ఊపి ప్రారంభించిన అగ్నిమాపక సేవల డైరెక్టర్ జనరల్ నాగిరెడ్డి



వైట్‌థాన్ రన్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

రాయదుర్గం: 'కంటి కేన్సర్'పై అవగాహనే లక్ష్యంగా 'వైట్‌థాన్' రన్ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. పిల్లలకు వచ్చే కంటి కేన్సర్‌పై అవగాహన, చికిత్సకు విరాళాల నిమిత్తం ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీ–వర్క్స్ ప్రాంగణం వద్ద 'వైట్‌థాన్' 10కే రన్‌ను నిర్వహించారు. రాష్ట్ర అగ్నిమాపక సేవల డైరెక్టర్ జనరల్ వై.నాగిరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో ఇది ఏడో రన్. ఈ కార్యక్రమం ప్రపంచ రెటినోబ్లాస్టోమా(కళ్ల కేన్సర్) అవగాహనా వారం ఈ సంవత్సరం మే 11 నుంచి 17వ తేదీ వరకు జరిగింది. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఈ రన్‌ను ఎంతో ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ చిన్నారుల్లో వచ్చే కేన్సర్‌ను ముందుగా గుర్తించేందుకు సహాయపడవచ్చని, ఎంతోమంది చూపును, ప్రాణాలను రక్షించవచ్చని అన్నారు. పిల్లలను ఫ్లాష్‌తో ఫొటోలు తీసినప్పుడు కళ్లలో ఏదైనా తెల్లగా కనిపిస్తే అనుమానించి వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. కల్లం అంజిరెడ్డి క్యాంపస్ ఆంకాలజిస్ట్ డాక్టర్ స్వాతి కలికి మాట్లాడుతూ కంటి కేన్సర్ లక్షణాలపై ప్రజల్లో అవగాహన పెంచాలని, చిన్న పిల్లల తల్లిదండ్రులు తెలుసుకోవాలన్నారు. ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రశాంత్ గార్గ్ మాట్లాడుతూ తమ ఆసుపత్రిలో ప్రతి ఏడాది కంటి కేన్సర్ కేసులు 150 నుంచి 200 వరకు వస్తుంటాయన్నారు. వీరిలో చికిత్స పొందిన కేసుల్లో 90 శాతం మంది పిల్లల ప్రాణాలు రక్షించామన్నారు. అపోలో ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ విజయానంద్‌రెడ్డి మాట్లాడుతూ మన చుట్టుపక్కల ఉన్న వారికి ఈ వ్యాధిపై అవగాహన కలిగించవచ్చన్నారు.

సీనియర్ ఫొటో జర్నలిస్ట్ శివకుమార్ మృతి



బంజారాహిల్స్: సీనియర్ ఫొటో జర్నలిస్టు పోచెంచర్ల వెంకట శివకుమార్ (66) ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. బంజారాహిల్స్ రోడ్ నం.12లోని ఫొటోగ్రాఫర్స్ కాలనీలో ఆయన నివాసం ఉంటారు. ఆదివారం అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో అపోలో ఆస్పత్రికి తరలించగా ఆయన అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. శివకుమార్ 1985 నుంచి 1993 వరకు ఇండియన్ ఎక్స్‌ప్రెస్, 1993 నుంచి 2015 వరకు దిహిందూ దిన పత్రికలో సీనియర్ ఫొటో జర్నలిస్టుగా పనిచేశారు. ఆయన మృతి పట్ల తెలంగాణ రాష్ట్ర ఫొటో జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు అనుమల్ల గంగాధర్, కార్యదర్శి కె.ఎస్.హరి, కార్యవర్గ సభ్యులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన అంత్యక్రియలు సోమవారం ఉదయం జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో నిర్వహిస్తామని కుటుంబసభ్యులు తెలిపారు. శివకుమార్ మృతి పట్ల ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

'గాంధీ' అలుమ్నీ మాజీ ప్రెసిడెంట్ ప్రతాప్‌రెడ్డి కన్నుమూత

నేడు గాంధీ మెడికల్ కాలేజీకి పార్థివదేహం అప్పగింత



గాంధీఆస్పత్రి : సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కాలేజీ అలుమ్నీ అసోషియేషన్ మాజీ ప్రెసిడెంట్ డాక్టర్ ప్రతాప్‌రెడ్డి కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఇండో అమెరికన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం కన్నుమూశారు. గాంధీ మెడికల్ కాలేజీ 1967 బ్యాచ్‌కు చెందిన ప్రతాప్‌రెడ్డి స్టూడెంట్ యూనియన్ లీడర్‌గా పలు పదవులు నిర్వహించారు. అనంతరం గాంధీ అలుమ్నీ అసోషియేషన్ అధ్యక్షుడిగా, ఇండియన్ మెడికల్ అసోషియేషన్ (ఐఎంఏ) తెలంగాణ స్టేట్ ప్రెసిడెంట్‌గా సమర్థవంతంగా సేవలు అందించారు. గాంధీ అలుమ్నీ హెరిటేజ్ భవనంలో సోమవారం ఉదయం గాంధీ వైద్యుల సందర్శనార్థం ప్రతాప్‌రెడ్డి పార్థివదేహాన్ని ఉంచుతారు. అనంతరం వైద్యవిద్యార్థుల పరిశోధనల నిమిత్తం గాంధీ మెడికల్ కాలేజీకి ఆయన భౌతికకాయాన్ని అప్పగించనున్నట్లు గాంధీ అలుమ్నీ అసోషియేషన్ అధ్యక్షుడు డాక్టర్ జీఆర్ లింగమూర్తి తెలిపారు.

నేడు పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సభ



పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సభకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి సభను సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు సుందరయ్య విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్. వినయ కుమార్ తెలిపారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సభకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వినయ కుమార్ మాట్లాడుతూ ఎస్వీకే ట్రస్టు అధ్యక్షుడు బీవీ రాఘవులు అధ్యక్షతన 'నేటి రాజకీయాలు–భగత్‌సింగ్ ప్రాసంగికత' అనే అంశంపై పంజాబ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ చమ్‌లాల్ స్మారకోపన్యాసం చేస్తారని అన్నారు. కార్యక్రమంలో ట్రస్టు కార్యదర్శి తమ్మినేని వీరభద్రంతోపాటు పలువురు ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆటలు, వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. పోస్టర్ ఆవిష్కరణలో భూపతి వెంకటేశ్వర్లు, విజ్ఞాన కేంద్రం మేనేజర్ రమణరావు తదితరులు పాల్గొన్నారు.

భూపతి చంద్ర స్మారక పురస్కారాల ప్రదానం



పురస్కారాలు అందజేస్తున్న రాంచంద్రమూర్తి, నర్సింగ్‌రావు తదితరులు

సుల్తాన్‌బజార్: కొంతమంది తల్లిదండ్రులను పట్టించుకోవట్లేదని, కానీ భూపతిచంద్ర కుమారులు వారి పేరిట స్మారక అవార్డులు అందజేయడం అభినందనీయమని సీనియర్ సంపాదకుడు కె.రామచంద్రమూర్తి అన్నారు. ఆదివారం సాయంత్రం బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో భూపతిచంద్ర మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ ఎంఎల్ కాంతారావు అధ్యక్షతన భూపతి చంద్ర స్మారక కథానికల బహుమతుల ప్రదానోత్సవ సభ జరిగింది. ముఖ్యఅతిథిగా కె.రాంచంద్రమూర్తి, గౌరవ అతిథిగా నాగార్జున యూనివర్సిటీ తెలుగుశాఖ పూర్వ అధ్యక్షుడు ప్రొఫెసర్ మన్నవ సత్యనారాయణ, ఆత్మీయ అతిథిగా సినీ దర్శకుడు బి.నర్సింగరావు హాజరయ్యారు. అనంతరం రామచంద్రమూర్తి మాట్లాడుతూ తాను హెచ్ఎంటీవీలో ఉన్నప్పుడు అనేక కథలు సేకరించి "వందేళ్ల కథలకు వందనం"అనే పుస్తకాన్ని తీసుకువచ్చానన్నారు. ఎంఎల్ కాంతారావు, నర్సింగ్‌రావు, విజయ్‌కుమార్, వేదకుమార్, అశోక్‌కుమార్‌లు వారి తల్లిదండ్రులైన భూపతి చంద్ర పేరిట పురస్కారాలు ఏర్పాటు చేయడం అభినందించదగ్గ విషయమన్నారు. సినీదర్శకుడు నర్సింగ్‌రావు మాట్లాడుతూ చిన్నతనం నుంచే కవితలు, కథలు రాసేవాడినని, 1975లో రెండు కథలు రాశానని తెలిపారు. ప్రతి సంవత్సరం భూపతి చంద్ర పేరిట ఈ అవార్డుల ప్రక్రియ కొనసాగుతుందని కాంతారావు తెలిపారు. ఈ సందర్భంగా చాగంటి ప్రసాద్ (తీరని రుణం) ప్రథమ బహుమతి గెలుచుకోగా, ఉప్పులూరి మధుపత్ర శైలజ (అనుకోని అతిథి)కి ద్వితీయ బహుమతి, కొండా మల్లారెడ్డి (కర్రెకోడి) తృతీయ బహుమతి అందజేశారు. ప్రోత్సాహిక పురస్కారాలను శ్రీనివాసరావు, గొర్లివాని శ్రీనివాస్, దత్త రమణ, గంగలక్ష్మీ, పప్పు శాంతాదేవిలకు అందించి ఘనంగా సన్మానించారు.

ఆపరేషన్ కగార్‌ను ఆపివేయాలి

న్యూడెమోక్రసీ నేతల డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న గోవర్ధన్, వెంకటేశ్వర్‌రావు, చలపతిరావు తదితరులు

ముషీరాబాద్: ఆపరేషన్ కగార్‌ను ఎత్తివేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ డిమాండ్ చేసింది. ఆదివారం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.గోవర్ధన్, సాధినేని వెంకటేశ్వర్‌రావు, జె.వి.చలపతిరావు మాట్లాడుతూ మావోయిస్టులతో కేంద్రం వెంటనే శాంతిచర్చలు సాగించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు జరుపుతున్న ఆపరేషన్ కగార్‌తో ఇప్పటికే దాదాపు 500 మంది ఆదివాసీలు, మావోయిస్టులు చనిపోయారని, దండకారణ్యంలో హత్యాకాండ కొనసాగుతోందని, ఇటీవల పోలీసులు జరిపిన దాడుల్లో డాక్టర్ రవి ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. మావోయిస్టులు ఆరు నెలల పాటు కాల్పుల విరమణ ప్రకటించి బేషరతు చర్చలకు సిద్ధం అంటూ ముందుకు వచ్చినా కేంద్ర ప్రభుత్వం నిరంకుశంగా మావోయిస్టులను అణచివేస్తామని ప్రకటించిందని విమర్శించారు. పహల్గాం హత్యలపై పూర్తిస్థాయి విచారణ జరపాలని, యుద్ధం వద్దని, అమెరికా ప్రభుత్వానికి మోకరిల్ల వద్దని డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్‌ను వ్యతిరేకిస్తూ మే 18 నుంచి 24 వరకు దేశవ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.

అధునాతన 'క్లావిస్' ఆవిష్కరణ



సాక్షి, సిటీబ్యూరో: దేశవ్యాప్తంగా నూతనంగా ఆవిష్కరించిన కారెన్స్ ఎంపీవీ ప్రీమియం వేరియంట్ 'క్లావిస్'ను నగరంలోనూ విడుదల చేసినట్లు కియా కార్స్ వెల్లడించింది. ఇందులో భాగంగా నగరంలోని జూబ్లీహిల్స్, గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని కార్ కియా షోరూమ్‌లలో కియా క్లావిస్‌ను అధికారికంగా ఆవిష్కరించారు. జూబ్లీహిల్స్ షోరూమ్‌లో జరిగిన ఆవిష్కరణకు ప్రముఖ చార్టెర్డ్ అకౌంటెంట్ పీఆర్ దత్తా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్ కియా సేల్స్ వైస్ ప్రెసిడెంట్ సంతోష్ మాట్లాడుతూ అధునాతన అలయ్ వీల్స్‌తో అప్‌గ్రేడ్ ఇంటీరియర్‌తో విలాస సౌలభ్యాలతో క్లావిస్ ఆకర్షణీయంగా ఉందన్నారు. అధునాతన లెవల్–2 అడ్వాన్స్‌డ్ డ్రైవర్ అసిస్టెన్స్ సిస్టమ్స్ భద్రతకు ప్రాధాన్యతనిస్తుందని, అడాప్టివ్ క్రూయిజ్ కంట్రోల్, లేన్–కీపింగ్ అసిస్ట్ వంటి లక్షణాలను అందిస్తుందన్నారు.

సెలవు దినం.. చప్పుడుకాకుండా తవ్వేద్దాం!

సీవరేజీ కనెక్షన్ కోసం అనుమతి లేకుండా 25 మీటర్లకుపైగా రోడ్డును తవ్వేసిన వైనం



బంజారాహిల్స్ రోడ్ నెం. 12లో అనుమతి లేకుండా తవ్వేసిన రోడ్డు

బంజారాహిల్స్: సెలవు దినాల్లో అనుమతి లేకుండా పనులు చేస్తే అడ్డుకునే అధికారే ఉండడనే ధీమాతో అక్రమార్కులు ఇష్టారాజ్యంగా రోడ్లను తవ్వేస్తున్నారు. బంజారాహిల్స్ రోడ్ నం.12లోని ఇన్‌కం ట్యాక్స్ క్వార్టర్స్‌కు, ర్యాడో షోరూంకు మధ్య ఉన్న వీధిలో ఓ భారీ భవనానికి సీవరేజీ కనెక్షన్ కోసం అనుమతులు లేకుండా భవన యజమాని ఆదివారం ఉదయం 25 మీటర్లకుపైగా రోడ్డును తవ్వేసాడు. ఈ వ్యవహారంపై సమాచారం అందుకున్న జీహెచ్ఎంసీ డీఈ అభినయ్‌కుమార్ వెంటనే అక్కడికి వర్క్‌ఇన్‌స్పెక్టర్ వికాస్‌ను పంపించి పనులను నిలిపివేయించారు.

- ఒక వైపు ఇదే రోడ్డులో ఉన్న కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు ప్రపంచ అందగత్తెలు వస్తున్న తరుణంలో అధికారులు ఉన్నతాధికారులంతా అక్కడే విధుల్లో ఉండగా గుట్టుచప్పుడు కాకుండా రోడ్డును తవ్వేశారరు. స్థానికంగా ఉన్న లీడర్ల అండదండలతో ఈ దందా కొనసాగుతున్నట్లు తెలుస్తున్నది. జలమండలికి డెవలప్‌మెంట్ చార్జీలు చెల్లించిన తర్వాత సీవరేజీ లైన్ కోసం ఎన్ని మీటర్ల తవ్వాలనేది కొలిచి ఆ మొత్తానికి జీహెచ్ఎంసీకి తగిన రుసుము చెల్లించి వారి అనుమతులు వచ్చిన తర్వాతనే రోడ్డును తవ్వాల్సి ఉంటుంది.
- ఇదేది లేకుండా స్థానికంగా ఉండే లీడర్లు డబ్బులు తీసుకుంటూ అడ్డగోలుగా రోడ్లను తవ్విస్తున్నారంటూ స్థానికులు మండిపడుతున్నారు. కొసమెరుపు ఏంటంటే ఈ అనుమతులు లేని తవ్వకాలు చేసింది కూడా జలమండలి సిబ్బందే కావడం గమనార్హం. బోరబండ ఏరియాలో జలమండలి మెయింటనెన్స్ కాంట్రాక్టర్ ఈ పనులు చేయించినట్లు జీహెచ్ఎంసీ అధికారులు గుర్తించారు. అనుమతులు లేకుండా రోడ్డును తవ్వినందుకు భవన యజమానికి నోటీసులు ఇస్తామని అధికారులు తెలిపారు.

గోల్కొండ కోట వద్ద సండే సందడి



క్యాప్ స్టాల్ వద్ద ...

గోల్కొండ: పర్యాటక ప్రాంతమైన గోల్కొండ కోట వద్ద సండే సందడి నెలకొంది. సెలవు రోజు కావడంతో వేలసంఖ్యలో పర్యాటకులు కోటకు తరలివచ్చారు. పర్యాటకులు తమ కుటుంబాలతో కోట చౌరస్తా వద్ద గల క్యాప్ స్టాల్స్ ముందు క్యాప్‌లు కొని మరీ లోపలికి వెళ్లారు. ఉదయం నుంచే కోటకు పర్యాటకులు రావడం ప్రారంభించారు. భారీ సంఖ్యలో వచ్చిన పర్యాటకులతో కోటలోని నగీనా బాగ్, ఆయుధాగారం, క్లాపింగ్ పోర్టికో, రాణి మహల్ దారి ఎదురుగా ఉన్న ఫౌంటెన్ తదితర ప్రాంతాల్లో పర్యాటకులు సందడి చేశారు. మిట్ట మధ్యాహ్నం వేళ నగీనాబాగ్ గార్డెన్‌లో సేదతీరారు. యువ జంటలు మాత్రం కోటలోని అన్ని ప్రాంతాల్లో కలియ తిరుగుతూ సెల్ఫీలు దిగారు.



జ్యూస్ సెంటర్ వద్ద ...

చెన్నయ్య కుట్రల వెనుక మంద కృష్ణ హస్తం

ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి



సమావేశంలో మాట్లాడుతున్న పిడమర్తి రవి తదితరులు

హిమాయత్‌నగర్: రాష్ట్రంలో వర్గీకరణకు వ్యతిరేకంగా మాల మహానాడు అధ్యక్షుడు చెన్నయ్య హైకోర్టులో వేసిన కేసు వెనక ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ హస్తం ఉందని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి ఆరోపించారు. ఆదివారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పిడమర్తి రవి మాట్లాడారు. చెన్నయ్య, మందకృష్ణ మాదిగ రహస్య మిత్రులని, చాలా సందర్భాల్లో మందకృష్ణ మాదిగ డబ్బులు ఇచ్చి వర్గీకరణకు వ్యతిరేకంగా చెన్నయ్యతో ఉద్యమం చేయించారని ఆరోపించారు. మాదిగలంతా రేవంత్‌రెడ్డి వెంట ఉండటంతో ఓర్వలేకనే కృష్ణ మాదిగ ఈ పని చేశారని అన్నారు. కృష్ణ మాదిగ ఎన్ని కుట్రలు చేసినా వాటిని తిప్పికొడుతూ సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణను అమలు చేసి తీరుతారని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ మీసాల మల్లేష్, బీఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ బోరెల్లి సురేష్, సంచార జాతుల రాష్ట్ర అధ్యక్షుడు నిమ్మల వీరన్న, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వరలక్ష్మి, మాదిగ విద్యార్థి జేఏసీ ఓయూ అధ్యక్షులు జోగు గణేష్, మాదిగ జేఏసీ నాయకులు పిడమర్తి రాంబాబు, శేఖర్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, సోమవారం, 19, మే, 2025



బ్యూటీస్ @ ఐసీసీసీ

బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ)ని మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొంటున్న బ్యూటీస్ ఆదివారం సందర్శించారు. శాంతి భద్రతల పరిరక్షణకు వివిధ విభాగాల పనితీరు తెలుసుకున్నారు.



ఎండలు మండిపోతుండటంతో నగరవాసులు బెస్ట్ పానీయాల కోసం వెతుకుతున్నారు. ఇప్పటి వరకు కూల్‌డ్రింక్స్, సోడాలు ఆధిపత్యం చెలాయించినా.. ప్రస్తుతం ఆరోగ్యంపై అవగాహన పెంచుకుంటూ సహజమైన, ఆరోగ్యకరమైన పానీయాలవైపు మొగ్గు చూపుతున్నారు. ఈ ఎండ వేడిలో శరీరానికి అవసరమైన ఉష్ణోగ్రతల సమతుల్యత కాపాడటం ప్రామాణికంగా మారుతున్న నేపథ్యంలో పోషక విలువలు కలిగిన పదార్థాల వినియోగానికే జై కొడుతున్నారు. ట్రైనర్లు సైతం వేసవిలో సహజ, పోషక పానీయాలకే ప్రాధాన్యత ఇవ్వాలని సూచిస్తుండటంతో ఇప్పుడిదే ట్రెండ్‌గా మారింది.

- సాక్షి, సిటీబ్యూరో





జర.. జ్యూస్‌కోండి

ఆరోగ్యం కోసం పానీయాలను ఆశ్రయిస్తున్న ప్రజలు

అలోవేరా, కీరా, బీట్‌రూట్ ఇలా ఎన్నెన్నో..

వేసవి తాపానికి ఉపశమనం అంటున్న నిపుణులు

సోషల్ మీడియాలో సెలబ్రిటీల పోస్టుల ప్రభావం

ఫుట్‌పాత్ నుంచి ఫైవ్‌స్టార్ హోటల్స్ వరకు లభ్యం

ఇష్టంగా జ్యూస్‌లు తాగుతున్న ఈతరం యువత

హెర్బల్ రింగ్స్ ఇందులో మరో ప్రత్యేకం





సామాన్య జనాల నుంచి సెలబ్రిటీల వరకూ ఈ ఆరోగ్య పానీయాలపై ఆసక్తి పెరగడం ద్వారా, ఇది తాత్కాలిక ఫ్యాషన్ కాకుండా జీవన శైలిలో భాగంగా మారిన ఆరోగ్యకరమైన అలవాటు అనే విషయం స్పష్టంగా తెలుస్తోంది. వేసవిలో చల్లదనం కోసం, ఆరోగ్యం కోసం ఈ తాజా పానీయాల ట్రెండ్‌ను మెచ్చుకోకుండా ఉండలేమంటున్నారు. ఈ మధ్య సినీనటి కీర్తిసురేష్‌తో పాటు పలువురు టాలీవుడ్ ముద్దుగుమ్మలు తమ అందానికి, ఆరోగ్యానికి ఈ పానీయాలు కూడా ప్రధాన కారణమని చెబుతుండటంతో యువత వీటిపై మోజు పెంచుకుంటోంది. ఈ పానీయాల తయారీ కోసం ఫుడ్ బ్లాగర్స్ ప్రత్యేకంగా రీల్స్ చేసి సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు.

కూల్ కూల్ సబ్జా..

సబ్జా గింజలతో కూడిన పానీయాలకు మార్కెట్‌లో ఆదరణ లభిస్తోంది. ప్రధానంగా ఇవి శరీర చల్లదనానికి దోహదపడతాయి. ముఖ్యంగా లెమన్ జ్యూస్, రోస్ షర్బత్, మిల్క్ బేస్డ్ డ్రింక్స్‌లో సబ్జా గింజల వినియోగం విస్తృతంగా పెరిగింది. శరీరానికి కూలింగ్ ఇచ్చే ఈ గింజలు, అధిక వేడిలో పొట్టకు ఉపశమనంగా పనిచేస్తాయి.

సరికొత్తగా అలోవేరా..

ఆరోగ్యకరమైన అభిరుచులలో అలోవేరా జ్యూస్ ఒకటిగా నిలిచింది. సోషల్ మీడియాలో అలోవేరా జ్యూస్ వైరల్‌గా మారడంతో.. దీనిని సైతం ఇష్టంగా సేవిస్తున్నారు. ఇది దాహాన్ని తీరుస్తూనే, జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. చర్మానికి కూడా లాభదాయకంగా ఉండటంతో మహిళలకు ఈ జ్యూస్ నచ్చేసింది.

వేడిమి సమతుల్యం..

క్యారెట్, బీట్‌రూట్, కీరా వంటి కూరగాయల జ్యూస్‌లు ఆల్‌టైం ఫేవరెట్‌గా నిలుస్తున్నాయి. వీటిలో విటమిన్లు, ఖనిజ లవణాలు సమృద్ధిగా ఉండటంతో ఇబ్బంది లేకుండా తేలికగా జీర్ణమై, శరీరానికి శక్తిని అందిస్తాయి. బీట్‌రూట్ జ్యూస్ రక్తహీనత నివారణకు, క్యారెట్ జ్యూస్ కంటికి మేలు చేసేందుకు, కీరా శరీర ఉష్ణోగ్రత తగ్గించేందుకు ఉపయోగపడుతుంటాయని నిపుణులు చెబుతున్నారు.

ఎలక్ట్రోలైట్ డ్రింక్స్‌కు బదులుగా..

సంప్రదాయ పానీయాలైన కొబ్బరి నీళ్లు, చెరుకు రసం కూడా ఎప్పటిలానే వాటి స్థానాన్ని నిలుపుకున్నాయి. వీటిలో సహజమైన తీపి, విటమిన్లు, మినరల్స్ ఉండటం వలన ఇవి ఎలక్ట్రోలైట్ డ్రింక్స్‌కు బదులు విస్తృతంగా ఉపయోగపడుతున్నాయి. కొబ్బరి నీళ్లు, కిడ్నీ ఆరోగ్యానికి మేలు చేస్తే, చెరుకు రసం శక్తిని పెంచుతుంది.

ఔషధ పానీయాలు సైతం..

ఇదే సమయంలో పుదీనా, తులసి వంటి ఔషధ గుణాలు కలిగిన పానీయాలు ఇప్పుడు మార్కెట్‌లో దొరకుతున్నాయి. వీటిలో పుదీనా శ్వాస సంబంధిత సమస్యలకు, తులసి ఇమ్యూనిటీ మెరుగు పరిచేందుకు సహాయపడతాయి. హెర్బల్ టీ, తులసి వాటర్ వివిధ రూపాల్లో లభిస్తున్నాయి.



ఫుట్‌పాత్ టు ఫైవ్ స్టార్..

ఈ పానీయాలు కేవలం ఫుట్‌పాత్ జ్యూస్ స్టాల్స్ వరకు మాత్రమే కాకుండా.. త్రీ స్టార్, ఫైవ్ స్టార్ హోటల్స్‌లో కూడా ప్రత్యేక మెనూలో చోటు దక్కించుకున్నాయి. హోటల్ లాబీలలో గ్రీన్ హెల్త్ షాట్స్, డిటాక్స్ జ్యూస్‌లు, స్పెషల్ డ్రింక్స్ కొత్తగా కనిపిస్తున్నాయి. రాత్రి సేదతీరే క్లబ్, పబ్‌లలో కూడా ఈ పానీయాలకు ఆదరణ పెరిగింది. ఇదొక మోడ్రన్ లివింగ్ స్టైల్‌గా గుర్తింపు తెచ్చుకుంది.

కుటుంబ సమేతంగా..

సందడి చేసేలా..



సాగర తీరంలో ఏర్పాటు చేసిన సమ్మర్ ఉత్సవ్ మేళా ఆదివారం సందర్శకులతో సందడిగా మారింది. నగరవాసులు కుటుంబ సమేతంగా విచ్చేసి ఉల్లాసంగా గడిపారు. ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన పూలవనం, ఫిష్ టన్నల్ ఆకట్టుకుంటున్నాయి.

- ఖైరతాబాద్



రుచిచూసి.. ఆహో అనాల్సిందే..

గచ్చిబౌలి: ఆహాలో ప్రతి వంటకం ఓ ప్రయాణమే.. స్పైసీ కోస్టల్ కూరల నుంచి ఇంటి శైలీ పప్పు, ఆంధ్రా ఊరగాయలు తెలుగు వారసత్వానికి ప్రతీక అని ఆహా సీఈఓ అట్లూరి వెంకట శివరాం అన్నారు. గచ్చిబౌలిలో ఆహా మల్టీక్యూషన్ రెస్టారెంట్‌ను ఆదివారం ప్రారంభించిన ప్రముఖ హాస్య నటుడు బ్రహ్మానందం కొద్ది సేపు సందడి చేశారు. సొంత మసాలాలు, చింత పండు, గుంటూరు మిరపకాయ వరకు నాణ్యత పాటిస్తామని, సంప్రదాయ వంటకాల నుంచి పచ్చి పులుసు వరకు ఆహార ప్రియులకు అందిస్తామని నిర్వాహకులు తెలిపారు. తూర్పు గోదావరి నుంచి హైదరాబాద్ వరకు ప్రాంతీయ వంటకాలను రుచి చూడవచ్చని వారు తెలిపారు.

జైల్ ఫుడ్.. వెరీ గుడ్..



సాక్షి, సిటీబ్యూరో: వహ్.. హైదరాబాద్ ఫుడ్ టేస్ట్‌కు ఏదీ సాటిరాదంటూ లొట్టలేసుకుంటూ.. నచ్చిన ఫుడ్ ఆర్డర్ చేసుకుంటూ సందడి చేశారు సినీ నటుడు శివాజీ, నటి అనన్య నాగళ్ల. గాలిదొడ్డిలో నూతనంగా ఏర్పాటు చేసిన 'జిస్మత్ జైలు మండి'ని సినీతారలు శివాజీ, అనన్య నాగళ్ల ప్రారంభించారు. బిగ్ బాస్ ఫేం భోలే, జిస్మత్ జైలు మండి యజమాని గౌతమి చౌదరి ముఖ్య అతిథులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నటుడు శివాజీ మాట్లాడుతూ.. నగరంలో కాన్సెప్ట్ ఓరియెంటెడ్ ఫుడ్ చైన్ నూతన ట్రెండ్‌గా మారిందని, ఇందులో భాగంగానే జిస్మత్ జైలు మండి 15వ బ్రాంచ్‌ను సైతం ప్రారంభించిందని అన్నారు. 50 బ్రాంచ్‌లు పెట్టాలనే ఆమె టార్గెట్ ఎంతో మంది మహిళలకు స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. జైలులో అన్నం పెట్టే ఈ వినూత్న కాన్సెప్ట్ చాలా బాగుందని అనన్య నాగళ్ల అన్నారు. మిడిల్ క్లాస్ ఫ్యామిలీకి అందుబాటుల ధరలో, ఆయిల్స్ రీయూజ్ చేయకుండా, ఫుడ్ కలర్స్ వాడకుండా నిర్వహిస్తున్నామని గౌతమి చౌదరి అన్నారు.





పక్షుల కిలకిలారావాలు..

మయూరాల నాట్యాలు..



గచ్చిబౌలి: అరుదైన పక్షి జాతులను గుర్తిస్తూ పక్షి ప్రేమికులు హాయిగా గడిపారు. తెల్లవారుజాము నుంచే పక్షులను తమ కెమెరాల్లో షూట్ చేశారు. కొత్తగూడలోని బొటానికల్ గార్డెన్‌లో బర్డ్స్ వాక్‌ను ఆదివారం నిర్వహించారు. నగరం నలుమూలల నుంచి వచ్చిన 18 మంది పక్షి ప్రేమికులు బర్డ్స్ వాక్‌లో పాల్గొన్నారు. టీజీఎఫ్‌డీసీ అందించిన బర్డ్స్ ప్యాకెట్ గైడ్ పక్షులను ఎలా గుర్తించాలి, ఎలాంటి పక్షులు ఎలాంటి శబ్దాలు చేస్తాయనే అంశాలలో నేచురలిస్ట్ అపరంజని అవగాహన కల్పించారు. షిక్రా, ఆడ నెమలి, మగ నెమలి, నల్ల యెట్రింత, చిన్న ససరిక, ముఖి పిట్ట, కొంగ, గిజిగాడు, మైనా, కాపర్ స్మిత బార్బెట్, రెడ్‌వంటెడ్ బుల్‌బుల్, షాలో తదితర పక్షులను వీక్షించారు. టీజీఎఫ్‌డీసీ ఎకో టూరిజం అసిస్టెంట్ డైరెక్టర్ తనేజ, ప్రాజెక్ట్ మేనేజర్ సుమన్, ఎఫ్ఆర్‌ఓ శ్రీనివాస్, ప్లాంటేషన్ మేనేజర్ లక్ష్మారెడ్డి, హెడ్ నేచురలిస్ట్ అఖిల్, డీఆర్‌ఏ విజయశాంతి తదితరులు పాల్గొన్నారు.



పీస్ ఆఫ్ మైండ్ @ పెట్స్

నగరంలో పెరుగుతున్న ఇంపోర్టెడ్ శునకాలు

ఒక్కో జాతికి ఒక్కో ప్రత్యేకత

స్టేటస్ సింబల్‌గా చూస్తున్న సెలబ్రిటీలు

రూ.లక్షలు లెక్కచేయడం లేదు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో సాధారణ మనిషి నుంచి సెలబ్రిటీల వరకు అందరికీ ఉరుకుల పరుగుల లైఫ్‌స్టైల్ అలవాటైపోయింది. ఉదయం లేచింది మొదలు కుటుంబం, ఉద్యోగం, వృత్తి, వ్యాపారం, ఇతర కార్యక్రమాలతో నిత్యం బిజీగా గడిపేస్తున్నారు. ఈ క్రమంలోనే తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నారు. దీంతో ఇంటికి చేరుకోగానే కొంత పీస్ ఆఫ్ మైండ్ కావాలని కోరుకుంటున్నారు. ఫలితంగా విశ్వాసానికి మారుపేరైన శునకాలను పెంచుకునే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఉదయం, సాయంత్రం వాటితో కొంత సమయం వాకింగ్ చేయడం, ఆహారం పెట్టడం, పెంపుడు జంతువులతో ఉల్లాసంగా గడపడానికి ఇష్టపడుతున్నారు. ఈ క్రమంలోనే రూ.లక్షలు వెచ్చించి మరీ నచ్చిన ఇంపోర్టెడ్ బ్రీడ్‌లు, వీధి జాతి శునకాలను పెంచుకుంటున్నారు. ఇందులో ఒక్కో బ్రీడ్‌లో ఒక్కో రకమైన ప్రత్యేకతలు ఉంటున్నాయి. కొన్ని ప్రత్యేక జాతుల శునకాలు సైతం స్టేటస్‌గా ఫీలవుతున్నారు. వారి అవసరాలకు తగ్గట్లు ఎంపికలు ఉంటున్నాయి. మహిళలకు ప్రత్యేకంగా కొన్ని రకాల బ్రీడ్‌లు అందుబాటులో ఉంటున్నాయి. విందు, వినోదాలు, టూర్‌లు వెళ్లినప్పుడు వాటిని హేండ్ బ్యాగ్‌లో వేసుకుని వెళ్తున్నారు. మూగజీవులతో ఎంజాయ్ చేస్తున్నారు. శునకం, గుర్రం, గోవులను పెంచడం వల్ల ఎన్నో కొత్త విషయాలు నేర్చుకుంటున్నామని, ఎదుటి వ్యక్తి మనసుని అర్థం చేసుకోగలిగే శక్తి వస్తుందని పలువురు జంతు ప్రేమికులు పేర్కొంటున్నారు.

పామేరేనియన్

ఇంట్లో చిన్న పిల్లల నుంచి పండు ముసలి వరకు అందరితో సరదాగా కాలక్షేపం చేసే జాతుల్లో పమేరియర్ ఒకటి. ఇది స్పిట్జ్ రకం కుక్కల జాతికి చెందినది. చూడటానికి తెల్లని బొచ్చు కుక్కే అయినా నిత్యం ఉల్లాసంగా ఉంటుంది. మనిషి మూడ్‌ను గుర్తించి మెలుగుతుంది. ఇంట్లోనే నిత్యం తిరుగుతుంది.



గ్రేట్ డేన్

ప్రపంచంలో ఎత్తయిన శున జాతి ఇది. జర్మన్ బ్రీడ్. అత్యంత వేగంగా పరుగులు తీస్తాయి. అప్రమత్తమైన, ధైర్య సాహసాలతో కూడిన శునకం. మనుషులతో స్నేహపూర్వకంగానూ ఉంటుంది. విశ్వసనీయతకు మారుపేరుగా నిలుస్తుంది. జర్మన్ రాజులు ఎలుగు బంట్లు, అడవి పందులు, జింకలు, ఇతర జంతువుల వేటకు ఉపయోగించేవారట.



చివావా

చివావా అనేది మెక్సికన్ జాతి శునకం. చిన్న జాతి కుక్క. చెవులు నిటారుగానూ, కళ్లు ప్రకాశవంతంగా ఉంటాయి. కేవలం రెండు కేజీల బరువు ఉంటుంది. దీన్ని సెలబ్రిటీలు, ఉన్నత శ్రేణి వర్గాల మహిళలు తమ హేండ్ బ్యాగులో వేసుకుని వెంట తీసుకెళ్తుంటారు. శుభకార్యాలు, టూర్లలోనూ ఇవి వెంట ఉంటాయి.

లాబ్రడార్

ఈ రకం శునకాలకు అనేక దేశాల్లో అత్యంత ప్రాచుర్యం కలిగి ఉన్నాయి. ఇవి మనుషులతో స్నేహపూర్వకంగా, ఉల్లాసంగా ఉంటాయి. సహచరుడిగానూ ఈ కుక్కను పెంచుకుంటున్నారు. ఎక్కువగా క్రీడలు, వేటకు వినియోగిస్తారు.

వీధి కుక్కలను సైతం..

నగరంలో వీధి కుక్కలను సైతం చాలా మంది పెంచుకుంటున్నారు. కుక్కపిల్ల చిన్నగా(పుట్టిన రోజుల వ్యవధిలోనే) ఉన్నప్పటి నుంచే ఇంటికి తీసుకెళ్లి ముద్దుగా చూసుకుంటున్నారు. దానితో ఇంట్లో అందరూ సరదాగా కాలక్షేపం చేస్తుంటారు. ఇవి స్నేహపూర్వకంగా, రక్షణగానూ ఉంటాయి.

జర్మన్ షెఫర్డ్

జర్మన్ షెఫర్డ్ జాతి కుక్కలు చాలా ఉల్లాసభరితంగా ఉంటాయి. అంకితభా [illegible] స్తాయి.



హరిత హైడ్రోజన్.. కాలుష్యానికి సొల్యూషన్



కాలుష్యంతో దేశంలోని 10 నగరాల్లో ఏటా మరణాలు **30,000**

- విద్యుత్తుకు మంచి ప్రత్యామ్నాయం
- గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి, నిర్వహణ ఖర్చులు ఎక్కువే
- భవిష్యత్తులో తగ్గే అవకాశం

వేగంగా జరుగుతున్న పట్టణీకరణ కారణంగా 2050 నాటికి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ప్రతి 10 మందిలో ఏడుగురు నగరాల్లో నివసిస్తారని అంచనా. పట్టణాలు వృద్ధి చెందడం ట్రాఫిక్ రద్దీ, వాయు కాలుష్యం వంటి సవాళ్లు వస్తాయి. ఇది ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఈ సమస్యకు పరిష్కారంగా ప్రస్తుతం విద్యుత్ వాహనాల వినియోగం కనిపిస్తోంది. భవిష్యత్తులో హైడ్రోజన్ ఇంధనం తోడవ్వనుంది. ఇది కాలుష్యాన్ని మరింత తగ్గించి, స్వచ్ఛ భారత్ సాధనకు కారకమవుతుందని ఇంధన, వాహన రంగ తాజా అధ్యయనాలు చెబుతున్నాయి. 2050 నాటికి ప్రపంచంలో నడిచే వాహనాల్లో 16 శాతం హైడ్రోజన్‌తోనే ఉంటాయని అంతర్జాతీయ ఇంధన సంస్థ (ఐఈఏ) అంచనా వేస్తోంది.

- సాక్షి, అమరావతి

ప్రపంచంలో అత్యధిక కాలుష్యం గల టాప్–5 దేశాల్లో ఇండియా ఉంది. మన దేశంలో 2008 నుంచి 2019 వరకూ, గాలిలో ఉండే పీఎం 2.5 కణాలు. 10 ప్రధాన నగరాల్లో ఏటా దాదాపు 30 వేల మరణాలకు కారణమయ్యాయి. ఇది మొత్తం మరణాలలో 7.2 శాతమని లాన్సెట్ అధ్యయనం వెల్లడించింది. ఇందులో ఏటా ముంబైలో మరణించినవారు 5,100, కోల్‌కతాలో 4,678, చెన్నైలో 2,870 మంది. తర్వాతి స్థానాల్లో అహ్మదాబాద్, బెంగళూరు, హైదరాబాద్, పుణే, వారణాసి, సిమ్లా, ఢిల్లీ ఉన్నాయి. ఈ నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా విద్యుత్ వాహనాల (ఈవీ)కు డిమాండ్ పెరిగింది.

దూసుకొస్తున్న హైడ్రోజన్

2023 నాటికి, ప్రపంచ రోడ్లపై 4 కోట్ల ఈవీలు ఉన్నాయి. ఇది 2022లో సంఖ్య కంటే 35 శాతం ఎక్కువ. మనదేశంలో 2024లో ఏకంగా 20.22 లక్షల ఈవీల అమ్మకాలు జరిగాయి. ఇప్పుడు వీటికి ప్రత్యామ్నాయంగా వస్తున్నవే ఫ్యూయల్ సెల్ ఎలక్ట్రిక్ వాహనాలు (ఎఫ్‌సీఈవీ). ఇవి హైడ్రోజన్ సాయంతో నడుస్తాయి. ఐఈఏ గణాంకాల ప్రకారం 2023 నాటికి ప్రపంచంలో హైడ్రోజన్ డిమాండ్ 9.7 కోట్ల టన్నులకు చేరింది. 2022తో పోలిస్తే ఇది 2.5 శాతం ఎక్కువ. నీటిని విద్యుత్ విశ్లేషణ (ఎలక్ట్రాలసిస్) ద్వారా హైడ్రోజన్, ఆక్సిజన్‌గా విడగొట్టవచ్చు. సౌరశక్తి వంటి పునరుత్పాదక వనరులతో ఉత్పన్నమయ్యే విద్యుచ్ఛక్తితో నీటిని విభజిస్తే గ్రీన్ హైడ్రోజన్ వస్తుంది. అలా కాకుండా బొగ్గు, చమురు, సహజ వాయువు వంటి వాటితో ఉత్పన్నమయ్యే విద్యుత్తుతో నీటిని విభజిస్తే బ్లూ, గ్రే హైడ్రోజన్‌లు ఉత్పన్నమవుతాయి. ఈ ప్రక్రియలోనూ కర్బన ఉద్గారాలు వెలువడతాయి. గ్రీన్ హైడ్రోజన్ అలా కాదు, స్వచ్ఛమైన ఇంధనం. ముఖ్యంగా ఎరువులు, చమురు శుద్ధి, ఉక్కు, రవాణా వంటి రంగాల్లో అత్యధిక కర్బన ఉద్గారాలు వెలువడతాయి. ఈ రంగాల్లో గ్రీన్ హైడ్రోజన్ వాడితే ఆ మేరకు అవి తగ్గుతాయి.

అధిక ధర, నిర్వహణ ఖర్చులు

హైడ్రోజన్ వాహనాలు తేలిగ్గా ఉంటాయి. తక్కువ ఇంధనంతో ఎక్కువ దూరం ప్రయాణించగలవు. కేవలం 5 నుంచి 15 నిమిషాల్లో ఇంధనం నింపుకోగలవు. ముఖ్యంగా దూర ప్రయాణం, వర్షం, తీవ్రమైన చలిలోనూ దూసుకుపోగలవు. అయితే, ప్రస్తుతం ఈ వాహనాలు చాలా తక్కువగా.. ప్రపంచవ్యాప్తంగా 93 వేలే ఉన్నాయి. దీనికి కారణం వాటి అధిక ధర, నిర్వహణ ఖర్చులు. డీజిల్ బస్సులకు కిలోమీటర్‌కు నిర్వహణ ఖర్చు దాదాపు రూ.23.06 అవుతుంది. ఎలక్ట్రిక్ బస్సులకు రూ.14.52 ఖర్చవుతుంది. విద్యుత్ వాహనాల కొనుగోలు ధరలు ఎక్కువగా ఉన్నప్పటికీ ఆ మేరకు నిర్వహణ భారం తగ్గుతుంది. కానీ హైడ్రోజన్ బస్సులు నడపడానికి చాలా ఖర్చవుతుంది. సహజ వాయువు నుంచి ఉత్పత్తి చేసిన బ్లూ హైడ్రోజన్ వాహనానికి కిలోమీటర్‌కి రూ.71.73 ఖర్చవుతుంది. గ్రీన్ హైడ్రోజన్ అయితే కిలోమీటర్‌కు రూ.77.69 ఖర్చవుతుంది. సాంకేతికత మెరుగుపడటంతో రెండింటి ధరలు 2030 నాటికి సమానమవుతాయని నిపుణులు భావిస్తున్నారు.

స్టీల్, వాహన రంగాల్లో..

స్టీల్ ఉత్పత్తిని గ్రీన్ హైడ్రోజన్‌తో చేపడుతోంది కేంద్ర ప్రభుత్వం. ఇందుకోసం 7 పైలట్ ప్రాజెక్టులు మంజూరు చేశారు. 2029–30 వరకు గ్రీన్ హైడ్రోజన్ ద్వారా స్టీల్ ఉత్పత్తి చేసేందుకు రూ.455 కోట్లతో పైలట్ ప్రాజెక్టులను కేంద్ర స్టీల్ శాఖ అమలుచేస్తోంది. రవాణా రంగంలో 5 పైలట్ ప్రాజెక్టులు మంజూరు చేశారు.

గ్రీన్ హైడ్రోజన్ మిషన్

గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి, వాడకం, ఎగుమతుల్లో మనదేశాన్ని గ్లోబల్ హబ్‌గా రూపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ హైడ్రోజన్ మిషన్ (జీహెచ్ఎమ్) అమలు చేస్తోంది. దీని ప్రకారం ఏటా 50 లక్షల టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేయగలిగితే శిలాజ ఇంధనాల దిగుమతులను భారీగా తగ్గించుకోవచ్చు. ఫలితంగా 2030 నాటికి రూ.లక్ష కోట్లు ఆదా చేయొచ్చు. గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి, వినియోగం వల్ల ఏటా 5 కోట్ల టన్నుల కార్బన్‌డయాక్సైడ్ ఉద్గారాలనూ తగ్గించుకోవచ్చు. గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేసే కంపెనీలకు కేంద్రం ప్రోత్సాహకాలూ ఇస్తోంది.

వైఎస్ జగన్ హయాంలో...

ఆంధ్రప్రదేశ్‌లో తిరుపతి రాక్‌మ్యాన్ ఇండస్ట్రీస్‌లో హీరో ఫ్యూచర్ ఎనర్జీస్ ఏర్పాటుచేసిన మొట్టమొదటి గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టు ఈ ఏడాది మార్చిలోనే ఉత్పత్తి ప్రారంభించింది. విశాఖలో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో భాగంగా అప్పటి సీఎం వైఎస్ జగన్ సమక్షంలో హీరో ఫ్యూచర్ ఎనర్జీస్ ఏపీలో హరిత ఇంధన రంగంలో రూ.30 వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. దీని ద్వారా తొలి విడతలో 25 టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేస్తారు. రానున్న కాలంలో 54 టన్నులకు పెంచనున్నారు. దీని ద్వారా ఏడాదికి 206 టన్నుల కార్బన్‌డయాక్సైడ్ ఉద్గారాల తగ్గింపుతోపాటు వాతావరణంలోకి ఏడాదికి సుమారు 195 టన్నుల ఆక్సిజన్ విడుదల అవుతుంది.
విశాఖ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లోనే.. ప్రభుత్వ రంగ విద్యుత్ సంస్థ ఎన్టీపీసీతో ఏపీ గ్రీన్ హైడ్రోజన్ హబ్ ఏర్పాటుకు ఒప్పందం కుదిరింది. సుమారు రూ.లక్ష కోట్లతో అనకాపల్లి జిల్లా పూడిమడక వద్ద నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టు తొలి విడత పనులు 2026 నాటికి, మొత్తం 2030 నాటికి పూర్తవుతాయి. అలాగే గత ప్రభుత్వ హయాంలోనే హెచ్‌పీసీఎల్, ఓఎన్‌జీసీ వంటి సంస్థలు కూడా గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్ల ఏర్పాటుకు ముందుకొచ్చాయి.

ఉత్పత్తి వ్యయం ఎక్కువే..: ఒక కేజీ బ్లూ లేదా గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి గరిష్ఠంగా 2.4 డాలర్ల వరకు ఖర్చవుతుంది. అదే కేజీ గ్రీన్ హైడ్రోజన్ తయారీకి దాదాపు 5.5 డాలర్లు వెచ్చించాలి. గ్రే హైడ్రోజన్ ఉత్పత్తితో పోలిస్తే గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి వల్ల.. ప్రతి కేజీకి 10 కిలోల కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలు తగ్గుతాయి.

గ్రీన్ హైడ్రోజన్ మిషన్‌లో భాగంగా చేపట్టే ప్రాజెక్టుల ద్వారా రూ.8 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు, 6 లక్షలకుపైగా ఉద్యోగాలు వస్తాయని అంచనా.

గ్రీన్ హైడ్రోజన్ రైలు

పూర్తి దేశీయ పరిజ్ఞానంతో హైడ్రోజన్‌తో నడిచే రైలును రైల్వే శాఖ తయారుచేసింది. మిగతా దేశాలు 500 నుంచి 600 హార్స్ పవర్ ఇంజిన్ మాత్రమే రూపొందిస్తే.. మనదేశం ఏకంగా 1200 హెచ్‌పీ ఇంజిన్ తయారుచేయగలిగింది. ప్రపంచంలో జర్మనీ, ఫ్రాన్స్, స్వీడన్, చైనా మాత్రమే ఇలాంటి ఇంజిన్లు తయారుచేశాయి. ప్రపంచంలో అత్యంత పొడవైన (10 కోచ్‌లు) రైలు ఇదే. అంతేకాదు, ప్రపంచంలోనే అత్యధిక సామర్థ్యం (2,400 కిలోవాట్లు) ఉన్న రైలు కూడా ఇదే. హరియాణాలోని జింద్ – సోనిపట్ మధ్య ఈ రైలు నడవనుంది.

తెలంగాణలోనూ..

తెలంగాణ కూడా 2029–30 నాటికి 418 కిలోటన్నులు, 2034–35 నాటికి 554 కిలోటన్నుల వార్షిక గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ – 2025లో వెల్లడించింది. గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేసే కంపెనీలకు ప్రోత్సాహకాలూ ప్రకటించింది.

భద్రత భేష్.. వసతులు సూపర్

సచివాలయం, కమాండ్ కంట్రోల్ సెంటర్లకు మిస్ వరల్డ్ పోటీదారులు

- తెలంగాణ చరిత్ర, అభివృద్ధిపై సచివాలయంలో వీడియో ప్రదర్శన
- ప్రత్యేక ఆకర్షణగా డ్రోన్ షో.. పోటీదారులకు తేనీటి విందు
- పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో భద్రత చర్యల పరిశీలన


సచివాలయం ముందు తెలంగాణ తల్లి విగ్రహం వద్ద మిస్ వరల్డ్ పోటీదారులు

సాక్షి, హైదరాబాద్: ఘనమైన చరిత్ర, వారసత్వంతోపాటు తెలంగాణ రాష్ట్రం అనతికాలంలోనే సాధించిన అభివృద్ధిని చూసి ప్రపంచ సుందరి పోటీదారులు ముగ్ధులయ్యారు. పోటీదారులు ఆదివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ సచివాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా తెలంగాణ సంస్కృతి, చరిత్ర, వారసత్వం, మౌలిక సదుపాయాల కల్పన, పారిశ్రామికాభివృద్ధిపై రూపొందించిన వీడియోను ప్రదర్శించారు. సుందరీమణులంతా ఈ వీడియోలను ఆసక్తిగా తిలకించారు. రాష్ట్రంలో విద్య, వైద్య సదుపాయాలు బాగున్నాయని మెచ్చుకున్నారు. అంతకుముందు సచివాలయం ముందు 112 దేశాల పోటీదారులు గ్రూప్ ఫొటో దిగారు. అక్కడి తెలంగాణ తల్లి విగ్రహానికి పది దేశాల ప్రతినిధులు పుష్పాంజలిఘటించారు. తెలంగాణ జరూర్ ఆనా అంటూ నినదించారు. సెల్ఫీలతో కాసేపు సందడి చేశారు. ఆ తర్వాత సచివాలయం లోపల ఏర్పాటు చేసిన తేనీటి విందులో పాల్గొన్నారు. అక్కడే తెలంగాణ చారిత్రక అంశాలతో కూడిన వీడియోను అధికారులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన ప్రపంచ సుందరి పోటీదారులు తెలంగాణ వారసత్వ కట్టడాలు, పర్యాటక ప్రాంతాలను సందర్శించినందుకు సంతోషంగా ఉందన్నారు. సచివాలయం నుంచి జరిగే పరిపాలనా వివరాలను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు వివరించారు. కాగా, ఆదివారం పాతబస్తీలో జరిగిన అగ్నిప్రమాదంలో మృతిచెందిన 17 మందికి సంతాపంగా రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. తేనీటి విందు అనంతరం సచివాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక డ్రోన్‌షోను అందగత్తెలు ఆసక్తిగా తిలకించారు. డ్రోన్ షోలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సన్నబియ్యం, ఉచిత బస్సు ప్రయాణం, రూ.500 గ్యాస్ సిలిండర్ తదితర పథకాల చిత్రాలను ప్రదర్శించారు.


కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో గన్నుతో..



నార్కోటిక్ బ్యూరో ప్రచార పోస్టర్ వద్ద ఫొటోలకు పోజిస్తూ..


సచివాలయం వద్ద డ్రోన్ షో దృశ్యం

రక్షణ వ్యవస్థ అద్భుతం

రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణ, మహిళలు–పిల్లలపై వేధింపుల నివారణ, డ్రగ్స్ కట్టడి చర్యలు, నేరాల నియంత్రణలో పోలీస్ శాఖ వినియోగిస్తున్న అత్యాధునిక టెక్నాలజీ అద్భుతంగా ఉందని మిస్ వరల్డ్ పోటీదారులు ప్రశంసించారు. 107 దేశాలకు చెందిన పోటీదారులు ఆదివారం బంజారాహిల్స్‌లోని తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించారు. వీరికి పోలీస్ అశ్వికదళం, పైప్ బ్యాండ్, మోటార్ సైకిల్ రైడర్స్, స్నిఫర్ డాగ్ స్క్వాడ్ ఘన స్వాగతం పలికాయి. అనంతరం పోలీస్ శాఖ కార్యకలాపాలపై కమాండ్ కంట్రోల్ సెంటర్‌లోని ఆడిటోరియంలో ప్రజెంటేషన్ ఇచ్చారు. లక్షల సంఖ్యలో ఏర్పాటు చేసిన సీసీటీవీల వల్ల రాష్ట్రంలో ఎక్కడ నేరం జరిగినా వెంటనే చర్యలు చేపట్టేందుకు వీలు కలుగుతోందని వివరించారు. టూరిజంలో తెలంగాణ అత్యంత సురక్షితమైనదని తెలిపారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ నియంత్రణలో సేవలందిస్తున్న ట్రాన్స్‌జెండర్లతో మిస్ వరల్డ్ పోటీదారులు సెల్ఫీలు తీసుకున్నారు. డ్రగ్స్ నివారణకై తెలంగాణ పోలీసులు చేపట్టిన చర్యలకు సంపూర్ణ మద్దతు తెలియజేస్తూ పోస్టర్లపై సంతకాలు చేశారు.

ప్రతీ ఎకరాకు సాగునీరు అందిస్తా

- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి


జాన్‌పహాడ్ వద్ద కృష్ణానదిపై నిర్మాణంలో ఉన్న లిఫ్ట్ పనులను పరిశీలిస్తున్న మంత్రి ఉత్తమ్

పాలకవీడు: హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని ప్రతీ ఎకరాకు సాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలంలో కృష్ణా, మూసీ నదులపై నిర్మాణంలో ఉన్న లిఫ్ట్ పనులను అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఆగస్టు నెలాఖరులోగా బెట్టెతండా లిఫ్ట్ పనులను పూర్తి చేసి రైతులకు సాగునీరు అందిస్తామన్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని నీటిపారుదలశాఖ అధికారులను ఆదేశించారు. రూ.33 కోట్లతో చేపట్టిన లిఫ్ట్ నిర్మాణం పూర్తయితే బెట్టెతండా, పాడ్యాతండా, సజ్జాపురం గ్రామాల్లో 2,041 ఎకరాలు సాగులోకి వస్తాయని మంత్రి స్పష్టం చేశారు. రూ.270 కోట్లతో జాన్‌పహాడ్ శివారులో చేపట్టిన జవహర్ జాన్‌పహాడ్ లిఫ్ట్ పనులు పరిశీలించారు. నత్తనడకన పనులు జరగడంపై సంబంధిత కాంట్రాక్టర్లు, అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. పనుల్లో నాణ్యతను పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని హెచ్చరించారు. ఇప్పటికే పైప్‌లైన్ పనులకు భూసేకరణ పూర్తయినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్, ఇరిగేషన్ శాఖ సీఈ రమేశ్‌బాబు, ఆర్డీవో శ్రీనివాసులు పాల్గొన్నారు.

చిన్నారుల ఉసురు తీసిన కారు

- ఆటలాడుతూ కారులోకి ఎక్కిన పసివాళ్లు
- హఠాత్తుగా డోర్ లాక్
- ఊపిరాడక నలుగురి మృతి


చిన్నారుల మృతికి కారణమైన కారు

విజయనగరం క్రైమ్: విజయనగరం జిల్లా కేంద్రానికి సమీపంలోని ద్వారపూడి గ్రామంలో విషాదం అలముకుంది. ఆటలాడుతూ కారులోకి ఎక్కిన నలుగురు చిన్నారులు ఊపిరాడక ప్రాణాలు విడిచారు. విజయనగరం రూరల్ పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ద్వారపూడి గ్రామం, బీసీ కాలనీలో ఆదివారం ఒక పెళ్లివేడుక జరిగింది. పెళ్లి హడావిడిలో ఉన్న తల్లిదండ్రులను విడిచి, మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఒకటో తరగతి చదువుతున్న కంది మణీశ్వరి (6), బూర్లె చారులత (7), 2వ తరగతి చదువుతున్న బూర్లె జాస్రిత (8), 3వ తరగతి చదువుతున్న పండి ఉదయ్ (7) సమీపంలోని నీళ్ల ట్యాంక్ వద్ద ఆడుకోవడానికి వచ్చారు. ఆటల్లో ఆటగా అక్కడే ఆగి ఉన్న ఒక కారులోకి ఎక్కారు. అకస్మాత్తుగా డోర్ లాక్ కావడంతో లోపల చిక్కుకుపోయారు. కేకలు వేసినా బయటకు వినపడక పోవడంతో నలుగురు చిన్నారులు ఊపిరాడక ప్రాణాలు కోల్పోయారు. పెళ్లి సందడిలో ఉన్న తల్లిదండ్రులు, ఎంతకూ తమ పిల్లలు కనిపించకపోవడంతో వెతకడం ప్రారంభించారు. సాయంత్రం 5 గంటల సమయంలో కారులో పిల్లలు ఉన్నట్టు గుర్తించారు. వెంటనే కారు అద్దాలు పగలగొట్టి పిల్లలను బయటకు తీశారు. కొన ఊపిరితో ఉన్నారన్న భావనతో 108 వాహనంలో విజయనగరం సర్వజన ఆస్పత్రికి తరలించారు. అప్పటికే నలుగురు చిన్నారులు మృతిచెందినట్టు వైద్యులు చెప్పడంతో తల్లిదండ్రులు బోరున విలపించారు. మృతుల్లో చారులత, జాస్రిత అక్కచెల్లెళ్లు. ఇద్దరు కుమార్తెలు మృతిచెందడంతో తండ్రి ఆనంద్ గుండెలవిసేలా రోదిస్తున్నారు. ఈ సంఘటనలో గ్రామంలో తీవ్ర విషాదం అలముకుంది. రూరల్ ఎస్‌ఐ అశోక్ కుమార్, వన్‌టౌన్ ఎస్‌ఐ రామ్‌గణేష్‌లు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆస్పత్రికి వెళ్లి వివరాలు సేకరించారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టండి

రష్యా కాన్సుల్ జనరల్‌తో భేటీలో ఉపముఖ్యమంత్రి భట్టి



సాక్షి, హైదరాబాద్: పారిశ్రామిక పెట్టుబడులను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. రాష్ట్రంలో సమృద్ధిగా ప్రకృతి వనరులు ఉన్నాయని, మరోవైపు నైపుణ్యంతో కూడిన మానవ వనరులు కూడా ఉన్నందున తెలంగాణ రాష్ట్రం పెట్టుబడులకు కేంద్రంగా మారుతోందని అన్నారు. ఆదివారం సాయంత్రం ప్రజాభవన్‌లో రష్యా కాన్సుల్ జనరల్ వాలెరి ఖోడ్జాయెవ్, భట్టి విక్రమార్కను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా భట్టి, ఆయనకు రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని కోరారు. 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామని, రాష్ట్రంలో ఫార్మా పరిశ్రమలతో పాటు ఇతర పరిశ్రమల అభివృద్ధికి, హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ పరిశ్రమల విస్తరణకు కావలసిన సహకారాన్ని ప్రభుత్వం అందించడంతో పాటు ప్రత్యేక ప్రోత్సాహకాలను ఇస్తోందన్నారు. రాష్ట్రంలో అద్భుతమైన మానవ వనరులను అందించే ప్రొఫెషనల్, ఇంజనీరింగ్ కళాశాలలు ఉన్నాయన్నారు. అలాగే యువతకు నైపుణ్యాలకోసం స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామన్నారు. వాలెరి ఖోడ్జాయెవ్ మాట్లాడుతూ తెలంగాణకు వచ్చినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. అభివృద్ధిలో దూసుకెళ్తున్న తెలంగాణ ప్రభుత్వంతో కలసి పని చేయడానికి తాము సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

మొఘల్స్ కాలనీలో అగ్ని ప్రమాదం

- షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో చెలరేగిన మంటలు
- 50 మందిని కాపాడిన అగ్నిమాపక సిబ్బంది


చిన్నారులను, వృద్ధులను కాపాడుతున్న అగ్నిమాపక సిబ్బంది

మైలార్‌దేవ్‌పల్లి: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మైలార్‌దేవ్‌పల్లి మొగల్స్ కాలనీలోని మూడంతస్తుల భవనంలో మంటలు చెలరేగిన సంఘటన ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మొఘల్స్ కాలనీలో షేక్ మాజిద్‌కు చెందిన మూడంతస్తుల భవనంలో మాజిద్‌తో పాటు మరో ఏడు కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ఆదివారం ఉదయం గ్రౌండ్ ఫ్లోర్‌లో విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేసిన ప్రాంతంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఇంటి యజమానికి చెందిన పాత ఫర్నిచర్‌కు వ్యాపించాయి. గ్రౌండ్ ఫ్లోర్‌లో మంటలు తీవ్రం కావడంతో భవనంలో నివాసం ఉంటున్న చిన్నాపెద్దా దాదాపు 50 మంది బయటికి వచ్చేందుకు మార్గం లేకుండా పోయింది. దీంతో వారంతా పైఅంతస్తులోని టెర్రస్‌పైకి వెళ్లారు. దీనిని గుర్తించిన స్థానికులు ఉప్పర్‌పల్లిలోని ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది అప్పటికే పాతబస్తీలో అగ్ని ప్రమాదం జరిగిన ప్రాంతానికి వెళ్లడంతో చాంద్రాయణగుట్ట ఫైర్ స్టేషన్ సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే స్పందించిన సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పి పైఅంతస్తులో చిక్కుకున్న 50 మందిని సురక్షితంగా బయటికి తీసుకువచ్చారు.

సంగారెడ్డిలో ఉగ్ర కలకలం

- అసోం యువకుడిని అరెస్టు చేసిన ఆ రాష్ట్ర పోలీసులు
- పాకిస్తాన్‌కు భారత సమాచారం చేరవేస్తున్నాడని ఆరోపణ
- ఆపరేషన్ ఘోస్ట్ సిమ్‌లో దేశవ్యాప్తంగా 7 మంది అరెస్టు

సంగారెడ్డి జోన్: సంగారెడ్డి జిల్లాలో ఉగ్ర కలకలం రేగింది. అసోం నుంచి వచ్చి జిల్లాలో కూలీ పనిచేసుకుంటున్న మోఫిజిల్ ఇస్లాం (19) అనే యువకుడిని ఆ రాష్ట్ర పోలీసులు ఈ నెల 14న అరెస్టు చేశారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మనదేశంలోని సిమ్ కార్డులతో పాకిస్తాన్‌లో వాట్సాప్ అకౌంట్‌లు క్రియేట్ చేసి ఇక్కడి సమాచారాన్ని పాక్‌కు చేరవేస్తున్న ముఠాను పట్టుకునేందుకు అస్సాం పోలీసులు ఆపరేషన్ ఘోస్ట్ సిమ్ పేరుతో రహస్య ఆపరేషన్ చేపట్టారు. ఆ ముఠాలో సభ్యుడైన ఇస్లాంను కొండాపూర్ మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో 14న అదుపులోకి తీసుకున్నారు. అతడు కొన్ని రోజులుగా గ్రామంలో తాపీ మేస్త్రిగా పనిచేస్తున్నాడు.

దేశవ్యాప్తంగా ఏడుగురు అరెస్టు

ఆపరేషన్ ఘోస్ట్ సిమ్‌లో భాగంగా అసోం పోలీసులు ఇస్లాంసహా ఏడుగురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. వీరంతా అస్సాం రాష్ట్రానికి చెందినవారే. వీరు మనదేశంలో మీడియాలో వచ్చే సమాచారాన్ని వాట్సాప్ గ్రూపుల ద్వారా పాకిస్తాన్‌కు చేరవేస్తున్నట్లు సమాచారం. ఇస్లాం గతంలో షాప్‌లో పనిచేస్తూ నకిలీ గుర్తింపు కార్డులతో సిమ్ కార్డులు కొనుగోలు చేసి, వాటి ద్వారా రహస్యంగా వాట్సాప్ లింకులను పాకిస్తాన్‌కు పంపించేవాడు. ఈ విషయాన్ని పసిగట్టిన అస్సాం పోలీసులు పక్కా సమాచారంతో అతడిని అరెస్టు చేసినట్లు తెలిసింది. ఈ ఘటనతో సంగారెడ్డి జిల్లా పోలీసులు అప్రమత్తమయ్యారు. జిల్లాలో అత్యధికంగా పరిశ్రమలు ఉండటంతో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చినవారు వాటిలో కార్మికులుగా పనిచేస్తున్నారు. వారి కదలికలను ఎప్పటికప్పుడు తెలుసుకునే విధంగా చర్యలు చేపట్టినట్లు సమాచారం.

ఉగ్రకుట్ర భగ్నం

▶ మొదటి పేజీ తరువాయి

పోలీసులను అప్రమత్తం చేశారు. సిరాజ్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. అతని ఇంట్లో పేలుళ్లకు వినియోగించే అమ్మోనియా, సల్ఫర్, అల్యూమినియం పౌడర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఎవరికీ అనుమానం రాదనే ఉద్దేశంతోనే విజయనగరంలో పేలుడు పదార్థాల కొనుగోలుకు పూనుకున్నట్టు సమాచారం. వీరి వెనుక ఉన్న ఉగ్రవాద సంస్థల గురించి ఆరా తీస్తున్నారు.

హైదరాబాద్‌లో చదువుకున్నప్పుడే...

సిరాజ్ 2018 సంవత్సరంలో హైదరాబాద్‌లో ఇంజనీరింగ్ విద్యనభ్యసిస్తున్న సమయంలో సమీర్‌తో పరిచయం ఏర్పడినట్టు నిఘా వర్గాల సమాచారం. వీరిద్దరూ ఐసిస్‌తో సంబంధాలు పెంచుకున్నట్టు తెలంగాణ ఇంటెలిజెన్స్ గుర్తించింది. తండ్రి, సోదరుడు పోలీస్ విభాగాల్లో వివిధ హోదాల్లో పని చేస్తుండగా, సిరాజ్ మాత్రం ఉగ్రవాద భావజాలానికి ప్రేరేపితం కావడం పోలీసులను విస్మయపరుస్తోంది. వీరు రసాయనాలను ఎక్కడెక్కడ కొనుగోలు చేశారు, ఇంకా ఎక్కడ నిల్వ చేశారు, దీనితో ఎవరెవరికి సంబంధం ఉందన్న కోణంలో ఇంటెలిజెన్స్ అధికారులు విచారిస్తున్నట్లు విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాస్ తెలిపారు. నిందితులిద్దరినీ విజయనగరం కోర్టులో హాజరుపరిచి, రిమాండ్‌కు తరలించారు.

స్థానిక ఎన్నికలలో 42 శాతం బీసీ రిజర్వేషన్లు

- ఆర్.కృష్ణయ్య డిమాండ్



హిమాయత్‌నగర్ (హైదరాబాద్): స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. రాజకీయ పార్టీల సవాళ్లు, ప్రతి సవాళ్లతో సమస్యను పక్కదారి పట్టించొద్దని కోరారు. ఆదివారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో 14 బీసీ సంఘాల సమావేశం బీసీ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం వెంకటేశ్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా ఆర్.కృష్ణయ్య హాజరై ప్రసంగించారు. బీసీ రిజర్వేషన్లను 42 శాతం పెంచుతూ అసెంబ్లీలో బిల్లు పాసయిన నేపథ్యంలో అమలు చేయాలని ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలన్నారు. దమ్ముంటే ఎన్నికలకు వెళ్లాలని కోరడం బీఆర్ఎస్ పార్టీ ప్రయోజనాల కోసమేనని ఆరోపించారు. ఈ విషయంలో ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం జరిపి నిపుణులతో చర్చించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం మీద నెట్టి చేతులు దులుపుకోవాలని చూడటం సరికాదని పేర్కొన్నారు. ప్రభుత్వం చేసిన వాగ్దానం ప్రకారం రిజర్వేషన్లు పెంచి ఎన్నికలు జరపాలని కృష్ణయ్య డిమాండ్ చేశారు.



పుష్కర సరస్వతికి ప్రణామం

ప్రతి నదికి ఏడాదికి ఒక్కసారి పుష్కరాలు జరుగుతాయి. బృహస్పతిలో ఆయా రాశులు ప్రవేశించడంతో ఆ నదికి పుష్కరాలు జరుగుతాయి. ఈనెల 15న గురువారం బృహస్పతి మిథున రాశిలోకి ప్రవేశించడంతో ఉదయం 5.44గంటలకు సరస్వతినదికి పుష్కరాలు ఆరంభం అయ్యాయి. ఈ సందర్భంగా ప్రత్యేక కథనం...



సరస్వతీనది పుష్కరాలు ఉత్తరాదిలో నాలుగుచోట్ల, దక్షిణాదిలో తెలంగాణలోని కాళేశ్వరంలో మాత్రమే జరుగుతున్నాయి. నది పుట్టినచోటుగా గుర్తించిన ఉత్తరాఖండ్‌లోని బద్రీనాథ్, ఉత్తర్‌ప్రదేశ్‌లోని గంగా, యమున, సరస్వతి (అంతర్వాహిని) నదులుగా భావించే ప్రయాగ్‌రాజ్, గుజరాత్‌లోని సోమనాథ్, రాజస్థాన్‌లోని పుష్కర్ వద్ద సరస్వతీనదికి పుష్కరాలు జరుగుతున్నాయి.

పుష్కర స్నానం..పుణ్యఫలం..

పుష్కర స్నానం... ఎంతో పుణ్య ఫలం. నది స్నానాలు చేస్తే మానవ జీవన గమనంలో తెలిసో, తెలియకో చేసిన పాపాలు తొలగుతాయని పురాణాల్లో పేర్కొన్నారు..

తర్పణలు, పిండప్రదానాలు..



సాధారణంగా నదీస్నానాల్లో తర్పణం, పిండ ప్రదానం, శ్రాద్ధకర్మ పిండప్రదాన కర్మలు చేసి పితృదేవతలను తృప్తిపరిచి వారి ఆశీస్సులు అందుకోవడం శుభప్రదమని విశ్వసిస్తారు. మొదటి రోజు హిరణ్య శ్రాద్ధం తొమ్మిదోరోజు అన్నశ్రాద్ధం. పన్నెండో రోజు ఆమ శ్రాద్ధం చేయడం మంచిదని పురాణాల్లో పేర్కొన్నారు.



పుష్కరకాల స్నానం..

నీరు నారాయణ స్వరూపం. అందుకే ఆయన స్పర్శతో పాపాలు తొలగిపోతాయని విశ్వాసం. తీర్థ, నదీస్నానాలు ఉత్తమం. దానికన్నా పుష్కరస్నానం ఉత్తమోత్తమం. ఆ సమయంలో దేవతలంతా పుష్కరుడితో నదిలో ప్రవేశిస్తారని విశ్వాసం. పుష్కరకాలంలో స్నానమాచరిస్తే 12 సంవత్సరాల కాలం 12 నదుల్లో స్నానాలు చేసినంత పుణ్యం లభిస్తుందని పురాణాల్లో లిఖించబడింది.

నదికి వాయినాలు..

సుమంగళిగా జీవితాంతం ఉండాలని కోరుకుంటూ ఆడపడచులు పుష్కరాల సందర్భంగా నదీమతల్లికి వాయనాలు సమర్పిస్తారు. ఇలా చేస్తే విఘ్నాలు తొలగి శుభాలు కలుగుతాయని విశ్వాసం. చీర, రవిక, గాజులు, పసుపు, కుంకుమ, పుస్తె, మెట్టెలను పూజించి నదిలోకి జారవిడుస్తారు. ముత్తైదువులకు వాయినాలు ఇచ్చి ఆశీస్సులు అందుకుంటారు.

12 రోజులు హోమాలు..

మే 15 గురువారం శ్రీ దత్తాత్రేయ, శ్రీ కార్తవీర్యార్జున హోమం, 16న శుక్రవారం సంకష్ట హర గణపతి హోమం, 17న శనివారం శ్రీ హయగ్రీవ, శ్రీ స్వయంవర పార్వతి హోమం, 18న ఆదివారం శ్రీ పుత్రకామేష్టి హోమం జరిగాయి. నేడు మేధా దక్షిణామూర్తి మహా అమృత మృత్యుంజయ హోమం, మంగళవారం కాలభైరవ హోమం, బుధవారం సుదర్శన హోమం, గురువారం శ్రీ సూక్త హోమం, శుక్ర వారం పురుష సూక్త హోమం, శనివారం నవగ్రహ, శ్రీ మత్స్య హోమం, ఆదివారం శ్రీ రుద్రహోమం, 26, సోమవారం చండి హోమాలు నిర్వహించనున్నట్లు ఈఓ పేర్కొన్నారు.

12 రోజులు హారతి..

12 రోజులపాటు సరస్వతిఘాట్ వద్ద కాశీకి చెందిన ఏడుగురు పండితులచే తొమ్మిది నవరత్నమాలిక హారతులను ఇస్తున్నారు. హారతి వీక్షణకు భక్తులు భారీగా తరలివస్తున్నారు. హారతి ఇవ్వడానికి ఏడు గద్దెలు ఏర్పాటు చేసి ఏడు జీవనదులు గంగా, యమున, గోదావరి, నర్మద, సింధు, సరస్వతి, కావేరి పేర్లు ఏర్పాటు చేశారు.



పీఠాధిపతుల పుష్కర స్నానాలు..

పుష్కరాల సందర్భంగా ప్రతిరోజూ ఒక పీఠాధిపతి పుష్కర స్నానం చేస్తున్నారు. పుష్కర ప్రారంభం మే 15న మొదటి రోజు శ్రీ గురుమద నానంద సరస్వతి పీఠం, రంగంపేట, మెదక్‌కు చెందిన మాధవానంద సరస్వతి స్వామి పాల్గొని సరస్వతి పుష్కరాలను ప్రారంభించారు. మూడవ రోజు మే 17న తుని తపోవనం పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతి స్వామి, మే 18న పుష్పగిరి పీఠాధిపతి అభినవోద్దండ విద్యా శంకరభారతీ మహాస్వామి, నేడు నాసిక్ త్రయంబకేశ్వర్ మహామండలేశ్వర్ ఆచార్య సంవిదానంద సరస్వతి మహారాజ్, మే 23న హంపి విరుపాక్ష పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి వార్లు పుష్కర స్నానం ఆచరిస్తారు.



– షేక్ వలీ హైదర్, సాక్షి, కాళేశ్వరం (భూపాలపల్లి జిల్లా)

17 అడుగుల ఏకశిల సరస్వతిమాత విగ్రహం



సరస్వతి ఘాటులో 17 అడుగుల ఏకశిలా విగ్రహాన్ని తమిళనాడులోని మహాబలిపురంలో శిల్పులు ప్రత్యేకంగా రూపు దిద్దారు. ఆ విగ్రహం చుట్టూరా నాలుగు వేదమూర్తులయిన రుగ్వేదం, సామవేదం, యజుర్వేదం, అధర్వవేదం విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఆ విగ్రహాన్ని సరస్వతినది పుష్కరాల సందర్భంగా 15న సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు.

ఆత్మదర్శిని

ఈ క్షణమే సచ్చిదానందం





నీవు 'ఈ క్షణం'లో ఉన్నప్పుడు కాలం, ప్రదేశం అనేవే ఉండవు. అవి లేనప్పుడు దుఃఖం కూడా ఉండదు. ఈ క్షణంలో ఉన్నపుడు నీవే దైవం. అదే ఆత్మసాక్షాత్కార స్థితి. సచ్చిదానంద స్థితిలో ఉంటావు. నీవే దైవమైనప్పుడు నీ గురించి ఎవరేమి అనుకున్నా నీకు చెందదు కదా! అసలు వ్యక్తి అనేదే మనస్సు కల్పితం. ఈ క్షణంలో మనస్సు–శరీరం అనేవే ఉండవు. శరీరం–మనస్సు అనేవి కాలం–ప్రదేశము అనేవాటితో కలిసే ఉంటాయి. శరీరం ప్రదేశానికి సంబంధించినదైతే, మనస్సు కాలానికి సంబంధించినది. నీవు ఈ దేశకాలాలకు అతీతమైన స్థితిలో ఉండాలి ఎల్లప్పుడూ. అంటే అతి సూక్ష్మమైన 'ఈ క్షణం'లో ఉండాలి. అంటే ఆత్మతో ఉండాలి. ఆ స్థితిలో నీవు అనంతుడివి. పుట్టుకలేదు, చావుకూడా లేదు. కేవలం ఒక శుద్ధ చైతన్యానివి. వ్యక్తివి కావు.

ఈ స్థితిలో నీవు విశ్వచైతన్యంతో నేరుగా అనుసంధానమై ఉంటావు. పరమానందంలో ఉంటావు. ఈ క్షణంలో నీవు ఆత్మవు. ఈ క్షణం నుండి మళ్ళితే శరీరమే నేను, మనస్సు నేను అనే భ్రమలో ఉంటావు. అదే దుఃఖానికి మూలం. అందుకే దైవం ఆనందస్వరూపం అంటారు. నిర్గుణం, నిరాకారం, నశ్వరం, సర్వవ్యాపితం, ఆద్యంత రహితం అంటారే, దానికి కారణం ఇదే. మరి నీవు దైవం కావాలంటే ఈ క్షణంలో కదా ఉండాలి! ఆత్మస్థితిలో కదా ఉండాలి! నశించిపోయే భౌతిక ప్రపంచంలో దైవాన్ని వెదికితే దానికి అతీతమైన దైవత్వాన్ని ఎలా పొందగలవు? మనస్సుకు అతీతంగా ఎదుగు. దైవత్వాన్ని చేరకుండా అడ్డుపడుతున్నది ఈ మనస్సే. నీ శక్తులన్నింటినీ నీ మూలం వైపుకు మళ్ళించు.

స్వామి మైత్రేయ, ఆధ్యాత్మిక బోధకులు

పౌరాణిక జిజ్ఞాస

అశ్వినీ దేవతలు ఎవరు?



అశ్వినీ దేవతలు సూర్యపుత్రులు. వీరిని ఆది వైద్యులుగా పురాణాలు వర్ణించాయి. వీరు దయార్ద్ర హృదయులు, ధర్మపరులు, సత్యసంధులు. వీరి ఆయుధాలలో అత్యంత ప్రభావితమైన మహా ఔషధాలు ఉంటాయి. వైద్యశాస్త్రానికి అధిపతులైన ఈ దేవతలు కుడిచేతిలో అభయముద్ర, ఎడమచేతిలో ఆయుర్వేద గ్రంథం కుడిపక్కన మృతసంజీవిని, విశల్యకరణి లాంటి ఔషధీ లతలు ఉంటాయని పురాణ వర్ణితం.

వీరు విరాట్పురుషుని నాసికాభాగంలో ఉంటారు. వీరిసోదరి ఉష. వీరు ప్రయాణించే రథం పేరు హిరణ్యవర్తం. అది హిరణ్యయానమనే దోవలో వాయువేగ మనోవేగాలతో ప్రయాణిస్తుంది. ఆ రథం చాలా బృహత్తరమైనది. అది హిరణ్యం అంటే బంగారంతో నిర్మితమైనది. ఆ రథాన్ని అధ్వరాశ్వాలనే మూడు గుర్రాలు నడుపుతుంటాయి. అవి తెల్లగా నున్నగా ఎల్లప్పుడూ యవ్వనంతో అత్యంత ఉత్సాహంతో ఉంటాయి. ఈ రథానికి చక్రాలూ మూడే. సారథి కూర్చోవడానికి త్రిఫలకాలు, త్రిబంధురాలు అనే పేర్లు కలిగిన మూడు ఆసనాలు ఉంటాయి.

ఆ రథంలో ఒకవైపు ధనం మరొకవైపు తేనె, సోమరసం మరొకవైపు ఆయుధాలు ఉంటాయి. రథం పైభాగంలో వేయిపతాకాలు సుందరంగా రెపరెపలాడుతూ ఉంటాయి.

అశ్వినీ దేవతల కంఠధ్వని... శంఖనాదంలా మధురంగా ఉంటుంది. ఈ దేవతలను అంతా వేదమంత్రాలతో ఆహ్వానిస్తుంటారు. వీరి చేతిలో తేనె, సోమరసం, మంచుతో అద్దిన బెత్తంతో యజ్ఞం చేసే ప్రదేశానికి విచ్చేసి అధిపతులను యజ్ఞ ద్రవ్యాలను బెత్తంతో సుతిమెత్తగా తాకి వారిని అనుగ్రహిస్తుంటారు.

సాక్షి సినిమా

కాన్స్‌లో బర్డ్ మేన్!



బర్డ్ మేన్‌తో రాఫెల్, హ్యూగో



జెన్నిఫర్‌కి సహాయం చేస్తున్న రాబర్ట్

రెడ్ కార్పెట్ అప్పటివరకూ అందాల భామల సుతి మెత్తని అడుగులతో కనువిందు చేసింది. అయితే హఠాత్తుగా ఒక పక్షి నడుచుకుంటూ రావడంతో వీక్షకులు ఆశ్చర్యపోయారు. ఎవరీ బర్డ్ మేన్? అంటూ చర్చించుకున్నారు. ఫ్రాన్స్‌లో జరుగుతున్న 78వ కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఈ వింత చోటు చేసుకుంది. ఈ బర్డ్ మేన్ ప్రత్యక్షం కావడానికి కారణం 'ఐ లవ్ పెరు' డాక్యుమెంటరీ. హ్యూగో డేవిడ్‌తో కలిసి రాఫెల్ క్వెనార్డ్ దర్శకత్వం వహించిన ఫ్రెంచ్ లఘు చిత్రం ఇది. ఈ ఇద్దరూ కీలక పాత్రలు కూడా పోషించారు. జీవితంలో క్లిష్ట దశలో ఉన్నప్పుడు రాఫెల్ తన చుట్టూ ఉన్నవారిని వదిలేసి, స్నేహితుడు హ్యూగోతో కలిసి పెరు వెళతాడు. ఈ ప్రయాణంలో పెరు అందాలు, సంస్కృతి, మానవ సంబంధాల ప్రాముఖ్యత 'ఐ లవ్ పెరు'లో చూపించారు. భూమి, స్వర్గానికి అనుసంధానంగా పెరూలో ఓ పక్షిని పేర్కొంటారు. అందుకే కాన్స్ చిత్రోత్సవాల్లో ఒక వ్యక్తిని బర్డ్ మేన్‌లా తయారు చేసి, ప్రవేశపెట్టారు. ఇక ఆరు నిమిషాల పాటు స్టాండింగ్ ఒవేషన్ దక్కించుకుని, 'డై, మై లవ్' చిత్రం హాట్ టాపిక్ అయింది. జెన్నిఫర్ లారెన్స్, రాబర్ట్ పాటిన్‌సన్ లీడ్ రోల్స్‌లో లిన్నె రామ్‌సే దర్శకత్వం వహించిన ఈ చిత్రం పామ్ డి ఓర్ విభాగంలో పోటీ పడుతోంది. ఈ చిత్రంలోని కీలక నటీనటులు, దర్శకుడు తదితరులు కాన్స్ చిత్రోత్సవాలకు హాజరయ్యారు. ఈ సినిమా ప్రదర్శనకు ముందు రెడ్ కార్పెట్ పై జెన్నిఫర్ లారెన్స్‌తో కలిసి నడుస్తున్నప్పుడు రాబర్ట్ పాటిన్‌సన్ ఆమె గౌను కాళ్లకు అడ్డంపడకుండా సహాయం చేయడం చూసి, వీక్షకులు భేష్ అన్నారు. 'ఇలా హెల్ప్‌ఫుల్‌గా ఉండే కో స్టార్ ఉంటే ఎవరికైనా బాగానే ఉంటుంది' అని నెటిజెన్లు సైతం పేర్కొన్నారు. ఇలా పలు విశేషాలతో కాన్స్ చిత్రోత్సవాలు సాగుతున్నాయి. ఈ నెల 24 వరకూ ఈ ఫెస్టివల్ జరుగుతుంది.

ఎదుటోడు మన మీద కన్నేసే లోపే...



రోహిత్, సాయి శ్రీనివాస్, మనోజ్

బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ హీరోలుగా నటించిన యాక్షన్ థ్రిల్లర్ మూవీ 'భైరవం'. ఈ చిత్రంలో అదితీ శంకర్, ఆనంది, దివ్యా పిళ్ళై హీరోయిన్లుగా నటించారు. జయంతీలాల్ గడా సమర్పణలో విజయ్ కనకమేడల దర్శకత్వంలో కేకే రాధామోహన్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 30న విడుదల కానుంది. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ''వారాహి అమ్మవారి గుడి మాన్యానికి చెందిన పట్టా పేపర్లు నాకు కావాలి, గుడి ఆస్తిని–నగల్ని సగం సగం పంచేసుకుందాం', 'ఈసారి ఉత్సవాల్లో తెగేది మేక కాదు... నీ పీక', 'ఎదుటోడు మన మీద కన్నేసే లోపే... వాడి మీద మనం మన్నేసెయ్యాలి', 'మనవాళ్ల కోసం మనవాళ్లనే చంపుకునే మహాభారతం మన మధ్యనే జరుగుతుందని ఎప్పుడూ అనుకోలేదు' అనే డైలాగ్స్ 'భైరవం' ట్రైలర్‌లో ఉన్నాయి. ఈ సినిమాకు సంగీతం: శ్రీచరణ్ పాకాల.

జూన్ 1 నుంచి థియేటర్స్ బంద్?

- హైదరాబాద్‌లో తెలుగు రాష్ట్రాల ఎగ్జిబిటర్స్ కీలక సమావేశం

తెలుగు చిత్ర పరిశ్రమలో థియేటర్స్ సెక్టార్‌లో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నట్లుగా తెలుస్తోంది. థియేటర్స్‌లో సినిమాల ప్రదర్శన విషయమై ఎగ్జిబిటర్స్ (థియేటర్స్ యాజమాన్యం), డిస్ట్రిబ్యూటర్స్ మధ్య కొంతకాలంగా ఏకాభిప్రాయం కోసం జరుగుతున్న చర్చలు ఓ కొలిక్కి రాని పరిస్థితి నెలకొందని సమాచారం. ఇకపై అద్దెల రూపంలో సినిమాలను ప్రదర్శించడం వీలుపడదని ఎగ్జిబిటర్స్ చెబుతుంటే, ఎగ్జిబిటర్స్‌కు పర్సంటేజీల రూపంలో సినిమాల వసూళ్ల షేరింగ్ కుదరదన్నది డిస్ట్రిబ్యూటర్స్ అభిప్రాయంగా తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఈ సమస్యల పరిష్కారం కోసం ఆదివారం హైదరాబాద్‌లో ప్రముఖ నిర్మాత, తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ 'దిల్' రాజు అధ్యక్షతన తెలుగు ఫిల్మ్ చాంబర్‌లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సంయుక్త సమావేశం జరిగిందని తెలిసింది. ప్రముఖ నిర్మాత సురేష్‌బాబుతో సహా దాదాపు 60 మంది ఎగ్జిబిటర్స్ ఈ కీలక సమావేశంలో పాల్గొన్నారని భోగట్టా. ఈ సమావేశంలో ఇకపై అద్దె ప్రాతిపదికన సినిమాలను ప్రదర్శించలేమని, పర్సెంటేజీల రూపంలో చెల్లిస్తేనే సినిమాలను థియేటర్స్‌లో ప్రదర్శిస్తామని, ఈ విషయమై నిర్మాతలకు లేఖ రాయాలని ఎగ్జిబిటర్స్ తీర్మానం చేశారని టాక్. అలాగే ప్రొడ్యూసర్స్ కౌన్సిల్, ప్రొడ్యూసర్స్ గిల్డ్‌లకు ఎగ్జిబిటర్ల నిర్ణయాన్ని తెలుగు ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు నిర్మాతల దృష్టికి తీసుకువెళ్లనున్నారని తెలిసింది. ఒకవేళ పర్సెంటేజీ విధానంలో సినిమాల ప్రదర్శన విషయమై సరైన స్పష్టత రాని పక్షంలో జూన్ 1 నుంచి తెలుగు రాష్ట్రాల్లోని థియేటర్స్‌ను బంద్ చేయాలని ఎగ్జిబిటర్స్ నిర్ణయించుకున్నారనే వార్తలు తెరపైకి వచ్చాయి. మరోవైపు సినిమాల రేంజ్, కలెక్షన్స్‌ను ఆధారంగా చేసుకుని పర్సెంటేజ్ విధానాన్ని తెలంగాణ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ మూడు భాగాలుగా విభజించిందని, ఈ విషయంపై నిర్మాతల్లో కూడా తీవ్రమైన చర్చలు జరుగుతున్నాయని సమాచారం. ఒకవేళ ఎగ్జిబిటర్స్ పర్సెంటేజ్ విధానంపై పట్టు వదలకపోతే తమకు అనుకూల థియేటర్స్, మల్టీప్లెక్స్‌లలో సినిమాలను ప్రదర్శిస్తే ఎలా ఉంటుందనే ఆలోచన చేస్తున్నారట నిర్మాతలు. ఈ విషయాలపై పూర్తి స్థాయి అధికారిక సమాచారం అందాల్సి ఉంది.

జూన్‌లో భారీ సినిమాలు: సమస్యలు పరిష్కారం కాకపోతే జూన్ 1 నుంచి థియేటర్స్ మూసివేస్తామని ఎగ్జిబిటర్స్ పేర్కొన్నారనే వార్తలు వచ్చిన నేపథ్యంలో జూన్‌లో విడుదల కానున్న చిత్రాల గురించి చర్చ జరుగుతోంది. మే 30న 'భైరవం, షష్టిపూర్తి' చిత్రాలు రిలీజ్ కానున్నాయి. జూన్ 5న కమల్‌హాసన్ 'థగ్ లైఫ్', పవన్‌కల్యాణ్ నటించిన 'హరిహర వీరమల్లు' జూన్ 12న, నాగార్జున–ధనుష్ నటించిన 'కుబేర' జూన్ 20న, విష్ణు మంచు నటించిన 'కన్నప్ప' జూన్ 27న రిలీజ్‌కు సిద్ధమయ్యాయి. ఈ తరుణంలో సినిమాల ప్రదర్శన విషయంలో ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్స్ మధ్య ఏకాభిప్రాయం కుదరకపోతే, జూన్‌లో విడుదలకు సిద్ధమైన సినిమాల పరిస్థితి ఏంటి? అనే చర్చ జరుగుతోంది.

సరదాలే సరిగమలై...



నాగ్ అశ్విన్, రూపేష్

''వేయి వేణువుల నాదం మోగే హాయి హాయి హృదయాన... ప్రేమ మంత్రముల గానం సాగే ఈ ముహూర్త సమయాన.. సరదాలే సరిగమలై పలికిన శుభవేళ'' అంటూ సాగే పాట 'షష్టిపూర్తి' సినిమాలోనిది. రాజేంద్ర ప్రసాద్, అర్చన కాంబినేషన్లో రూపేష్, ఆకాంక్షా సింగ్ ప్రధాన పాత్రధారులుగా నటించిన చిత్రం ఇది. పవన్ ప్రభ దర్శకత్వంలో రూపేష్ కుమార్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 30న విడుదల కానుంది. ఈ సినిమాలోని 'వేయి వేణువుల నాదం మోగే...' పాటను దర్శకుడు నాగ్ అశ్విన్ విడుదల చేశారు. చైతన్య ప్రసాద్ సాహిత్యం అందించిన ఈ పాటను కార్తీక్, విభావరి ఆప్టే జోషి ఆలపించారు. స్వర్ణ మాస్టర్ నృత్య రీతులు సమకూర్చారు. ఈ పాట గురించి పవన్ ప్రభ మాట్లాడుతూ– ''ఈ పాటను చైతన్య ప్రసాద్ అద్భుతంగా రాశారు. ఇకపై ఎవరు 'షష్టిపూర్తి' జరుపుకున్నా ఈ పాటను ప్లే చేసి తీరాల్సిందే. ఇళయరాజా గారు స్వరపరిచిన ఈ సినిమా పాటల రికార్డింగ్‌ని ప్రత్యక్షంగా వీక్షించి, పులకించిపోయాను. ఈ పాట కోసం తోట తరణిగారు ఓ మండువా లోగిలిని అత్యద్భుతంగా తీర్చిదిద్దారు. రాజేంద్రప్రసాద్, అర్చనగార్లు, రూపేష్–ఆకాంక్ష ఈ పాటలో జీవించారు. చాలా కాలం గుర్తుండిపోయే పాట ఇది'' అని తెలిపారు.

కరాలి ఆరంభం



కాజల్ చౌదరి, నవీన్ చంద్ర

నవీన్ చంద్ర హీరోగా నటించనున్న చిత్రానికి 'కరాలి' టైటిల్ ఖరారైంది. ఈ చిత్రంలో రాశీ సింగ్, కాజల్ చౌదరి హీరోయిన్లుగా నటిస్తున్నారు. రాకేశ్ పొట్టా దర్శకత్వంలో మందలపు శివకృష్ణ నిర్మిస్తున్న ఈ సినిమా పూజా కార్యక్రమాలు ఆదివారం జరిగాయి. శ్రీ హర్షిణి ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ అధినేత గోరంట్ల రవికుమార్, యాస్పైర్ స్పేసెస్ మేనేజింగ్ డైరెక్టర్ తూమాటి నరసింహా రెడ్డి కెమెరా స్విచ్చాన్ చేయగా, ముహూర్తపు సన్నివేశానికి సాహు గారపాటి క్లాప్ ఇచ్చి, స్క్రిప్ట్‌ని యూనిట్‌కి అందించారు. ఈ సందర్భంగా నవీన్ చంద్ర మాట్లాడుతూ– ''కరాలి' టైటిల్ ఎంత కొత్తగా, విభిన్నంగా ఉందో సినిమా కూడా అంతే కొత్తగా ఉంటుంది. కొత్తవారు కొత్త పాయింట్‌తో వచ్చినప్పుడు, ఆ సినిమాలను నిర్మించేందుకు శివ గారిలాంటి ధైర్యం ఉన్న నిర్మాతలు ముందుకు రావాలి'' అని తెలిపారు. ''నేను కేంద్ర ప్రభుత్వ మాజీ ఉద్యోగిని. సినిమాలపై ప్యాషన్‌తో వీఆర్‌ఎస్ తీసుకుని, ప్రొడక్షన్ హౌస్ స్టార్ట్ చేశాను. ఆ సమయంలో రాకేశ్‌గారు చెప్పిన కథ నచ్చి, ఈ సినిమా నిర్మిస్తున్నాను'' అని అన్నారు మందలపు శివకృష్ణ. ''ఈ సినిమా పెద్ద హిట్టవుతుందనే నమ్మకం ఉంది'' అని తెలిపారు రాకేశ్ పొట్టా. ఈ సినిమాకు సంగీతం: వికాస్ బడిసా, కెమేరా: అపూర్వ అనిల్ శాలిగ్రామ్.

అమరావతిలో హారర్



సుప్రీత, ఎస్తర్, ధన్యా బాలకృష్ణ

శివ కంఠమనేని, ఎస్తర్, ధన్యా బాలకృష్ణ, హరీష్, సుప్రీత ప్రధాన పాత్రల్లో నటిస్తున్న హారర్ అండ్ థ్రిల్లర్ మూవీ 'అమరావతికి ఆహ్వానం'. జీవీకే దర్శకత్వంలో కేఎస్ శంకర్ రావు, ఆర్. వెంకటేశ్వరరావు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు చెందిన ఓ కీలక షెడ్యూల్ మధ్యప్రదేశ్‌లో ముగిసినట్లు యూనిట్ పేర్కొంది. ''ఇప్పటికే ఆంధ్రప్రదేశ్, తెలంగాణాలోని పలు లొకేషన్స్‌లో షూట్ చేశాం. తాజాగా మధ్యప్రదేశ్‌లో తామ్య హిల్స్, పాతాళ్ కోట్, బిజోరి వంటి లొకేషన్స్‌లో షూటింగ్ చేయడం జరిగింది. మంచి హారర్ థ్రిల్లర్‌గా జీవీకే తెరకెక్కిస్తున్నారు'' అని తెలిపారు శివ కంఠమనేని. ''సరికొత్త హారర్ థ్రిల్లర్ కథతో రాబోతున్న సినిమా ఇది. వీఎఫ్‌ఎక్స్‌కి మంచి ప్రాముఖ్యత ఉంది'' అన్నారు జీవీకే.

గుడి నేపథ్యంలో...



వైకుంఠ్ బోను, మణిశర్మ, మహేంద్రన్

గుడి నేపథ్యంలో సాగే కథ 'వసుదేవ సుతం'. ఈ చిత్రంతో మాస్టర్ మహేంద్రన్ హీరోగా రాబోతున్నారు. అంబికా వాణి హీరోయిన్‌గా నటిస్తున్నారు. వైకుంఠ్ బోను దర్శకత్వంలో బేబీ చైత్ర శ్రీ, మాస్టర్ యువాంశ్ కృష్ణ బాదర్ల సమర్పణలో ధనలక్ష్మి బాదర్ల ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమా గ్లింప్స్‌ను ప్రముఖ సంగీత దర్శకుడు మణిశర్మ విడుదల చేసి, శుభాకాంక్షలు తెలిపారు. ''గుడిలో ఉన్న నిధి చుట్టూ ఈ సినిమా కథనం సాగుతుంది. తెలుగు, తమిళ, హిందీ, ఒరియా భాషల్లో ఈ సినిమాను రిలీజ్ చేయనున్నాం'' అని దర్శక–నిర్మాతలు పేర్కొన్నారు. ఈ సినిమాకు సంగీతం: మణిశర్మ.

సందేశాత్మక జనం



'జనం' పోస్టర్

సుమన్ హీరోగా, అజయ్ ఘోష్, కిశోర్, వెంకటరమణ, ప్రగ్య నైనా ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'జనం'. వీఆర్‌పీ క్రియేషన్స్ పతాకంపై పి. పద్మావతి సమర్పణలో వెంకటరమణ పసుపులేటి స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రం ఇది. గత ఏడాది నవంబరులో విడుదలైన ఈ చిత్రానికి ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించిందని చిత్రయూనిట్ పేర్కొంది. తాజాగా ఈ సినిమాను ఈ నెల 29న రీ–రిలీజ్ చేయనున్నారు. ఈ సందర్భంగా పసుపులేటి వెంకటరమణ మాట్లాడుతూ– ''ఉత్తమ పౌరులుగా ఉండాల్సిన నేటి తరంవారు స్మార్ట్ ఫోన్‌కు, నాయకులు పంచే మందు, డబ్బులకు ఎలా బానిస అవుతున్నారనే ఆలోచింపజేసే సందేశంతో ఈ సినిమాను తెరకెక్కించాం. మరింత మంది ప్రేక్షకులకు చేరువ కావాలని రీ రిలీజ్ చేస్తున్నాం'' అన్నారు.



సింగిల్స్‌లో మనిక, మానవ్ శుభారంభం

దోహా: ప్రపంచ టేబుల్ టెన్నిస్ (టీటీ) చాంపియన్‌షిప్ మహిళల సింగిల్స్ విభాగంలో భారత స్టార్ మనిక బత్రా... పురుషుల సింగిల్స్‌లో భారత నంబర్‌వన్ మానవ్ ఠక్కర్ శుభారంభం చేశారు. ఆదివారం జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో మనిక 11-5, 11-6, 11-8, 11-2తో ఫాతిమా బెల్లో (నైజీరియా)పై, మానవ్ 11-3, 11-8, 6-11, 11-7, 14-12తో టిమోతి చోయ్ (న్యూజిలాండ్)పై విజయం సాధించి రెండో రౌండ్‌కు చేరుకున్నారు. మరో తొలి రౌండ్ మ్యాచ్‌లో అంకుర్ భట్టాచార్య (భారత్) 11-4, 7-11, 9-11, 10-12, 8-11తో లామ్ సియు హాంగ్ (హాంకాంగ్) చేతిలో ఓడిపోయాడు. మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్‌లో మనుశ్ షా-దియా చిటాలె (భారత్) ద్వయం 11-2, 11-7, 11-6తో మెహదీ బులూసా-మలీసా నాస్రి (అల్జీరియా) జోడీని ఓడించింది. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో సత్యన్ జ్ఞానశేఖరన్-హర్మీత్ దేశాయ్ (భారత్) జంట 9-11, 12-10, 14-16, 10-12తో మసిజ్ కొలోజెసిక్ (ఆస్ట్రియా)-వ్లాదిస్లావ్ ఉర్సు (మాల్డోవా) జోడీ చేతిలో పరాజయం పాలైంది. మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్‌లో హర్మీత్ దేశాయ్-యశస్విని (భారత్) ద్వయం 11-8, 11-6, 10-12, 8-11, 10-12తో థిబాల్ట్ పొరెట్-లీనా హొచార్ట్ (ఫ్రాన్స్) జోడీ చేతిలో ఓడిపోయింది.

పంజాబ్ 11 ఏళ్ల తర్వాత...


హర్‌ప్రీత్ బ్రార్

ప్లే ఆఫ్స్ దశకు అర్హత
- రాజస్తాన్‌పై 10 పరుగులతో నెగ్గిన పంజాబ్ కింగ్స్
- మెరిపించిన నేహల్, శశాంక్
- తిప్పేసిన హర్‌ప్రీత్ బ్రార్

జైపూర్: సుదీర్ఘ విరామం తర్వాత ఐపీఎల్ టోర్నీలో పంజాబ్ కింగ్స్ జట్టు 'ప్లే ఆఫ్స్' దశకు అర్హత సాధించింది. రాజస్తాన్ రాయల్స్‌తో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో శ్రేయస్ అయ్యర్ నాయకత్వంలోని పంజాబ్ కింగ్స్ జట్టు 10 పరుగుల తేడాతో గెలిచింది. మరోవైపు ఢిల్లీ క్యాపిటల్స్‌పై గుజరాత్ టైటాన్స్ జట్టు నెగ్గడంతో... పంజాబ్ కింగ్స్ జట్టుకు మరో రెండు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే 'ప్లే ఆఫ్స్' బెర్త్ ఖరారైంది. చివరిసారి పంజాబ్ కింగ్స్ జట్టు 2014లో 'ప్లే ఆఫ్స్'కు చేరింది. రాజస్తాన్‌తో జరిగిన మ్యాచ్‌లో మొదట పంజాబ్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 219 పరుగులు చేసింది. నేహల్ వధేరా (37 బంతుల్లో 70; 5 ఫోర్లు, 5 సిక్స్‌లు), శశాంక్ సింగ్ (30 బంతుల్లో 59 నాటౌట్; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) దంచేశారు. అనంతరం భారీ లక్ష్యఛేదనకు దిగిన రాజస్తాన్ 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 209 పరుగులు చేసి ఓడింది. ధ్రువ్ జురేల్ (31 బంతుల్లో 53; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు), యశస్వి జైస్వాల్ (25 బంతుల్లో 50; 9 ఫోర్లు, 1 సిక్స్), వైభవ్ సూర్యవంశీ (15 బంతుల్లో 40; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) చెలరేగారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' హర్‌ప్రీత్ బ్రార్ 3 వికెట్లు తీశాడు.

ధనాధన్ ఆరంభం

భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన రాజస్తాన్‌కు 4, 0, 4, 4, 6, 4లతో జైస్వాల్ తొలి ఓవర్లోనే దీటైన ఆరంభమిచ్చాడు. రెండో ఓవర్‌ను వైభవ్ బౌండరీ, రెండు సిక్స్‌లతో చితగ్గొట్టాడు. దీంతో 2.5 ఓవర్లోనే రాజస్తాన్ 50 స్కోరు చేసేసింది. వైభవ్ చేసిన 40 పరుగులు 4 ఫోర్లు, 4 సిక్స్‌లతోనే సాధించడం విశేషం. ఐదో ఓవర్లో వైభవ్ అవుటవడంతో 76 పరుగుల ఓపెనింగ్ భాగస్వామ్యం ముగిసింది. తర్వాత యశస్వి ధాటిగా ఆడుతున్నా... సామ్సన్ (20), పరాగ్ (13) వికెట్లు పారేసుకోవడం ప్రతికూలమైంది. అయినా ధ్రువ్ జురేల్ భారీషాట్లతో ఆశలు రేపాడు. కానీ ఇంపాక్ట్ బౌలర్ హర్‌ప్రీత్ బ్రార్ కీలక వికెట్లను తీసి రాజస్తాన్‌ను దెబ్బకొట్టాడు.

స్కోరు వివరాలు

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: ప్రియాన్ష్ (సి) హెట్‌మైర్ (బి) తుషార్ 9; ప్రభ్‌సిమ్రన్ (సి) సామ్సన్ (బి) తుషార్ 21; ఒవెన్ (సి) సామ్సన్ (బి) క్వెనా మఫాక 0; నేహల్ (సి) హెట్‌మైర్ (బి) ఆకాశ్ 70; శ్రేయస్ (సి) జైస్వాల్ (బి) పరాగ్ 30; శశాంక్ (నాటౌట్) 59; అజ్మతుల్లా (నాటౌట్) 21; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు)** 219. **వికెట్ల పతనం:** 1-19, 2-34, 3-34, 4-101, 5-159. **బౌలింగ్:** ఫజల్‌హక్ 3-0-39-0, తుషార్ దేశ్‌పాండే 4-0-37-2, క్వెనా మఫాక 3-0-32 -1, పరాగ్ 3-0-26-1, హసరంగ 3-0-33-0, ఆకాశ్ మధ్వాల్ 4-0-48-1. **రాజస్తాన్ రాయల్స్ ఇన్నింగ్స్:** జైస్వాల్ (సి) ఒవెన్ (బి) హర్‌ప్రీత్ 50; వైభవ్ (సి) బార్ట్‌లెట్ (బి) హర్‌ప్రీత్ 40; సామ్సన్ (సి) యాన్సెన్ (బి) అజ్మతుల్లా 20; పరాగ్ (బి) హర్‌ప్రీత్ 13; జురేల్ (సి) ఒవెన్ (బి) యాన్సెన్ 53; హెట్‌మైర్ (సి) బార్ట్‌లెట్ (బి) అజ్మతుల్లా 11; దూబే (నాటౌట్) 7; హసరంగ (సి) ప్రభ్‌సిమ్రన్ (బి) యాన్సెన్ 0; క్వెన మఫాక (నాటౌట్) 8; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు)** 209. **వికెట్ల పతనం:** 1-76, 2-109, 3-114, 4-144, 5-181, 6-200, 7-200. **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-0-60-0, యాన్సెన్ 3-0-41-2, బార్ట్‌లెట్ 1-0-12-0, హర్‌ప్రీత్ బ్రార్ 4-0-22-3, చహల్ 4-0-30-0, అజ్మతుల్లా 4-0-44-2.

ఐపీఎల్-2025 పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	ర.రే
గుజరాత్	12	9	3	0	18	0.795
బెంగళూరు	12	8	3	1	17	0.482
పంజాబ్	12	8	3	1	17	0.389
ముంబై	12	7	5	0	14	1.156
ఢిల్లీ	12	6	5	1	13	0.260
కోల్‌కతా	13	5	6	2	12	0.193
లక్నో	11	5	6	0	10	-0.469
హైదరాబాద్	11	3	7	1	7	-1.192
రాజస్తాన్	13	3	10	0	6	-0.701
చెన్నై	12	3	9	0	6	-0.992

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ఫ.తే- ఫలితం తేలనివి, పా-పాయింట్లు, ర.రే- రన్‌రేట్

గుజరాత్ దర్జాగా...


కేఎల్ రాహుల్


గిల్


సాయి సుదర్శన్

10 వికెట్లతో గెలిచి 'ప్లే ఆఫ్స్'కు చేరిన టైటాన్స్
- గుజరాత్ గెలుపుతో బెంగళూరు, పంజాబ్ కూడా 'ప్లే ఆఫ్స్'కు అర్హత
- సాయి సుదర్శన్ సూపర్ సెంచరీ
- రాణించిన శుబ్‌మన్ గిల్
- కేఎల్ రాహుల్ శతకం వృథా

న్యూఢిల్లీ: ఓపెనర్ల గర్జనతో గుజరాత్ టైటిల్స్ దర్జాగా ఐపీఎల్ 18వ సీజన్‌లో ప్లే ఆఫ్స దశకు అర్హత సంపాదించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సాయి సుదర్శన్ (61 బంతుల్లో 108 నాటౌట్; 12 ఫోర్లు, 4 సిక్స్‌లు), శుబ్‌మన్ గిల్ (53 బంతుల్లో 93 నాటౌట్; 3 ఫోర్లు, 7 సిక్స్‌లు) ఢిల్లీ బౌలింగ్‌ను దంచికొట్టారు. దీంతో టైటాన్స్ 10 వికెట్ల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌పై ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేపట్టిన ఢిల్లీ క్యాపిటల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 199 పరుగులు చేసింది. కేఎల్ రాహుల్ (65 బంతుల్లో 112 నాటౌట్; 14 ఫోర్లు, 4 సిక్స్‌లు) అజేయ సెంచరీతో కదంతొక్కాడు. అర్షద్, ప్రసిధ్‌కృష్ణ, సాయి కిశోర్ తలా ఒక వికెట్ తీశారు. అనంతరం గుజరాత్ టైటాన్స్ 19 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 205 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్లు సాయి సుదర్శన్, శుబ్‌మన్ గిల్ అజేయంగా, ఆకాశమే హద్దుగా చెలరేగారు. నెల నిషేధం ముగియడంతో గుజరాత్ తరఫున రబడ ఈ మ్యాచ్ బరిలోకి దిగాడు.

రాహుల్ 112 నాటౌట్

క్యాపిటల్స్ ఇన్నింగ్స్‌ను ఆరంభం నుంచి ఆఖరుదాకా నడిపించింది... పరుగులు రాబట్టింది ఒకే ఒక్కడు రాహుల్. డుప్లెసిస్ (5)తో ఓపెనింగ్ వికెట్ ఎంతోసేపు నిలబడలేదు. ఆరంభంలో స్కోరులో ఏమాత్రం జోరు లేదు. 5 ఓవర్లలో ఢిల్లీ స్కోరు 28/1. పవర్‌ప్లేలో కనీసం బంతికో పరుగైనా చేయలేదు. అయితే ఆరో ఓవర్లో రాహుల్ రెండు సిక్స్‌లు, ఓ బౌండరీ బాదడంతో క్యాపిటల్స్ 45/1 స్కోరుతో కోలుకుంది. అభిషేక్ పొరెల్ (19 బంతుల్లో 30; 1 ఫోర్, 3 సిక్స్‌లు) అడపాదడపా భారీషాట్లు బాదాడు. రాహుల్ 35 బంతుల్లో ఫిఫ్టీ పూర్తిచేసుకున్నాడు. రబడ 11వ ఓవర్లో పొరెల్, రాహుల్ చెరో సిక్సర్ బాదడంతో 17 పరుగులు వచ్చాయి. దీంతో మరుసటి ఓవర్లోనే క్యాపిటల్స్ 100 మార్క్‌ను దాటింది. కానీ ఆఖరి బంతికి పొరెల్ వికెట్‌ను కోల్పోయింది. దీంతో రెండో వికెట్‌కు 90 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. క్రీజులోకి కెప్టెన్ అక్షర్ పటేల్ (16 బంతుల్లో 25; 2 ఫోర్లు, 1 సిక్స్) రాగా... రాహుల్ ధాటిని పెంచాడు. 14వ ఓవర్లో వరుసగా 3 బౌండరీలు కొట్టాడు. అక్షర్ కూడా 4, 6తో దంచేపనిలో పడ్డాడు కానీ మరుసటి ఓవర్లోనే ప్రసిధ్‌కృష్ణకు వికెట్ సమర్పించుకున్నాడు. 19వ ఓవర్లో 6, 4 బాదిన రాహుల్ 60 బంతుల్లో శతకాన్ని పూర్తి చేసుకున్నాడు. స్టబ్స్ (10 బంతుల్లో 21 నాటౌట్; 2 సిక్స్‌లు) వేగంగా ఆడే ప్రయత్నం చేశాడు.

ఆరంభం నుంచే ధనాధన్

తొలి ఓవర్లో సాయి సుదర్శన్ బౌండరీతో శుబ్‌మన్ సిక్స్‌తో తమ ఖాతా తెరవడం ద్వారా లక్ష్యానికి దీటైన ఆరంభమిచ్చారు. నటరాజన్ వేసిన రెండో ఓవర్‌ను సుదర్శన్ 6, 4, 4, 0, 2, 4లతో చితగ్గొట్టాడు. దీంతో 20 పరుగులు వచ్చాయి. అక్షర్ మూడో ఓవర్లో మరో రెండు బౌండరీలు బాదాడు. టైటాన్స్ 6 ఓవర్లలో 59/0 స్కోరు చేసింది. ఆ తర్వాత కూడా ఇద్దరు చక్కని సమన్వయంతో ఆడటంతో పరుగులకు పెద్దగా ఇబ్బంది లేకుండా పోయింది. ఈ క్రమంలో మొదట సుదర్శన్ 30 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేసుకోగా... 10 ఓవర్లు ముగిసేసరికి గుజరాత్ 93/0 స్కోరు చేసింది. ఇక మిగిలిన 10 ఓవర్లలో 107 పరుగులు చేయాల్సిన దశలోనూ ఓపెనింగ్ జోడీ పరుగుల పయనం సాఫీగా సాగిపోయింది. దీంతో ఓవర్లు గడిచేకొద్దీ ఢిల్లీ బౌలర్లు కాస్తా డీలా బౌలర్లుగా మారిపోయారు. 33 బంతుల్లో గిల్ అర్ధసెంచరీ పూర్తవగా జట్టు స్కోరు 15వ ఓవర్లో 150 దాటింది. ఇక 30 బంతుల్లో 46 పరుగుల సమీకరణంతోనే... చేతిలో పది వికెట్లున్న టైటాన్స్ చేతుల్లోకే మ్యాచ్ వచ్చేసింది. ఈ లాంఛనాన్ని మరో బ్యాటర్‌కు ఇవ్వకుండా ఓపెనర్లే పూర్తి చేశారు. భారీ సిక్సర్‌తో సాయి సుదర్శన్ 56 బంతుల్లో సెంచరీ సాధించగా, చూడచక్కని బౌండరీలతో గిల్ కూడా శతకానికి చేరువయ్యాడు. కానీ ఈ లోపే 200 పరుగుల పెద్ద లక్ష్యం 19వ ఓవర్లోనే దిగిరావడంతో అతని సెంచరీకి అవకాశం లేకుండాపోయింది.

200 పరుగుల లక్ష్యం. ఛేదించే జట్టుకు ఏమాత్రం సులువు కానేకాదు. కానీ ఇద్దరే ఇద్దరు... గుజరాత్ ఓపెనర్లు దంచేశారు. అంతపెద్ద లక్ష్యాన్ని సులువుగా కరిగించేశారు. సాయి సుదర్శన్, శుబ్‌మన్ గిల్ పోటీపడ్డారు. పరుగు పెట్టేందుకు... ఫోర్లు బాదేందుకు... సిక్సర్లు కొట్టేందుకు ఇలా ప్రతిదానికి ఆఖరుదాకా పోటీపడి మరీ సాధించడంతో కఠిన లక్ష్యం కూడా ఓ ఓవర్‌కు ముందే కరిగిపోయింది. అంత చేసి కూడా ఢిల్లీ క్యాపిటల్స్ ఓటమితో కుంగిపోయింది. అంతేకాదు గుజరాత్ దర్జాగా సాధించిన విజయంతో తమతోపాటే రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ), పంజాబ్ కింగ్స్ జట్లను కూడా 'ప్లే ఆఫ్స్'కు తీసుకెళ్లింది. ఇక మిగిలింది ఒకే ఒక్క బెర్త్. దీని కోసం ముంబై ఇండియన్స్, ఢిల్లీ క్యాపిటల్స్ కాచుకున్నాయి. మరి ఆఖరి బెర్త్ ఎవరిని వరిస్తుందో చూడాలి.

స్కోరు వివరాలు

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: కేఎల్ రాహుల్ (నాటౌట్) 112; డుప్లెసిస్ (సి) సిరాజ్ (బి) అర్షద్ 5; పోరెల్ (సి) బట్లర్ (బి) సాయికిషోర్ 30; అక్షర్ (సి) సాయికిశోర్ (బి) ప్రసిధ్ కృష్ణ 25; స్టబ్స్ (నాటౌట్) 21; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (20 ఓవర్లలో 3 వికెట్లకు)** 199. **వికెట్ల పతనం:** 1-16, 2-106, 3-151. **బౌలింగ్:** సిరాజ్ 4-0-37-0, అర్షద్ ఖాన్ 2-0-7-1, రబడా 2-0-34-0, ప్రసిధ్‌కృష్ణ 4-0-40-1, రషీద్ ఖాన్ 4-0-32-0, సాయికిషోర్ 4-0-47-1. **గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్:** సాయి సుదర్శన్ (నాటౌట్) 108; శుబ్‌మన్ గిల్ (నాటౌట్) 93; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (19 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా)** 205. **బౌలింగ్:** అక్షర్ పటేల్ 3-0-35-0, నటరాజన్ 3-0-49-0, ముస్తాఫిజుర్ 3-0-24-0, చమీర 2-0-22-0, విప్రాజ్ 4-0-37-0, కుల్దీప్ 4-0-37-0.

ఐపీఎల్‌లో నేడు

లక్నో × హైదరాబాద్
వేదిక: లక్నో
రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

భవిత
స్పర్ధయా వర్ధతే విద్య

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-ఇండియన్ హిస్టరీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం- ఫిజిక్స్
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-జనరల్ స్టడీస్-తెలంగాణ హిస్టరీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం-రీజనింగ్

విద్య, ఉద్యోగ సమాచారం

డీఆర్‌డీవో-ఎల్ఆర్‌డీఈ, బెంగళూరులో 118 అప్రెంటిస్‌లు

బెంగళూరులోని డీఆర్‌డీవో-ఎలక్ట్రానిక్స్ అండ్ రాడార్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్ (ఎల్ఆర్‌డీఈ).. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- » **మొత్తం ఖాళీల సంఖ్య:** 118.
- » **ఖాళీల వివరాలు:** ట్రేడ్ అప్రెంటిస్-30, డిప్లొమా అప్రెంటిస్-30, గ్రాడ్యుయేట్ అప్రెంటిస్-58.
- » **ట్రేడులు:** కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్/డేటా ఎంట్రీ, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్ మెకానిక్, టర్నర్, మెషినిస్ట్/సీఎన్‌సీ మెషినింగ్ టెక్, మెకానిక్ మోటార్ వెహికల్, టర్నర్, వెల్డర్, ఫోటోగ్రాఫర్, మెకానికల్ ఇంజనీరింగ్, బీకాం, బీఎస్సీ, బీసీఏ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్ తదితరాలు.
- » **అర్హత:** సంబంధిత ట్రేడుల్లో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
- » **స్టైపెండ్:** నెలకు ట్రేడ్ అప్రెంటిస్‌కు రూ.7000, డిప్లొమా అప్రెంటిస్‌కు రూ.8000, గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌కు రూ.9000.
- » **వయసు:** కనీసం 18 ఏళ్లు నిండి ఉండాలి.
- » **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్టింగ్, విద్యార్హత మార్కులు, రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **దరఖాస్తులకు చివరితేది:** 25.05.2025
- » **వెబ్‌సైట్:** https://drdo.gov.in

ఎఫ్‌డీడీఐ, హైదరాబాద్‌లో 18 అకడమిక్, నాన్ అకడమిక్ పోస్టులు

హైదరాబాద్ అంకలేశ్వర్‌లోని ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ (ఎఫ్‌డీడీఐ).. ఒప్పంద ప్రాతిపదికన అకడమిక్, నాన్ అకడమిక్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 18.
- » **పోస్టుల వివరాలు:** సీనియర్ ఫ్యాకల్టీ గ్రేడ్1/చీఫ్ ఫ్యాకల్టీ-01, జూనియర్ ఫ్యాకల్టీ/ఫ్యాకల్టీ/సీనియర్ ఫ్యాకల్టీ-08, ల్యాబ్ అసిస్టెంట్-03, జూనియర్ ఫ్యాకల్టీ/ఫ్యాకల్టీ/సీనియర్ ఫ్యాకల్టీ గ్రేడ్ 2, 1-1, అసిస్టెంట్ మేనేజర్-5.
- » **విభాగాలు:** ఫ్యాషన్ డిజైన్, లెదర్ గూడ్స్ అండ్ యాక్సెసరీస్, స్కూల్ ఆఫ్ ఫుట్‌వేర్ డిజైన్ అండ్ ప్రొడక్షన్, ప్రమోషన్స్ అండ్ అడ్మిషన్స్, స్టూడెంట్ అఫైర్ అండ్ ఎగ్జామినేషన్ డిపార్ట్‌మెంట్ తదితరాలు.
- » **అర్హత:** పోస్టును అనుసరించి ఎనిమిదో తరగతి, పదో తరగతి, ఏదైనా డిగ్రీ, సంబంధిత విభాగంలో డిప్లొమా, బీటెక్/బీఈ, ఎంబీఏ, పీజీడీఎం, పీజీ, ఎంఫిల్, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
- » **వేతనం:** నెలకు జూనియర్ ఫ్యాకల్టీ పోస్టుకు రూ.45,000, ఫ్యాకల్టీ పోస్టులకు రూ.65,000, సీనియర్ ఫ్యాకల్టీ గ్రేడ్1కు రూ.80,000, సీనియర్ ఫ్యాకల్టీ గ్రేడ్2కు రూ.1,10,000, చీఫ్ ఫ్యాకల్టీకి రూ.1,50,000, ల్యాబ్ అసిస్టెంట్‌కు రూ.25,000, అసిస్టెంట్ మేనేజర్‌కు రూ.40,000.
- » **వయసు:** కనీసం 18 ఏళ్లు నిండి ఉండాలి.
- » **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **దరఖాస్తులకు చివరితేది:** 26.05.2025.
- » **వెబ్‌సైట్:** https://fddiindia.com

ఎన్ఐఎన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్-2025

హైదరాబాద్‌లోని ఐసీఎంఆర్-నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్(ఎన్ఐఎన్) రెండేళ్ల ఎమ్మెస్సీ(అప్లైడ్ న్యూట్రిషన్), ఎమ్మెస్సీ (స్పోర్ట్స్ న్యూట్రిషన్) కోర్సుల్లో ప్రవేశాలకు కామన్ ఎంట్రన్స్ టెస్ట్-2025 నోటిఫికేషన్ విడుదల చేసింది.
- » **కోర్సుల వివరాలు:** ఎమ్మెస్సీ(అప్లైడ్ న్యూట్రిషన్), ఎమ్మెస్సీ(స్పోర్ట్స్ న్యూట్రిషన్).
- » **కోర్సు వ్యవధి:** రెండేళ్లు.
- » **అర్హత:** కోర్సులను అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ(బీఎస్సీ), ఎంబీబీఎస్, బీడీఎస్‌లో ఉత్తీర్ణులవ్వాలి.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 02.06.2025
- » **ప్రవేశ పరీక్ష తేది:** 06.07.2025.
- » **ఫలితాల వెల్లడితేది:** 14.07.2025.
- » **వెబ్‌సైట్:** https://ibtexamination.com/ICMR_NIN_2025

హాల్, హైదరాబాద్‌లో 127 అప్రెంటిస్‌లు

హైదరాబాద్‌లోని హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్ఏఎల్)..వివిధ విభాగాల్లో అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- » **మొత్తం ఖాళీల సంఖ్య:** 127.
- » **ఖాళీల వివరాలు:** గ్రాడ్యుయేట్(టెక్నికల్) అప్రెంటిస్-61,గ్రాడ్యుయేట్(నాన్ టెక్నికల్) అప్రెంటిస్-32,డిప్లొమా అప్రెంటిస్-34.
- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీటెక్, డిగ్రీ,డిప్లొమా ఉత్తీర్ణుల వ్వాలి.
- » **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా.
- » **ఇంటర్వ్యూ తేది:** 29.05.2025, 30.05.2025, 31.05.2025.
- » **శిక్షణ ప్రారంభతేది:** 24.07.2025.
- » **వెబ్‌సైట్:** http://hal-india.co.in

యూపీఎస్సీలో 84 పోస్టులు

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ).. వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ మైనింగ్ ఇంజనీర్, ట్రైనింగ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 84.
- » **పోస్టుల వివరాలు:** రీసెర్చ్ ఆఫీసర్-01, డిప్యూటీ సూపరింటెండెంట్ ఆర్కియాలజికల్ ఆర్కిటెక్ట్-02, డిప్యూటీ సూపరింటెండింగ్ ఆర్కియాలజికల్ ఇంజనీర్-15, ప్రొఫెసర్ (కెమికల్ ఇంజనీరింగ్)-01, సైంటిఫిక్ ఆఫీసర్-01, అసిస్టెంట్ ప్రొఫెసర్ (కన్‌స్ట్రక్షన్ మేనేజ్‌మెంట్)-01, అసిస్టెంట్ ప్రొఫెసర్ (సాయిల్ మెకానిక్స్)-01, మెడికల్ ఆఫీసర్ (ఫీమేల్)-03, సైంటిస్ట్-బి(ఫోరెన్సిక్ సైకాలజీ)-02, అసిస్టెంట్ డైరెక్టర్(సేఫ్టీ)-02, అసిస్టెంట్ మైనింగ్ ఇంజనీర్ (మైన్స్)-3, అసిస్టెంట్ రీసెర్చ్ ఆఫీసర్-1, సీనియర్ అసిస్టెంట్(కంట్రోలర్ ఆఫ్ మైన్స్)-2, ఇంజనీర్-షిప్ సర్వేయర్ కమ్ డిప్యూటీ జనరల్(టెక్నికల్)-2, ట్రైనింగ్ ఆఫీసర్(ఎక్స్‌ప్ట్ ఉమెన్ ట్రైనింగ్)-4, ట్రైనింగ్ ఆఫీసర్(ఫిట్టర్)-21, ట్రైనింగ్ ఆఫీసర్(మెకానిక్ డీజిల్)-4, ట్రైనింగ్ ఆఫీసర్(మెషినిస్ట్)-1, ట్రైనింగ్ ఆఫీసర్(ప్లంబర్)-3, ట్రైనింగ్ ఆఫీసర్ (సీవింగ్ టెక్నాలజీ)-4, మెడికల్ ఆఫీసర్(ఆయుర్వేద)-9, మెడికల్ ఆఫీసర్(యునాని)-1.
- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఆర్క్, బీటెక్/బీఈ, డిప్లొమా, బీఏఎంఎస్, బీయూఎంఎస్, ఎంఎస్సీ, ఎంఈ/ఎంటెక్‌లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- » **వయసు:** 35 నుంచి 55 ఏళ్లు ఉండాలి.
- » **ఎంపికవిధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**29.05.2025
- » **వెబ్‌సైట్:** https://upsc.gov.in

ఐడీబీఐలో మేనేజర్ కొలువు

బ్యాంకు ఉద్యోగమే లక్ష్యంగా సిద్ధమవుతున్న అభ్యర్థులకు చక్కటి అవకాశం స్వాగతం పలుకుతోంది. ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఐడీబీఐ).. జూనియర్ అసిస్టెంట్ మేనేజర్ (జేఏఎం) గ్రేడ్-ఓ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న బ్యాంక్ బ్రాంచ్‌ల్లో 676 పోస్టులను భర్తీ చేయనుంది. ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తుకు అర్హులు. ఈ నేపథ్యంలో.. ఐడీబీఐ ఉద్యోగాలు, ఎంపిక విధానం, ప్రిపరేషన్ తదితర వివరాలు..

- » 676 పోస్టుల భర్తీకి ఐడీబీఐ నోటిఫికేషన్
- » ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణతతో దరఖాస్తుకు అర్హత
- » జూన్ 8న ఆన్‌లైన్ పరీక్ష నిర్వహణ
- » ఎంపికైతే రూ.6లక్షలకుపైగా వార్షిక వేతనం



మొత్తం 676 పోస్టులు

ఐడీబీఐ మొత్తం 676 జూనియర్ అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల భర్తీకి ప్రకటన ఇచ్చింది. ఇందులో అన్ రిజర్వ్‌డ్‌కు 271,ఎస్సీలకు 140,ఎస్టీలకు 74, ఓబీసీలకు 124, ఈడబ్ల్యూఎస్‌కు 67, దివ్యాంగుల కోటా కింద 31 పోస్టులను కేటాయించారు.

అర్హతలు

గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదైనా డిగ్రీలో ఉత్తీర్ణత సాధించాలి. జనరల్, ఓబీసీ అభ్యర్థులు 60 శాతం, ఎస్సీ, ఎస్టీ, వికలాంగులు 55 శాతం మార్కులతో పాస్ అవ్వాలి. కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి.

వయసు

అభ్యర్థి వయసు 01.05.2025 నాటికి 20 నుంచి 25 ఏళ్ల మధ్యలో ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల గరిష్ట వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.

ఎంపిక ప్రక్రియ

ఆన్‌లైన్ ఆబ్జెక్టివ్ పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక ప్రక్రియ జరుగుతుంది. ఆన్‌లైన్ పరీక్ష, ఆ తర్వాత ఇంటర్వ్యూలోనూ ప్రతిభ చూపిన వారికి వైద్య పరీక్షలు నిర్వహించి తుది విజేతలను ప్రకటిస్తారు.

సమయ నిబంధన

- ✦ ఆన్‌లైన్ పరీక్ష 200 ప్రశ్నలు-200 మార్కులకు ఉంటుంది. ఈ ఆబ్జెక్టివ్ తరహా పరీక్షలో ప్రతి ప్రశ్నకు ఒక మార్కు కేటాయించారు. ప్రశ్నపత్రం హిందీ, ఇంగ్లిష్‌లో ఉంటుంది. పరీక్షలో నాలుగు విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష వ్యవధి రెండు గంటలు. ఇందులో సెక్షన్ల వారీగా ప్రశ్నలకు సమయ నిబంధన వర్తిస్తుంది.
- ✦ లాజికల్ రీజనింగ్, డేటా అనాలసిస్ అండ్ ఇంటర్‌ప్రెటేషన్ నుంచి 60 ప్రశ్నలు- 60 మార్కులకు.. 40 నిమిషాల వ్యవధి; ఇంగ్లిష్ లాంగ్వేజ్ 40 ప్రశ్నలు-40 మార్కులకు.. 20 నిమిషాల వ్యవధి; క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ 40 ప్రశ్నలు-40 మార్కులకు.. 35 నిమిషాలు; జనరల్ ఎకానమీ/బ్యాకింగ్ అవేర్‌నెస్/కంప్యూటర్ అవేర్‌నెస్ 60 ప్రశ్నలు- 60 మార్కులకు.. 25 నిమిషాలు వ్యవధి ఉంటుంది. ఈ నిర్ణీత సయమంలోనే ఆయా సెక్షన్లను అభ్యర్థి ముగించాల్సి ఉంటుంది. నెగెటివ్ మార్కులు ఉన్నాయి. ప్రతి తప్పు సమాధానానికి పావు మార్కు(0.25) తగ్గిస్తారు. పోటీలో నిలవాలంటే.. సెక్షన్ల వారీగా కనీస మార్కులు పొందడం తప్పనిసరి

100 మార్కులకు ఇంటర్వ్యూ

రిజర్వేషన్లు, కేటగిరీల వారీగా ఒక్కో పోస్టుకు ఎంతమందిని ఇంటర్వ్యూకు ఎంపిక చేయాలన్నది ఎంపిక బోర్డు నిర్ణయిస్తుంది. ఇంటర్వ్యూకు 100 మార్కులు కేటాయించారు. ఇందులో కనీసం 50 శాతం మార్కులు సాధించాలి. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు 45 శాతం మార్కులు రావాలి.

వెయిటేజీ స్కోరుతో తుది జాబితా

ఆన్‌లైన్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూలకు ఐడీబీఐ బ్యాంకు వేర్వేరుగా వెయిటేజీని నిర్ణయిస్తుంది. ఆన్‌లైన్ రాత పరీక్ష 200 మార్కులను 75 మార్కులకు, వంద మార్కులకు నిర్వహించే ఇంటర్వ్యూను 25 మార్కులకు నార్మలైజేషన్ చేస్తుంది. ఇలా మొత్తం వంద మార్కులకు సాధించిన స్కోర్ ఆధారంగా మెరిట్ జాబితాను రూపొందిస్తారు. ఈ లిస్టులో చోటు దక్కిన వారికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అనంతరం ఐడీబీఐ ఆఫర్ లెటర్లను అందజేస్తుంది.

వేతనం

ఆన్‌లైన్ పరీక్ష, ఇంటర్వ్యూ, మెడికల్ టెస్టులో ప్రతిభ చూపి విజేతలుగా నిలిచి ఉద్యోగం సొంతం చేసుకున్న వారికి రూ.6.14 లక్షల వార్షిక వేతనం (నగరాల్లో రూ.6.50 లక్షలు)అందుతుంది.దీంతోపాటు డీఏ,హెచ్ఆర్ఏ,ఇతర అలవెన్సులు లభిస్తాయి.

కెరీర్

ఎంపికైన వారికి జూనియర్ అసిస్టెంట్ మేనేజర్ గ్రేడ్-ఓ హోదాతో కెరీర్ ప్రారంభం అవుతుంది. బ్యాంకులో చేరిన నాటి నుంచి ఏడాది పాటు ప్రొబేషనరీగా విధులు నిర్వహించాల్సి ఉంటుంది. బ్యాంకులోని ఏ డిపార్ట్‌మెంట్లో అయినా పోస్టింగ్ ఇవ్వొచ్చు. అలాగే, దేశంలో ఎక్కడైనా పని చేసేందుకు సిద్ధంగా ఉండాలి. ప్రతిభ ఆధారంగా మూడేళ్ల తర్వాత గ్రేడ్-ఏ ఆఫీసర్‌గా పదోన్నతి లభిస్తుంది. నిర్ణీత సమయానికి ఇంక్రిమెంట్లు, ప్రమోషన్లు ఉంటాయి.

రాత పరీక్షలో రాణించేలా

- ✦ లాజికల్ రీజనింగ్, డేటా అనాలిసిస్ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్‌కు సంబంధించి డైరక్షన్స్, డిస్టెన్స్,అనాలజీ,బ్లడ్ రిలేషన్స్,సిరీస్, డబుల్ లైనప్, డయాగ్రమ్స్, ఫ్లో చార్ట్‌లను ప్రాక్టీస్ చేయాలి.
- ✦ ఇంగ్లిష్‌కు సంబంధించి గ్రామర్ అంశాలపై పూర్తి అవగాహన ఏర్పరచుకోవాలి. ముఖ్యంగా వొకాబ్యులరీ, కాంప్రహెన్షన్‌లపై పట్టు సాధించాలి. అదే విధంగా సింపుల్, కాంప్లెక్స్, కాంపౌండ్ సెంటెన్స్‌లను ప్రాక్టీస్ చేయాలి.
- ✦ క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్‌కు సంబంధించి మ్యాథమెటిక్స్‌లోని కోర్ అంశాలతోపాటు అర్థమెటిక్ అంశాలు(నిష్పత్తులు, శాతాలు, టైం అండ్ డిస్టెన్స్, టైం అండ్ వర్క్, యావరేజెస్, స్క్వేర్ రూట్స్, క్యూబ్ రూట్స్, కూడికలు, హెచ్చవేతలు తదితర)పై దృష్టి పెట్టాలి.
- ✦ నాలుగో విభాగంలోని జనరల్ అవేర్‌నెస్‌కు సంబంధించి కరెంట్ అఫైర్స్‌పై పట్టు సాధించాలి. ఎకానమీకి సంబంధించి ఇటీవల కాలంలో ఆర్థిక రంగంలో చోటు చేసుకుంటున్న పరిణామాలు తెలుసుకోవాలి. బ్యాంకింగ్ అవేర్‌నెస్ విషయంలో బ్యాంకింగ్ వ్యవస్థ స్వరూపంతో పాటు తాజా పరిణామాలు, బ్యాంకింగ్ టెర్మినాలజీపై అవగాహన ఏర్పరచుకోవాలి. కంప్యూటర్/ఐటీ అవేర్‌నెస్ విషయంలో అభ్యర్థులు కంప్యూటర్ ఆపరేషన్ టూల్స్‌పై పట్టు సాధించాలి.

ముఖ్య సమాచారం

- ✦ **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలి
- ✦ **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేది:** 20.05.2025
- ✦ **ఆన్‌లైన్ పరీక్ష తేది:** 08.06.2025
- ✦ **వెబ్‌సైట్:** https://www.idbibank.in

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సూచీ	మార్పు	ముగింపు
సెన్సెక్స్ ▽	200	82,331
నిఫ్టీ ▽	42	25,020

విదేశీ సూచీలు

సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	19,211	△	99
డోజోన్స్	42,655	△	332
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,685	△	51
డాక్స్	23,767	△	72
షాంఘై	3,367	▽	13
నికాయ్	37,754	▽	2

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	85.00	86.02
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	112.40	115.33
€	యూరో	ఎస్‌బీఐ	94.47	97.15
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	58.10	59.62
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.82	53.03
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	63.55	68.22
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.90	23.41
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.39	24.17
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.99	12.81

మీ పెట్టుబడి బంగారం గాను!

ఒకవైపు ఈక్విటీలు, క్రిప్టోలు అస్థిరతలను ఎదుర్కొంటున్నాయి. మరోవైపు రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో డిమాండ్ నీరసించింది. ఇదే కాలంలో బంగారం సైలెంట్‌గా ర్యాలీ చేయడం చూశాం. ఈక్విటీలు దీర్ఘకాలంలో మెరుగైన రాబడులకు వేదిక అనడంలో ఎలాంటి సందేహం లేదు. కానీ, అన్ని కాలాల్లోనూ అత్యుత్తమైన పెట్టుబడి సాధనం ఏదంటే..? అది బంగారమే. ఈ అర్థంలోనే దీన్ని 'గోట్ అసెట్'గా చెబుతారు. గడిచిన రెండేళ్లలోనే కాదు.. గత రెండు దశాబ్దాల్లోనూ ఈక్విటీలకు మించి రాబడులను అందించిన పసిడిని ప్రతీ ఇన్వెస్టర్ తన పోర్ట్‌ఫోలియోలో చేర్చుకోవడం మంచి నిర్ణయంగా నిపుణులు చెబుతున్నారు. పెట్టుబడులకు రిస్క్ తగ్గించుకుని, వైవిధ్యం కోసం, రాబడుల స్థిరత్వం కోసం తప్పకుండా పుత్తడికి ప్రాధాన్యం ఇవ్వాల్సిందేనంటున్నారు.

– సాక్షి, బిజినెస్‌డెస్క్

- అన్ని కాలాలకూ అనువైన ఆర్థిక సాధనం.. పుత్తడి
- సంక్షోభ, విపత్కర పరిస్థితుల్లో కొండంత అండ
- పెట్టుబడులకు చక్కని వైవిధ్యం..
- తక్కువ వడ్డీపై సులభంగా రుణం
- పెట్టుబడుల్లో పసిడికి 10 శాతం వాటా

భారతీయుల్లో ఎక్కువ మంది బంగారాన్ని ఆభరణంగా, విలువైన సాధనంగానే చూస్తుంటారు. కానీ, ఇటీవలి కాలంలో పెట్టుబడుల పరంగానూ బంగారానికి ప్రాధాన్యం పెరుగుతోంది. అస్థిరతల్లో సురక్షిత సాధనంగా పసిడికి గుర్తింపు ఇప్పుడు వచ్చింది కాదు. చారిత్రకంగా ఎప్పటి నుంచో ఉన్నదే. కాకపోతే సెంట్రల్ బ్యాంక్‌లు (ఆర్‌బీఐ, ఇతరత్రా) రిజర్వ్ అసెట్‌గా బంగారానికి ఈ మధ్యకాలంలో అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయి. ఎడాపెడా కొనుగోలు చేస్తున్నాయి. దీనికితోడు భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ఇటీవలి కాలంలో ఎన్నడూ లేనంత పెరిగిపోవడం.. అంతర్జాతీయ వాణిజ్యం పరంగా రక్షణాత్మక ధోరణులు పెరిగిపోతున్న తరుణంలో పసిడి మరింత బలాన్ని సంతరించుకుంది. కనుక ప్రతి ఒక్కరి పెట్టుబడులకు పుత్తడి వన్నెతెస్తుందనేది నిపుణుల మాట.

రాబడుల చరిత్ర..

గత 25 ఏళ్ల కాలంలో పసిడి ఎస్అండ్‌పీ 500తోపాటు నిఫ్టీ–50ని మించి రాబడులను ఇచ్చినట్టు ఈక్విటాస్ ఇన్వెస్ట్‌మెంట్స్ చెబుతోంది. 2000 సంవత్సరం నుంచి చూస్తే బంగారం డాలర్ మారకంలో 10 రెట్లు పెరిగింది. ఇదే కాలంలో ఎస్అండ్‌పీ 500 రాబడులు నాలుగున్నర రెట్లుగా ఉన్నాయి. రూపాయి మారకంలో చూసినా బంగారం గత 25 ఏళ్లలో 20 రెట్లు పెరగ్గా.. సెన్సెక్స్ ఇదే కాలంలో 16 రెట్లు ప్రతిఫలాన్నిచ్చింది. ఇక గత 15 ఏళ్లలో చూస్తే బంగారం ఏటా 12 శాతం రాబడులను సగటున ఇచ్చింది. ఇదే కాలంలో సెన్సెక్స్ రాబడి ఏటా 10–11 శాతం మధ్య ఉందన్నది ఈక్విటాస్ ఇన్వెస్ట్‌మెంట్స్ విశ్లేషణ. ''2000 నుంచి నిఫ్టీ కంటే బంగారమే అధిక రాబడిని ఇచ్చింది. గోల్డ్ సీఎఫ్‌డీలు (ఫ్యూచర్ కాంట్రాక్టులు) 2,000 శాతం పెరగ్గా.. నిఫ్టీ–50 సూచీ రాబడి 1470 శాతంగా ఉంది'' అని జెరోదా సహ వ్యవస్థాపకుడు నితిన్ కామత్ ఎక్స్ ప్లాట్‌ఫామ్‌లో చేసిన పోస్ట్‌లో వివరించారు.

పెట్టుబడిలో పుత్తడికి వాటా

పెట్టుబడుల్లో వైవిధ్యం దృష్ట్యా కొంత మొత్తాన్ని పసిడిలోనూ ఇన్వెస్ట్ చేసుకోవాలన్నది మెజారిటీ నిపుణుల సూచన. ఒకరు తమ మొత్తం పెట్టుబడుల్లో 10 నుంచి 15 శాతం వరకు బంగారంపై ఇన్వెస్ట్ చేసుకోవచ్చని క్వాంటమ్ మ్యూచువల్ ఫండ్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ చిరాగ్ మెహతా సూచించారు. పసిడే కాదు, వెండి కూడా దీర్ఘకాలంలో పెట్టుబడులను వృద్ధి చేస్తుందని స్టాక్స్‌కార్ట్ (డిస్కౌంట్ బ్రోకర్) సీఈవో ప్రణయ్ అగర్వాల్ అభిప్రాయం. ఇన్వెస్టర్లు తమ పెట్టుబడుల్లో 5–8 శాతం వరకు పసిడి, వెండికి కేటాయించుకోవచ్చని సూచించారు. ''బంగారం ఒక ప్రత్యామ్నాయ సాధనం. కొత్త రిజర్వ్ కరెన్సీ అని, డాలర్లను భర్తీ చేస్తుందని ఎక్కడో చదివాను. అదే జరిగితే రూ.90,000 ధరకు అర్థమే లేదు'' అని మార్కెట్ నిపుణుడు సునీల్ సుబ్రమణ్యం అభిప్రాయపడ్డారు. రిజర్వ్ కరెన్సీగా మారితే అప్పుడు బంగారం ఇంకా పెరగొచ్చన్నది ఆయన ఉద్దేశం. ఆర్‌బీఐ విదేశీ మారక నిల్వల్లో బంగారం వాటా 2024 సెప్టెంబర్ చివరికి 9.32 శాతంగా ఉంటే, 2025 మార్చి నాటికి 11.70 శాతానికి పెరిగింది. ప్రపంచవ్యాప్తంగా ఎన్నో కేంద్ర బ్యాంక్‌లు ఇదే మాదిరి బంగారం నిల్వలు పెంచుకుంటున్నాయి.



అన్ని కాలాల్లోనూ అత్యుత్తమం ఎందుకు?

సురక్షిత సాధనం: ఆర్థిక సంక్షోభాలు, అనిశ్చితులు, యుద్ధాల వంటి పరిస్థితుల్లో బంగారానికి డిమాండ్ ఏర్పడుతుంది. ఆ సమయంలో ఇందులోకి అధిక పెట్టుబడులు రావడంతో పసిడి మరింత విలువను సంతరించుకుంటుంది. అలాంటి సంక్షోభాల్లో ఈక్విటీలు, రియల్ ఎస్టేట్ వంటి ప్రత్యామ్నాయ పెట్టుబడులు అమ్మకాల ఒత్తిడికి గురవుతుంటాయి. తాజా డిమాండ్ వెనక్కి వెళుతుంది.

స్టోర్ ఆఫ్ వ్యాల్యూ: పసిడిని బీరువాలో ఉంచినా.. బ్యాంక్ లాకర్లో ఉంచినా కొంత కాలానికి దాని విలువ పెరిగేదే కానీ తరిగేది కాదు. అందుకే దీనికి స్టోర్ ఆఫ్ వ్యాల్యూ గుర్తింపు. అదే మిగిలిన పెట్టుబడులకు ద్రవ్యోల్బణం సెగ ఉంటుంది.

పరిమిత సరఫరా: బంగారం ఉత్పత్తి ఏటేటా పెరిగేది కాదు. బంగారం మైనింగ్ అత్యంత సంక్లిష్టమైనది. దీని సరఫరా స్థిరంగానే ఉంటుంది. కానీ, డిమాండ్ మాత్రం ఏటేటా పెరుగుతోంది. ఈ డిమాండ్ పసిడి ధరలకు మద్దతుగా నిలుస్తుంది.

వైవిధ్యం: పెట్టుబడులు అన్నీ ఒకే చోట ఉంటే.. ఆ విభాగంలో సమస్యాత్మక పరిస్థితులు ఏర్పడితే.. విలువకు నష్టం కలుగుతుంది. అందుకే పెట్టుబడులకు వైవిధ్యం కూడా అవసరమే. ఈ విషయంలో పుత్తడి ఒక ప్రత్యామ్నాయ పెట్టుబడి సాధనం.

చిటికెలో రుణం: బంగారం కాయిన్లపై (బ్యాంకుల్లో కొనుగోలు చేసిన వాటికే ఇవ్వాలన్నది ఆర్‌బీఐ తాజా ప్రతిపాదన), ఆభరణాలపై 9–10 శాతం మేర వార్షిక వడ్డీపై బ్యాంకుల నుంచి సులభంగా రుణం లభిస్తుంది.

పెట్టుబడి సాధనాలు..

బంగారంలో పెట్టుబడి భౌతికం కంటే డిజిటల్‌గానే సౌకర్యంగా ఉంటుంది. డిజిటల్ సాధనాల్లో గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్, గోల్డ్ మ్యూచువల్ ఫండ్స్‌ను ఇన్వెస్టర్లు పరిశీలించొచ్చు. ఎంఎంటీసీ తదితర సంస్థల భాగస్వామ్యంతో ఫిన్‌టెక్ ప్లాట్‌ఫామ్‌లు డిజిటల్ గోల్డ్‌ను రూపాయి నుంచి కొనుగోలు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నాయి.

గోల్డ్ ఈటీఎఫ్‌లు

ఇవి స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల్లో రోజువారీ ట్రేడ్ అవుతుంటాయి. మ్యూచువల్ ఫండ్స్ సంస్థలే వీటిని నిర్వహిస్తుంటాయి. షేర్ల మాదిరే ఏ పనిదినంలో అయినా కొనుగోలు, విక్రయాలు చేసుకోవచ్చు. డీమ్యాట్ ఖాతా అవసరం. ఇందులో పెట్టుబడి విలువపై ఫండ్ సంస్థకు ఎక్స్‌పెన్స్ రేషియో, కొనుగోలుపై బ్రోకర్లకు చార్జీ చెల్లించాల్సి ఉంటుంది. ఒక గోల్డ్ ఈటీఎఫ్ ధర గ్రాము బంగారం మార్కెట్ ధరను ప్రతిఫలిస్తుంది.



గోల్డ్ ఈటీఎఫ్‌లను ఇప్పుడు చాలా సంస్థలు 0.01 గ్రాముల కింద ఆఫర్ చేస్తున్నాయి. కనుక రూ.90 నుంచి వీటిలో ఫ్రాక్షన్ యూనిట్‌ను కొనుగోలు చేసుకోవచ్చు. గోల్డ్ ఈటీఎఫ్‌లను నిర్వహించే సంస్థలు వాటి ఇష్యూ పరిమాణంకు అనుగుణంగా భౌతిక బంగారాన్ని కొనుగోలు చేసి భద్రపరుచుకోవడం తప్పనిసరి.

గోల్డ్ మ్యూచువల్ ఫండ్స్

గోల్డ్ ఈటీఎఫ్‌ల్లో ఇవి ఇన్వెస్ట్ చేస్తుంటాయి. డీమ్యాట్ ఖాతాలేకపోయినా గోల్డ్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవడం సానుకూలత. బ్రోకర్ల సాయం లేకుండా ఫండ్స్ సంస్థ నుంచే కొనుగోలు చేస్తున్నందున బ్రోకరేజీ చార్జీలు పడవు. కాకపోతే ఇందులోనూ ఎక్స్‌పెన్స్ రేషియో చెల్లించాలి. గోల్డ్ ఈటీఎఫ్‌లు, గోల్డ్ మ్యూచువల్ ఫండ్స్ సెబీ నియంత్రణల పరిధిలోకి వస్తాయి. కనుక పెట్టుబడులు సురక్షితం. ఉదాహరణకు ఎస్‌బీఐ గోల్డ్ మ్యూచువల్ ఫండ్ డైరెక్ట్ ప్లాన్‌లో గత పదేళ్లలో రాబడి వార్షికంగా 12.66 శాతంగా ఉంది. నిప్పన్ ఇండియా గోల్డ్ ఈటీఎఫ్, ఎస్‌బీఐ గోల్డ్ ఈటీఎఫ్‌లు గత పదేళ్లలో 8.5–9.5 శాతం మధ్య రాబడిని ఇచ్చినట్టు గణాంకాలు తెలియజేస్తున్నాయి. గోల్డ్ మ్యూచువల్ ఫండ్స్‌లో అయితే సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ ద్వారా రూ.500 నుంచి ఇన్వెస్ట్ చేసుకోవచ్చు.



భౌతిక బంగారం

కొందరికి డిజిటల్ బంగారంలో పెట్టుబడి నచ్చకపోవచ్చు. భౌతికంగా చూసుకోవడమే ఇష్టం. అలాంటి వారు ఆభరణాలకు బదులు బ్యాంక్‌లు విక్రయించే కాయిన్లను పరిశీలించొచ్చు. భౌతిక బంగారం అయితే జాగ్రత్త పరుచుకోవడం కొంత రిస్క్‌తో కూడినది. కనుక మొదటి ప్రాధాన్యం డిజిటల్ బంగారానికే ఇవ్వాలి. కాయిన్లు, ఆభరణాల రూపంలో కొనుగోలు చేస్తే విలువపై 3 శాతం జీఎస్‌టీ చెల్లించాలి. అదే ఆభరణాలు అయితే జీఎస్‌టీకి అదనంగా తయారీ చార్జీల రూపంలో మరో 5–15 శాతం అదనంగా ఖర్చు చేయాల్సి ఉంటుంది. తిరిగి అవే ఆభరణాలను మార్చుకోవాలనుకుంటే, వాటిని గతంలో కొనుగోలు చేసినప్పుడు చెల్లించిన తయారీ చార్జీలు, జీఎస్‌టీ మేర నష్టపోవాల్సి వస్తుంది. అంతేకాదు పాత ఆభరణాలను కొత్త వాటితో మార్పిడి చేసుకున్నప్పటికీ.. కొత్త ఆభరణం బరువు ప్రకారమే విలువపై జీఎస్‌టీ చెల్లించాల్సి ఉంటుంది. మార్చుకున్న పాత బంగారం మేర జీఎస్‌టీకి మినహాయింపు లేదు.

డిజిటల్ గోల్డ్

ఫోన్‌పే, పేటీఎం తదితర సంస్థలు డిజిటల్ గోల్డ్‌ను ఆఫర్ చేస్తున్నాయి. రూపాయి నుంచి కొనుగోలు చేసుకోవచ్చు. కానీ, మిగిలిన డిజిటల్ బంగారం సాధనాలు మాదిరిగా ఇవి సెబీ నియంత్రణలో పనిచేయవు. పైగా వీటి కొనుగోలు, విక్రయంపై చార్జీల విషయంలో పారదర్శకత లేదు.

పన్ను బాధ్యత

- బంగారం కాయిన్లు, బిస్కెట్లు, ఆభరణాలు తదితర భౌతిక రూపంలోని బంగారాన్ని కొనుగోలు చేసి రెండేళ్ల తర్వాత విక్రయించినట్టయితే వచ్చిన లాభం దీర్ఘకాల మూలధన లాభం అవుతుంది. దీనిపై 12.5% పన్ను చెల్లించాలి. రెండేళ్లలోపు విక్రయిస్తే వచ్చిన లాభం స్వల్పకాల మూలధన లాభం అవుతుంది. ఈ మొత్తాన్ని వార్షిక ఆదాయానికి కలిపి తమ మొత్తం ఆదాయానికి వర్తించే రేటు ప్రకారం పన్ను చెల్లించాలి. పాత ఆభరణాన్ని కొత్త ఆభరణంతో మార్చుకుంటే అప్పుడు పాత బంగారాన్ని విక్రయించినట్టుగానే చట్టం పరిగణిస్తుంది. కనుక పాత ఆభరణంపై వచ్చిన లాభంపై పన్ను చెల్లించాల్సి ఉంటుంది.
- డిజిటల్ గోల్డ్‌కూ భౌతిక బంగారానికి మాదిరే పన్ను రేట్లు వర్తిస్తాయని ట్యాక్స్‌మ్యాన్ డాట్ కామ్ వైస్ ప్రెసిడెంట్ నవీన్ వాధ్వా తెలిపారు
- గోల్డ్ మ్యూచువల్ ఫండ్‌కు సైతం భౌతిక బంగారం నిబంధనలే వర్తిస్తాయి.
- గోల్డ్ ఈటీఎఫ్‌లను ఏడాదిలోపు విక్రయిస్తే వచ్చిన స్వల్పకాల మూలధన లాభం వార్షిక ఆదాయం కింద చూపించి పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఏడాది తర్వాత విక్రయించినట్టయితే వచ్చిన దీర్ఘకాల మూలధన లాభంపై 12.5 శాతం పన్ను చెల్లిస్తే సరిపోతుంది.



బంగారాన్ని ఇప్పుడు ఆభరణం కంటే ఎక్కువగా చూస్తున్నారు. సురక్షితమైన లిక్విడ్ అసెట్‌గా. అత్యవసరాల్లో హెడ్జింగ్‌గా పరిగణిస్తున్నారు.

– పృథ్వీరాజ్ కొఠారి, రిద్ధిసిద్ధి బులియన్స్ ఎండీ



భారతీయ గృహిణి అత్యంత తెలివైన ఫండ్ మేనేజర్ అనడానికి కాలక్రమంలో బంగారంపై రాబడే నిదర్శనం.

– ఉదయ్ కోటక్, కోటక్ మహీంద్రా బ్యాంక్ ఫౌండర్

సమీప కాలంలో ధరలు ఎలా ఉండొచ్చు..?

బంగారాన్ని స్వల్పకాల దృష్టితో కొనుగోలు చేయడం సూచనీయం కాదు. తమ అవసరాలు, పెట్టుబడుల కోణంలోనే దీర్ఘకాలానికి నిర్దేశిత పరిమితులకు లోబడి కొనుగోలు చేసుకోవాలి. కానీ, అమెరికా–చైనా మధ్య వాణిజ్య సయోధ్య, ఉక్రెయిన్–రష్యా మధ్య చర్చలకు సానుకూల త నేపథ్యంలో ఆల్‌టైమ్ గరిష్టాల నుంచి బంగారం ధరలు దిగొస్తున్నాయి. ఔన్స్‌కు అంతర్జాతీయంగా 3,510 డాలర్ల వరకు వెళ్లిన బంగారం ధర 3,180 డాలర్లకు తగ్గింది.



ఇప్పటికీ దీర్ఘకాలానికి బంగారం పట్ల నిపుణులు బుల్లిష్ ధోరణినే వ్యక్తం చేస్తున్నారు. వచ్చే 30–40 రోజుల్లో ఔన్స్ బంగారం ధర 3,150 డాలర్ల స్థాయికి రావొచ్చన్నది మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ కమోడిటీస్ రీసెర్చ్ హెడ్ నవనీత్ దమాని అంచనా. దేశీయంగా 10 గ్రాములకు (24 క్యారెట్లు) రూ. 90,00–91,000 వరకు దిగిరావొచ్చన్నారు. 2,900–3,000 డాలర్ల స్థాయికి సైతం బంగారం అంతర్జాతీయ మార్కెట్లో తగ్గొచ్చని, కొంత కాలం స్థిరీకరణ చెందొచ్చన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి.



స్టాక్స్ వ్యూ

సిర్మా ఎస్‌జీఎస్ టెక్నాలజీ | బ్రోకరేజ్: మోతీలాల్ ఓస్వాల్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 526 టార్గెట్: రూ. 630

ఎందుకంటే: కంపెనీ ఎఫ్‌ఐ25 క్యూ4లో బలమైన నిర్వహణ పనితీరు చూపించింది. ఎబిట్డా వార్షికంగా 510 బేసిస్ పాయింట్లు మెరుగుపడి, 46 శాతం వృద్ధి చెందింది. తక్కువ మార్జిన్ కలిగిన కన్జ్యూమర్ బిజినెస్ వాటా 46 శాతం నుంచి 21 శాతానికి తగ్గడం అనుకూలించింది. కన్జ్యూమర్ విభాగం వ్యాపారం 64 శాతం, హెల్త్‌కేర్ వ్యాపారం 20 శాతం తగ్గడం వల్ల ఆదాయం 19 శాతం క్షీణించింది. ఆర్డర్ పుస్తకం 19 శాతం వృద్ధితో క్యూ4 చివరికి (2025 మార్చి) రూ.5,300 కోట్లకు చేరుకుంది. 2025–26లో ఆదాయం 30–35 శాతం మధ్య పెరుగుతుందని, ఎబిటా మార్జిన్ 8 శాతంగా ఉంటుందని యాజమాన్యం గైడెన్స్ ఇచ్చింది. కనుక 2025–26, 2026–27 ఆర్థిక సంవత్సరాలకు గతంలో ప్రకటించిన ఈపీఎస్ అంచనాలను కొనసాగిస్తూ.. స్టాక్‌కు రూ.630 టార్గెట్ ధరతో కొనుగోలు సిఫారసు చేస్తున్నట్టు మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ తెలిపింది.



ఇండియన్ హోటల్స్ | బ్రోకరేజ్: మిరే అసెట్ షేర్‌ఖాన్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 766 టార్గెట్: రూ. 917

ఎందుకంటే: ఇండియన్ హోటల్స్ కంపెనీ లిమిటెడ్ క్యూ4 ఫలితాలు మార్కెట్ అంచనాల ప్రకారం వెలువడ్డాయి. నికరలాభం క్యూ4లో 27% ఇయర్ ఆన్ ఇయర్ 38% వృద్ధిని నమోదు చేసింది. ఎబిటా మార్జిన్ 70 బేసిస్ పాయింట్లు పెరిగి 35.3%కి చేరింది.2026 ఆర్థిక సంవత్సరంలో ఇండియన్ హోటల్స్ కంపెనీ రెండంకెల ఆదాయ వృద్ధిని సాధిస్తుందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. దీనికి కారణం పనితీరు మెరుగుపడటం, కొత్త వ్యాపారాలు, హోటల్స్ ప్రారంభాలలో వేగం, పరిశ్రమలో లభిస్తున్న మెరుగైన అవకాశాల వలన సాధ్యమవుతుందని అంచనా. 2025–26 ఆర్థిక సంవత్సరంలో రూ.1,200 కోట్ల పెట్టుబడులను ప్రణాళికాబద్ధంగా ఖర్చు చేయనుంది. దీనిలో 60–65 శాతం ప్రస్తుత ఆస్తుల మరమ్మతులు, నిర్వహణ కోసం కేటాయిస్తుండగా మిగతా 35–40% గ్రీన్‌ఫీల్డ్ ఆస్తుల అభివృద్ధికి వినియోగించనుంది.



గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

అత్యవసర నిధికి మార్గం ఏది?



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్



ప్రస్తుత మార్కెట్ పరిస్థితుల్లో లార్జ్‌క్యాప్, లార్జ్ అండ్ మిడ్‌క్యాప్ విభాగం మధ్య ఏ ఫండ్స్ మెరుగైనవి?

– వీణారాణి

దీర్ఘకాలంలో ఏ విభాగం మంచి పనితీరు చూపిస్తుందన్నది ఊహించడమే అవుతుంది. ఈక్విటీల్లో పెట్టుబడులు పెడుతున్నప్పుడు కాల వ్యవధి కనీసం ఐదేళ్లకు తగ్గకుండా ఉండాలి. ఇన్వెస్ట్ చేసిన ఆ ఐదేళ్ల కాలంలోనూ మార్కెట్ సైకిల్ ఉండొచ్చు. కొన్ని సందర్భాల్లో లార్జ్‌క్యాప్ కంపెనీలు మంచి పనితీరు చూపిస్తాయి. కొన్ని సందర్భాల్లో మిడ్ క్యాప్ మంచి ప్రదర్శన చేస్తాయి. కొన్ని సందర్భాల్లో స్మాల్‌క్యాప్ ఇంకా మంచి రాబడులను ఇస్తుంటాయి. కనుక ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవడం సానుకూలం. ఫ్లెక్సీక్యాప్ ఫండ్ ఏ విభాగంలో అయినా ఇన్వెస్ట్ చేసే స్వేచ్ఛతో ఉంటుంది. మార్కెట్లో ఒక విభాగం మంచి పనితీరు, మరో విభాగం బలహీన పనితీరు చూపిస్తున్న సందర్భాల్లో ఫ్లెక్సీక్యాప్ పథకంలో పెట్టుబడుల ద్వారా దీన్ని చక్కగా అధిగమించగలరు.

నేను అధిక పన్ను శ్లాబులోకి వస్తాను. ఎఫ్‌డీలపై ఆదాయం సైతం పన్ను పరిధిలోకి వస్తుంది. అత్యవసర నిధిని డెట్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చా..?

– జగన్నాథ స్వామి


మీ అత్యవసర నిధిలో కొంత భాగాన్ని డెట్ మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవడం మంచి నిర్ణయమే అవుతుంది. అత్యవసర నిధిని మూడు భాగాలుగా వర్గీకరించుకుని ఇన్వెస్ట్ చేసుకోవాలి. మొదటి భాగం అత్యవసర నిధిని నగదు రూపంలోనే ఉంచుకోవాలి. రెండో భాగాన్ని బ్యాంకు ఖాతా లేదంటే ఫిక్స్‌డ్ డిపాజిట్ రూపంలో పెట్టుకోవచ్చు. లేదా వెంటనే నగదుగా మార్చుకోగలిగిన మరొక సాధనంలో అయినా ఇన్వెస్ట్ చేసుకోవాలి. మూడో భాగాన్ని లిక్విడ్ ఫండ్ లేదా అల్ట్రా షార్ట్ డ్యురేషన్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేసుకోవాలి. దీనివల్ల రాబడులు సానుకూలంగా ఉంటాయి. పన్ను పరంగా ప్రత్యేక అనుకూలతలు ఏవీ లేవు. ఫిక్స్‌డ్ డిపాజిట్ల మాదిరిగా కాకుండా.. డెట్ ఫండ్స్‌లో పెట్టుబడులను వెనక్కి తీసుకున్నప్పుడే రాబడులపై పన్ను వర్తిస్తుంది. ఫిక్స్‌డ్ డిపాజిట్ అయితే ప్రతీ ఆర్థిక సంవత్సరంలోనూ వడ్డీ ఆదాయాన్ని పన్ను చెల్లింపుదారు తన వార్షిక ఆదాయానికి కలిపి చూపించాల్సి ఉంటుంది. వారి శ్లాబు రేటు ప్రకారం పన్ను చెల్లించాలి. అధిక పన్ను శ్లాబు పరిధిలోకి వచ్చే వారికి ఫిక్స్‌డ్ డిపాజిట్ రూపంలో వచ్చే ఆదాయంపై 30 శాతం పన్ను పడుతుంది. డెట్ మ్యూచువల్ ఫండ్స్‌లోనూ 2023 ఏప్రిల్ 1 తర్వాత చేసిన పెట్టుబడులను విక్రయిస్తే.. ఎంతకాలం అన్నదానితో సంబంధం లేకుండా లాభం మొత్తం వార్షిక ఆదాయానికి కలుస్తుంది. కనుక ఈ ఆదాయంపైనా మీరు గరిష్ఠ పన్ను చెల్లించాల్సి వస్తుంది. అయితే, ఎఫ్‌డీలతో పోలిస్తే డెట్ ఫండ్స్ కాస్త మెరుగైన రాబడులిస్తాయి. కానీ, డెట్ ఫండ్స్‌లో రాబడులకు హామీ ఉండదు. ఫిక్స్‌డ్ డిపాజిట్స్ మాదిరి ఒక్కో ఇన్వెస్టర్‌కు గరిష్ఠంగా రూ.5 లక్షల పెట్టుబడికి బీమా రక్షణ హామీ కూడా ఉండదు. లిక్విడ్ ఫండ్స్, అల్ట్రా షార్ట్ డ్యురేషన్ ఫండ్స్ తక్కువ రిస్క్ విభాగంలోకి వస్తాయి.

ఫ్యూచర్ జనరాలీ 'హెల్త్ అన్‌లిమిటెడ్' బీమా పాలసీ




సమగ్ర ఆరోగ్య బీమా భద్రతను అందించే దిశగా హెల్త్ అన్‌లిమిటెడ్ పేరిట హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీని ఫ్యూచర్ జనరాలీ ఇండియా ఇన్సూరెన్స్ ప్రవేశపెట్టింది. సమ్ ఇన్సూర్డ్‌తో సంబంధం లేకుండా పాలసీ జీవితకాలంలో ఒక్కసారి క్లెయిమ్ ఎంతైనా సరే బీమా సంస్థ పూర్తిగా చెల్లిస్తుంది. పెరుగుతున్న వైద్య వ్యయాల నుంచి రక్షణ కల్పించేలా ఏటా సమ్ ఇన్సూర్డ్ పెరుగుతుంది. గత నాలుగేళ్లలో క్లెయిమ్ చేయని పక్షంలో అయిదో ఏట చెల్లించే రెన్యువల్ ప్రీమియంలో, మొదటి సంవత్సరం బేస్ ప్రీమియంనకు సరిసమానమైన డిస్కౌంటును పొందవచ్చు. రెండో క్లెయిమ్ నుంచి బేస్ సమ్ ఇన్సూర్డ్‌ను బీమా సంస్థ అపరిమిత స్థాయిలో రీఫిల్ చేస్తుంది. వీటితో పాటు వెల్‌నెస్ డిస్కౌంట్లు, క్లెయిమ్ నమోదు కాని సంవత్సరానికి గాను బోనస్, క్యాటరాక్ట్ శస్త్రచికిత్సలాంటి వాటిపై ఉపపరిమితులేమీ లేకపోవడం మొదలైన ప్రత్యేకతలు ఇందులో ఉన్నాయి.

బజాజ్ అలయంజ్ లైఫ్ నుంచి స్మార్ట్ పెన్షన్ ప్లాన్



ప్రైవేట్ రంగ బజాజ్ అలయంజ్ లైఫ్ కొత్తగా స్మార్ట్ పెన్షన్ పేరిట మార్కెట్ ఆధారిత పింఛను పథకాన్ని ఆవిష్కరించింది. ఇది కొత్తగా ప్రవేశపెట్టిన బజాజ్ అలయంజ్ లైఫ్ నిఫ్టీ 200 ఆల్ఫా 30 ఇండెక్స్ పెన్షన్ ఫండ్‌కి అనుసంధానమై ఉంటుంది. కనిష్ఠంగా పదేళ్ల వ్యవధికి కూడా దీన్ని తీసుకోవచ్చు. 45 ఏళ్ల వయస్సు నుంచే ప్రయోజనాలను పొందవచ్చు. ఏదైనా కీలక సందర్భంలో పాక్షికంగా రిటైర్మెంట్ నిధి నుంచి విత్‌డ్రా చేసుకునేందుకు వీలుంటుంది.


ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ నుంచి క్వాలిటీ ఫండ్



ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ మ్యూచువల్ ఫండ్ కొత్తగా ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ క్వాలిటీ ఫండ్ పేరుతో న్యూ ఫండ్ ఆఫర్ (ఎన్ఎఫ్‌ఓ)ను ప్రకటించింది. ఈ పథకంలో పెట్టుబడులకు ఈ నెల 20వ తేదీ వరకు అవకాశం ఉంది. ఈ పథకం పనితీరుకు నిఫ్టీ 200 క్వాలిటీ 30 టీఆర్ఐ సూచీ ప్రామాణికంగా ఉంటుంది. మొత్తం 625 కంపెనీలను జల్లెడ పట్టి అందులో నుంచి 40–60 కంపెనీలను ఎంపిక చేసుకుని పెట్టుబడులు పెడుతుంది. చారిత్రక డేటాను పరిశీలిస్తే నాణ్యమైన పెట్టుబడుల విధానం మంచి రాబడులను ఇచ్చినట్టు తెలుస్తోంది. సౌకర్యమైన పెట్టుబడుల వ్యూహం, టాప్‌డౌన్, బోటమ్ విధానంలో స్టాక్స్‌ను ఎంపిక చేస్తుంది. బలమైన ఆర్థిక మూలాలు, పటిష్టమైన నగదు ప్రవాహాలు, మెరుగైన నిధుల కేటాయింపుల వంటి అంశాలను చూస్తుంది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
ప్రపంచ పరిణామాలే దిక్సూచి
దీర్ఘకాలంలో రాబడుల స్థిరత్వం యూటీఐ లార్జ్, మిడ్‌క్యాప్ ఫండ్

మిషన్ మిస్సైల్



భారత్‌- పాకిస్తాన్‌ మధ్య కాల్పుల విరమణతో యుద్ధ మేఘాలు తొలగిపోయినా, క్షిపణుల రాజధానిగా పేరుగాంచిన హైదరాబాద్‌లో మాత్రం యుద్ధ సన్నద్ధత కొనసాగుతూనే ఉంది. నగరంలోని పలు రక్షణ రంగ సంస్థలు క్షిపణులు, ఇతర ఆయుధ సామగ్రి ఉత్పత్తిలో రాత్రీ పగలు తీరిక లేకుండా పనిచేస్తున్నాయి. 'మేం బ్రహ్మోస్, ఆకాశ్‌ క్షిపణులకు కీలక ఉప వ్యవస్థలను సరఫరా చేస్తున్నాం. వీటి డెలివరీ కోసం వారాంతాల్లో కూడా పని చేయాలని మాకు ఆదేశాలు వచ్చాయి'అని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్‌ కంపెనీ ప్రమోటర్‌ తెలిపారు. - సాక్షి, హైదరాబాద్‌


ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో హైదరాబాద్‌లో అలర్ట్‌

క్షిపణుల తయారీ వేగవంతం చేసిన సంస్థలు

రాత్రీ పగలు తేడా లేకుండా నిరాటంకంగా ఉత్పత్తి

పరిస్థితులు చక్కబడే వరకు అదే సన్నద్ధత

డ్రోన్స్, యాంటీ డ్రోన్స్‌ కోసం కూడా..: 'ఆపరేషన్‌ సిందూర్‌ సమయంలో మా యాంటీ డ్రోన్‌ వ్యవస్థలను పోర్టులు, రక్షణ శాఖ మౌలిక సదుపాయాలను కాపాడేందుకు వినియోగించారు. భవిష్యత్తులో భూమి మీద నుంచి కాకుండా, గగనతలంలో నుంచే ముప్పు ఎక్కువగా ఉంటుందని ప్రభుత్వం గుర్తించింది'అని ఒక డ్రోన్‌ టెక్‌ కంపెనీ వ్యవస్థాపకుడు తెలిపారు. సైనికాధికారులకు సొంతంగా కొనుగోలు చేసే అధికారం కూడా ఇచ్చారని, పరిస్థితిని బట్టి భారీ ఆర్డర్లు రావొచ్చని భావిస్తున్నట్లు వెల్లడించారు.



బాలాకోట్‌ దాడిలోనూ మన క్షిపణులే..: అనేక రక్షణ ఉత్పత్తుల తయారీ కేంద్రం కావడంతో దేశ క్షిపణి రాజధానిగా హైదరాబాద్‌ను పేర్కొంటారు. ఇక్కడ ప్రభుత్వ, ప్రైవేట్‌ రంగ సంస్థలు వివిధ రకాల ఆయుధాలు, క్షిపణులు, యుద్ధ వాహనాలు, ఎలక్ట్రానిక్‌ వ్యవస్థలు, డ్రోన్లు, రాడార్లు ఇతర సాంకేతిక పరికరాలను ఉత్పత్తి చేస్తున్నాయి. 2019 ఫిబ్రవరిలో బాలాకోట్‌ దాడిలో భారత్‌ ఉపయోగించిన స్పైస్‌ 2000 క్షిపణులు సైతం హైదరాబాద్‌లోని కల్యాణి రఫెల్‌ అడ్వాన్స్‌డ్‌ సిస్టమ్స్‌ (కేఆర్‌ఏఎస్‌) అందించినవే. ఆపరేషన్‌ సిందూర్‌లోనూ స్పైస్‌ క్షిపణులను మోహరించినప్పటికీ చివరికి భారత వాయుసేన స్కాల్ప్‌ హ్యామర్‌ క్షిపణులను ప్రయోగించినట్లు వార్తలు వచ్చాయి.

నగరంలోని ప్రభుత్వ రంగ రక్షణ ఉత్పత్తుల సంస్థలు	నగరంలోని ప్రైవేట్‌ రంగ రక్షణ ఉత్పత్తుల సంస్థలు
గైడెడ్‌ క్షిపణులు, అండర్‌ వాటర్‌ ఆయుధాలు, గ్రౌండ్‌ సపోర్ట్‌ ఎక్విప్‌మెంట్‌లను భారత్‌ డైనమిక్స్‌ లిమిటెడ్‌ (బీడీఎల్‌) తయారు చేస్తోంది. ఇటీవల ఐజీఎల్‌ఏ–1ఎమ్‌ క్షిపణులను పునరుద్ధరించేందుకు ఒప్పందం కుదుర్చుకుంది.	భారత నావికాదళం కోసం అదానీ ఏరోస్పేస్‌ పార్క్‌ దృష్టి 10 స్టార్‌ లైనర్, యూఏవీలను తయారు చేస్తోంది. దీర్ఘశ్రేణి క్షిపణులు, నౌకాదళ క్షిపణులు, రుద్రం–2 హైపర్‌సోనిక్‌ క్షిపణులను కూడా అభివృద్ధి చేస్తోంది.
సంగారెడ్డి జిల్లాలోని ఆర్డినెన్స్‌ ఫ్యాక్టరీ బీఎంపీ–2 సారథ్‌ వంటి ఇన్‌ఫాంట్రీ యుద్ధ వాహనాలు, సాయుధ అంబులెన్స్‌లు, పినాకా రాకెట్‌ లాంచర్లు, యుద్ధ వాహనాలను తయారు చేస్తోంది.	శంషాబాద్‌లోని వీఈఎమ్‌ టెక్నాలజీస్‌ సంస్థ భారతదేశపు మొట్టమొదటి స్వదేశీ యాంటీ ట్యాంక్‌ క్షిపణి 'అసిబాల్'ను అభివృద్ధి చేసింది.
ఎలక్ట్రానిక్స్‌ కార్పొరేషన్‌ ఆఫ్‌ ఇండియా లిమిటెడ్‌ (ఈసీఐఎల్‌) న్యూక్లియర్‌ ఎనర్జీ, స్పేస్, డిఫెన్స్‌ రంగాల కోసం ఎలక్ట్రానిక్‌ పరికరాలను అభివృద్ధి చేస్తోంది.	ఆదిభట్లలోని టాటా అడ్వాన్స్‌డ్‌ సిస్టమ్స్‌ లిమిటెడ్‌ (టీఏఎస్‌ఎల్‌) క్షిపణి సబ్‌సిస్టమ్‌లు, రాడార్‌లు, యూఏవీలు, ఇతర రక్షణ పరికరాలను తయారు చేస్తోంది. బోయింగ్‌తో కలిసి ఏహెచ్‌–64 అపాచీ హెలికాప్టర్ల కోసం ఫ్యూజిలాజ్‌లు అందిస్తోంది.
యుద్ధ విమానాలకు ఉపకరించే సూపర్‌ అలాయ్స్, టైటానియం అలాయ్స్‌ తదితర ప్రత్యేక లోహాలను మిశ్రధాతు నిగమ్‌ (మిధాని) తయారు చేస్తోంది.	బరాక్‌ 8 ఎంఆర్‌–ఎస్‌ఏఎమ్‌ క్షిపణి కిట్లను కల్యాణి రఫేల్‌ అడ్వాన్స్‌డ్‌ సిస్టమ్స్‌ తయారుచేస్తోంది.
ఆధునిక యుద్ధ పరికరాల కోసం లోహాలు ఇతర పదార్థాలను డిఫెన్స్‌ మెటలర్జికల్‌ రీసెర్చ్‌ లేబొరేటరీ (డీఎమ్‌ఆర్‌ఎల్‌) అందిస్తోంది.	అస్ట్రా రఫాయెల్‌ కామ్‌సిస్‌ సంస్థ డిజిటల్‌ కమ్యూనికేషన్‌ సిస్టమ్‌లు, ఎస్‌డీఆర్‌లు, ఇతర ఎలక్ట్రానిక్‌ వార్‌ఫేర్‌ పరికరాలను అభివృద్ధి చేస్తోంది.
ఎలక్ట్రానిక్‌ వార్‌ఫేర్‌ సిస్టమ్‌లు, కమ్యూనికేషన్‌ రాడార్‌ సిస్టమ్‌లను డిఫెన్స్‌ ఎలక్ట్రానిక్స్‌ రీసెర్చ్‌ లేబొరేటరీ (డీఎల్‌ఆర్‌ఎల్‌) రూపొందిస్తోంది.	సైన్యం ఉపయోగించే పిస్టల్స్, సబ్‌ మెషీన్‌ గన్స్, రైఫిల్స్, స్నైపర్‌ రైఫిల్స్‌ను ఐకామ్‌ కంపెనీ తయారు చేస్తోంది.
	ట్రైనింగ్‌ ఎక్విప్‌మెంట్‌లు, సిమ్యులేటర్లు, స్మార్ట్‌ ఫైరింగ్‌ రేంజ్‌లను జెన్‌ టెక్నాలజీస్‌ అభివృద్ధి చేస్తోంది. ఇవి రక్షణ, పోలీస్‌ బలగాలకు ఉపయోగపడతాయి.
	స్కైలైట్‌ మినీ యూఏవీ సిస్టమ్స్‌ను సైయెంట్‌ సొల్యూషన్స్‌ ఏరో సిస్టమ్స్‌ అభివృద్ధి చేస్తోంది.

ధాన్యం బస్తాలో డబ్బు దాచిన భర్త

విషయం తెలియక అమ్మేసిన రైతు భార్య

చేజారిన రూ.1.50 లక్షలు

గణపురం: ధాన్యం బస్తాలో ఒక రైతు రూ.1.50 లక్షల నగదు దాచాడు. ఆ విషయం తెలియని ఆయన భార్య.. ధాన్యం బస్తాలను వ్యాపారికి విక్రయించింది. జయశంకర్‌ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం గాంధీనగర్‌లో ఆదివారం ఈ ఘటన వెలుగు చూసింది. గాంధీనగర్‌కు చెందిన రైతు పోతరాజు వీరయ్య ఇటీవల తన ఎడ్లను విక్రయించాడు. వచ్చిన డబ్బును దొంగల భయానికో.. లేక మరే కారణం చేతో వడ్ల బస్తాలో దాచి ఉంచాడు. ఈ విషయం ఇంట్లో చెప్పలేదు. ఈ క్రమంలో గత బుధవారం వీరయ్య పని మీద పొలం వద్దకు వెళ్లాడు. ఈ సమయంలోనే ధాన్యం వ్యాపారి ఊళ్లోకి రాగా.. వీరయ్య భార్య వడ్లను అతనికి విక్రయించింది. పొలం పనులు ముగించుకొని వీరయ్య ఇంటికి రాగా.. వడ్ల బస్తాలు అమ్మేశానని భార్య చెప్పింది. దీంతో భార్యకు అసలు విషయం చెప్పగా.. లబోదిబోమన్నారు. వెంటనే ఆ వ్యాపారి కోసం గాలించినా ఆచూకీ లభించలేదు. భార్యాభర్తలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



పుష్కర స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

త్రివేణి సంగమ తీరానికి భారీగా భక్తులు

- నాలుగవ రోజు 1.80 లక్షల మంది పుష్కర స్నానాలు
- మహదేవపూర్‌ నుంచి పుష్కర ఘాట్‌ చేరుకోవడానికి 2 గంటల సమయం
- ట్రాఫిక్‌ను నియంత్రించిన ఎస్పీ కిరణ్‌ఖరే

భూపాలపల్లి/కాళేశ్వరం: త్రివేణి సంగమ తీరానికి భక్తుల రద్దీ భారీగా పెరిగింది. జయశంకర్‌ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం వద్ద సరస్వతి నది పుష్కరాల్లో నాలుగో రోజు ఆదివారం ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు త్రివేణి సంగమంలో పుష్కర స్నానాలు ఆచరించారు. పుణ్యస్నానాల తర్వాత నదీమాతకు విశేష పూజలు చేశారు. నదీ తీరంలోనే సైకత లింగాలను తయారు చేసి శివుడిని ప్రత్యేకంగా పూజించారు. మహిళలు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. పితృదేవతలకు పిండప్రదానాలు చేశారు. అలాగే భక్తులు శ్రీకాళేశ్వర ముక్తీశ్వరుడిని దర్శించుకున్నారు. ఆదివారం 1.80 లక్షల మంది భక్తులు పుష్కర స్నానాలు చేసినట్లు అధికారులు అంచనా వేశారు. ఇదిలా ఉండగా శనివారం భారీగా ట్రాఫిక్‌ జామ్‌ కావడంతో ఎదురైన ఇబ్బందులు పునరావృతం కాకుండా కలెక్టర్‌ రాహుల్‌శర్మ ఆదేశాల మేరకు అధికారులు ఆదివారం పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. రద్దీ కొనసాగుతున్న నేపథ్యంలో కలెక్టర్‌ రాహుల్‌శర్మ హెలికాప్టర్‌ ద్వారా ఏరియల్‌ సర్వే నిర్వహించారు. మహదేవపూర్‌ నుంచి కాళేశ్వరం పుష్కర ఘాట్‌ వరకు 18 కిలోమీటర్ల దూరం వాహనాలు వెళ్లడానికి రెండు గంటల సమయం పట్టింది. ఎస్పీ కిరణ్‌ఖరే రంగంలోకి దిగి ట్రాఫిక్‌ జామ్‌ కాకుండా చర్యలు చేపట్టారు. హైకోర్టు జడ్జి జస్టిస్‌ సుధ, ఎమ్మెల్సీ తీన్మార్‌ మల్లన్న, సినీ నటుడు రాజేంద్ర ప్రసాద్‌లు వేర్వేరుగా స్వామిని దర్శించుకున్నారు.



బేగంపేట



వరంగల్‌



కరీంనగర్‌


అదిగదిగో.. 'అమృత్‌ భారత్‌' స్టేషన్లు

తెలంగాణలో బేగంపేట, కరీంనగర్, వరంగల్‌లో ఆధునిక స్టేషన్లు రెడీ

సాక్షి, హైదరాబాద్‌: రైల్వే స్టేషన్‌ అనగానే దుర్వాసన, అపరిశుభ్ర వాతావరణం, ప్రయాణికులు కూర్చోవటానికి వసతుల లేమి, విచారణ–టికెట్ల కోసం పెద్ద క్యూలైన్లు.. వెరసి అంతా అస్తవ్యస్తం. ఇప్పటి వరకు మన కళ్ల ముందు కనిపిస్తూ వస్తున్న పరిస్థితులు ఇవి. అయితే పూర్తి ఆధునిక వసతులతో ఇలాంటి పరిస్థితిని సమూలంగా మార్చేసి, కొత్త రూపుతో ఉండే అమృత్‌ భారత్‌ స్టేషన్లు అందుబాటులోకి వస్తున్నాయి. రైల్వే శాఖ దేశవ్యాప్తంగా 1,309 రైల్వే స్టేషన్లకు 'అమృత్‌ భారత్‌ స్టేషన్‌'పథకం కింద ఆధునిక రూపు ఇస్తుండగా, దక్షిణ మధ్య రైల్వేలో 119 స్టేషన్లకు కొత్త రూపం ఇవ్వనున్నారు. వీటిల్లో ఇప్పుడు దేశవ్యాప్తంగా 103 స్టేషన్లు, తెలంగాణలో 3 స్టేషన్లు సిద్ధమయ్యాయి. వీటిని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈనెల 22న ప్రారంభించనున్నారు. 103 స్టేషన్లలో ఏదో ఓ స్టేషన్‌కు వెళ్లి దానిని నేరుగా, మిగతా వాటిని వర్చువల్‌గా ప్రారంభించనున్నారు.

దక్షిణ మధ్య రైల్వే పరిధిలో రూ.6,200 కోట్లతో..: పెద్ద రైల్వే స్టేషన్లను మినీ ఎయిర్‌పోర్టుల తరహాలో, చిన్న రైల్వే స్టేషన్లను పూర్తి ఆధునిక రూపుతో పునర్‌నిర్మిస్తున్నారు. రాష్ట్రంలో సికింద్రాబాద్, హైదరాబాద్‌ (నాంపల్లి) స్టేషన్లను రూ.1,300 కోట్లతో మినీ ఎయిర్‌పోర్టుల్లాగా అభివృద్ధి చేస్తున్నారు. ఇవి కాకుండా మరో 38 స్టేషన్లను ఆధునిక రీతిలో పునర్‌ నిర్మిస్తున్నారు. సికింద్రాబాద్‌ స్టేషన్‌ పనులు మూడొంతులు పూర్తయ్యాయి. మరో ఏడాదిలో దానిని ప్రారంభించనుండగా, వరంగల్, బేగంపేట, కరీంనగర్‌ స్టేషన్‌ భవనాలు సిద్ధమయ్యాయి. ఇప్పుడు ఈ మూడు స్టేషన్లు ప్రారంభానికి రెడీగా ఉన్నాయి. దక్షిణ మధ్య రైల్వే జోన్‌ పరిధిలో మొత్తం 119 స్టేషన్లకు ఆధునిక రూపు ఇవ్వటానికి రూ.6,200 కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఇందులో తెలంగాణలోని 40 స్టేషన్ల పునర్‌నిర్మాణానికి రూ.2,750 కోట్లు ఖర్చు చేస్తున్నారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.
Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.



సాక్షి ప్లస్
సోమవారం । 19-5-2025





మెడలో ఇక్కత్ డిజైన్ల శాలువాలతో అందగత్తెలు

మెరిసిన చేనేత.. మురిసిన భామలు

విశ్వవేదికపై చేనేత కళా ప్రదర్శన

ఇక్కత్ చీరలు, వస్త్రాలకు ప్రపంచస్థాయి గుర్తింపు

తెలంగాణ పర్యాటక శాఖ ప్రయత్నం విజయవంతం

సాక్షి, యాదాద్రి: పోచంపల్లి ఇక్కత్ చీరలు, ఇక్కత్ వస్త్రాలు, విశ్వవ్యాప్తంగా తరలివచ్చిన సుందరాంగుల మనసు దోచుకున్నాయి. చేనేత కళాకారుల వస్త్ర డిజైన్లను చూసి వారు ముగ్ధులయ్యారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని ప్రపంచ సిల్క్ సిటీ భూదాన్ పోచంపల్లిలో.. ప్రపంచ సుందరీమణుల పోటీదారుల పర్యటనలో అడుగడుగునా చేనేత వస్త్ర కళా వైభవం కళ్లకు కట్టింది. చేనేత చీరలు, వస్త్రాలను చూసి విదేశీ వనితలు మురిసిపోయారు. ఈ సందర్భంగా కొన్ని వస్త్రాలను ధరించి ఇక్కత్ చీరల తయారీ ప్రక్రియ, డిజైన్ల వివరాలను వారు అడిగి తెలుసుకున్నారు. ఇక్కత్ చీరల నేతకు ప్రసిద్ధిగాంచిన పోచంపల్లి మరోసారి ప్రపంచ ప్రఖ్యాతి గాంచింది. తెలంగాణ పర్యాటక శాఖ.. చేనేతను మరింత ప్రచారంలోకి తీసుకురావడంలో విజయవంతమైంది.

అందగత్తెలతో ప్రపంచం దృష్టికి..

పోచంపల్లిలో అందాల భామల పర్యటనతో చేనేత, ఇక్కత్ వస్త్రాలు ప్రపంచానికి మరోసారి పరిచయమైనట్లయింది. తెలంగాణ పర్యాటక శాఖ ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో చేనేత కళాకారుల ప్రతిభకు గుర్తింపు దక్కేలా ప్రభుత్వం కృషి చేసింది. పోచంపల్లికి వచ్చిన 25 దేశాల మిస్ వరల్డ్ పోటీదారులు.. పోచంపల్లి చీరల తయారీ, డిజైన్, అద్దకం ఇక్కత్ వస్త్రాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఒక్కొక్క చీర తయారీకి కళాకారులు తీసుకునే శ్రమ, డిజైన్ల సృజనాత్మకత.. పోటీదారుల మనస్సును హత్తుకున్నాయి. చీరలపై భిన్న డిజైన్లను తిలకించిన అందగత్తెలు పరవశించిపోయారు. రంగు రంగుల డిజైన్లతో ఉన్న ఇక్కత్, డబుల్ ఇక్కత్ చీరలు, శాలువాలు, డ్రెస్ మెటీరియల్, కాటన్, పట్టు చీరలను చేతితో తడిమి మరీ చూశారు. పోచంపల్లి, వెంకటగిరి ,గొల్లభామ, నారాయణపేట చీరలు, వస్త్రాల ప్రదర్శన సుందరీమణులను ఆకట్టుకుంది.



ఇక్కత్ డిజైన్లతో రూపొందించిన ఆధునిక డ్రెస్‌ల ప్రదర్శనలో స్థానిక మోడల్స్

ర్యాంప్ వాక్‌తో మెరుగులు దిద్ది..

అందగత్తెలకే అసూయ పుట్టేలా నిర్వహించిన ఫ్యాషన్ షో.. పోచంపల్లి సందర్శనలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రపంచ అందగత్తెలే అచ్చెరువొందేలా హైదరాబాద్, ఢిల్లీకి చెందిన భారతీయ మోడల్స్.. ఇక్కత్ చీరలు, వస్త్రాల ఫ్యాషన్ షో అద్భుతంగా సాగింది. సంప్రదాయం, ఆధునికత ఉట్టిపడేలా రూపొందించిన డిజైన్‌లు ధరించిన చేనేత, ఇక్కత్ వస్త్రాలతో యువతీ యువకులు ప్రపంచానికి ఆధునికత జోడించిన చేనేత దుస్తులను పరిచయం చేశారు.

ర్యాంప్‌వాక్ అదుర్స్

ర్యాంప్‌వాక్‌లో చేనేత డిజైన్లతో మోడల్స్ ధరించిన దుస్తులను..ప్రపంచ అందగత్తెలు కళ్లార్పకుండా చూ స్తూ చప్పట్లు, కేరింతలతో ప్రోత్సహించారు. ప్రపంచ సుందరీమణులు, స్థానిక మోడల్స్ ధరించిన చేనేత వస్త్రాలతో వేదిక చేనేతను విశ్వవ్యాప్తం చేసింది.

1956లో పోచంపల్లిలో పట్టు పరిశ్రమకు బీజం

పోచంపల్లి టైఅండ్‌డై ఇక్కత్ చేనేత కళారంగం ఇప్పుడు ప్రపంచ ప్రఖ్యాతి గాంచింది. 1956లో పోచంపల్లిలో పట్టు పరిశ్రమకు బీజం పడింది. మొదటిసారిగా పోచంపల్లికి చెందిన కర్నాటి అనంతరాములు, తడక పెద్దయాదగిరిలు నిలువు, పేక పద్ధతిలో సహజరంగులతో పట్టు చీరలను నేశారు. నాటి నుంచి ఎందరో చేనేత కళాకారులు ప్రయోగాలు చేస్తూ నూతన డిజైన్లు సృష్టిస్తూ చేనేత కళను విశ్వవ్యాప్తం చేస్తున్నారు.

ప్రపంచాధినేతల ఆకట్టుకునేలా ఇక్కత్ వస్త్రాలు

పోచంపల్లి ఇక్కత్ కళ ప్రపంచ వ్యాప్తమైంది. ఇటీవల భారత ప్రధాని నరేంద్రమోదీ ఫ్రాన్స్ పర్యటనలో ఫ్రాన్స్ అధ్యక్షుడి భార్య బ్రిగ్గేట్టే మెక్రాన్‌కు.. ఇక్కడి నేతన్నలు నేసిన ఇక్కత్ చీరను బహూకరించారు. ఐక్యరాజ్య సమితి అనుబంధ సంస్థ అయిన ప్రపంచ పర్యాటక సంస్థ.. 2021లో పోచంపల్లికి 'అంతర్జాతీయ బెస్ట్ టూరిజం విలేజ్ అవార్డు' బహూకరించడంతో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చింది. చేనేత కుటీర పరిశ్రమ ద్వారా సంప్రదాయ వృత్తి, వారసత్వ సంపదను కాపాడుకుంటూనే పలువురు ఉపాధి పొందుతున్నందుకు ఈ గుర్తింపు ఇచ్చారు.



పోచంపల్లి వస్త్రాలు తప్పనిసరి..

దేశ, విదేశాల్లో జరిగే అంతర్జాతీయ సదస్సుల్లో అతిథులకు పోచంపల్లి శాలువాను కప్పడం సంప్రదాయంగా మారింది. ఇక్కత్ చేనేత వస్త్రాలను సిల్క్, కాటన్, సిల్క్ చీరలు, డ్రెస్ మెటీరియల్స్, బెడ్‌షీట్స్, రజయ్ (క్విల్ట్స్), స్టోల్స్, స్కార్ఫ్, దుప్పట్టా, డోర్, టేబుల్ కర్టెన్లు, పిల్లో కవర్లు తదితర వెరైటీలు దేశ, విదేశాలకు ఎగుమతి అవుతున్నాయి. ఆఫ్రికా, యూరప్, అమెరికాలకు వెళ్తున్నాయి. ముస్లిం దేశాలలో మహిళలు ముఖానికి ధరించే స్కార్ఫ్‌కు మంచి డిమాండ్ ఉంది. ఇక అపెరల్ ఫ్యాబ్రిక్, హోమ్ ఫర్నిషింగ్, డ్రెస్ మెటీరియల్స్‌ను యూరప్ దేశాల ప్రజలు అమితంగా ఇష్టపడుతున్నారు.

పేటెంట్ హక్కులతో ముందుకు..

పోచంపల్లి వస్త్రాలకు మొట్టమొదటిసారిగా 2003లో కేంద్ర ప్రభుత్వం జియోగ్రాఫికల్ ఇండికేషన్ రిజిస్ట్రీ (పేటెంట్) సర్టిఫికెట్ జారీ చేసింది. ఇక్కత్ కళ దేశంలో మరెక్కడా లేదు. మారుతున్న కాలానుగుణంగా ఇక్కడి చేనేత కళాకారులు పోచంపల్లి ఇక్కత్ డిజైన్‌లలో గద్వాల, కంచి, ధర్మవరంతో పాటు కొత్త కొత్త డిజైన్లు వచ్చేలా వినూత్న ప్రయోగాలు చేస్తూ విజయం సాధిస్తున్నారు. కాగా పేటెంట్ హక్కులు పొందినప్పటికీ.. నకిలీ వస్త్రాల తయారీ చేనేత వస్త్ర పరిశ్రమపై తీవ్ర ప్రభావం చూపుతోంది.



పోచంపల్లి చేనేత టై అండ్ డై పట్టు చీరల డిజైన్లను పరిశీలిస్తున్న అందగత్తెలు

ఇక్కత్ యూనివర్సల్ బ్రాండ్

ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా పోచంపల్లి టై అండ్ డైలోనే ఇక్కత్ ఉంది. ఇక్కత్ అనేది ఒక యూనివర్సల్ బ్రాండ్. చేనేత చీరలు పూర్తిగా చేతితో మగ్గంపై ఎన్నో సంవత్సరాల నుంచి చేస్తున్న సంప్రదాయ కళ. నూలు ఉడకబెట్టడం, రంగుల అద్దకం వంటి చేతి వృత్తి. ఎంతో మంది మహిళలు ఇక్కత్ చీరల పనితో జీవనోపాధి పొందుతున్నారు. పోచంపల్లి చీరల డిజైన్ కూడా ఒక ప్రత్యేకత సంతరించుకుంది. పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలు ఎంతో గుర్తింపు పొందాయి.

– ఎం.హనుమంతరావు,
కలెక్టర్, యాదాద్రి భువనగిరి జిల్లా

చేనేతకు ప్రభుత్వం చేయూత

తెలంగాణలో జరుగుతున్న ప్రపంచ సుందరీమణుల పోటీల్లో పాల్గొనడానికి వచ్చిన అందాల భామలు పోచంపల్లి చీరలు, వస్త్రాలకు ముగ్ధులయ్యారు. ప్రపంచ పటంలో పోచంపల్లి కళాకారులు రూపొందించిన వస్త్రం సంపద వెలకట్టలేనిది. సీఎం రేవంత్ అధ్వర్యంలోని ప్రభుత్వం చేనేతకు చేయూత నిస్తోంది.

– కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి,
ఎమ్మెల్యే, భువనగిరి

యాదగిరిగుట్టకు వేసవి సెలవుల తాకిడి

యాదగిరిగుట్ట: వేసవి సెలవులతో పాటు ఆదివారం సెలవు రోజు కావడంతో యాదగిరి శ్రీ లక్ష్మీనరసింహస్వామిని వివిధ ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. శ్రీవారి ధర్మ దర్శనానికి 4 గంటల సమయం.. వీఐపీ దర్శనానికి గంటన్నర సమయం పట్టింది. వివిధ పూజలతో శ్రీస్వామి వారికి నిత్యాదాయం రూ.63,93,991 వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.



త్రితల ద్వారం నుంచి ప్రధానాలయంలోకి బారులు తీరిన భక్తులు

బోర్ ఒక్కటి.. కనెక్షన్లు పన్నెండు



మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలం చిన్నముప్పారం గ్రామంలోని వంజర బజారులో పంచాయతీ ఆధ్వర్యంలో మంచినీటి బోర్ వేయించారు. ఈ బోర్‌కు సుమారు 12 మంది పైప్ కనెక్షన్లు బిగించి.. నీటిని వాడుకుంటున్నారు.



ఆదివారం హైదరాబాద్‌లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ వద్ద అభివాదం చేస్తున్న మిస్ వరల్డ్ పోటీదారులు

బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది

మంత్రి దామోదర్ రాజనర్సింహ



సాక్షి, హైదరాబాద్: గుల్జార్ హౌజ్ అగ్నిప్రమాదంపై రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ విచారం వ్యక్తం చేశారు. ఆదివారం ఉస్మానియా హాస్పిటల్ మార్చురీలో మృతదేహాలను ఆయన పరిశీలించారు. మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి సానుభూతి తెలిపారు. ప్రభుత్వం బాధిత కుటుంబాలకు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కాగా, అగ్నిప్రమాదంపై భువనగిరి పార్లమెంటు సభ్యుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

'అమృత్'ం.. ఆలస్యం!

- అర్బన్ ప్రాంతాల్లో శుద్ధికాని జలం
- రూ.83,577.53 కోట్ల నిధులు
- ఇప్పటివరకు ఖర్చయినవి రూ.57,558.76 కోట్లే..
- పదేళ్లయినా 68.87 శాతం పనులే..
- పథకం వచ్చి నాలుగేళ్లు.. పూర్తిస్థాయిలో ఇవ్వని నల్లా కనెక్షన్లు
- అప్రమత్తం చేసిన కేంద్ర పట్టణ వ్యవహారాల శాఖ



సాక్షి ప్రతినిధి, వరంగల్: అటల్ మిషన్ ఫర్ రిజువనేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌ఫర్మేషన్ (అమృత్-1.0) పనులు నత్తనడకన సాగుతున్నాయి. వచ్చే జూన్ 15 నాటికి పదేళ్లు పూర్తవుతున్నా చాలా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ముందుకు సాగడం లేదు. దేశంలోని 500 నగరాలు/పట్టణాల్లో 'అమృత్'ను ప్రారంభించింది. ఈ మిషన్ ఎంపిక చేసిన నగరాలు, పట్టణాల్లో నీటి సరఫరా, మురుగునీటి పారుదల, సెప్టేజ్ నిర్వహణ మొదలైన రంగాల్లో ప్రాథమిక మౌలిక సదుపాయాల అభివృద్ధి లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకు రూ.83,577.53 కోట్ల అంచనాలతో 6,010 పనులను మంజూరు చేయగా.. పదేళ్లు కావస్తున్నా 68.87 శాతమే పూర్తి కావడంతో కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ రాష్ట్రాలను అప్రమత్తం చేసింది.

'అమృత్' ఉద్దేశం ఇదీ..

అటల్ మిషన్ ఫర్ రెజువనేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌ఫర్మేషన్ పథకాన్ని 2015, జూన్ 15వ తేదీన దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన 500 నగరాలు, పట్టణాల్లో ప్రారంభించారు. 2011 జనాభా లెక్కల ప్రకారం లక్ష లేదా అంతకంటే ఎక్కువ జనాభా కలిగిన అన్ని పట్టణ స్థానిక సంస్థలు (యు.ఎల్.బి.లు), రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల (యు.టి.ల) రాజధానులైన ఇతర నగరాలను ఎంచుకుంది. అలాగే హెరిటేజ్ సిటీ డెవలప్‌మెంట్ అండ్ అగ్మెంటేషన్ యోజన (హెచ్.ఆర్.ఐ.డి.ఎ.వై) పరిధిలోని అన్ని వారసత్వ నగరాలు, ప్రధాన నదీ తీరాల వెంట గల ప్రముఖ నగరాలు, కొండప్రాంతాలు గల రాష్ట్రాలు, ద్వీపాల నుంచి, పర్యాటక ప్రాంతాల నుంచి 10 నగరాల చొప్పున (ప్రతి రాష్ట్రం నుంచి ఒకటి కంటే ఎక్కువ లేకుండా) అమృత్ పథకం కింద ఎంపిక చేశారు. నీటి సరఫరా, మురుగునీటి వ్యవస్థ, సెప్టేజీ నిర్వహణ, వరద నీటి ప్రవాహ వ్యవస్థ, పట్టణ రవాణా, ఉద్యానవనాల అభివృద్ధి, సామర్థ్యం పెంపుదల, సంస్కరణల అమలు ప్రామాణికంగా నిధులు కేటాయించారు.

ఎనిమిది రాష్ట్రాల్లోనే నూరు శాతం... అందులో తెలంగాణ

దేశంలోని 37 రాష్ట్రాలు/యూటీలలో ఈ పథకం అమలవుతుండగా.. ఎనిమిదే నూరు శాతం పనులు పూర్తి చేశాయి. అమృత్-1.0 కింద రూ.83,577.53 కోట్ల అంచనాలతో 6,010 పనులను మంజూరు చేసింది. పదేళ్లు కావస్తున్నా ఇప్పటికి రూ.57,558.76 కోట్ల (68.87 శాతం) నిధులు ఖర్చుకాగా రూ.26,018.77 కోట్ల విలువైన 463 పనులు పెండింగ్‌లో ఉన్నాయి. అయితే నూరు శాతం పనులు పూర్తి చేసిన ఆరు రాష్ట్రాలు/యూటీల జాబితాలో తెలంగాణ కూడా ఉంది. త్రిపుర, ఒడిశా, లక్షద్వీప్, డామన్ అండ్ డయ్యూ, దాద్రానగర్ హవేలి, సిక్కిం, చండీగఢ్‌ల సరసన తెలంగాణ నిలిచింది. సిక్కిం రూ.37.53 కోట్లతో 75 పనులు, త్రిపుర రూ.160.28 కోట్లతో 10, ఒడిశా రూ.1,714.42 కోట్లతో 191 పనులు సకాలంలో పూర్తి చేశాయి. అలాగే లక్షద్వీప్‌లో ఆరు, చండీగఢ్‌లో 12, డీఎన్ హవేలిలో రెండు, డామన్ అండ్ డయ్యూలో 3 పనులు సుమారు రూ.42 కోట్లతో పూర్తికాగా తెలంగాణలోని 12 కార్పొరేషన్/మున్సిపాలిటీలు రూ.1,663.08 కోట్ల విలువైన 66 పనులు పూర్తి చేశాయి.

2021, అక్టోబర్ 1 నుంచి అమృత్-2.0

2015, జూన్ 15 నుంచి అమలవుతున్న అమృత్‌కు తోడు దేశంలోని అన్ని పట్టణ స్థానిక సంస్థలు (యూఎల్‌బీ) /నగరాల్లో అమృత్-2.0ను 2021, అక్టోబర్ 1న కేంద్రం ప్రారంభించింది. దీంతో అమృత్-1.0 కింద చేపట్టిన మురుగునీటి పారుదల, సెప్టేజీ నిర్వహణతో పాటు నగరాలు/పట్టణాలను 'స్వయం-ఆధారిత', 'నీటి సురక్షిత'గా మార్చడం లక్ష్యంగా చెప్పారు.

నీటి వనరుల పునరుజ్జీవనం, నీటి సంరక్షణపై దృష్టి సారించే ప్రతి నగరానికి 'నగర జల సమతుల్య ప్రణాళిక' (సీడబ్ల్యూబీపీ) అభివృద్ధి ద్వారా అమృత్-2.0 నీటి వృత్తాకార ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహిస్తుందన్నారు. ఈ క్రమంలోనే 2021-22 ఆర్థిక సంవత్సరం నుంచి 2025-26 వరకు.. 5 సంవత్సరాల కాలానికి, దేశంలోని అన్ని చట్టబద్ధమైన పట్టణాల్లోని అన్ని గృహాలకు కుళాయిల ద్వారా నీటి సరఫరా అందించనున్నట్లు చెప్పారు. ఈ మేరకు 10,02,71,358 ఇళ్లకు గాను 2025, మార్చి 31 నాటికి 7,05,57,047 (70.36 శాతం) గృహాలకు నల్లా కనెక్షన్లు ఇచ్చినట్లు కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ నివేదికలో పేర్కొంది. తెలంగాణలోని నగర/పట్టణాల్లో 40,22,960లకు గాను 37,20,003 (92.43 శాతం) గృహాలకు కనెక్షన్లు ఇచ్చామని వెల్లడించింది.

'అమృత్' పథకం వివరాలు..


- అమృత్ కింద ఎంపికైన నగరాలు/పట్టణాలు: **500**
- 'అమృత్'లో మంజూరైన పనులు : **6,010**
- మంజూరైన పనుల విలువ: రూ.**83,577.53** కోట్లు
- ఇప్పటికి పూర్తయిన పనులు: **5,547**
- పూర్తయిన పనుల విలువ: రూ.**57,558.76** కోట్లు
- ప్రగతిలో ఉన్న పనులు: **463**
- పురోగతిలో ఉన్న పనుల విలువ: రూ.**26,018.77** కోట్లు

అమృత్ పనుల్లో ముందున్న రాష్ట్రాలు/యూటీలు: 8

1.తెలంగాణ, **2.**త్రిపుర, **3.**ఒడిశా, **4.**లక్షద్వీప్, **5.**డామన్ అండ్ డయ్యూ, **6.**దాద్రానగర్ హవేలి, **7.**చండీగఢ్, 8.సిక్కిం.

చిట్టి తల్లి.. బుజ్జి కన్నా..!

ఆరిలోవ: విశాఖపట్నంలోని ఇందిరాగాంధీ జూ పార్కులో వన్యప్రాణుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఇటీవల జూలో ఇండియన్ తోడేలు, బెంగాల్ నక్క, మడగాస్కర్ ప్రాంతానికి చెందిన లెమూర్ ఒక్కో పిల్లకు జన్మనిచ్చాయి. ఈ మూడు పిల్లలు జూ వైద్యులు, సిబ్బంది సంరక్షణలో ఆరోగ్యంగా ఉన్నాయని జూ క్యూరేటర్ జి.మంగమ్మ వెల్లడించారు. అంతరించిపోతున్న జాబితాలో ఉన్న తోడేళ్లు జూలో సంతానోత్పత్తి చేయడం శుభసూచికమని క్యూరేటర్ పేర్కొన్నారు. కాగా, ఇక్కడ సంతానోత్పత్తి చేసిన తోడేళ్లను 2019లో మైసూరు జూ పార్కు నుంచి, బెంగాల్ నక్కలను 2021లో ఢిల్లీ జూ నుంచి తీసుకువచ్చినట్లు ఆమె తెలిపారు. ఇక లెమూర్లను సుమారు పదేళ్ల కిందట ఇజ్రాయెల్ నుంచి తీసుకొచ్చామని వివరించారు. ప్రస్తుతం జూలో ఈ కొత్త పిల్లలతో కలిపి మొత్తం 8 ఇండియన్ తోడేళ్లు, 15 రింగ్‌టైల్డ్ లెమూర్స్, 4 బెంగాల్ నక్కలు ఉన్నాయని క్యూరేటర్ తెలిపారు.



రింగ్‌టైల్డ్ లెమూర్ ఒడిలో పసికూన



హుషారుగా తిరుగుతున్న బెంగాల్ నక్క, దాని పిల్ల



ఇండియన్ తోడేలు పిల్ల



కష్టాన్ని మ'రుచి'

వారంతా రెక్కల కష్టంతో బతికేవారు. కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలం అలుగుందు గ్రామం నుంచి కల్లూరు మండలం చిన్నటేకూరు గ్రామానికి పూలు తెంచడానికి వచ్చారు. ఉదయం నుంచి తోటలో పనిచేసి మధ్యాహ్నం వేళ అందరూ ఇలా కలిశారు. ఇంటి నుంచి తెచ్చుకున్న భోజనాన్ని పంచుకుని తిన్నారు. ఒకరి కష్టంలో ఒకరు తోడుగా ఉండడం సంగతి ఏమో.. కనీసం కలసి మాట్లాడుకోవడం లేని పరిస్థితులు నేడు నెలకొన్నాయి. వ్యవసాయ పనులు చేసే వీరిని చూసి అందరూ ఆదర్శంగా తీసుకోవాల్సి ఉంది. - కల్లూరు

ఆ ఫుడ్.. నాట్ గుడ్

ఉరుకుల పరుగుల జీవనయానంలో ప్రజల జీవన శైలిలో అనేక మార్పులు వచ్చాయి. ఆహారపు అలవాట్లు కూడా చాలా వరకు మారిపోయాయి. సామాజిక స్థాయిలు మారాయి. నగరాలు, పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కూడా కిట్టీ పార్టీ కల్చర్ వచ్చింది. బర్త్ డేలు, మ్యారేజ్ డేలు, నిశ్చితార్థాలు, ఉద్యోగంలో ప్రమోషన్లు.. సందర్భం ఏదైనా స్నేహితులు, సన్నిహితులు, కుటుంబ సభ్యులతో కలిసి హోటళ్లల్లో సెలబ్రేట్ చేసుకుంటున్నారు. అయితే ఆ ఆహారమే అనారోగ్యమని గుర్తించలేపోతున్నారు.



ఇంటి వంటల కంటే హోటల్ ఫుడ్‌కే జనం ప్రాధాన్యం

- అపరిశుభ్ర వాతావరణంలో వంటల తయారీ
- రంగు, రుచి కోసం ప్రమాదకర రసాయనాల వాడకం
- పుట్టుకొస్తున్న కొత్త రోగాలు
- అధికారుల తనిఖీలు నామమాత్రం

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: మురికి కాలువ గట్ల మీద ఉండే చిన్నపాటి తినుబండారాల తోపుడుబండి నుంచి పెద్దపెద్ద భవనాల్లో ఉండే ఖరీదైన హోటళ్ల వరకు అన్ని వేళలా ఆహార ప్రియులతో కిటకిటలాడుతుంటాయి. శుభకార్యాల నుంచి అశుభకార్యాల వరకు అన్ని సందర్భాల్లోనూ వడ్డించే ఫుడ్ కోసం హోటల్స్‌కు ఆర్డర్లు ఇస్తున్నారు. ఇంటి భోజనం కంటే హోటళ్లు, దాబాలు, రెస్టారెంట్లు, బేకరీ ఫుడ్‌కు బాగా ప్రాధాన్యత పెరిగింది. అయితే ఇక్కడ తయారయ్యే ఆహారాలు, నిల్వ ఉన్న పదార్థాలు, పలు రసాయనాలతో చేసినవి కావడంతో ఆ వంటకాలు తిని పలువురు రోగాల బారిన పడుతున్నారు. క్యాన్సర్ రోగుల్లో 53 శాతం మంది హోటల్స్ ఆహారంతోనే సమస్య తెచ్చుకుంటున్నారని పలు సర్వేలు వెల్లడించడం ప్రమాద తీవ్రతను తెలియజేస్తోంది.

ఆహారాల్లో ప్రమాదకర రసాయనాలు

హోటళ్లల్లో ఆహారాలు కలర్ ఫుల్, రుచికరంగా ఉండేందుకు ప్రమాదకర రసాయనాలు వినియోగిస్తుండడంతో అనేక రోగాలకు కారణమవుతున్నాయి.

- మెటానియల్ ఎల్లో వాడకం నిషేధించినప్పటికీ చాలా హోటళ్లలో వినియోగిస్తున్నారు. ఇది ఆరోగ్యంపై వెంటనే దుష్ప్రభావం చూపించదు. నెమ్మదిగా క్యాన్సర్‌కు కారకమవుతోంది. చిన్నారుల్లో నిద్రలేమి, నరాల సంబంధిత వ్యాధులకు దారితీస్తాయి.
- వంటకాల్లో రంగు కోసం వాడే నిషేధిత టార్‌ట్రాజిన్ చాలా ప్రమాదకరం. దీంతో మానసిక వ్యాధితోపాటు థైరాయిడ్, క్యాన్సర్, ఎలర్జీ, దద్దుర్లు, తామర, రక్తకణ జాలంలో హానికర కణ జాలల వృద్ధి చెందడం, డీఎస్ఏ నష్టపోవడం, నిద్రలేమి, నీరసం వస్తాయి.
- స్వీట్లు, బిస్కెట్లలో ఆరెంజ్ రంగు కోసం వాడే సన్‌సెటన్, పసుపు రంగు కోసం వాడే కాటారజ్, గ్రీన్ కలర్ కోసం వాడే బ్రిలియంట్ బ్లూ, టార్టాజీన్‌లు ప్రమాదకరమే.
- చాకెట్లలో వాడే రోడ్‌మస్–బీ కూడా ప్రాణాంతకమే. అయినా చాక్లెట్లు, చిన్న పిల్లలు తినే రంగుల ఆహార పదార్థాల్లో వీటిని వినియోగిస్తున్నారు.

పార్టీ కల్చర్.. ప్రమాదకరం

కొన్నేళ్ల క్రితం వరకు పల్లెల నుంచి పట్టణాలకు వెళ్లినా.. సమయానికి ఇంటికి రాలేని పరిస్థితుల్లో కొందరు హోటళ్లలో తినేవారు. కొందరైతే ఎంత సమయమైనా ఇంటికి వచ్చే భోజనం చేసేవారు. ఇప్పుడు కల్చర్ మారింది. సామాజిక నడతలో మార్పు వచ్చింది. నగరాలు, పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో పార్టీ కల్చర్ వచ్చింది. నలుగురు స్నేహితులు కలిస్తేనే కాదు.. వీకెండ్ ఫ్యామిలీస్‌తో కలిసి లంచ్, డిన్నర్ బయటే చేస్తున్నారు. ఖరీదైన ఆహారం తింటున్నామనే భ్రమలో అనారోగ్యం బారిన పడుతున్నామని గ్రహించలేకపోతున్నారు. నిల్వ ఉంచిన ఆహారం, ప్రమాదకర రసాయనాలు కలిపిన ఆహారాలతో అప్పటికప్పుడు నష్టం లేకపోయినా దీర్ఘకాలంలో వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంది.

నాసిరకం.. రంగుల మయం



హోటళ్లల్లో తయారయ్యే ఆహార పదార్థాలు నాసిరకం.. రంగుల మయంగా ఉంటాయి.

- పశువుల ఎముకలను సేకరించి వాటిని బట్టీలో అత్యధిక ఉష్ణోగ్రతపై మరిగించి ద్రావణాన్ని తీస్తున్నారు. ఆ ద్రావణాన్ని సాధారణ నూనెల్లో కలిపి విక్రయిస్తున్నారు. దీని వల్ల జీర్ణకోశ వ్యాధులు వచ్చే అవకాశం ఉంది.
- చికెన్, మటన్ బిర్యానీలు, తందూరిలో ఆకట్టుకునేందుకు ఎక్కువగా హానికరమైన రంగులను వాడుతున్నారు. అనారోగ్యానికి గురైన, ప్రమాదాల్లో చనిపోయిన గొర్రెలు, పొట్టేళ్లు, మేకలతోపాటు అనారోగ్యానికి గురైన వాటిని వధించి వినియోగదారులకు విక్రయిస్తున్నారు.
- నిషేధిత క్యాట్ ఫిష్‌లను సైతం కొర్రమీనుగా విక్రయిస్తున్నారు. జిల్లాలో వీటిని చికెన్, మటన్ వ్యర్థాలతో గుంతల్లో పెంచుతున్నారు.
- మిరప కాయల్లో ఎరుపు రంగు రావడానికి సూడాన్ రంగులు వాడుతుంటారు. పసుపులో మెటానిల్ ఎల్లో అనే పదార్థాన్ని కలుపుతారు. వీటిని వంటలో వినియోగిస్తే క్యాన్సర్ సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. ఆహారాన్ని వండే సమయంలో వాడిన నూనెనే మళ్లీ మళ్లీ కాచి వినియోగిస్తున్నారు. దీని వల్ల క్యాన్సర్, అల్సర్లు వచ్చే ప్రమాద మున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.
- చిన్న చిన్న హోటళ్లు, కర్రీస్ పాయింట్లలో వేడి వేడి కూరలు, పప్పు, సాంబారు వంటి ఆహార పదార్థాలు పల్చటి పాలిథిన్ కవర్లలో వేసి ఇస్తున్నారు. పదార్థాల వేడికి ప్లాస్టిక్ కరిగి వాటిని తినే వారికి అనారోగ్యాన్ని కలిగిస్తున్నాయి.
- అల్లం, వెల్లుల్లి పేస్టులను సైతం కల్తీ చేస్తున్నారు. వీటి ధర ఎక్కువగా ఉండడంతో అందులో ఆలుగడ్డ, ఉల్లిగడ్డ పేస్ట్‌ను కలుపుతున్నారు.

నిబంధనలు బేఖాతర్

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో చిన్నా, పెద్ద హోటల్స్, రెస్టారెంట్లు, దాబాలు, చాట్ బండార్‌లు, నూడిల్స్ షాపులు, అన్ని కలుపుకుని 5 వేలకు పైగా ఉంటాయి. ఒక్క నగరంలోనే 3 వందల వరకు హోటల్స్ ఉన్నాయి. వీటి ద్వారా ప్రతి సంవత్సరం కోట్లాది రూపాయల వ్యాపారం జరుగుతోంది. వాస్తవానికి హోటల్స్ యజమానులు ఆహార పరిరక్షణ, నాణ్యత ప్రమాణాల సంస్థ నుంచి లైసెన్స్ తీసుకోవాల్సి ఉంది. నిబంధనల మేరకు ఆహారం తయారు చేయాలి. ఈ చట్టం 2006 నుంచి అమల్లో ఉంది. ఆ శాఖ పరిధిలో జిల్లా స్థాయి అధికారితోపాటు ఓ గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్, మరో ఇద్దరు ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు. వీరు నెలకు 12 శాంపిల్స్ సేకరించాలి. శాంపిల్స్‌ను ప్రయోగశాలకు పంపి, పరిశీలన తర్వాత అవి ప్రమాణాల మేరకు లేకపోతే కేసులు నమోదు చేయాల్సి ఉంది. కల్తీని బట్టి క్రిమినల్ లేదా సివిల్ కేసులు నమోదు చేసి జరిమానాలు విధించే వీలుంది. కానీ ఇవి జరగడం లేదు. దీంతో తమ వద్దకు ఎవరూ రారన్న ధీమాతో వ్యాపారులు చెలరేగిపోతున్నారు. విచ్చలవిడిగా ఆహారాన్ని కల్తీ చేస్తున్నారు.

నిత్యం తనిఖీలు చేస్తున్నాం



హోటల్స్, ఐస్‌క్రీం పార్లర్‌లు, రెస్టారెంట్‌లు, పండ్ల దుకాణాలను నిత్యం తనిఖీలు చేస్తూనే ఉన్నాం. పలు హోటళ్లలో వంటల తయారీకి ఉపయోగిస్తున్న పదార్థాల్లో నాణ్యత లేకపోగా చాలా వరకు కాలం చెల్లినవి, ఉంటున్నాయి. 2024–25లో పలు హోటల్స్‌ను తనిఖీ చేసి 296 శ్యాంపిల్స్‌ను సేకరించగా 20 శాంపిల్స్‌లో నాణ్యత తక్కువగా ఉన్నట్లు, 18 శాంపిల్స్ ప్యాకెట్స్‌పై వివరాలు లేకుండా ఉన్నట్లు గుర్తించాం.

– వెంకటేశ్వరరావు, జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోల్ ఆఫీసర్

కల్తీ వల్ల ఆరోగ్య సమస్యలు



కల్తీ ఆహారం తినడం వల్ల జీర్ణకోశ సమస్యలు తలెత్తుతాయి. అవసరమైన పదార్థాలు అందక శరీరం బలహీనమవుతుంది. పోషకాహారం తీసుకుంటున్నామని ప్రజలు భావిస్తున్నప్పటికీ, కల్తీ వల్ల జీవనక్రియలు నిలిచిపోయి అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. వీలైనంత వరకు బయట ఫుడ్‌కు స్వస్తి చెప్పి ఇంటి ఆహారాన్ని తీసుకోవడం శ్రేయస్కరం. ఆరోగ్యానికి ఎంతో మంచిది.

– డాక్టర్ ఎంవీ రమణయ్య, రామచంద్రారెడ్డి ప్రజావైద్యశాల

పవర్ లిఫ్టింగ్...బరువులెత్తే ఈ క్రీడలో ఇప్పుడు పేదింటి యువతులు రాణిస్తున్నారు. చదువుతో పాటు బరువులు ఎత్తుతూ జాతీయ, అంతర్జాతీయ వేదికలపై తలపడుతున్నారు. ఆ క్రీడలో 'స్టామినా'ను చాటుతున్నారు. అలవోకగా బంగారు పతకాలను సాధిస్తున్నారు. గుంటూరు జిల్లా తెనాలికి చెందిన షేక్ షబీనా, మదిర షానూన్ ఇందుకు నిదర్శనం. షబీనా అంతర్జాతీయ పోటీల్లో పతకాల వేటలో జైత్రయాత్ర కొనసాగిస్తుంటే, మదిర షానూన్ తొలి అంతర్జాతీయ పోటీల్లోనే పతకాలను సాధించడం మరో విశేషం.

పవర్‌ఫుల్ ఉమెన్



విక్టరీ స్టాండ్‌పై స్వర్ణ పతకాలతో షేక్ షబీనా

అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో తెనాలి యువతుల సత్తా / ఆసియా పోటీల్లో మెరిసిన బంగారాలు / షేక్ షబీనాకు ఎనిమిది స్వర్ణ పతకాలు / మదిర షానూన్‌కు నాలుగు స్వర్ణం, ఒక రజతం, మూడు కాంస్య పతకాలు

తెనాలి: ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని డెహ్రాడూన్‌లో ఈనెల 12న ముగిసిన ఆసియా సబ్ జూనియర్, జూనియర్ ఎక్విప్డ్ ఉమెన్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో జూనియర్స్ 84 కిలోల విభాగంలో తలపడిన షేక్ షబీనా నాలుగు బంగారు పతకాలను సాధించింది. స్క్వాట్‌లో 190 కిలోలు, బెంచ్ ప్రెస్‌లో 85 కిలోలు, డెడ్ లిఫ్ట్‌లో 180 కిలోలు, ఓవరాల్‌గా 455 కిలోల బరువులనెత్తి నాలుగింటిలోనూ బంగారు పతకాలను కైవసం చేసుకోవడం విశేషం. ఇదే వేదికపై ఆసియన్ యూనివర్సిటీ కప్–2025లోనూ కేఎల్ యూనివర్సిటీ తరపున పాల్గొన్న షబీనా మరో నాలుగు బంగారు పతకాలను సాధించింది. స్ట్రాంగ్ ఉమెన్ పోటీలో మూడో స్థానంలో నిలిచింది. మొత్తం 2ఈవెంట్లలో కలిపి 8 బంగారు పతకాలను షబీనా సాధించింది.

అంతర్జాతీయ పోటీల్లో పతకాల పంట

షబీనాకు అంతర్జాతీయ పోటీల్లో పతకాల సాధన కొత్త కాదు. 2024 మేలో హాంకాంగ్‌లో జరిగిన ఆసియన్ ఎక్విప్డ్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ కమ్ ఆసియన్ యూనివర్సిటీ కప్–2024 పోటీల్లోనూ మెరిసింది. జూనియర్ విభాగంలో పోటీ పడిన షబీనా స్క్వాట్, బెంచ్ ప్రెస్, డెడ్‌లిఫ్ట్‌లో బంగారు పతకాలను సాధించింది. 3 విభాగాల్లోనూ కలిపి టోటల్‌లోనూ మరో పతకంతో 4 బంగారు పతకాలను కైవసం చేసుకుంది. మూడేళ్లుగా పవర్‌లిఫ్టింగ్‌లో నిలకడగా విజయాలను సాధిస్తున్న షబీనా, 2023 మేలో కేరళలో జరిగిన ఆసియా పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో 4 బంగారు పతకాలు సాధించింది. ఆ వెంటనే తమిళనాడులో జరిగిన జాతీయ పోటీల్లో 3 బంగారు పతకాలు సాధించిన చరిత్ర ఉంది. హైదరాబాద్‌లో జరిగిన నేషనల్ ఎక్విప్డ్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో 3 బంగారు పతకాలు, రజత పతకం సాధించింది. ఆసియా పోటీల్లో వరుసగా మూడేళ్లు నాలుగేసి బంగారు పతకాలను గెలుచు కుంది.

కేవీఐకే అకాడమీలో సాధన

2017 కామన్‌వెల్త్ ఛాంపియన్‌షిప్‌లో మూడు స్వర్ణాలు గెలిచిన ఘట్టమనేని సాయిరేవతి, పూసపాటి శివరామకిరణ్‌రాజు శిక్షణలో స్థానిక కేవీఐకే అకాడమీలో షానూన్ సాధన చేస్తోంది. పట్టణానికి చెందిన మదిర ప్రభుదాస్, మదిర నయోమి కుమార్తె షానూన్. కేఎల్ యూనివర్సిటీలో బీఐఏఎస్ డిగ్రీ సెకండియర్ చదువుతోంది. కోవిడ్ సమయంలో ఫిట్‌నెస్ కోసం ఆమెను కేవీఐకే అకాడెమీలో చేర్పించారు. తనలోని టాలెంట్‌ను గుర్తించిన కోచ్ ప్రోత్సాహంతో ఇంటర్ నుండే పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొంటూ పతకాలను సాధిస్తోంది. ఇప్పటివరకు 13 జిల్లాస్థాయి, 12 రాష్ట్రస్థాయి పతకాలు, నాలుగుసార్లు రాష్ట్ర స్ట్రాంగ్ విమెన్ టైటిల్స్‌ను సాధించింది. 'కాలేజీకి వెళుతూ రోజుకు 3 గంటల చొప్పున.. పోటీలకు నెల రోజుల ముందు ఉదయం సాయంత్రం మూడేసి గంటల చొప్పున సాధన చేస్తా' అని షానూన్ వెల్లడించింది.

తల్లి ప్రోత్సాహంతో సాధన



షేక్ షబీనా

పట్టణ ఆర్ఆర్ నగర్‌కు చెందిన ఆటో ఎలక్ట్రీషియన్ మెకానిక్ బుజ్జి, షంషద్ ఏకైక కుమార్తె షబీనా ప్రస్తుతం కేఎల్ యూనివర్సిటీలో బీబీఏ ఫస్టియర్ చదువుతోంది. పదో తరగతిలో పవర్ లిఫ్టింగ్‌పై ఆసక్తి చూపిన కుమార్తెను తల్లి ప్రోత్సహించింది. కామన్‌వెల్త్ పోటీల్లో బంగారు పతకాలను సాధించిన తెనాలి యువతి జి.సాయిరేవతి శిష్యరికంలో కొంతకాలం సాధన చేసింది. రాష్ట్ర పోటీల్లో పాల్గొని బహుమతులను గెలవడంతో ఆత్మవిశ్వాసం పెరిగింది. అక్కడ నుంచి సాధన మంగళగిరికి మారింది. కోచ్ సంధాని శిక్షణలో సాధన చేస్తోంది. చదువు, సాధన మినహా షబీనాకు మరో వ్యాపకం లేదు. జాతీయస్థాయి పోటీల్లో అప్రతిహతంగా రాణిస్తూ ఇప్పుడు అంతర్జాతీయస్థాయిలో పతకాలను కొల్లగొడుతోంది. కామన్‌వెల్త్, ప్రపంచ చాంపియన్‌షిప్ పోటీల్లో పతకాలు నెగ్గి, రైల్వేలో ఉద్యోగం సాధించాలనేది ఆమె లక్ష్యం.

పోటీల్లో షానూన్ పతకాల పంట



మదిర షానూన్

డెహ్రాడూన్‌లో జరిగిన ఆసియన్ పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో తెనాలికి చెందిన మరో యువతి మదిర షానూన్ రాణించింది. జూనియర్స్‌లో 47 కిలోల కేటగిరీలో తలపడిన తొలి అంతర్జాతీయ పోటీల్లోనే రజత పతకం,3 కాంస్య పతకాలను సాధించింది. ఆసియన్ వర్సిటీ కప్–2025లో పాల్గొన్న షానూన్ తన అద్భుత ప్రదర్శనతో 4 స్వర్ణ పతకాలను సాధించింది. 2 ఈవెంట్లలో 4 బంగారు పతకాలు, రజతం, 4 కాంస్యాలను గెలుచుకుంది.



తడిసి రంగుమారిన మిర్చిని కుప్పగా పోస్తున్న రైతు

మిర్చి రైతు కంట్లో కారం

కూటమి ప్రభుత్వం మిర్చి రైతు కంట్లో కారం కొడుతోంది. మార్కెట్లో గిట్టుబాటు ధర లభించక రైతులు అల్లాడిపోతున్నారు. గుంటూరు యార్డులోనే క్వింటా ధర రకాన్ని బట్టి రూ.8500 నుంచి రూ.10 వేల మధ్య పలుకుతోంది. ప్రకాశం జిల్లాలో మిర్చి కొనుగోలు కేంద్రం లేకపోవడంతో గుంటూరు వెళ్లి మిర్చి యార్డులో అమ్ముకోవాల్సిన పరిస్థితి. కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి క్వింటా మిర్చిని రూ.11,740కి కొనుగోలు చేయిస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు నమ్మబలికి రెండు నెలలు కావస్తోంది. ఇప్పటి వరకు ఆ ఊసే లేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో క్వింటా మిర్చి రూ.18 వేల నుంచి రూ.25 వేల వరకు పలికింది. దీంతో మిర్చి రైతులు లాభాల బాట పట్టారు. మళ్లీ జీవితంలో ఆ పరిస్థితులను చూడలేమనుకుంటూ రైతులు నిట్టూరుస్తున్నారు. - సాక్షి,ఒంగోలు



కోల్డ్ స్టోరేజీ వద్ద ఉన్న మిర్చి బస్తాల ట్రాక్టర్లు



ఆరబోసిన మిర్చిని చూపుతూ ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతు



కోల్డ్ స్టోరేజిలో ఖాళీ లేక పొలంలో మిర్చిని ఆరబోసి కప్పిన పట్టలు



ట్రాక్టర్‌తో కోల్డ్ స్టోరేజికి మిర్చి బస్తాలను తరలిస్తున్న రైతు



రాత్రి వేళ బస్తాల్లో ఉంచిన మిర్చిని పగలు ఆరబోసుకుంటున్న రైతు

ట్రావెల్

దక్షిణాది వాళ్లకు
ఉత్తరాదికి యాత్రలంటే...
కాశీ విశ్వనాథుడు... విశాలాక్షి దర్శనాలు.
అయోధ్య బాల రాముడు... సరయు నది.
త్రివేణీ సంగమంలో పుణ్యస్నానం...
నైమిశారణ్యం పర్యటన... ఇవే ప్రధానం.
రాముడు పడవనెక్కిన శృంగేశ్వర్‌పూర్..?
గంగారామాయణ యాత్రలో
ఇది ప్రత్యేకం!

శృంగేశ్వర్‌పూర్

రాముని వనపథం


శృంగేశ్వర్‌పూర్

ప్యాకేజ్ వివరాలు

గంగారామాయణ పుణ్యక్షేత్ర యాత్ర (ఎస్‌సీజెడ్‌బీజీ44). భారత్ గౌరవ్ టూరిస్ట్ ప్యాకేజ్‌లో ఇది (గంగారామాయణ పుణ్యక్షేత్ర యాత్ర) తొమ్మిది రోజుల యాత్ర. ఈ టూర్‌లో వారణాసి, అయోధ్య, నైమిశారణ్యం, ప్రయాగ్‌రాజ్, శృంగ్వేర్‌పూర్ క్షేత్రాలు కవర్ అవుతాయి.

- టికెట్ ధరలు కంఫర్ట్ కేటగిరీ (సెకండ్ ఏసీ)లో ఒక్కొక్కరికి 35 వేల రూపాయలు, స్టాండర్డ్ కేటగిరీ (థర్డ్ ఏసీ)లో 26,500, ఎకానమీ కేటగిరీ (స్లీపర్ క్లాస్)లో 16,200 రూపాయలవుతుంది. ఈ ప్యాకేజ్‌లో ట్విన్ షేరింగ్, ట్రిపుల్ షేరింగ్ అవకాశం లేదు.
- కంఫర్ట్ కేటగిరీకి ఏసీ హోటల్ గది, లోకల్ జర్నీకి ఏసీ వాహనాలు. స్టాండర్డ్ కేటగిరీకి ఏసీ గదులు, నాన్ ఏసీ వాహనాలు. ఎకానమీకి నాన్ ఏసీ గదులు, నాన్‌ఏసీ వాహనాలలో ప్రయాణం.
- అన్ని రోజులూ ఉదయం టీ, బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్నం, రాత్రి శాకాహార భోజనాలు ఉంటాయి.
- ట్రావెల్ ఇన్సూరెన్స్, టూర్ ఎస్కార్ట్, ట్రైన్‌లో సెక్యూరిటీ ఉంటుంది. పర్యాటకులకు అవసరమైన సర్వీసుల సహాయం ఏర్పాటు చేయడం కోసం టూర్ మేనేజర్ ఆద్యంతం ప్రయాణిస్తారు.
- పైన చెప్పుకున్నవన్నీ ప్యాకేజ్ ధరలో వర్తిస్తాయి. ఇక ఇప్పుడు చెప్పుకునేవి ఆ ధరలో వర్తించవు. బోటు విహారం, స్పోర్ట్స్, పర్యాటకప్రదేశాల ఎంట్రీ టికెట్‌లు, ప్యాకేజ్‌లో ఇచ్చిన భోజనం కాకుండా వేరే ఆర్డర్ చేసుకుంటే ఆ ఖర్చులు, ప్యాకేజ్‌లో లేని ఇతర పానీయాలు తీసుకున్నా విడిగా డబ్బు చెల్లించాల్సి ఉంటుంది.

https://www.irctctourism.com/pacakage_description?packageCode=SCZBG44

1,2,3 రోజులు

మధ్యాహ్నం 12 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరుతుంది. బోన్‌గిర్, జనగాన్, ఖాజీపేట్, వరంగల్, మహబూబాబాద్, దోర్నకల్, ఖమ్మం, మధిర, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, తుని, దువ్వాడ, పెందుర్తి, విజయనగరం, పలాస, బ్రహ్మపూర్, ఖుర్దారోడ్ జంక్షన్, భువనేశ్వర్, కటక్, జాజ్‌పూర్ కోయింజహార్ రోడ్, భద్రక్, బాలాసోర్‌ల మీదుగా మూడవ రోజు మధ్యాహ్నం ఒంటిగంటకు బనారస్‌కు చేరుతుంది. హోటల్ గదికి చేరిన తర్వాత సాయంత్రం వీలును బట్టి స్వయంగా వారణాసిలో ప్రదేశాలను చూడవచ్చు లేదా విశ్రాంతి తీసుకోవచ్చు.

4వ రోజు

ఉదయం బ్రేక్‌ఫాస్ట్ తర్వాత కాశీ విశ్వనాథ కారిడార్‌లో విహారం, ఆలయ దర్శనం, విశాలాక్షి, అన్నపూర్ణ ఆలయాల సందర్శనం. సాయంత్రం గంగాహారతి వీక్షణం, ఆ తర్వాత రాత్రి బస.

విశ్వానికి నాథుడు

కాశీలో శివుడి పేరు విశ్వనాథుడు. ఇక్కడ శివలింగాన్ని భక్తులు తాకవచ్చు. తెల్లవారు ఝామున నాలుగు నుంచి ఐదు గంటల మధ్య స్పర్శ దర్శనం చేసుకోవచ్చు. ఐదు దాటిన తర్వాత గర్భగుడిలోకి అనుమతించరు. గది ఇవతల నుంచే దర్శనం చేసుకోవాలి. కొత్తగా నిర్మించిన ఆలయం గంగానది తీరం వరకు విస్తరించి చాలా చక్కగా ఉంటుంది. ఆలయ ప్రాంగణంలో పోలీసు గస్తీ కూడా బాగుంటుంది. ఇక్కడ దర్శనం క్యూలో ఉన్నంత సేపు పక్కనే ఉన్న జ్ఞానవాపి ని చూడవచ్చు. అందులో ఉన్న నంది విశ్వనాథుడి ఆలయంలో ఉన్న శివలింగానిక అభిముఖంగా ఉంటుంది. కాశీ నగరం ప్రాచీనమైన నివాస ప్రదేశం కావడంతో ఆర్గనైజ్‌డ్‌గా ఉండదు. ఒక్క మనిషి మాత్రమే నడవగలిగినంత ఇరుకు రోడ్లుంటాయి. విశాలాక్షి, అన్నపూర్ణ, కాలభైరవ, వారాహి ఆలయాలకు వెళ్లాలంటే ఇరుకు రోడ్ల మధ్య మనం ఊహించనన్ని మలుపులు తిరుగుతూ వెళ్లాలి. తెల్లవారు ఝామున విశ్వనాథుడి దర్శనం చేసుకుని ఐదున్నరకు గంగానది తీరానికి చేరితే నది నీటిలో ప్రతిబింబించే సూర్యోదయాన్ని ఆస్వాదించవచ్చు. రాత్రి బస కాశీలో కాబట్టి ముందురోజు సాయంత్రం గంగాహారతిని కూడా వీక్షించవచ్చు. కాశీలో టీ దుకాణాల్లో ఉదయం పూట మట్టి ప్రమిదలో తాజా మీగడలో చక్కెర వేసిస్తారు. చాలా రుచిగా ఉంటుంది.




అయోధ్యలోని హనుమాన్ గరి

5వ రోజు

ఉదయం ఏడు గంటలకు రూమ్ చెక్ అవుట్ చేసి వారణాసి రైల్వే స్టేషన్‌కు వెళ్లి రైలెక్కాలి. రైలు మధ్యాహ్నం పన్నెండు గంటలకు అయోధ్యలోని అయోధ్యధామ్ రైల్వేస్టేషన్‌కు చేరుతుంది. రైలు దిగి రామజన్మభూమి, హనుమాన్‌గరి చూసిన తర్వాత హోటల్‌లో చెక్ ఇన్ కావడం, రాత్రి బస.

రాముడు పుట్టిన అయోధ్య

రాముడు పుట్టిన ప్రదేశంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన ఆలయాన్ని ఆద్యంతం కనువిందు చేస్తుంది. కళ్లు విప్పార్చుకుని చూస్తే తప్ప తృప్తి కగలదు. ఆలయ ప్రాంగణం అంతా తిరిగి చూసిన తర్వాత క్యూలో వెళ్లి బాలరాముడిని దర్శించుకున్నప్పుడు భక్తులు తమ ఇంటి బిడ్డను చూసిన అనుభూతిని పొందుతారు. ఆలయం నుంచి బయటకు వచ్చిన తర్వాత సరయు నదిని తప్పకుండా చూడాలి. సరయు నది గుప్త ఘాట్‌లో మునిగి రాముడు అంతర్ధానమయ్యాడని చెబుతారు. ఇక్కడి కనకభవన్ భారీ నిర్మాణం కాదు కానీ ప్రాచీన కాలం నాటి నిర్మాణశైలి గొప్పగా ఉంటుంది. రాముడు అశ్వమేధ యాగాన్ని నిర్వహించిన త్రేతా కీ ఠాకూర్ ప్రదేశాన్ని, సీత వంటగది, దశరథ్ భవన్‌లను చూడడం మరువద్దు.
హనుమాన్ గరి నుంచి చూస్తే అయోధ్య నగరం మొత్తం కనిపిస్తుంది.

6వ రోజు

ఉదయం హోటల్ గది చెక్ అవుట్ చేసి రైల్వేస్టేషన్‌కు చేరి రైలెక్కాలి. ఏడు గంటలకు రైలు బాలామావ్ వైపు సాగిపోతుంది. మధ్యాహ్నం పన్నెండు గంటలకు బాలామావ్ రైల్వేస్టేషన్‌కు చేరుతుంది. రైలు దిగి ఆ రోజంతా నైమిశారణ్య సందర్శనం. చక్రతీర్థ, హనుమాన్ టెంపుల్, వ్యాసగద్ది చూసుకుని తిరిగి రైల్వేస్టేషన్‌కి వచ్చి రైలెక్కాలి. రైలు రాత్రి పదకొండు గంటలకు బాలామావ్ నుంచి ప్రయాగ్‌రాజ్ వైపు సాగిపోతుంది.

పురాణాల పుట్టిల్లు

నైమిశారణ్యం అంటే మన పురాణాల్లో కనిపిస్తుంటుంది. దాదాపు ప్రతి పురాణమూ శుక మహర్షి నైమిశారణ్యంలో సనకసనందాది మునులతో ఈ విధంగా చెప్పడం మొదలుపెట్టాడు అనే ఉపోద్ఘాతంతో మొదలవుతుంది. ఇక్కడి ప్రధాన పర్యాటక ప్రదేశం నైమిశనాథ్ విష్ణు టెంపుల్. ఉత్తరప్రదేశ్‌లోని సీతాపూర్ జిల్లాలో ఉంది. వైష్ణవ ఆళ్వారులు చెప్పిన 108 దివ్యదేశాలలో ఇదొకటి. ఈ ఆలయ నిర్మాణం దక్షిణాది ఆలయ నిర్మాణశైలిలో ఉంటుంది. లోపలి మందిరం, గర్భాలయం మాత్రం ఉత్తరాది నిర్మాణశైలిలో ఉంటుంది. మూడు గర్భాలయాలుంటాయి. అందులో ఒకటి విష్ణువు, ఒకటి లక్ష్మీదేవి కోసం ఉండగా మరొకటి రామానుజాచార్యుల గర్భాలయం. దేవీదేవతలతోపాటు సమాజానికి సమానత్వం, ఆధ్యాత్మికత మార్గదర్శనం చేసిన గురువుకి కూడా స్థానం లభించడం గుర్తించాల్సిన విషయం. ఆలయం ఆవరణలోని చక్రతీర్థాన్ని పుణ్యతీర్థంగా భావిస్తారు. గోమతి నది స్నానం చేయవచ్చు. ఆదిశంకరాచార్యుడు, మహర్షి సూరదాసు కూడా ఇక్కడ స్నానమాచరించి చక్రతీర్థాన్ని దర్శించుకున్నారని చెబుతారు. ఇక ఇక్కడ చూడాల్సిన మరో ప్రదేశం వ్యాసగద్ది. వేదవ్యాసుడు ఇక్కడ నివసించిన సమయంలో ఇక్కడ ఉన్న మర్రిచెట్టు కింద ఉన్న రాయి మీద కూర్చునేవాడని నమ్ముతారు. వ్యాసుని గౌరవార్థం ఆ ప్రదేశంలో చిన్న నిర్మాణం చేశారు. ఈ మర్రిచెట్టు ఐదువేల ఏళ్ల నాటిది.

7వ రోజు

ఉదయం ఏడు గంటలకు ప్రయాగ సంగమం చేరుతుంది. హోటల్ గదిలో చెక్ ఇన్ కావడం రిఫ్రెష్‌మెంట్ తర్వాత త్రివేణి సంగమానికి చేరాలి. నదిలో విహారం, స్నానమాచరించడం, నీటిని బాటిళ్లలో పట్టుకోవడం, ఇతర క్రతువులు పూర్తి చేసుకున్న తర్వాత పక్కనే ఉన్న హనుమాన్ మందిర్, ఆదిశంకరాచార్య విమానమంటపాలకు వెళ్లాలి. మధ్యాహ్న భోజనం తరవాత రోడ్డు మార్గాన శృంగ్వేర్‌పూర్‌కు వెళ్లాలి. ఇది ప్రయాగ్‌రాజ్ నుంచి 40 కి.మీ.ల దూరాన ఉంది. ఓ గంట ప్రయాణం. ఆ దర్శనం పూర్తి చేసుకుని తిరిగి ప్రయాగ్‌రాజ్‌కి వచ్చి రైలెక్కాలి. రాత్రి ఏడున్నరకు తిరుగు ప్రయాణం మొదలవుతుంది.

అరణ్యవాసానికి దారి

శృంగ్వేర్‌పూర్ పెద్దగా ప్రచారం సంతరించుకోని యాత్రాస్థలం. ఇది ఉత్తర్‌ప్రదేశ్‌లో ఉంది. రామలక్ష్మణులు సీతాదేవి అయోధ్య నుంచి అరణ్యవాసం వెళ్లేటప్పుడు గంగానదిని దాటింది ఇక్కడేనని చెబుతారు. ఈ ప్రదేశాన్ని పాలిస్తున్న నిషధరాజు మత్స్యకారుడు. అతడు రామలక్ష్మణసీతాదేవికి తన రాజ్యంలో ఆతిథ్యమిచ్చి మరుసటి రోజు పడవ ఎక్కించి సాగనంపాడు. ఇది ఇలా ఉంటే ఈ ప్రదేశానికి ఈ పేరు శృంగి మహర్షి ఇక్కడ తపస్సు చేసుకోవడం వల్ల వచ్చింది. ఇతిహాస కథనం ఇలా ఉంటే చారిత్రక ఆధారాలు కూడా ఆసక్తికరంగా ఉన్నాయి. పురాతన శృంగ్వేర్‌పూర్ నిర్మాణాలు తవ్వకాల్లో బయటపడ్డాయి. ఈ ప్రదేశం అయోధ్య నగరానికి 170 కిమీల దూరాన ఉంది.

8వ రోజు


ఈ రోజంతా ప్రయాణంలోనే గడుస్తుంది. సికింద్రాబాద్‌కు చేరేటప్పటికి తొమ్మిదవ రోజు రాత్రి పదిన్నర అవుతుంది.

- వాకా మంజులారెడ్డి,
సాక్షి, ఫీచర్స్ ప్రతినిధి



అయోధ్య రామాలయం


అయోధ్య రాముడు



సంపద అనేది ఎక్కువ వస్తువులను కలిగి ఉండడంలో లేదు.
తక్కువ కోరికలు కలిగి ఉండడంలో ఉంది.
- ఎపిక్టేటస్, గ్రీకు తత్వవేత్త

బిజినెస్ రీల్

దిగ్గజాల మార్కెట్ విలువ రూ.3.35 లక్షల కోట్లు జూమ్



న్యూఢిల్లీ: బుల్ మళ్లీ రంకెలేస్తుండటంతో మార్కెట్ కళకళలాడుతోంది. గత వారంలో బీఎస్ఈ సెన్సెక్స్ 3.6 శాతం జంప్ చేయడంతో దిగ్గజ కంపెనీల మార్కెట్ విలువలు కూడా భారీగా ఎగబాకాయి. మార్కెట్ క్యాప్ పరంగా అత్యంత విలువైన 10 కంపెనీల్లో 9 దిగ్గజాలు రూ.3.35 లక్షల కోట్లను జత చేసుకున్నాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు దూకుడుతో మార్కెట్ విలువ రూ.1.06 లక్షల కోట్లు ఎగసి, రూ. 19.71 లక్షల కోట్లకు చేరింది. ఐసీఐసీఐ బ్యాంక్ రూ.46,303 కోట్లు, టీసీఎస్ రూ.43,688 కోట్లు, ఇన్ఫోసిస్ రూ.34,281 కోట్లు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రూ.34,029 కోట్లు, బజాజ్ ఫైనాన్స్ రూ.32,730 కోట్లు, ఐటీసీ రూ.15,142 కోట్లు, ఎస్‌బీఐ రూ.11,111 కోట్లు, హెచ్‌యూఎల్ రూ.11,054 కోట్లు చొప్పున మార్కెట్ విలువను పెంచుకున్నాయి. అయితే, భారతీ ఎయిర్‌టెల్ మార్కెట్ క్యాప్ మాత్రం రూ.19,330 కోట్లు తగ్గింది. అత్యంత విలువైన కంపెనీగా రిలయన్స్ అగ్ర స్థానంలో కొనసాగుతోంది. తర్వాత ర్యాంకుల్లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ (రూ.14.80 లక్షల కోట్లు), టీసీఎస్ (రూ.12.89 లక్షల కోట్లు), ఐసీఐసీఐ బ్యాంక్ (రూ.10.36 లక్షల కోట్లు), భారతీ ఎయిర్‌టెల్ (రూ. 10.34 లక్షల కోట్లు), ఎస్‌బీఐ (రూ.7.06 లక్షల కోట్లు), ఇన్ఫోసిస్ (రూ.6.6 లక్షల కోట్లు), బజాజ్ ఫైనాన్స్ (రూ.5.69 లక్షల కోట్లు), హెచ్‌యూఎల్ (రూ.5.59 లక్షల కోట్లు), ఐటీసీ (రూ.5.45 లక్షల కోట్లు) ఉన్నాయి.

తగ్గిన హెరిటేజ్ ఫుడ్స్ నికర లాభం

ముంబై: హెరిటేజ్ ఫుడ్స్ మార్చి త్రైమాసికంలో రూ.38.16 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరం(2023-23) ఇదే క్వార్టర్‌లో నమోదు చేసిన రూ.40.49 కోట్లతో పోలిస్తే ఇది 6% తక్కువ. అధిక వ్యయాలు ఇందుకు కారణమయ్యాయి. మొత్తం ఆదాయం రూ.950.56 కోట్ల నుంచి రూ.1,048.46 కోట్లకు చేరింది. వ్యయాలు రూ.898.62 కోట్ల నుంచి రూ.990.5 కోట్లకు పెరిగాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

19-5-2025

విశాఖ	545-00
చిత్తూరు	613-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	540-00
విజయవాడ	550-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	525-00
వరంగల్	527-00
రిటైల్ ధర	5.85

ప్రపంచ పరిణామాలే దిక్సూచి

విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడులూ కీలకమే...

- క్యూ4 ఫలితాలపైనా ఇన్వెస్టర్ల దృష్టి...
- అమెరికాతో వాణిజ్య ఒప్పందాల చర్చల ప్రభావం
- ఈ వారం మార్కెట్ గమనంపై విశ్లేషకుల అంచనా



న్యూఢిల్లీ: దేశీ కార్పొరేట్ కంపెనీల ఆర్థిక ఫలితాలతో పాటు ప్రపంచవ్యాప్తంగా జరిగే ఆర్థిక, రాజకీయ పరిణామాలు, విదేశీ ఇన్వెస్టర్ల నిధుల ప్రవాహం ఈ వారంలో మన స్టాక్ మార్కెట్లకు దిశానిర్దేశం చేయనున్నాయని విశ్లేషకులు పేర్కొన్నారు. ముఖ్యంగా అమెరికా సుంకాల నుంచి తప్పించుకునేందుకు వివిధ దేశాలు కుదుర్చుకోనున్న వాణిజ్య ఒప్పందాలపై తాజా సమాచారం, ప్రపంచ మార్కెట్లపై అది చూపే ప్రభావాన్ని ఇన్వెస్టర్లు నిశితంగా గమనించనున్నారు. 'భారత్-పాకిస్తాన్ ఉద్రిక్తతలు, తెరవెనుక భౌగోళిక-రాజకీయ సంఘటనలు ప్రస్తుతం శాంతించిన నేపథ్యంలో.. ఇన్వెస్టర్లు ఇప్పుడు క్యూ4 ఆర్థిక ఫలితాల సీజన్‌లో మిగిలిన కంపెనీల పనితీరుపై దృష్టిసారించే అవకాశం ఉంది. అంతేకాకుండా, భారత్-అమెరికా మధ్య ట్రేడ్ డీల్ అనుకున్నదాని కంటే ముందుగానే కుదరవచ్చన్న ఆశాభావం నెలకొంది. ఇది మార్కెట్ సెంటిమెంట్‌పై మరింత సానుకూల ప్రభావం చూపవచ్చు' అని మాస్టర్ ట్రస్ట్ గ్రూప్ డైరెక్టర్ పునీత్ సింఘానియా అభిప్రాయపడ్డారు. దేశీ పరిణామాలతో పాటు ప్రపంచవ్యాప్తంగా వెలువడే కీలక ఆర్థిక గణాంకాలు కూడా మన మార్కెట్‌కు దిక్సూచిగా నిలుస్తాయని ఆయన తెలిపారు. అమెరికా వస్తువులపై టారిఫ్‌లను పూర్తిగా ఎత్తివేసేందుకు భారత్ సుముఖంగా ఉందని యూఎస్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి పేర్కొనడం తెలిసిందే. ఇరు దేశాల మధ్య త్వరలోనే వాణిజ్య ఒప్పందం కుదరనుందని కూడా ఆయన తాజాగా చెప్పారు.

కీలక ఫలితాలు...

ఈ వారంలో పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, హిందాల్కో, ఓఎన్‌జీసీ, సన్ ఫార్మా, ఐటీసీ, జేఎస్‌డబ్ల్యూ తదితర కీలక కంపెనీలు క్యూ4 ఆర్థిక ఫలితాలను ప్రకటించనున్నాయి. స్వల్పకాలానికి మన మార్కెట్ ట్రెండ్‌ను ఇవి నిర్దేశించే అవకాశం ఉంది. 'ప్రపంచ వ్యాప్తంగా చెప్పుకోదగిన ప్రధాన ఈవెంట్‌లు ఏవీ లేనందున ఇన్వెస్టర్ల దృష్టి మళ్లీ దేశీ కంపెనీల ఫలితాలపై ఉంటుంది. అలాగే కీలక ఆర్థిక గణాంకాలను కూడా నిశితంగా ట్రాక్ చేస్తారు. ప్రపంచ ట్రేడ్ డీల్స్‌పై అప్‌డేట్‌లు, ప్రపంచ మార్కెట్లు వాటికి ఎలా స్పందిస్తాయనేది కూడా ఇన్వెస్టర్లు జాగ్రత్తగా గమనిస్తారు' అని రెలిగేర్ బ్రోకింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (రీసెర్చ్) అజిత్ మిశ్రా పేర్కొన్నారు. ప్రస్తుత ర్యాలీకి దన్నుగా నిలుస్తున్న విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడి ధోరణి కూడా మార్కెట్ గమనంపై ప్రభావం చూపుతుంది' అని మిశ్రా వ్యాఖ్యానించారు. 'అమెరికా-చైనా మధ్య ట్రేడ్ డీల్, ఇండో-పాక్ ఉద్రిక్తతలు సద్దుమణగడంతో ప్రపంచ వాణిజ్య రంగంలో సానుకూల పరిస్థితులు కనిపిస్తున్నాయి. పెట్టుబడులు పుంజుకోవడానికి ఇది దోహదం చేస్తుంది' అని జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజిస్ట్ వీకే విజయ్‌కుమార్ అభిప్రాయపడ్డారు.

గతవారం ఇలా..

విదేశీ ఇన్వెస్టర్ల జోరు నేపథ్యంలో స్టాక్ మార్కెట్ తాజా ర్యాలీ గత వారంలో కూడా కొనసాగింది. బీఎస్ఈ సెన్సెక్స్ 2,876 పాయింట్లు (3.61 శాతం) దూసుకెళ్లి 82,331 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 1,012 పాయింట్లు (4.21 శాతం) జంప్ చేసి 25,020 వద్ద ముగిసింది.

విదేశీ ఇన్వెస్టర్ల క్యూ...

ప్రపంచవ్యాప్తంగా భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు శాంతిస్తుండటంతో విదేశీ ఇన్వెస్టర్లు మళ్లీ పెట్టుబడుల బాట పడుతున్నారు. దేశీయంగా కూడా ఆర్థిక వ్యవస్థ మూలాలు మెరుగుపడుతుండటం కూడా ఇందుకు దోహదం చేస్తోంది. దీంతో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల (ఎఫ్‌పీఐ) తాజా ర్యాలీ కొనసాగుతోంది. మే నెలలో ఇప్పటిదాకా (16 నాటికి) దేశీ ఈక్విటీ మార్కెట్లో నికరంగా రూ.18,620 కోట్లు ఇన్వెస్ట్ చేశారు. ఈ ఏడాది తొలి మూడు నెలల్లో భారీగా అమ్మకాలకు దిగిన ఎఫ్‌పీఐలు ఏప్రిల్‌లో తొలిసారి మళ్లీ నికర పెట్టుబడులు (రూ.4,223 కోట్లు) పెట్టడం తెలిసిందే. జనవరిలో ఏకంగా రూ.78,027 కోట్లు, మార్చిలో రూ.34,574 కోట్లు, మార్చిలో రూ.3,973 కోట్ల చొప్పున విదేశీ ఇన్వెస్టర్లు వెనక్కి తీసుకోవడం గమనార్హం. ఏప్రిల్ మధ్య నుంచి మళ్లీ పెట్టుబడుల రూట్‌లోకి వచ్చిన ఎఫ్‌పీఐల దన్నుతో మార్కెట్లు కూడా యూ టర్న్ తీసుకుని దూసుకెళ్తున్నాయి. మొత్తంమీద మార్కెట్లో ఇన్వెస్టర్ల విశ్వాసం తిరిగి పుంజుకోవడానికి ఇది దారితీస్తోంది.

ఎలక్ట్రిక్ త్రిచక్ర వాహనాలకు కేరాఫ్ భారత్!

ప్రపంచంలోనే అతిపెద్ద మార్కెట్

- వరుసగా రెండో ఏడాది గుర్తింపు
- 2024లో 7 లక్షల యూనిట్ల విక్రయాలు
- ఇంటర్నేషనల్ ఎనర్జీ ఏజెన్సీ నివేదిక

న్యూఢిల్లీ: ఎలక్ట్రిక్ త్రిచక్ర వాహనాలకు ప్రపంచంలోనే అతిపెద్ద మార్కెట్‌గా భారత్ వరుసగా రెండో ఏడాది గుర్తింపును సొంతం చేసుకుంది. 2024లో వీటి అమ్మకాలు 20 శాతం పెరిగి 7 లక్షల యూనిట్లుగా ఉన్నట్టు ఇంటర్నేషనల్ ఎనర్జీ ఏజెన్సీ (ఐఈఏ) తెలిపింది. ప్రపంచ ఈవీ మార్కెట్‌పై ఐఈఏ ఒక నివేదికను విడుదల చేసింది. ఇందులో భారత్ మార్కెట్ గురించి కీలకంగా ప్రస్తావించింది. అంతర్జాతీయంగా త్రిచక్ర ఈవీల వృద్ధిలో భారత్ ప్రముఖ పాత్ర పోషిస్తున్నట్టు తెలిపింది. 2024లో ప్రపంచవ్యాప్తంగా త్రిచక్ర వాహన అమ్మకాలు అంతకుముందు ఏడాదితో పోల్చితే 5 శాతం క్షీణించినప్పటికీ.. తిచక్ర ఈవీల విక్రయాలు మాత్రం 10 శాతం పెరిగి మిలియన్ యూనిట్లను దాటినట్టు పేర్కొంది. ప్రపంచ వ్యాప్తంగా సంప్రదాయ త్రిచక్ర వాహనాలతోపాటు త్రిచక్ర ఈవీల్లో 90 శాతం వాటా చైనా, భారత్ చేతుల్లోనే ఉన్నట్టు ఈ నివేదిక వెల్లడించింది. ''చైనాలో తిచక్ర వాహన అమ్మకాల్లో గత మూడేళ్ల నుంచి ఈవీలు 15 శాతంలోపే ఉంటున్నాయి. 2023లో చైనాను వెనక్కి నెట్టేసి ప్రపంచ అతిపెద్ద తిచక్ర ఈవీ మార్కెట్‌గా భారత్ అవతరించింది. 2024లోనూ 7 లక్షల త్రిచక్ర ఈవీ అమ్మకాలతో అతి పెద్ద మార్కెట్ స్థానాన్ని కాపాడుకుంది''అని ఈ నివేదిక తెలిపింది. 2024లో ప్రపంచవ్యాప్త త్రిచక్ర ఈవీల అమ్మకాల్లో భారత్ వాటా 57 శాతంగా ఉన్నట్టు పేర్కొంది. 2023తో పోల్చి చూస్తే 3 శాతం వాటాను పెంచుకున్నట్టు తెలిపింది. పీఎం ఈ-డ్రైవ్ పథకం మద్దతును ప్రస్తావించింది. కేంద్ర సర్కారు ఈ పథకం ద్వారా ఈవీలకు సబ్సిడీ ప్రయోజనాలు అందిస్తుండడం తెలిసిందే.

ద్వి, త్రిచక్ర వాహనాలకు బడా మార్కెట్

అంతర్జాతీయంగా ద్విచక్ర, త్రిచక్ర వాహన అమ్మకాల్లో చైనా, భారత్, దక్షిణాసియా దేశాలు 80 శాతం వాటా కలిగి ఉన్నట్టు ఐఈఏ నివేదిక వెల్లడించింది. ప్రైవేటు ప్యాసింజర్ రవాణాకు ఇవి ప్రాథమిక వినియోగంగా ఉన్నట్టు పేర్కొంది. ''ఎలక్ట్రిక్ టూవీలర్లకు భారత్ చురుకైన మార్కెట్‌గా ఉంటోంది. 220కు పైగా ఓఈఎంలకు (వాహన తయారీ సంస్థలు) కేంద్రంగా ఉంది. 2023లో ఉన్న 180 కంటే పెరిగాయి. 2024లో మొత్తం ద్విచక్ర ఈవీల అమ్మకాలు 1.3 మిలియన్ యూనిట్లలో 80 శాతం వాటా టాప్-4 కంపెనీలు కలిగి ఉన్నాయి''అని ఈ నివేదిక తెలిపింది.



అధిక ధరలు, తీవ్ర పోటీ

సంప్రదాయ ద్విచక్ర వాహనలతో పోల్చి చూసినప్పుడు ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల కొనుగోలు ధర అధికంగా ఉన్నట్టు.. అదే సమయంలో పోటీ పెరగడంతో ఓఈఎంలు అందుబాటు ధరలపై మోడళ్లను ఆఫర్ చేస్తున్నట్టు తెలిపింది. ఓలా ఎస్1ఎక్స్ మోడల్‌ను నిదర్శనంగా పేర్కొంది. 2కిలోవాట్‌హవర్ బ్యాటరీ, 6కిలోవాట్ పీక్ పవర్ సామర్థ్యంతో 70,000కే అందిస్తున్నట్టు గుర్తు చేసింది. విధానపరమైన మద్దతు (సబ్సిడీలు) కూడా సంప్రదాయ, ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల మధ్య ధరల అంతరాన్ని తగ్గిస్తున్నట్టు ఐఈఏ నివేదిక తెలిపింది. ఎలక్ట్రిక్ కార్ల అమ్మకాలు 2024లో కేవలం 2 శాతం పెరిగి 1,00,000 యూనిట్లుగా ఉన్నట్టు వెల్లడించింది. ఇక ఈ ఏడాది మొదటి మూడు నెలల్లో ఎలక్ట్రిక్ కార్ల అమ్మకాలు క్రితం ఏడాది మొదటి త్రైమాసికంతో పోల్చి చూస్తే 45 శాతం పెరిగి 35,000 యూనిట్లుగా ఉన్నట్టు తెలిపింది.

భారీగా స్మార్ట్‌ఫోన్ల ఎగుమతులు

పెట్రోలియం, వజ్రాల ఎగుమతుల కంటే అధికం

యూఎస్, జపాన్‌కు నాలుగైదింతలు పెరుగుదల

2024-25 ఆర్థిక సంవత్సరంలో నమోదు



న్యూఢిల్లీ: స్మార్ట్‌ఫోన్ల ఎగుమతులు మంచి జోరు చూపిస్తున్నాయి. ముఖ్యంగా అమెరికాకు ఐదు రెట్లు, జపాన్‌కు నాలుగు రెట్లకు మించి స్మార్ట్‌ఫోన్ల ఎగుమతులు గత మూడేళ్లలో పెరిగినట్టు ప్రభుత్వ డేటా తెలియజేస్తోంది. పెట్రోలియం ఉత్పత్తులు, వజ్రాలను వెనక్కి నెట్టేసి ఎగుమతుల్లో టాప్ స్థానానికి స్మార్ట్‌ఫోన్లు చేసుకున్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 24.14 బిలియన్ డాలర్ల విలువైన (రూ.2.05 లక్షల కోట్లు) స్మార్ట్‌ఫోన్ల ఎగుమతులు నమోదయ్యాయి. 2023-24లో 15.57 బిలియన్ డాలర్ల ఎగుమతులతో పోల్చి చూస్తే 55 శాతం పెరిగాయి. 2022-23లో స్మార్ట్ ఫోన్ల ఎగుమతులు 10.96 బిలియన్ డాలర్లుగా ఉండడం గమనార్హం. గత ఆర్థిక సంవత్సరంలో ప్రధానంగా యూఎస్, నెదర్లాండ్స్, ఇటలీ, జపాన్, చెక్ రిపబ్లిక్ దేశాలకు భారత స్మార్ట్‌ఫోన్ల ఎగుమతుల్లో అధిక వృద్ధి నమోదైంది. ఒక్క అమెరికాకే గత ఆర్థిక సంవత్సరంలో 10.6 బిలియన్ డాలర్ల స్మార్ట్‌ఫోన్ల ఎగుమతులు జరిగాయి. 2023-24లో 5.57 బిలియన్ డాలర్లుగా ఉంటే, 2022-23లో అమెరికాకు స్మార్ట్ ఫోన్ల ఎగుమతులు 2.16 బిలియన్ డాలర్ల చొప్పున ఉన్నాయి. జపాన్ విషయంలోనూ గణనీయమైన వృద్ధి నమోదైంది. 2022-23లో జపాన్‌కు స్మార్ట్‌ఫోన్ల ఎగుమతులు 120 మిలియన్ డాలర్లుగా ఉంటే, 2024-25లో 520 మిలియన్ డాలర్లకు పెరిగాయి.

తయారీ, ఎగుమతులకు కేంద్రం

దేశ అగ్రగామి ఎగుమతుల్లో స్మార్ట్‌ఫోన్లు కూడా చేరినట్టు, పెట్రోలియం ఉత్పత్తులు, వజ్రాల ఎగుమతులను మొదటిసారి అధిగమించినట్టు వాణిజ్య శాఖ అధికారి ఒకరు పేర్కొన్నారు. ముఖ్యంగా గత మూడేళ్లలో బలమైన వృద్ధి నమోదైనట్టు.. దీంతో అంతర్జాతీయంగా స్మార్ట్‌ఫోన్ల తయారీ, ఎగుమతులకు భారత్ ప్రధాన కేంద్రంగా అవతరించినట్టు చెప్పారు. పీఎల్ఐ కింద స్మార్ట్‌ఫోన్ల తయారీకి కేంద్రం రాయితీలు ఇస్తుండడం తెలిసిందే. ఇక నెదర్లాండ్స్‌కు గత ఆర్థిక సంవత్సరంలో 2.2 బిలియన్ డాలర్ల స్మార్ట్‌ఫోన్ల ఎగుమతులు జరిగాయి. అంతకు ముందు ఆర్థిక సంవత్సరంలో ఎగుమతులు 1.07 బిలియన్ డాలర్లతో పోల్చితే రెట్టింపయ్యాయి. ఇటలీకి సైతం 720 మిలియన్ డాలర్ల నుంచి గత ఆర్థిక సంవత్సరంలో 1.26 బిలియన్ డాలర్లకు పెరిగాయి. చెక్ రిపబ్లిక్‌కు 650 మిలియన్ డాలర్ల నుంచి 1.17 బిలియన్ డాలర్ల విలువైన స్మార్ట్‌ఫోన్ల ఎగుమతులు గత ఆర్థిక సంవత్సరంలో పెరిగినట్టు వాణిజ్య శాఖ డేటా తెలియజేస్తోంది.

సెక్షన్ 80Cలో ఎన్నో ఆప్షన్లు


కె.సీహెచ్. ఎ.వి.ఎస్.ఎన్ మూర్తి
కె.వి.ఎన్ లావణ్య
ట్యాక్సేషన్ నిపుణులు

ఈ సెక్షన్ 80C లో సేవింగ్స్, ఇన్వెస్ట్‌మెంట్లు, ఖర్చులు ఇలా ఎన్నో ఆప్షన్లు ఉన్నాయి. ఈ సెక్షన్‌కు పదేళ్ల చరిత్ర ఉంది. ఒకప్పుడు గరిష్ఠ పరిమితి రూ.1,00,000 ఉండేది. తరువాత రూ.1.50 లక్షలకి పెంచారు. అనంతరం ఎటువంటి మార్పు లేదు. ఎప్పటికప్పుడు ఈ పరిమితిని పెంచుతారని వదంతులు, పుకార్లు, ఎదురుచూపులు.. కానీ ప్రతిసారి నిరాశే ఎదురైంది. ఈ లక్షన్నర లిమిట్ ప్రస్తుతానికి అక్కడే ఆగిపోయింది. కారణం ఏమిటంటే ఈ సెక్షన్ పాత పద్ధతిలో పన్ను భారాన్ని ఎంచుకున్నవారికి మాత్రమే. కొత్త విధానం ఎంచుకున్న వారికి ఇది వర్తించదు.

పాతవిధానాన్ని ఎంచుకున్న వారికి మాత్రమే 80C లో ఉన్న ఆప్షన్లు వర్తిస్తాయి. అవేమిటంటే ...

- తన పేరు మీద, జీవిత భాగస్వామి .. పిల్లల పేర్ల మీద చెల్లించే జీవిత బీమా
- డిఫర్డ్ యాన్యుటీ కోసం చేసిన చెల్లింపులు
- ఈపీఎఫ్/జీపీఎఫ్/ సూపర్ యాన్యుయేషన్ ఫండ్‌కి చెల్లింపులు
- సుకన్య సమృద్ధి అకౌంటులో డిపాజిట్లు
- నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్లలో VIII, IX ఇష్యూలు
- అయిదేళ్ల పైబడి కాలవ్యవధి కలిగిన డిపాజిట్లలో ఇన్వెస్ట్‌మెంట్లు
- పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్‌లో జమలు
- సీనియర్ సిటిజన్స్ స్కీము 2024లో పెట్టుబడులు
- యూటీఐ యూలిప్ పాలసీ 1971కి జమలు, ఎల్ఐసీ జమలు
- ఎల్ఐసీ మ్యూచువల్ ఫండ్‌కి జమలు
- ఎల్ఐసీ యాన్యుటీ ప్లాన్/ ఇతర సంస్థల యాన్యుటీ ప్లాన్, కొత్త జీవన్‌ధార, కొత్త జీవన్ అక్షయ ఐఐ, ఐఐఐ ప్లాన్లు, జీవన్‌ధార అక్షయ
- యూటీఐ స్కీం 1992/1999/2005కి సంబంధించిన మ్యూచువల్ ఫండ్
- నేషనల్ హౌసింగ్ బ్యాంక్ (ఎన్‌హెచ్‌బీ) వారికి చేసిన చెల్లింపులు
- బ్యాంకు/ఎల్ఐసీ/ఎన్‌హెచ్‌బీ/ ఇతర కంపెనీల నుంచి తీసుకున్న రుణాల తిరిగి చెల్లింపులు
- పిల్లల స్కూల్ ఫీజు చెల్లింపులు (ఇద్దరికి మాత్రమే)
- ఈక్విటీ షేర్లు/డిబెంచర్ల కోసం చెల్లింపులు
- షెడ్యూల్డ్ బ్యాంకులు, పోస్ట్ ఆఫీసులో అయిదేళ్ల కాలవ్యవధితో చేసిన డిపాజిట్లు
- నాబార్డు వారు జారీ చేసిన బాండ్ల కొనుగోళ్లు
- ఇన్సూరెన్స్ పాలసీ (డిఫర్డ్ యాన్యుటీ పాలసీ మినహా)
- ఇంటి రిజిస్ట్రేషన్ కోసం చెల్లించే రిజిస్ట్రేషన్ ఫీజులు, స్టాంప్ డ్యూటీ చెల్లింపులు.

ఇలా సెక్షన్ 80 ఇలో 20 అంశాలు ప్రతిపాదించారు. వీటిలో కొన్నింటికి షరతులు విధించారు. షరతులకు లోబడితేనే ఆయా అంశాల ప్రకారం మినహాయింపు ఇస్తారు. ఇతరత్రా విషయాలు..

- ప్రావిడెండ్ ఫండ్‌కి చేసే చెల్లింపులు, లోన్ రీపేమెంట్లకు ఎటువంటి మినహాయింపు రాదు.
- ఇంటి రిజిస్ట్రేషన్ విషయంలో వాటా కోసం చెల్లింపు, డిపాజిట్, ఇంటికి మార్పులు, రెనోవేషన్, రిపేరు ఖర్చులకు మినహాయింపు ఇవ్వరు.
- ట్యూషన్ ఫీజుకే మినహాయింపులు. డెవలప్‌మెంట్, డొనేషన్స్ నిమిత్తం చెల్లించినందుకు మినహాయింపులు ఇవ్వరు.
- లైఫ్ ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లింపుల మీద ఆంక్షలున్నాయి. ఏడాది చెల్లింపులు సమ్ అష్యూర్డ్‌లో 10 శాతం దాటకూడదు.

(5). సుకన్య సమృద్ధి అకౌంటు డిపాజిట్ల మీద వడ్డీ మినహాయింపు ఉంది.

పన్నుకు సంబంధించిన సందేహాలు ఏమైనా ఉంటే పాఠకులు business@sakshi.comకు ఈ-మెయిల్ పంపించగలరు.

దీర్ఘకాలంలో రాబడుల స్థిరత్వం

యూటీఐ లార్జ్ అండ్ మిడ్‌క్యాప్ ఫండ్

దీర్ఘకాలం కోసం మోస్తరు రిస్క్‌తో, మెరుగైన రాబడులు కోరుకునే వారికి లార్జ్‌అండ్ మిడ్‌క్యాప్ ఫండ్స్ విభాగం అనుకూలంగా ఉంటుంది. ఎందుకంటే మార్కెట్ విలువ పరంగా టాప్ 250 కంపెనీల్లోనే ఈ పథకాలు ఇన్వెస్ట్ చేస్తుంటాయి. ఈ విభాగంలో యూటీఐ లార్జ్ అండ్ మిడ్‌క్యాప్ ఫండ్ మెరుగైన, స్థిరమైన ప్రదర్శన చూపిస్తోంది. దీర్ఘకాల లక్ష్యాల కోసం సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) రూపంలో ఈ పథకంలో పెట్టుబడులను ఇన్వెస్టర్లు పరిశీలించొచ్చు.



రాబడులు

ఈ పథకం డైరెక్ట్ ప్లాన్‌లో ఏడాది కాల రాబడి 15.66 శాతంగా ఉంది. మూడేళ్లలో ఏటా 26.23 శాతం, ఐదేళ్లలో ఏటా 31.38 శాతం, ఏడేళ్లలో 16.44 శాతం, పదేళ్లలో 14.37 శాతం చొప్పున వార్షిక రాబడిని గమనించొచ్చు. బీఎస్ఈ లార్జ్ అండ్ మిడ్‌క్యాప్ విభాగం సగటు రాబడి కంటే ఈ పథకంలోనే అన్ని కాలాల్లోనూ అదనపు రాబడి కనిపిస్తోంది. ఏక మొత్తంలో అయితే రూ.5,000, సిప్ రూపంలో అయితే కనీసం రూ.500 నుంచి ఇన్వెస్ట్ చేసుకోవచ్చు.



పెట్టుబడుల విధానం

వైవిధ్యమైన పెట్టుబడుల పోర్ట్‌ఫోలియోకి ఈ పథకం ప్రాధాన్యం ఇస్తుంది. బలమైన కంపెనీలు, అది కూడా సహేతుక విలువల వద్ద లభిస్తూ, పెట్టుబడికి భద్రత అధికంగా ఉండే కంపెనీలనే ఎంపిక చేసుకుంటుంది. సెబీ నిబంధనల మేరకు లార్జ్ అండ్ మిడ్‌క్యాప్ ఫండ్స్ కనీసం 35 శాతం చొప్పున పెట్టుబడులను లార్జ్‌క్యాప్, మిడ్‌క్యాప్ విభాగానికి కేటాయించాల్సి ఉంటుంది. అయితే భద్రత కోసం లార్జ్ క్యాప్ కంపెనీలకే ఎక్కువ కేటాయింపులు చేస్తుంటుంది. అదే సమయంలో దీర్ఘకాలంలో అదనపు రాబడి కోసం కొంత మొత్తాన్ని స్మాల్‌క్యాప్ కంపెనీలకూ కేటాయిస్తుంటుంది. ఒక విధంగా వ్యాల్యూ ఇన్వెస్టింగ్‌కు ప్రాధాన్యం ఇస్తుంది. వాటి అంతర్గత విలువ కంటే తక్కువలో ట్రేడ్ అవుతున్న వాటిల్లో పెట్టుబడులనే వ్యాల్యూ ఇన్వెస్టింగ్‌గా చెబుతారు. వ్యాల్యూ ఇన్వెస్టింగ్‌లో మార్జిన్ ఆఫ్ సేఫ్టీ (భద్రత పాళ్లు) అధికంగా ఉంటుంది. టాప్ డౌన్ విధానంలో రంగాల వారీ ఎక్స్‌పోజర్ తీసుకుంటుంది.

పోర్ట్‌ఫోలియో

ప్రస్తుతం ఈ పథకం నిర్వహణలో రూ.4,349 కోట్ల పెట్టుబడులు ఉన్నాయి. ఇందులో 95 శాతం మేర ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేయగా, మిగిలిన మేర నగదు నిల్వలు కలిగి ఉంది. ఈక్విటీ పెట్టుబడుల్లోనూ 55 శాతం మేర లార్జ్‌క్యాప్ కంపెనీల్లోనే ఉన్నాయి. మిడ్‌క్యాప్‌లో 36 శాతం ఇన్వెస్ట్ చేయగా, స్మాల్‌క్యాప్ కంపెనీల్లో 8.67 శాతం చొప్పున పెట్టుబడులు ఉన్నాయి. పెట్టుబడులను గమనిస్తే.. అత్యధికంగా బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ రంగ కంపెనీల్లోనే 32 శాతం మేర పెట్టుబడులు ఉన్నాయి. ఆ తర్వాత టెక్నాలజీ రంగ కంపెనీల్లో 12.8 శాతం, కన్జ్యూమర్ డిస్క్రీషినరీ కంపెనీల్లో 12.08 శాతం, మెటీరియల్స్ కంపెనీల్లో 10.04 శాతం చొప్పున పెట్టుబడుల పరంగా ప్రాధాన్యం ఇచ్చింది. పోర్ట్‌ఫోలియోలో మొత్తం 68 స్టాక్స్ ఉన్నాయి.

టాప్ ఈక్విటీ హోల్డింగ్స్


కంపెనీ	పెట్టుబడులు శాతం
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	7.25
ఐసీఐసీఐ బ్యాంక్	4.75
ఐటీసీ	3.06
ఇండస్ టవర్స్	2.60
ఫెడరల్ బ్యాంక్	2.57
ఆదిత్య బిర్లా క్యాపిటల్	2.56
వేదాంత	2.29
ఇన్ఫోసిస్	2.20
ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్	2.19
మ్యాక్స్ ఫైనాన్షియల్	2.13

సాక్షి ప్లస్
సోమవారం। 19-5-2025

రన్నరప్ యూకీ-గాలోవే జోడీ



న్యూఢిల్లీ: ఈ ఏడాది రెండో డబుల్స్ టైటిల్ సాధించాలని ఆశించిన భారత టెన్నిస్ అగ్రశ్రేణి క్రీడాకారుడు యూకీ బాంబ్రీకి నిరాశ ఎదురైంది. ఫ్రాన్స్‌లో ఆదివారం ముగిసిన బోర్డెక్స్ ఓపెన్ ఏటీపీ చాలెంజర్-175 టోర్నమెంట్‌లో యూకీ బాంబ్రీ (భారత్)-రాబర్ట్ గాలోవే (అమెరికా) జోడీ రన్నరప్‌గా నిలిచింది. ఫైనల్లో రెండో సీడ్ యూకీ-గాలోవే జంట 6-7 (1/7), 6-7 (2/7)తో నాలుగో సీడ్ ఫ్రాన్సిస్కో కబ్రాల్ (పోర్చుగల్)-లుకాస్ మిడ్లెర్ (ఆస్ట్రియా) ద్వయం చేతిలో ఓడిపోయింది. 1 గంట 45 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో యూకీ-గాలోవే ఏడు ఏస్‌లు సంధించి, నాలుగు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. 69 సర్వీస్ పాయింట్లలో ఇండో-అమెరికన్ జంట 43 పాయింట్లు సొంతం చేసుకుంది. రెండు జోడీలు తమ సర్వీస్‌లను రెండుసార్లు చొప్పున చేజార్చుకున్నాయి. అయితే కీలకమైన టైబ్రేక్‌లో కబ్రాల్-మిడ్లెర్ ద్వయం పైచేయి సాధించి టైటిల్‌ను ఖరారు చేసుకుంది. రన్నరప్ యూకీ-గాలోవే జోడీకి 6,520 యూరోల (రూ. 6 లక్షల 22 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 100 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. ఈ ఏడాది అలెక్సీ పాపిరిన్ (ఫ్రాన్స్)తో జతగా యూకీ బాంబ్రీ దుబాయ్ ఓపెన్‌లో డబుల్స్ టైటిల్ సాధించాడు.



వారెవ్వా నూర్...

ఎనిమిదోసారి ప్రపంచ స్క్వాష్ టైటిల్ గెలిచిన ఈజిప్ట్ స్టార్

షికాగో (అమెరికా): అద్దాల కోర్టులో అదరగొట్టే ఆటను కనబరిచిన ఈజిప్ట్ స్టార్ నూర్ ఎల్ షెర్బిని తన కెరీర్‌లో ఎనిమిదోసారి విశ్వవిజేతగా నిలిచింది. ప్రొఫెషనల్ స్క్వాష్ అసోసియేషన్ (పీఎస్‌ఏ) ఆధ్వర్యంలో జరిగిన ప్రపంచ స్క్వాష్ చాంపియన్‌షిప్ లో 29 ఏళ్ల నూర్ మరోసారి తన ఆధిపత్యాన్ని చాటుకుంది. ఈ మెగా ఈవెంట్ చరిత్రలో వరుసగా పదోసారి ఫైనల్ ఆడిన నూర్ 11-5, 11-9, 4-11, 11-7తో ఈజిప్ట్‌కే చెందిన ప్రపంచ మూడో ర్యాంకర్ హనియా ఎల్ హమామీపై విజయం సాధించింది. ఈ గెలుపుతో మహిళల సింగిల్స్ విభాగంలో అత్యధికంగా 8 సార్లు ప్రపంచ టైటిల్ నెగ్గిన ప్లేయర్‌గా నికోల్ డేవిడ్ (మలేసియా) పేరిట ఉన్న రికార్డును ప్రపంచ రెండో ర్యాంకర్ నూర్ సమం చేసింది. నూర్ 2015, 2016, 2019 (రెండుసార్లు), 2021, 2022, 2023లలో కూడా విశ్వవిజేతగా నిలిచింది. 2015 నుంచి మహిళల సింగిల్స్ విభాగంలో ఈజిప్ట్ అమ్మాయిలే చాంపియన్స్‌గా నిలువడం విశేషం. పురుషుల సింగిల్స్ విభాగంలో ఈజిప్ట్ ఆటగాడు ముస్తఫా అసల్ టైటిల్ సాధించాడు. ఫైనల్లో ప్రపంచ నంబర్‌వన్ ముస్తఫా 11-7, 11-8, 11-3తో ప్రపంచ రెండో ర్యాంకర్, నాలుగుసార్లు ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన అలీ ఫరాగ్ (ఈజిప్ట్)పై విజయం సాధించాడు.

జయహో జాస్మిన్

రోమ్ ఓపెన్ టోర్నీలో సింగిల్స్‌తో పాటు డబుల్స్ టైటిల్ సొంతం

ఈ ఘనత సాధించిన ఆరో క్రీడాకారిణిగా గుర్తింపు


సింగిల్స్ విన్నర్స్ ట్రోఫీతో జాస్మిన్ పావోలిని

రోమ్: సొంతగడ్డపై ఇటలీ మహిళా టెన్నిస్ స్టార్ జాస్మిన్ పావోలిని 'డబుల్ ధమాకా' మోగించింది. రోమ్ ఓపెన్ డబ్ల్యూటీఏ-1000 టోర్నీలో శనివారం సింగిల్స్ టైటిల్ నెగ్గిన 29 ఏళ్ల జాస్మిన్ ఆదివారం ఇటలీకే చెందిన సారా ఎరానితో కలిసి డబుల్స్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. డబుల్స్ ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ జాస్మిన్-సారా ఎరాని (ఇటలీ) ద్వయం 6-4, 7-5తో వెరోనికా కుదెర్‌మెటోవా (రష్యా)-ఎలీజ్ మెర్‌టెన్స్ (బెల్జియం) జోడీపై గెలిచింది. టైటిల్ సాధించిన జాస్మిన్-ఎరానిలకు 3,06,500 యూరోల (రూ. 2 కోట్ల 92 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 1000 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. అంతకుముందు ప్రపంచ మూడో ర్యాంకర్ కోకో గాఫ్ (అమెరికా)తో జరిగిన సింగిల్స్ ఫైనల్లో ప్రపంచ ఐదో ర్యాంకర్ జాస్మిన్ 6-4, 6-2తో గెలిచింది. 89 నిమిషాల్లోనే ముగిసిన ఈ మ్యాచ్‌లో జాస్మిన్ ఒక్క ఏస్ కొట్టలేదు. ఒక్క డబుల్ ఫాల్ట్ చేయలేదు. తన సర్వీస్‌ను రెండుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసింది. 70 సర్వీస్ పాయింట్లలో జాస్మిన్ 41 పాయింట్లు సాధించింది. మరోవైపు కోకో గాఫ్ ఏకంగా ఏడు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. విజేతగా నిలిచిన జాస్మిన్‌కు 8,77,390 యూరోల (రూ. 8 కోట్ల 28 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 1000 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. రన్నరప్ కోకో గాఫ్‌కు 4,56,735 యూరోల (రూ. 4 కోట్ల 36 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 650 ర్యాంకింగ్ పాయింట్లు దక్కాయి.

6 ఓపెన్ శకంలో (1968 తర్వాత) రోమ్ ఓపెన్ టోర్నీలో సింగిల్స్‌తోపాటు డబుల్స్ టైటిల్ సాధించిన ఆరో క్రీడాకారిణిగా జాస్మిన్ పావోలిని గుర్తింపు పొందింది. గతంలో బిల్లీ జీన్ కింగ్ (1970: అమెరికా), వర్జీనియా వేడ్ (1971: అమెరికా), క్రిస్ ఎవర్ట్ (1974, 1975: అమెరికా), రాఫెల్లా రెగీ (ఇటలీ: 1985), మోనికా సెలెస్ (యుగోస్లావియా: 1990) ఈ ఘనత సాధించారు.

2 మహిళల టెన్నిస్ సంఘం (డబ్ల్యూటీఏ) 2009లో 1000 ర్యాంకింగ్ టోర్నీలు ప్రవేశపెట్టాక ఒకే టోర్నీలో సింగిల్స్, డబుల్స్ టైటిల్ నెగ్గిన రెండో ప్లేయర్ జాస్మిన్. 2009లో ఇండియన్ వెల్స్ ఓపెన్‌లో వెరా జ్వొనరేవా (రష్యా) తొలిసారి ఈ ఘనత సాధించింది.

40 ఇటలీ ప్లేయర్‌కు రోమ్ ఓపెన్‌లో సింగిల్స్ టైటిల్ లభించడం 40 ఏళ్ల తర్వాత ఇదే తొలిసారి. 1985లో రాఫెల్లా రెగీ తర్వాత ఇటలీ నుంచి రోమ్ ఓపెన్ టైటిల్ నెగ్గిన రెండో ప్లేయర్ జాస్మిన్ పావోలినియే కావడం విశేషం.

2 రోమ్ ఓపెన్ డబుల్స్ టైటిల్‌ను వరుసగా రెండేళ్లు గెలిచిన రెండో జోడీగా జాస్మిన్ పావోలిని-సారా ఎరాని గుర్తింపు పొందింది. గతంలో గీగీ ఫెర్నాండెజ్ (అమెరికా)-నటాషా జ్వెరెవా (బెలారస్) వరుసగా రెండేళ్లు (1994, 1995) డబుల్స్ టైటిల్ సాధించింది.


డబుల్స్ విన్నర్స్ ట్రోఫీతో జాస్మిన్-సారా ఎరాని

రైజర్స్ గాడిన పడేనా!

నేడు లక్నో సూపర్ జెయింట్స్‌తో మ్యాచ్



లక్నో: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) టి20 టోర్నమెంట్ 18వ సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్‌ఆర్‌హెచ్) జట్టు నామమాత్రమైన పోరుకు సిద్ధమైంది. సోమవారం లక్నో సూపర్ జెయింట్స్ (ఎల్‌ఎస్‌జీ)తో రైజర్స్ తలపడనుంది. ఇప్పటికే 'ప్లే ఆఫ్స్' రేసు నుంచి తప్పుకున్న గత సీజన్ రన్నరప్ సన్‌రైజర్స్... మెరుగైన స్థానంతో ఈ సీజన్‌కు ముగింపు పలకాలని భావిస్తోంటే... పడుతూ లేస్తూ సాగుతున్న లక్నో జట్టు మిగిలిన మూడు మ్యాచ్‌ల్లోనూ విజయం సాధించాలని తహతహలాడుతోంది. రిషభ్ పంత్ సారథ్యంలోని లక్నో జట్టు గత ఐదు మ్యాచ్‌ల్లో నాలుగింట ఓడింది. ఈ నేపథ్యంలో తెగించి పోరాడేందుకు రెడీ అవుతోంది. పేలవ ప్రదర్శనతో విమర్శలు ఎదుర్కొంటున్న లక్నో సారథి పంత్‌పై తీవ్ర ఒత్తిడి నెలకొంది. అనుకోని విరామం తర్వాతైనా పంత్ విజృంభిస్తాడా చూడాలి. ఈ సీజన్‌లో 11 మ్యాచ్‌లాడిన లక్నో 5 విజయాలు, 6 పరాజయాలతో 10 పాయింట్లతో ఉంది. మరోవైపు 'ఆరెంజ్ ఆర్మీ' 11 మ్యాచ్‌ల్లో 3 విజయాలు, 7 ఓటములు, ఒక మ్యాచ్‌లో ఫలితం తేలకపోవడంతో 7 పాయింట్లతో ఉంది.

బౌలింగ్ మెరుగైతేనే!

తొలి మ్యాచ్‌లో భారీ స్కోరు చేసి ప్రత్యర్థులను హడలెత్తించిన సన్‌రైజర్స్ ఆ తర్వాత అదే జోరు కొనసాగించడంలో విఫలమైంది. అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్‌లో ఏమాత్రం ప్రభావం చూపలేక పరాజయాలతో సహవాసం చేసింది. ఇప్పటికే రేసు నుంచి తప్పుకున్న కమిన్స్ బృందం... ఇక మిగిలిన మూడు మ్యాచ్‌ల్లో అయినా కాస్త మెరుగైన ప్రదర్శన చేయాలని భావిస్తోంది. గతేడాది 'ఎమర్జింగ్ ప్లేయర్' అవార్డు గెలుచుకున్న ఆంధ్ర ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి ఈసారి పేలవ ప్రదర్శన చేస్తుంటే... తొలి మ్యాచ్‌లో సెంచరీ చేసిన ఇషాన్ కిషన్ ఆ తర్వాత జట్టుకే భారంగా మారాడు. అభిషేక్ శర్మ అడపాదడపా మెరుపులు తప్ప నిలకడలేమితో ఇబ్బంది పడుతుంటే... సీజన్‌లో కాస్త మెరుగైన ప్రదర్శన చేసిన ట్రావిస్ హెడ్ కోవిడ్-19 సోకడంతో ఈ మ్యాచ్‌కు అందుబాటులో లేకుండా పోయాడు. దీంతో అభిషేక్‌తో కలిసి ఇషాన్ ఇన్నింగ్స్‌ను ఆరంభించనుండగా... సచిన్ బేబీకి తుది జట్టులో చోటు దక్కనుంది. మిడిలార్డర్‌లో క్లాసెన్, నితీశ్, అనికేత్, మెండిస్ కీలకం కానున్నారు. ఇక ఈ సీజన్‌లో లయ దొరకబుచ్చుకోలేక ఇబ్బంది పడుతున్న టీమిండియా పేసర్ మొహమ్మద్ షమీతో పాటు కమిన్స్, ఉనాద్కట్ బౌలింగ్‌లో మెరుగుపడాల్సిన అవసరముంది.

పంత్‌పైనే అందరి చూపు

పది రోజుల విరామం తర్వాత బరిలోకి దిగుతున్న లక్నో జట్టు పంత్‌పై భారీ ఆశలు పెట్టుకుంది. ఈ సీజన్‌లో 10 ఇన్నింగ్స్‌ల్లో ఆరుసార్లు సింగిల్ డిజిట్‌కే పరిమితమైన పంత్... 12.8 సగటుతో 128 పరుగులు చేశాడు. కనీసం 100 బంతులు ఎదుర్కొన్న వారిలో పంత్‌దే అతితక్కువ సగటు, స్ట్రయిక్ రేట్. ఈ గణాంకాలు చాలు ఈ సీజన్‌లో పంత్ ఎంతలా తడబడుతున్నాడో అర్థం చేసుకునేందుకు. ఢిల్లీ క్యాపిటల్స్‌తో మ్యాచ్‌లో అయితే అబ్దుల్ సమద్, ఆయుశ్ బదోనీ తర్వాత ఏడో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చాడు. భారత టెస్టు జట్టు కెప్టెన్సీ రేసులో ముందు వరసలో ఉన్న పంత్ ఈ మ్యాచ్‌లోనైనా చెలరేగుతాడా చూడాలి. మార్క్‌రమ్, మార్ష్, పూరన్, మిల్లర్ రూపంలో నలుగురు భీకర బ్యాటర్లు లక్నోకు అందుబాటులో ఉండగా... మిల్లర్ ఫామ్‌లేమీ మేనేజ్‌మెంట్‌ను ఇబ్బంది పెడుతోంది. బౌలింగ్‌లో లక్నో తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఆరంభంలో మెరిపించిన శార్దుల్ ఠాకూర్ ప్రభావం చూపలేకపోతుండగా... మయాంక్ యాదవ్ గాయాలతో సతమతమవుతున్నాడు. విఘ్నేశ్ రాఠీ, ప్రిన్స్ యాదవ్, అవేశ్ ఖాన్ కలసి కట్టుగా కదంతొక్కాల్సిన అవసరముంది.

తుది జట్లు (అంచనా)

లక్నో సూపర్ జెయింట్స్: పంత్ (కెప్టెన్), మార్క్‌రమ్, మార్ష్, పూరన్, బదోని, మిల్లర్, సమద్, రవి బిష్ణోయ్, శార్దుల్ ఠాకూర్, విగ్నేశ్ రాఠీ, ప్రిన్స్ యాదవ్, అవేశ్ ఖాన్.

సన్‌రైజర్స్ హైదరాబాద్: కమిన్స్ (కెప్టెన్), ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ, సచిన్ బేబీ, క్లాసెన్, నితీశ్ రెడ్డి, అనికేత్ వర్మ, కమిందు మెండిస్, ఉనాద్కట్, హర్షల్ పటేల్, షమీ, జీషాన్ అన్సారీ.

చాంపియన్ యువ భారత్



యూపియా (అరుణాచల్ ప్రదేశ్): మరోసారి తమ ఆధిపత్యాన్ని చాటుకున్న యువ భారత్ జట్టు దక్షిణాసియా ఫుట్‌బాల్ సమాఖ్య (శాఫ్) అండర్-19 చాంపియన్‌షిప్‌లో చాంపియన్‌గా నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్లో భారత్ 'షూటౌట్'లో 4-3 గోల్స్ తేడాతో బంగ్లాదేశ్ జట్టును ఓడించింది. భారత్ తరఫున తొలి గోల్‌ను రెండో నిమిషంలో షమీ సింగాయుమ్ సాధించగా... 61వ నిమిషంలో జాయ్ అహ్మద్ గోల్‌తో బంగ్లాదేశ్ స్కోరును 1-1తో సమం చేసింది. ఆ తర్వాత రెండు జట్లు గోల్స్ చేసేందుకు ప్రయత్నించి విఫలమయ్యాయి. దాంతో విజేతను నిర్ణయించేందుకు 'షూటౌట్'ను నిర్వహించారు. 'షూటౌట్'లో భారత్ నాలుగు గోల్స్ చేయగా... బంగ్లాదేశ్ మూడు గోల్స్‌కే పరిమితమై ఓడిపోయింది. తాజా విజయంతో భారత్ ఈ టోర్నీని అజేయంగా ముగించింది. ఆడిన అన్ని మ్యాచ్‌ల్లో భారత్ గెలిచింది. గ్రూప్ దశలో భారత జట్టు 8-0తో శ్రీలంకను చిత్తు చేసి... 4-0తో నేపాల్‌పై జయభేరి మోగించింది. ఇక నాకౌట్ దశలో మాల్దీవులుతో జరిగిన సెమీఫైనల్లో భారత్ 3-0తో జయకేతనం ఎగురవేసింది. 'శాఫ్' వయో విభాగాల టోర్నీల్లో భారత్‌కే అసాధారణ రికార్డు ఉంది. అండర్-15, 16, 17, 18, 19, 20 చాంపియన్‌షిప్‌లలో భారత్ ఇప్పటి వరకు పది టైటిల్స్ గెలిచింది.

వెల్‌డన్ వెర్‌స్టాపెన్

ఎమిలియా రొమాగ్నా గ్రాండ్‌ప్రి టైటిల్ సొంతం


వెర్‌స్టాపెన్

ఇమోలా (ఇటలీ): ఫార్ములావన్-2025 సీజన్‌లో రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ రెండో విజయాన్ని అందుకున్నాడు. ఆదివారం జరిగిన ఎమిలియా రొమాగ్నా గ్రాండ్‌ప్రి రేసులో ప్రస్తుత ప్రపంచ చాంపియన్ వెర్‌స్టాపెన్ విజేతగా నిలిచాడు. నిర్ణీత 63 ల్యాప్‌లను వెర్‌స్టాపెన్ అందరికంటే వేగంగా, అందరికంటే ముందుగా 1 గంట 31 నిమిషాల 33.199 సెకన్లలో పూర్తి చేసి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. 'పోల్ పొజిషన్'తో రేసును ఆరంభించిన మెక్‌లారెన్ డ్రైవర్ ఆస్కార్ పియాస్ట్రి (1గం:31ని:46.155 సెకన్లు) మూడో స్థానంతో సరిపెట్టుకోగా... మెక్‌లారెన్‌కే చెందిన మరో డ్రైవర్ లాండో నోరిస్ (1గం:31ని:39.308 సెకన్లు) రెండో స్థానంలో నిలిచాడు. తొలి ల్యాప్ తొలి మలుపు వద్ద చాకచక్యంగా పియాస్ట్రిని ఓవర్‌టేక్ చేసిన వెర్‌స్టాపెన్ ఆ తర్వాత వెనుదిరిగి చూడలేదు. రేసులోని ఏ దశలోనూ పియాస్ట్రి, నోరిస్, ఇతర డ్రైవర్లు వెర్‌స్టాపెన్‌ను దాటి ముందుకెళ్లడంలో విఫలమయ్యారు. సీజన్‌లో ఏడు రేసులు ముగిశాక పియాస్ట్రి 146 పాయింట్లతో తొలి స్థానంలో, 133 పాయింట్లతో నోరిస్ రెండో స్థానంలో, 124 పాయింట్లతో వెర్‌స్టాపెన్ మూడో స్థానంలో ఉన్నారు. సీజన్‌లోని తదుపరి రేసు మొనాకో గ్రాండ్‌ప్రి ఈనెల 25న జరుగుతుంది.



పోప్‌కు పట్టాభిషేకం









నూతన పోప్ లియో-14 ఆదివారం లాంఛనంగా పూర్తిస్థాయిలో బాధ్యతలు స్వీకరించారు. వాటికన్ సిటీలో అట్టహాసంగా జరిగిన కార్యక్రమంలో ఉన్ని వస్త్రం, ఫిషర్‌మెన్స్ రింగ్, టోపీ వంటి పోప్ అధికారిక లాంఛనాలను కార్డినల్స్ ఆయనకు తొడిగారు. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ దంపతులతో పాటు ప్రపంచ నలుమూలల నుంచీ వచ్చిన పలువురు దేశాధినేతలు, ప్రముఖులు కార్యక్రమంలో పాల్గొన్నారు. దీనికి రెండు లక్షల మందికి పైగా రోమన్ క్యాథలిక్‌లు హాజరవడం విశేషం. అంతకుముందు లియో-14 తొలిసారి పోప్ అధికారిక వాహనంలో వారిమధ్య కలియదిరుగుతూ ఆశీస్సులు అందజేశారు.

సముద్రగర్భంలో పెను విస్ఫోటం!

బద్దలయ్యేందుకు సిద్ధంగా ఉన్న అగ్నిపర్వతం
- పసిఫిక్‌లో అత్యంత క్రియాశీలకంగా 'సీమౌంట్'
- గతంలో పేలినప్పుడు ఏకంగా 10,000 భూకంపాలు

అగ్నిపర్వతం బద్దలైనప్పుడు నిప్పులు చిమ్ముతూ లావా నింగిలోకి ఎగసిపడటం, విపరీతంగా ధూళి సమీప గ్రామాలపై దుమ్ము దుప్పటి కప్పేయడం టీవీల్లో చూసే ఉంటారు. వీటికి పూర్తిభిన్నమైన అగ్ని పర్వతం అతి త్వరలో బద్దలుకానుందని ఖగోళ శాస్త్రవేత్తలు ప్రకటించారు. అమెరికాలోని ఒరెగాన్ రాష్ట్రంలోని ఆస్టోరియా నగర తీరానికి 300 మైళ్ల దూరంలో పసిఫిక్ మహాసముద్రం లోపల ఈ అగ్ని పర్వతం దాగి ఉంది. దీని పేరు యాక్సియల్ సీమౌంట్. భూ ఉపరితలం మీద కాకుండా పసిఫిక్ మహాసముద్రం ఉపరితలానికి 1.4 కిలోమీటర్ల లోతులో ఉండటమే ఈ అగ్నిపర్వతం ప్రత్యేకత.

ఎందుకంత ప్రత్యేకత?

ఈ అగ్నిపర్వతం రెండు భూ పలకలు ఢీకొనే చోట ఏర్పడింది. పసిఫిక్ భూ పలక, జువాన్ డీ ఫ్యూకా భూ పలకలు తరచూ అత్యంత స్వల్పంగా కదులుతుంటాయి. ఈ క్రమంలో ఇవి పరస్పరం తగులుతూ భూమి ఉపరితల పొరల కదలికలకు కారణం అవుతున్నాయి. వీటి సమీపంలో ఉన్న ఈ అగ్నిపర్వతం త్వరలో బద్దలయ్యే అవకాశం ఉందని శాస్త్రవేత్తల తాజా అధ్యయనంలో తేలింది. ఒరెగాన్ స్టేట్ యూనివర్సిటీలోని హ్యాట్‌ఫీల్డ్ మెరైన్ సైన్స్ సెంటర్‌లో పరిశోధకుడైన బిల్ చాడ్విక్ ఈ వివరాలను వెల్లడించారు. ''భూకేంద్రంలో ద్రవ రూపంలోని శిలలు అగ్నిపర్వతం ద్వారా బయటకు వస్తాయి. ఈ శిలాద్రవం (మాగ్మా) వెంటనే సముద్ర జలాలకు తగిలి చల్లబడుతుంది. ఈ క్రమంలో అక్కడి సముద్ర జలాలు వేడెక్కుతాయి'' అని చాడ్విక్ చెప్పారు.



వేల కొద్దీ భూకంపాలు!

''అగ్నిపర్వతం ఎత్తు కేవలం 3,300 అడుగులు. కానీ అత్యంత క్రియాశీలంగా తయారైంది. ఇటీవలికాలంలో శిలాద్రవం బయటికొచ్చే అవకాశాలు ఎక్కువయ్యాయి. భూమి కంపిస్తోంది. అగ్నిపర్వతం తాజా స్థితిని తెల్సుకునేందుకు మేం సమీప ప్రాంతం దాకా కేబుల్ వ్యవస్థ ద్వారా భూకంప తీవ్రతలను కనిపెట్టే ఏర్పాట్లుచేశాం'' అని ఆయన చెప్పారు. ''అగ్నిపర్వతం బద్దలయ్యే ముందు భూమి వందల సార్లు కంపిస్తుంది. ఇక అగ్నిపర్వతం బద్దలైన సందర్భాల్లో వేల సార్లు కంపిస్తుంది. 2015 ఏప్రిల్‌లో చివరిసారిగా అగ్నిపర్వతం బద్దలైంది. అప్పుడు విపరీతంగా శిలాద్రవం బయటకు ఎగజిమ్మింది. అప్పుడు 24 గంటల వ్యవధిలో ఈ ప్రాంతంలో 10,000 చిన్నపాటి భూకంపాలు వచ్చాయి. ఈసారి కూడా అదే స్థాయిలో భూమి కంపించే వీలుంది'' అని 'యూనివర్సిటీ ఆఫ్ వాషింగ్టన్ స్కూల్ ఆఫ్ ఓషనోగ్రఫీ'లో మెరైన్ జియోఫిజిసిస్ట్, ప్రొఫెసర్ విలియం విల్‌కుక్ స్పష్టంచేశారు.

జీవవైవిధ్యానికి బాసట

అగ్నిపర్వతం బద్దలైనప్పుడు భారీ స్థాయిలో శిలాద్రవం మహాసముద్రజలాల్లో కలిసిపోతుంది. ఈ శిలాద్రవంలో ఎన్నో రకాల మూలకాలు ద్రవరూపంలో ఉంటాయి. ఇవన్నీ సముద్రజలాల్లో సమ్మిళితమై అక్కడి సూక్ష్మజీవులకు ఆహారంగా మారతాయి. ఈ సూక్ష్మజీవులపై ఆధారపడిన చిన్న జలచరాలు, వాటిని ఆహారం తీసుకునే చేపలు.. ఇలా ఆహార చక్రం సదా సవ్యంగా కొనసాగేందుకు అగ్నిపర్వతం పరోక్షంగా సాయపడుతోంది. అత్యంత వేడితో సెగలు కక్కే మాగ్మా సముద్ర ఉపరితలానికి ఎగసిపడగానే అక్కడ జీవులు కొన్ని చనిపోయినా తర్వాత మాత్రం అక్కడ జీవరాశి పెరుగుదలకు దోహదపడుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. సముద్రంలో జీవం మనుగడకు అగ్నిపర్వతాలు సైతం తమ వంతు సాయం చేస్తున్నాయని యూనివర్సిటీ ఆఫ్ వాషింగ్టన్‌లో మెరైన్ జియోలజీ, జియోఫిజిక్స్ విభాగ ప్రొఫెసర్ డెబీ కెల్లీ వ్యాఖ్యానించారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

భారత్‌ను చుట్టేస్తున్న... స్థూలకాయ సునామీ

- 2050కల్లా 45 కోట్ల మందికి
- లాన్సెట్ అధ్యయనం వెల్లడి



న్యూఢిల్లీ: మిరపకాయ బజ్జీ. మైసూర్ బోండా. పిజ్జా. బర్గర్. ఇలా జంక్ ఫుడ్‌ను భారతీయులు మితిమీరి తింటున్నారట. ఫలితంగా జనాభాలో చాలామంది స్థూలకాయ సుడిగుండంలో చిక్కుతున్నారని ప్రఖ్యాత లాన్సెట్ అధ్యయనం వెల్లడించింది. ఈ సమస్య దేశాన్ని నిశ్శబ్ద సునామీలా చుట్టేస్తోందని ప్రమాదఘంటికలు మోగించింది. 2050కల్లా దేశంలో మూడోవంతు, అంటే 45 కోట్ల మంది స్థూలకాయంతో బాధపడటం ఖాయమని 'ది లాన్సెట్ ప్రాజెక్ట్' పేరిట ప్రచురించిన అధ్యయనంలో కుండబద్దలు కొట్టింది. 22 కోట్ల మంది పురుషులు, 23 కోట్ల మంది స్త్రీలు సమస్య బారిన పడతారని అంచనా వేసింది. స్థూలకాయం వల్ల టైప్-2 మధుమేహం, గుండె, శ్వాసకోశ, కాలేయ, జీర్ణకోశ సమస్యలు, హార్మోన్ల అసమతుల్యత, వంధ్యత్వం, క్యాన్సర్ ముప్పు మరింత పెరుగుతాయని హెచ్చరించింది.

సర్వాంతర్యామి

స్థూలకాయం నగరాలు, అధికాదాయ కుటుంబాలకే పరిమితం కావడం లేదు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోనూ ఈ కేసులు పెరుగుతున్నాయి. మధుమేహ బాధితుల్లో భారతీయులే ఎక్కువని పలు నివేదికలు ఘోషిస్తున్నాయి. జనాభాలో 10 కోట్ల మందికి పైగా దాని బారిన పడ్డట్టు అంచనా. యుక్త వయస్కుల్లోనూ షుగర్ సమస్యలు పెరుగుతుండటం ఆందోళనకర మేనని అధ్యయనం పేర్కొంది. అధిక బరువే దీనికి మూలమని ఢిల్లీ ఎయిమ్స్ మెడిసిన్ విభాగ అదనపు అధ్యాపకుడు డాక్టర్ నీరజ్ నిశ్చల్ అన్నారు. ''ఒబెసిటీ విజృంభణ భారత్‌లో వ్యాధుల ముఖచిత్రాన్నే మార్చేస్తోంది. సమస్యకు వెంటనే పరిష్కారం వెతక్కపోతే ఆరోగ్య, ఆర్థిక రంగాలకు పెనుభారంగా మారుతుంది'' అన్నారు. ''ఒకప్పుడు వ్యక్తిగత సమస్య అయిన స్థూలకాయం ఇప్పుడు దేశ సమస్యగా మారుతోంది. స్కూళ్లు, కార్యాలయాల నుంచి ఆస్పత్రులదాకా అంతటా దీనిపై అవగాహన కల్పించాలి'' అని సూచించారు. ''స్థూలకాయం నిజంగానే నిశ్శబ్ద సునామీ. పైకి కనిపించకుండా దీర్ఘకాల సమస్యలకు దారితరరీస్తుంది. దీన్ని జాతీయ ఎమర్జెన్సీగా ప్రకటించాలి. వ్యవస్థీకృత ప్రజారోగ్య సవాల్‌గా పరిగణించి సంస్థాగత స్థాయిలో నివారణ చర్యలు చేపట్టాలి'' అని గంగారాం ఆస్పత్రి సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ మొహిసిన్ వాలీ అన్నారు. ''పోషకాహారంపై ప్రజలకు అవగాహన పెంచాలి. ఆహార పదార్థాల్లో పరిమితికి మించి కృత్రిమ పదార్థాల జోడింపు తదితరాలపై తనిఖీలు పెంచాలి. స్థూలకాయానికి ప్రభుత్వరంగ సంస్థలను జవాబుదారీగా చేయాలి'' అన్నది వైద్య నిపుణుల అభిప్రాయం. ''ఒబెసిటీ దెబ్బకు భావి తరాల ఆయుర్దాయం బాగా తగ్గే ప్రమాదముంది. దేశ శ్రామికశక్తి సామర్థ్యాలను తగ్గించి ఆర్థికాభివృద్ధికి ఇది ప్రతిబంధకంగా మారుతుంది. ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోకపోతే ఒబెసిటీ రోగులకు, సాంక్రమణేతర వ్యాధి సంక్షోభానికి భారత్ ప్రపంచ కేంద్ర స్థానంగా మారడం ఖాయం'' అని హెచ్చరిస్తున్నారు.



ఎవరెస్ట్‌పైకి 19వసారి!

స్వీయ రికార్డునే అధిగమించిన బ్రిటిష్ పర్వతారోహకుడు

కఠ్మాండు: ప్రఖ్యాత బ్రిటిష్ పర్వతారోహకుడు కెంటన్ కూల్ (51) సరికొత్త రికార్డు నెలకొల్పారు. ప్రపంచంలోనే ఎత్తయిన శిఖరం ఎవరెస్ట్‌ను రికార్డు స్థాయిలో 19వ సారి అధిరోహించారు. ఈ ఘనత సాధించిన తొలి షెర్పాయేతరుడిగా నిలిచారు. ఈ విషయంలో కూల్ తన రికార్డును తానే అధిగమించడం విశేషం. మౌంటెయిన్ గైడ్ అయిన కూల్ ఇతర అధిరోహకులతో కలిసి ఆదివారం 8,849 మీటర్ల ఎత్తయిన ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించారు. ఆయన 2004లో తొలిసారి ఎవరెస్ట్‌ను అధిరోహించారు. అప్పటినుంచి 2014, 2015, 2020ల్లో మినహా ఏటా ఎవరెస్ట్ ఎక్కుతూ వస్తున్నారు. మంచు చరియలు విరిగిపడటం వల్ల 2014లో, భూకంపంతో 2015లో, కరోనా కారణంగా 2020లో ఎవరెస్ట్ యాత్ర జరగలేదు. ఎవరెస్ట్‌ను అత్యధిక పర్యాయాలు అధిరోహించిన రికార్డు మాత్రం నేపాలీ షెర్పాలదే. షెర్పా గైడ్ కమి రిటా అత్యధికంగా 30సార్లు ఈ ఘనత సాధించారు. ప్రస్తుతం ఆయన మరోసారి శిఖరాన్ని చేరుకునే ప్రయత్నంలోనే ఉండటం విశేషం!

బుద్ధుడు నవ్విన వేళ

భారత తొలి అణు పరీక్షకు 51 ఏళ్లు ● అణుసత్తాను ప్రపంచానికి చాటిన ప్రయోగం

51 ఏళ్ల క్రితం. 1974 మే 18. ఆ రోజు థార్ ఎడారిలోని ఇసుక మేటల్లో పుట్టిన 'భూకంపం' యావత్ ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురి చేసింది. 'ఆపరేషన్ స్మైలింగ్ బుద్ధ' పేరుతో రాజస్థాన్‌లోని పోఖ్రాన్‌లో భారత్ తొలి అణుపరీక్ష నిర్వహించింది. శాస్త్ర సాంకేతిక సత్తాను ప్రపంచానికి చాటింది. ఐరాస భద్రతా మండలిలోని ఐదు శాశ్వత సభ్యదేశాల తర్వాత అణుపరీక్ష చేసిన తొలి దేశంగా అవతరించింది. పోఖ్రాన్-1 న్యూక్లియర్ టెస్ట్‌గా పిలిచే ఈ ప్రయోగాన్ని నాటి ప్రధాని ఇందిరాగాంధీ సారథ్యంలో అత్యంత రహస్యంగా చేపట్టారు.

ఏ దేశాలు వ్యతిరేకించాయి?

అణుబాంబుల బాధిత దేశమైన జపాన్ మొట్టమొదట ఈ పరీక్షలను తీవ్రంగా ఖండించింది. భారత్‌పై కఠిన ఆంక్షలు విధించాలని అంతర్జాతీయ సమాజాన్ని కోరింది. ఆస్ట్రేలియా సైతం ఇదే పాట పాడింది. రెండ్రోజుల తర్వాత జరిగిన ఐరాస నిరాయుధీకరణ సమావేశంలో ఆస్ట్రేలియా తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసింది. ''అణుబాంబురహిత అవని కోసం అంతా ఎదురుచూస్తుంటే పేలుళ్లతో అందరి ముఖం మీద భారత్ చెంప వాచిపోయేలా కొట్టింది'' అని ఆస్ట్రేలియా ప్రతినిధి జాన్ క్యాంప్‌బెల్ వ్యాఖ్యానించారు. ద.కొరియా, మలేసియా, న్యూజిలాండ్ సైతం ఇలాగే స్పందించాయి.

అమెరికా కన్నుగప్పి...

1974 ప్రయోగంలో అణు విచ్ఛిత్తి సిద్ధాంతంతో తయారైన అణుబాంబును పరీక్షించారు. అత్యధిక పీడనం, ఒత్తిడితో అత్యల్ప పరిమాణంలోకి ఇమిడ్చిన ప్లుటోనియంను పేలేలా చేశారు. కేంద్రక విచ్ఛిత్తిలో బరువైన ప్లుటోనియం అణువులోని కేంద్రకం రెండు చిన్న కేంద్రకాలుగా విడిపోతుంది. ఆ క్రమంలో అత్యధిక ఉష్ణశక్తి వెలువడుతుంది. ఆ క్రమంలో జరిగే భారీ విస్ఫోటం పెను విధ్వంసాన్ని సృష్టిస్తుంది. రెండో ప్రపంచ యుద్ధం చివర్లో జపాన్‌లోని హిరోషిమా, నాగసాకి నగరాలపై అమెరికా వేసిన అణుబాంబులు ఈ రకానివే. ఈ ప్రయోగం కోసం కోసం ముంబై సమీపంలోని కెనడా ఇండియా రియాక్టర్ యుటిలిటీ సర్వీసెస్ (సిరస్) నుంచి తెప్పించిన ఆరు కిలోల ప్లుటోనియం వాడారు. అది పేలడానికి పొలోనియం-బేరియం పేలుడు పదార్థాన్ని జతచేశారు. దాన్ని పేల్చే వ్యవస్థను చండీగఢ్, పుణెల్లో అభివృద్ధిచేశారు. షట్కోణాకృతిలోని 1,400 కిలో బాంబు అమెరికా నిఘా కంటికి చిక్కకుండా ఇసుకతో కప్పేసి రైలు మార్గాన థార్‌కు తరలించారు!

చాన్నాళ్ల క్రితమే బీజం

అణుబాంబు తయారీ కోసం భారత్ 1967 నుంచే విస్తృత పరిశోధనలు మొదలు పెట్టింది. ప్రఖ్యాత అణు భౌతిక శాస్త్రవేత్త రాజా రామన్న సారథ్యంలో పీకే అయ్యంగార్, రాజగోపాల చిదంబరం వంటి 75 మంది శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు అణుబాంబు తయారీలో తలమునకలయ్యారు. 1972 సెప్టెంబర్ 7న ప్రధాని ఇందిర బాబా ఆటమిక్ రీసెర్చ్ సెంటర్ (బార్క్)ను సందర్శించారు. అణుపరీక్షపై ముందుకెళ్లాలని శాస్త్రవేత్తల బృందానికి దిశానిర్దేశం చేశారు. ప్రయోగానికి ఒక రోజు ముందు, అంటే 1974 మే 17న రాజా రామన్నకు ఇందిర ఫోన్ చేశారు. ''డాక్టర్ రామన్నా! ఇక మనమేంటో చూపిద్దాం. మనం చేసే పని దేశానికి ఎంతో మేలు చేకూరుస్తుంది'' అన్నారు. ఆ మర్నాడు జరిగిన అణుపరీక్షకు పోఖ్రాన్ టెస్ట్ రేంజ్‌లోని ఇండియన్ ఆర్మీ బేస్ వేదికైంది. అణుపరీక్ష అత్యంత శాంతియుతంగా జరిగిందని విదేశాంగ శాఖ ప్రకటించింది. ప్రపంచదేశాలు మాత్రం భారత్ అణ్వస్త్ర వ్యాప్తికి పాల్పడుతోందని కుతకుతలాడాయి. మనపై ఆంక్షల కత్తి దూశాయి.


పోఖ్రాన్‌లో అణు పరీక్ష జరిపిన ప్రాంతంలో ఇందిర (ఫైల్)

ఆ మీట నొక్కిందెవరు?

మే 18 ఉదయం 8.05 గంటలకు శాస్త్రవేత్త ప్రణబ్ రేబతిరంజన్ దస్తీదార్ ఫైరింగ్ బటన్ నొక్కారు. ''బటన్‌ను నొక్కేందుకు అంతా ఆసక్తి చూపారు. దాంతో ట్రిగ్గర్ తయారీలో కీలకపాత్ర పోషించిన ప్రణబ్‌కే చాన్సివ్వాలని నిర్ణయించాం'' అని రాజా రామన్న తన 'ఇయర్స్ ఆఫ్ పిల్‌గ్రిమేజ్' పుస్తకంలో వెల్లడించారు. నాడు బార్క్ గ్రూప్ డైరెక్టర్‌గా ఉన్న ప్రణబ్ తర్వాత ఐరాస అణుఇంధన సంస్థ డైరెక్టర్‌గా చేశారు. భారత తొలి దేశీయ అణుఇంధన జలాంతర్గామి తయారీలో కీలకపాత్ర పోషించారు.

'స్మైలింగ్ బుద్ధ' ఎందుకు?

1974లో బుద్ధ పూర్ణిమ మే 18న వచ్చింది. అందుకే ప్రయోగానికి ఇందిర ఆ పేరు పెట్టారు. ఆ మేరకు సైంటిస్ట్ రాజా రామన్నకు రహస్య సందేశం పంపారు. ప్రయోగం విజయవంతం అయ్యాక 'ఎట్టకేలకు బుద్ధుడు నవ్వాడు' అంటూ ఆయన ఇందిరకు మెసేజ్ పంపారు.

1998లో పోఖ్రాన్-2

అంతర్జాతీయ ఆంక్షల నేపథ్యంలో రెండు దశాబ్దాల పాటు భారత్ అణుపరీక్షలకు దూరంగా ఉంది. ఆ సమయంలో పుష్కలంగా కూడగట్టుకున్న అణు సాంకేతికతను జోడించి 1998లో 'ఆపరేషన్ శక్తి' పేరిట మళ్లీ అణుపరీక్షలకు దిగింది. దీన్నే పోఖ్రాన్-2 అని కూడా అంటారు. అప్పుడూ మే లోనే ప్రయోగం జరగడం విశేషం. అమెరికా నిఘా సంస్థ సీఐఏ కళ్లుగప్పి మే 11న థార్ ఎడారిలో మరోసారి దిగ్విజయంగా ప్రయోగం నిర్వహించింది. అణు, హైడ్రోజన్ బాంబులను ఏకకాలంలో పేల్చింది. రెండు రోజులకు మే 13న మరో రెండు అణుబాంబులను పేల్చింది.

– సాక్షి, నేషనల్ డెస్క్

పాక్ కన్నా నరకం మేలు: జావెద్ అఖ్తర్

న్యూఢిల్లీ: దేశభక్తి, మతం అంశాలపై తన అభిప్రాయాలను కుండబద్దలు కొట్టినట్లు వెల్లడించే సినీ రచయిత జావెద్ అఖ్తర్ (80) మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. పాకిస్తాన్, నరకం ఈ రెండింట్లో ఎక్కడికెళతావని అడిగితే తాను నరకాన్నే ఎంచుకుంటానని చెప్పారు. శనివారం రాత్రి ముంబైలో శివసేన(యూబీటీ) నేత సంజయ్ రౌత్ రాసిన పుస్తకం 'హెవెన్ ఇన్ ది స్వాంప్'(చిత్తడి నేలలో స్వర్గం) ఆవిష్కరణ సభలో ఆయన మాట్లాడారు. తనను నాస్తికుడని చెప్పుకునే జావెద్ అఖ్తర్ భారత్, పాకిస్తాన్‌ల నుంచి అతివాదులు నిత్యం తనపై దుర్భాషల వర్షం కురిపిస్తున్నారని వెల్లడించారు. వీరిలో ఎవరైనా నన్ను దూషించడం ఆపేస్తే, చాలా ఆందోళన చెందుతాను. 'కాఫిర్ అని, నరకానికి వెళ్తావని ఒకరంటే, జిహాదీ, పాకిస్తాన్‌కు పొమ్మంటూ మరొకరు దూషిస్తారు. పాకిస్తాన్, నరకం ఈ రెండింట్లో ఎటు వెళ్లాలన్న ప్రశ్న వస్తే మాత్రం నేను నరకానికే వెళ్తానంటాను' అంటూ జావెద్ అఖ్తర్ చేసిన వ్యాఖ్యలకు ఆహూతుల కరతాళ ధ్వనులతో ఆ ప్రాంతం దద్దరిల్లింది. 'పౌరులు ఏ రాజకీయ పార్టీకి చెందిన వారై ఉండరాదు. ఏ ఒక్క పార్టీకీ విధేయత చూపరాదు. అలాంటప్పుడు మాత్రమే పౌరులు ఏది తప్పో, ఏది రైటో చెప్పగలరు' అని అభిప్రాయం వ్యక్తం చేశారు.

ఆపరేషన్ సిందూర్‌పై బీజేపీ అవగాహన తరగతులు

సాక్షి, న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌పై కొందరు పార్టీ నేతలు చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమైన నేపథ్యంలో దీనిపై అవగాహన తరగతులు నిర్వహించాలని బీజేపీ నాయకత్వం నిర్ణయించింది. ఆర్మీ అధికారులు సహా, భారత్ చేపట్టిన ఆపరేషన్‌పై అనుచిత వ్యాఖ్యలకు ఆస్కారం ఇవ్వకుండా, కేవలం ప్రస్తావించాల్సిన, ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అంశాలపై నేతలకు ఇందులో మార్గదర్శనం చేయనున్నారు. సైనికాధికారి కల్నల్ సోఫియా ఖురేషీపై మధ్యప్రదేశ్ మంత్రి విజయ్‌షా చేసిన అభ్యంతరకర వ్యాఖ్యల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెబుతున్నారు. తరగతులను మొదట మధ్యప్రదేశ్‌లోని భోపాల్ నుంచి ప్రారంభించనున్నారు. నేతలు తమ ప్రసంగాలు, రాజకీయంగా సున్నితమైన ప్రశ్నలను ఎదుర్కొనేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రాష్ట్ర మంత్రులు, సీనియర్ నేతలు మార్గనిర్దేశనం చేయనున్నారు.

సిందూర్ దౌత్యం ఓ 'బరాత్': రౌత్

బహిష్కరించాలని ఇండియా కూటమికి పిలుపు

ముంబై: ఆపరేషన్ సిందూర్ అనంతరం దౌత్యపరమైన మద్దతు కూడగట్టేందుకు ఎంపీల బృందాలను విదేశాలకు పంపించాలన్న కేంద్ర ప్రభుత్వం నిర్ణయాన్ని శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్ తప్పుబట్టారు. ఈ కార్యక్రమాన్ని ఆయన పెళ్లి కొడుకు ఊరేగింపు 'బరాత్'గా అభివర్ణించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బలహీనుడు. ఈ బరాత్‌ను పంపించాల్సిన అవసరమే లేదు. ఇంత హడావుడి సరికాదు. ఈ బృందంలో సభ్యుడుగా ఉన్న డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ షిండే, ఎంపీ శ్రీకాంత్ షిండే విదేశాల్లో ఏం చేస్తారు?. ఈ అంశాన్ని బీజేపీ రాజకీయం చేస్తోంది. ప్రతి దాన్నీ రాజకీయం చేయడం ఆ పార్టీకి అలవాటు. ఇండియా కూటమి ఈ బరాత్‌ను బాయ్‌కాట్ చేయాలి'అని రౌత్ పిలుపునిచ్చారు. కాగా, సంజయ్ రౌత్ పార్టీకి చెందిన ప్రియాంకా చతుర్వేది సైతం విదేశాలకు వెళ్లే ఎంపీల బృందంలో సభ్యురాలు కావడం విశేషం.

పీఏసీఎస్‌ల బలోపేతానికి చర్యలు

కేంద్ర మంత్రి అమిత్ షా వెల్లడి

అహ్మదాబాద్: రిజిస్టరయిన ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘా(పీఏసీఎస్)లు ఆర్థికంగా చితికిపోకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందని కేంద్ర హోం, సహకార శాఖల మంత్రి అమిత్ షా చెప్పారు. రుణభారంతో దివాళా స్థితికి చేరుకున్న పీఏసీఎస్‌లను ఒన్‌టైం సెటిల్‌మెంట్ ద్వారా ఒడ్డున పడేసేందుకు త్వరలోనే విధానాన్ని తీసుకురానున్నామని ప్రకటించారు. ఆయా పీఏసీఎస్‌ల స్థానంలో కొత్తవి నమోదైనా ఈ విధానం ద్వారా సాయం చేస్తామన్నారు. 2029 కల్లా దేశంలో కొత్తగా 2 లక్షల పీఏసీఎస్‌లను ఏర్పాటు చేయాలన్నది మోదీ ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. సహకార విధానంలో చీజ్, పనీర్, ఐస్‌క్రీం తదితర 22 రకాల వ్యాపారాలు చేపట్టేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని అమిత్ షా తెలిపారు. ఆదివారం అహ్మదాబాద్‌లో జరిగిన సహకారీ మహా సమ్మేళన్‌లో మంత్రి ప్రసంగించారు. మరింతమంది రైతులకు పీఏసీఎస్‌లను చేరువ చేసేందుకు తమ శాఖ 57 కార్యక్రమాలను అమలు చేస్తోందని అమిత్ షా చెప్పారు.

మోదీ ప్రభుత్వానిది చౌకబారు రాజకీయం

ప్రతినిధి బృందాల ఎంపికపై కాంగ్రెస్ నేత జైరాం రమేశ్

సాక్షి, న్యూఢిల్లీ: పాకిస్తాన్ ఉగ్రవాదంపై భారత్ వైఖరిని ప్రపంచ దేశాలకు వివరించేందుకు పంపే ఎంపీల బృందాల ఎంపిక తీరును కాంగ్రెస్ తప్పుబట్టింది. ఈ విషయంలో మోదీ ప్రభుత్వం చౌకబారు రాజకీయం చేస్తోందని మండిపడింది. తమ పార్టీ నాలుగు పేర్లను అందజేయగా ఒక్కరిని ఎంపిక చేయడం ఏమిటంటూ సీనియర్ నేత జైరాం రమేశ్ ఆదివారం 'ఎక్స్'లో మోదీ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 'విదేశాలకు పంపే ప్రతినిధుల బృందాల్లో చేర్చాల్సిన కాంగ్రెస్ పార్టీకి చెందిన నలుగురు ఎంపీలు, నాయకుల పేర్లను మోదీ ప్రభుత్వం కోరింది. మే 16న మధ్యాహ్నం ఆ నాలుగు పేర్లను పార్లమెంటరీ వ్యవహారాల మంత్రికి పంపాం. అదే రోజు విడుదల చేసిన జాబితాలో కాంగ్రెస్ సూచించిన నాలుగు పేర్లలో ఒక్కటి మాత్రమే చేర్చడం విచారకరం. ఇది మోదీ ప్రభుత్వపు పూర్తిగా సున్నితత్వం లేని, నిజాయతీ లేని రాజకీయ ఆలోచనకు నిదర్శనం. తీవ్రమైన జాతీయ సమస్యలపై కూడా ఎలా చౌకబారు రాజకీయ ఆట ఆడుతుందనేందుకు ఇదే నిదర్శనం. తాము పంపిన నలుగురు ఎంపీలు, నాయకులు కచ్చితంగా ప్రతినిధి బృందంతో పాటు వచ్చి తమ భూమికను పోషిస్తారు. ప్రధానమంత్రి, బీజేపీల మాదిరిగా.. కాంగ్రెస్ ఎప్పుడూ దిగజారదు'అని జైరాం రమేశ్ మండిపడ్డారు.

ఆయన మానసికంగా దెబ్బతిన్నట్లుంది

అస్సాం సీఎంపై ఎంపీ గొగోయ్ అనుమానం

న్యూఢిల్లీ/గువాహటి: అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మపై కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ గౌరవ్ గొగోయ్ తీవ్రంగా మండిపడ్డారు. పనిగట్టుకుని తనపై 13 ఏళ్లుగా నిరాధార ఆరోపణలు సాగిస్తున్న సీఎం శర్మ మానసిక ఆరోగ్య సరిగా లేనట్లుందని అనుమానం వ్యక్తం చేశారు. సీఎం శర్మ చేస్తున్న ఆరోపణల్లో 99 శాతం వరకు అర్థంపర్థం లేనివేనంటూ దుయ్యబట్టారు. భ్రమల్లో జీవించడం మాని ఆరోపణలకు సంబంధించిన వాస్తవ ఆధారాలను ప్రజల ముందుంచాలన్నారు. పాక్ గూఢచర్య విభాగం ఐఎస్ఐ ఆహ్వానం మేరకు గొగోయ్ ఆ దేశం వెళ్లారని, అక్కడి ప్రభుత్వం దగ్గరి సంబంధాలు కొనసాగించారని శనివారం సీఎం శర్మ తీవ్ర ఆరోపణలు చేయడంపై గొగోయ్ పైవిధంగా స్పందించారు. పార్టీ, ప్రభుత్వంలో సమస్యలను పరిష్కరించలేకనే సీఎం హిమంత బిశ్వ శర్మ నిరాధార ఆరోపణలు సాగిస్తున్నారన్నారు. 2026 ఎన్నికల తర్వాత ఆయనకు కొంత విశ్రాంతి దొరుకుతుందని హామీ ఇస్తున్నామన్నారు.

బెంగాల్ విభజనకు కారణమైన వైస్రాయ్?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

ఆధునిక భారతదేశ చరిత్ర - బ్రిటీషర్ల పాలన

వైస్రాయ్‌లు

లార్డ్ కానింగ్

ఇతడిని 1858 నవంబర్ 1న అలహాబాద్ కోటలో తొలి రాజప్రతినిధిగా ప్రకటించారు.

మొదటి లార్డ్ ఎల్జిన్ (1862-63)

ఇతడి కాలంలో ప్రధానంగా వహాబి ఉద్యమం జరిగింది. సుప్రీమ్, సాదర్ కోర్టులను హైకోర్టులో కలిపారు.

సర్ జాన్ లారెన్స్ (1864-69)

లారెన్స్ 1866లో ఒడిశాలో,1868–69లో రాచపుతానాలో సంభవించిన క్షామానికి సంబంధించిన నివారణ చర్యలు తీసుకోవడానికి సలహా సంఘం నియమించాడు. 1866లో వితంతు వివాహ సంస్థను డి.కె. కార్వే ఆధ్వర్యంలో బొంబాయిలో స్థాపించారు. సర్ జాన్ లారెన్స్ అనేక రైల్వే, తంతి తపాలా సౌకర్యాలను కల్పించాడు. ఇతడు యూరప్‌లో మొదటిసారిగా తంతి సౌకర్యం కల్పించాడు. పంజాబ్ కౌలు చట్టాన్ని జారీ చేశాడు. దీని ప్రకారం కౌలుదార్లకు అధికారాలు ఇచ్చారు. భూటాన్ యుద్ధం చేశాడు. ఇతడి కాలంలో మద్రాస్, బొంబాయి, కలకత్తాలో కోర్టులు ఏర్పాటు చేశారు.

లార్డ్ మేయో (1869-72)

ఇతడు స్టాటిస్టికల్ సర్వే ఆఫ్ ఇండియా, వ్యవసాయ, వాణిజ్య శాఖలను ఏర్పాటు చేశాడు. ఇతడు ఆఫీసులోనే హత్యకు గురైన మొదటి గవర్నర్ జనరల్. అజ్మీర్‌లో విద్య కోసం ఒక కళాశాల, రాజ్‌కోట్‌లో రాజకీయ శిక్షణ ఇవ్వడానికి మరో కళాశాల స్థాపించాడు.

లార్డ్ నార్త్ బ్రూక్ (1872-76)

ఇతడి కాలంలో 1875లో వేల్స్ రాజు (ఏడో ఎడ్వర్డ్) భారతదేశాన్ని సందర్శించాడు. 1872లో బహు భార్యత్వ నిషేధ చట్టాన్ని జారీ చేశారు.

లార్డ్ లిట్టన్ (1876-80)

ఇతడి కాలంలో 1878లో ఆయుధ చట్టం, దేశభాషా పత్రికల చట్టాలను చేశారు.

ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడే జాతీయ వాదులను అణచివేయడం కోసం దేశభాషా పత్రికల చట్టాన్ని ప్రవేశపెట్టారు. లిట్టన్ 1878లో ఐ.సి.ఎస్. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల గరిష్ఠ వయసును 21 ఏళ్ల నుంచి 19 సంవత్సరాలకు తగ్గిస్తూ కొత్త నిబంధనలు ప్రకటించాడు. ఇతడు రెండో అఫ్గాన్ యుద్ధం చేశాడు. ఇతడి కాలంలో తీసుకువచ్చిన యుద్ధ చట్టం యావత్ జాతిని నిరాయుధులను చేసింది. రాయల్ టైటిల్స్ యాక్ట్ చేశారు. 1877లో ఢిల్లీ దర్బార్ జరిగింది. ఇతడి కాలంలో మొదటిసారిగా కరవుపై కమిషన్ ఏర్పాటు చేశారు.



1919లో స్వాతంత్ర్యోద్యమ నాయకులైన డాక్టర్ సైఫుద్దీన్ కిచ్లూ, డాక్టర్ సత్యపాల్ అరెస్ట్‌కు నిరసనగా అమృత్‌సర్‌లోని జలియన్ వాలాబాగ్‌లో సమావేశమైన ప్రజానీకంపై జనరల్ డయ్యర్ విచక్షణారహితంగా కాల్పులు జరిపించాడు. ఈ ఊచకోతకు నిరసనగా రవీంద్రనాథ్ టాగూర్ బ్రిటిష్ ప్రభుత్వం ఇచ్చిన నైట్‌హుడ్ బిరుదును త్యజించారు. 1929లో లాహోర్ కాంగ్రెస్ సమావేశంలో సంపూర్ణ స్వాతంత్ర్య సాధనే కాంగ్రెస్ ఆశయంగా ప్రకటించారు. ఇదే సంవత్సరం త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు.

లార్డ్ రిప్పన్ (1880-84)

ఇతడు 1882లో దేశభాషా పత్రికల చట్టాన్ని రద్దు చేసి స్వేచ్ఛా ప్రతిపత్తిని కల్పించాడు. 1881లో మొదటి కర్మాగార చట్టం ప్రవేశపెట్టాడు. దీని ద్వారా కర్మాగారంలో పని చేసే శ్రామికుల పరిస్థితులు మెరుగయ్యాయి. 1882లో ఆర్థిక వికేంద్రీకరణ చేసి ఆదాయాన్ని 3 భాగాలుగా విభజించారు. అవి.. 1) కేంద్ర ప్రభుత్వ ఆదాయం, 2) రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం, 3) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి ఆదాయం. 1882లో స్థానిక ప్రభుత్వాలకు పునాది వేసిన ఘనత రిప్పన్‌దే. ఇతడు 1882–85లో స్థానిక ప్రభుత్వ వ్యవహార చట్టం జారీ చేశాడు. ఇదే సంవత్సరంలో సర్ విలియం హంటర్ అధ్యక్షతన విద్యకు సంబంధించి ఒక కమిషన్‌ను నియమించాడు. ఈ కమిషన్ సూచనల ఆధారంగా ప్రాథమిక పాఠశాల విద్యను స్థానిక సంస్థలకు అప్పగించాడు. స్త్రీ విద్య కూడా ప్రవేశపెట్టారు. ఇతడి కాలంలో యూరోపియన్ల ఒత్తిడి మేరకు 'ఇల్బర్ట్ బిల్లు'ను సవరించారు.

ఈ బిల్లు క్రిమినల్ కేసుల్లో యూరోపియన్లను విచారించడానికి భారతీయ జిల్లా మెజిస్ట్రేటులు, సెషన్స్ జడ్జీలకు అవకాశం కల్పించే శాసనంగా ఉండేది. 1879లో వాసుదేవ్ బలవంత్ పాడ్కే అనే ఉద్యోగి అమోషి రైతులను కూడగట్టి మహారాష్ట్రలో సాయుధ తిరుగుబాటు ప్రారంభించాడు. లార్డ్ రిప్పన్ కాలంలో భారతదేశంలో మొదటిసారిగా జనాభా లెక్కలు గణించారు.

లార్డ్ డఫ్రిన్ (1884-88)

ఇతడి కాలంలో 1885లో భారత జాతీయ కాంగ్రెస్ స్థాపనకు ఎ.ఒ. హ్యూమ్ తుది రూపం ఇచ్చాడు. ఇదే సంవత్సరం డిసెంబర్‌లో బొంబాయిలో ప్రథమ జాతీయ కాంగ్రెసు సమావేశానికి డబ్ల్యు.సి. బెనర్జీ అధ్యక్షత వహించాడు. మూడో బర్మా యుద్ధం డఫ్రిన్ కాలంలోనే జరిగింది.

లాండ్‌జన్ (1888-94)

ఇతడి కాలంలో ఫ్యాక్టరీ చట్టం చేశారు. సివిల్ సర్వీసులను విభజించారు. 'డ్యూరాండ్ కమిషన్' బ్రిటిష్ ఇండియా, అఫ్గానిస్తాన్ మధ్య సరిహద్దును నిర్ణయించింది. 1892లో 'భారత కౌన్సిళ్ల చట్టం' జారీ చేశారు. దీని ప్రకారం కేంద్ర, రాష్ట్ర శాసనసభల్లో సభ్యుల సంఖ్య పెరిగింది. వీరిలో కొందరిని భారతీయులు పరోక్షంగా ఎన్నుకునే వీలు కలిగింది. కానీ ప్రభుత్వం నియమించే సభ్యుల సంఖ్యాధికృత యథాతథంగానే ఉంది. నూతన సభ్యులకు వార్షిక బడ్జెట్‌పై చర్చలో పాల్గొనే అవకాశం కల్పించారు. కానీ, వీరికి ఓటు హక్కు లేదు.

ఎల్జిన్ (1894-99)

ఇతడి కాలంలో 1896–97లో భయంకరమైన క్షామం సంభవించింది. దీనికి కారణాలు తెలుసుకోవడానికి 'విల్లీ' అధ్యక్షతన ఒక సంఘాన్ని నియమించాడు. ఇది నివేదిక సమర్పించక ముందే 1899లో మళ్లీ క్షామం వచ్చింది.చాపేకర్ సోదరులు 1897లో ఇద్దరు బ్రిటిష్ అధికారులను హత్య చేశారు.

లార్డ్ కర్జన్ (1899-1905)

కర్జన్ 1904లో యూనివర్సిటీ చట్టాన్ని జారీ చేశాడు. 'సర్‌థామస్' ర్యాలీ అధ్యక్షతన యూనివర్సిటీలకు సలహాలు ఇవ్వడానికి ఒక కమిషన్ నియమించాడు. 1904లో ప్రాచీన కట్టడాల (మాన్యుమెంట్స్) రక్షణ చట్టం, ప్రిజర్వేషన్ యాక్ట్‌ను జారీ చేశాడు. బిహార్‌లోని 'పూసా'లో వ్యవసాయ పరిశోధన సంస్థను స్థాపించాడు. 1905లో బెంగాల్‌ను విభజించాడు. కర్జన్ కాలంలోనే 1904లో వి.డి సావర్కర్ 'అభినవ భారత్' పేరుతో ఒక రహస్య విప్లవ సంస్థను స్థాపించాడు.

లార్డ్ మింటో (1905-10)

ఇతడి కాలంలో అతివాదులు, విప్లవ కారులు విజృంభించారు. వీరి కార్యకలాపాలను అరికట్టడానికి 1908లో 'ఎక్స్‌ప్లోజివ్ సబ్‌స్టెన్స్ యాక్ట్' చేశాడు. పత్రికలు, ప్రజావేదికలపై ఆంక్షలు విధించాడు. దీని కారణంగా 1908లో 'లోకమాన్య' బాలగంగాధర్ తిలక్‌ను మాండలే కారాగారంలో నిర్బంధించారు.లార్డ్ మింటో కాలంలోనే 1906లో 'భారత ముస్లింలీగ్'ను స్థాపించారు. ఆగాఖాన్, ఢాకా నవాబు దీని ఏర్పాటుకు కృషి చేశారు. 1907లో భారత జాతీయ కాంగ్రెస్ అతివాదులు, మితవాదులుగా చీలిపోయింది. బెంగాల్ విభజనకు నిరసనగా ప్రతిఘటనోద్యమ నాయకులు 1905 అక్టోబర్ 16ను జాతీయ సంతాప దినంగా ప్రకటించారు. 1906 ఆగస్టు 15న జాతీయ విద్యా సమితి ఆవిర్భవించింది. కలకత్తాలో జాతీయ కళాశాలను ప్రారంభించారు. అరవింద్ ఘోష్ దీనికి మొదటి ప్రిన్సిపల్‌గా వ్యవహరించారు. 1905 తర్వాత అనేక పత్రికలు విప్లవ హింసావాదాన్ని ప్రచారం చేయడం ప్రారంభించాయి. వీటిలో బెంగాలీలో వెలువడే సంధ్య, యుగంధర్; పుణే నుంచి వెలువడే 'కాల్ ప్రముఖ్' పత్రికలు ముఖ్యమైనవి. 1909లో భారత శాసనసభల చట్టం ద్వారా రాజ్యాంగపరమైన రాయితీలు ప్రకటించారు. వీటినే మింటో–మార్లే సంస్కరణలు అంటారు. వీటి ద్వారా కేంద్ర, రాష్ట్ర శాసనసభల్లో ఎన్నికైన సభ్యుల సంఖ్యను పెంచారు. వీరిలో ఎక్కువ మందిని పరోక్ష పద్ధతి ద్వారా ఎన్నుకునే విధానం ప్రవేశపెట్టారు. మత ప్రాతిపదికన ప్రత్యేక నియోజకవర్గాలను కూడా ఏర్పాటు చేశారు. హిందూ–ముస్లింలను విభజించి పాలించడమే ఇందులోని ప్రధాన ఉద్దేశం.

లార్డ్ హార్డింజ్ (1910-1916)

ఇతడి కాలంలో 1911లో బెంగాల్ విభజనను రద్దు చేశారు. భారత రాజధానిని కలకత్తా నుంచి ఢిల్లీకి మార్చారు. అయిదో జార్జి ఢిల్లీ దర్బారును ఏర్పాటు చేశారు. 1914లో మొదటి ప్రపంచ యుద్ధం ప్రారంభమైంది. భారత సైనికులు,పౌరులను అనుమతి లేకుండానే యుద్ధంలోకి నెట్టారు. 1915లో గాంధీజీ దక్షిణాఫ్రికా నుంచి భారత్ తిరిగి వచ్చారు. ఇదే సంవత్సరంలో అనిబిసెంట్ హోమ్ రూల్ ఉద్యమాన్ని, మదన్ మోహన్ మాలవ్య 'హిందూ మహాసభ'ను స్థాపించారు. 1915లోనే గోఖలే, ఫిరోజ్‌షా మెహతా మరణించారు.

విద్య, ఉద్యోగ సమాచారం

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో 500 అసిస్టెంట్ మేనేజర్ పోస్టులు

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 500.
- » **పోస్టుల వివరాలు:** అసిస్టెంట్ మేనేజర్ (క్రెడిట్)–250, అసిస్టెంట్ మేనేజర్(ఐటీ) –250.
- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీటెక్/బీఈ, సీఏ, సీఎస్, ఐసీడబ్ల్యూఏ, ఎంఎస్సీ, ఎంఈ/ఎంటెక్, ఎంబీఏ/పీజీడీఎం, ఎంసీఏ, పీజీడీబీఎంలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. –వయసు: 30 ఏళ్లు ఉండాలి.
- » **వేతనం:** నెలకు రూ.48,480 నుంచి రూ.85,920.
- » **ఎంపిక విధానం:** రాతపరీక్ష, గ్రూప్ డిస్కషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 20.05.2025.
- » **వెబ్‌సైట్:** www.unionbankofindia.co.in

ఎన్ఐఐలో 11 సైంటిఫిక్ పోస్టులు

న్యూఢిల్లీలోని ప్రతిష్టాత్మక వైద్య పరిశోధనా సంస్థ అయిన నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇమ్యునాలజీ (ఎన్ఐఐ) 11 స్టాఫ్ సైంటిస్ట్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

- » **మొత్తం పోస్టులు:** 11
- » **ఖాళీల వివరాలు:** స్టాఫ్ సైంటిస్ట్–3 మూడు, స్టాఫ్ సైంటిస్ట్–4 ఎనిమిది ఖాళీలున్నాయి.
- » **అర్హత:** ఎంఎస్సీ, ఎంటెక్, ఎమ్‌డీ, ఎంవీఎస్సీ, ఎంఫార్మా, ఎం.బయోటెక్ లేదా పీహెచ్‌డీతో పాటు పని అనుభవం ఉండాలి.
- » **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఉంటుంది. విద్యార్హతల్లో ప్రతిభ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేస్తారు. పని అనుభవం, పరిశోధనలు చేసిన వారికి ప్రాధాన్యమిస్తారు.
- » **వయసు:** స్టాఫ్ సైంటిస్ట్–3కి 40 ఏళ్లు, స్టాఫ్ సైంటిస్ట్–4కు 50 ఏళ్లకు మించకూడదు
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్లో చేసుకోవాలి
- » **దరఖాస్తులకు చివరి తేది:** 26.05.20025
- » **వెబ్‌సైట్:** http://www.nii.res.in

నక్షత్రాల ఉష్ణోగ్రతలను కొలవడానికి ఉపయోగించేది?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

భౌతిక శాస్త్రం

ఉష్ణం

ఉష్ణోగ్రత మాపక రకాలు

వాయు ఉష్ణోగ్రతా మాపకాలు

ఘన, ద్రవ పదార్థాలతో పోలిస్తే వాయువుల ఉష్ణవ్యాకోచం అనేక రెట్లు ఎక్కువగా ఉంటుంది. కాబట్టి వీటిని ఉపయోగించి తక్కువ ఉష్ణోగ్రతను కచ్చితంగా కొలవచ్చు. ఈ ఉష్ణోగ్రత మాపకాల్లో ఎలాంటి వాయువులైనా ఉపయోగించవచ్చు. ఇవి పరిమాణంలో పెద్దవిగా ఉంటాయి. అందువల్ల వీటిని ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి తీసుకెళ్లడం సాధ్యం కాదు. వీటిలో హైడ్రోజన్, నైట్రోజన్, హీలియంలతో పాటు ఏ వాయువునైనా నింపవచ్చు.

నిరోధక ఉష్ణోగ్రతా మాపకాలు

లోహాలను వేడిచేస్తే వాటి నిరోధం పెరుగుతుందనే సూత్రం ఆధారంగా ఈ ఉష్ణోగ్రతా మాపకాలు పనిచేస్తాయి. కానీ వేర్వేరు లోహాల నిరోధాలు వేర్వేరుగా ఉండటం వల్ల వీటిని ఉపయోగించి ఉష్ణోగ్రతలను కచ్చితంగా కొలవలేం. నిరోధక ఉష్ణోగ్రతా మాపకాల్లో ప్లాటినంను వాడతారు.దీన్ని ఉపయోగించి కొలిచే ఉష్ణోగ్రత స్థాయి –200°C నుంచి 1200°C.

అయస్కాంత ఉష్ణోగ్రత మాపకం

పరమశూన్య ఉష్ణోగ్రత –273°C లేదా 0°K-ను కొలవడానికి ఈ ఉష్ణోగ్రతా మాపకాలను ఉపయోగిస్తారు. సాధారణంగా ద్రవస్థితిలో ఉన్న హీలియంను ఇలాంటి మాపకాల్లో వాడతారు.

ఉష్ణ విద్యుత్ ఉష్ణోగ్రతా మాపకం

ఇది సీబెక్ ఫలితం ఆధారంగా పనిచేస్తుంది. దీన్ని ఉపయోగించి క్రిమికీటకాల ఉష్ణోగ్రతలను 0.025°C వరకు కచ్చితంగా కొలవవచ్చు. ఇలాంటి ఉష్ణోగ్రత మాపకాలను Sb, Bi అనే ఉష్ణయుగ్మంతో నిర్మిస్తారు.

సిక్స్ గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతా మాపకం

ఇందులో పాదరసం, ఆల్కహాల్‌ను ఉపయోగిస్తారు. 24 గంటల కాల వ్యవధిలో వాతావరణంలో సంభవించే కనిష్ఠ, గరిష్ఠ ఉష్ణోగ్రతలను కొలవవచ్చు.

బెక్‌మెన్స్ ఉష్ణోగ్రతా మాపకం

వివిధ స్వభావాలు ఉన్న నీటిఆవిరి ఉష్ణోగ్రతలను కొలవడానికి ఈ మాపకాన్ని వాడతారు.

ఉదాహరణ:

1) స్వచ్ఛమైన నీరు 100°C
2) సముద్ర జలం 101°C
3) మలినమైన నీరు 99°C (సుమారు)

బెథిస్కోప్

సముద్రగర్భంలో ఉన్న ఉష్ణోగ్రతలను కొలవడానికి దీన్ని జలాంతర్గామిలో అమరుస్తారు.

క్లినికల్ థర్మోమీటర్

దీన్ని సెంటారియో అనే శాస్త్రవేత్త 1602లో కనుగొన్నాడు. ప్రస్తుతం ఉపయోగిస్తున్న ఆధునిక క్లినికల్ థర్మామీటర్‌ను 1866లో సర్ థామస్ క్లిఫర్డ్ ఆల్బట్ రూపొందించాడు.

పైరో మీటర్

పరిశ్రమల్లోని బట్టీలు లేదా కొలిమిల నుంచి వెలువడే అత్యధిక ఉష్ణోగ్రతలను కొలవడానికి పైరో మీటర్‌ను ఉపయోగిస్తారు. దీని సహాయంతో 3000°C - 3500°C వరకు ఉష్ణోగ్రతలను కొలవడం సాధ్యపడుతుంది.

ఆప్టికల్ పైరోమీటర్

సూర్యుడు లేదా నక్షత్రాల్లో ఉండే అత్యధిక ఉష్ణోగ్రతలను కొలవడానికి ఉపయోగిస్తారు.

పైరోమీటర్, ఆప్టికల్ పైరోమీటర్లు ఉష్ణ వికిరణం ఆధారంగా పనిచేస్తాయి. కాబట్టి వస్తువుల ఉష్ణోగ్రతలను కొలిచేటప్పుడు వేడి వస్తువులు, ఉష్ణోగ్రత మాపకాల మధ్య భౌతిక స్పర్శ ఉండాల్సిన అవసరం లేదు.

విశిష్టోష్ణం

పదార్థం విశిష్టోష్ణం $S = \frac{1}{m}\frac{Q}{t}$

$$\Rightarrow S \propto \frac{1}{\Delta t}$$

m = పదార్థ ద్రవ్యరాశి,

Q = పదార్థానికి అందించిన ఉష్ణరాశి.

విశిష్టోష్ణం, ఆయా పదార్థాల (ఘన, ద్రవ, వాయు) స్వభావంపై ఆధారపడి ఉంటుంది. కాబట్టి వేర్వేరు పదార్థాల్లో విశిష్టోష్ణ విలువలు వేర్వేరుగా ఉంటాయి.

పాదరసం

ఇది గది ఉష్ణోగ్రత వద్ద ద్రవస్థితిలో లభించే ఒక లోహ మూలకం. పాదరసాన్ని సిన్నబార్ అనే ముడిపదార్థం నుంచి సంగ్రహిస్తారు. స్వభావరీత్యా వెండిలా మెరవడం వల్ల దీన్ని క్విక్ సిల్వర్ అని కూడా అంటారు. పాదరసం లోహాలతో చర్య జరిపినప్పుడు ఏర్పడిన పదార్థాలను అమాల్గమ్‌లు అంటారు. ఇది Fe(ఇనుము)తో చర్య జరపదు. కాబట్టి దీన్ని ఇనుప పాత్రలో రవాణా/నిల్వ చేస్తారు. పాదరసం మంచి ఉష్ణ వాహకం, విద్యుత్ వాహకం. పాదరస కాలుష్యం వల్ల 'మినిమిటా' అనే వ్యాధి వస్తుంది. తొలిసారిగా ఈ వ్యాధిని జపాన్‌లో కనుగొన్నారు.

ఉష్ణ వ్యాకోచాలు

ఘన పదార్థాల ఉష్ణ వ్యాకోచాలు

ప్రతి ఘన పదార్థంలో ద్రవ్యరాశి మూడు అంశాల వెంబడి అంటే X, Y, Z (X– పొడవు, Y– వెడల్పు, Z– ఎత్తు)లలో విభజితమై ఉంటుంది. ఒక ఘన పరిమాణాన్ని వేడిచేస్తే అది మూడు రకాల వ్యాకోచాలను కలిగి ఉంటుంది.

దైర్ఘ్య వాకోచం: ఘన పదార్థాన్ని వేడిచేస్తే ఏదైనా ఒక అక్షం వెంట వ్యాకోచిస్తే దాన్ని దైర్ఘ్య వ్యాకోచం అంటారు.

విస్తీర్ణ వ్యాకోచం: ఒక ఘన పదార్థాన్ని వేడి చేస్తే ఏదైనా రెండు అంశాల వెంట వ్యాకోచిస్తే దాన్ని విస్తీర్ణ వ్యాకోచం అంటారు.

ఘనపరిమాణ వ్యాకోచం: ఒక ఘన పదార్థాన్ని వేడిచేస్తే అన్ని అక్షాల వెంట వ్యాకోచిస్తే దాన్ని ఘన పరిమాణ వ్యాకోచం అంటారు.

ఒక ఘన పదార్థాన్ని వేడిచేస్తే దానిలో ఉండే వివిధ వ్యాకోచాల నిష్పత్తి 1:2:3గా ఉంటుంది. కాబట్టి ప్రతి ఘనపదార్థం దాని ఘనపరిమాణంలో గరిష్ఠ వ్యాకోచాన్ని కలిగి ఉంటుంది. ఘన పదార్థాలను వేడిచేసినప్పుడు వాటి స్వభావాన్ని బట్టి అణువుల మధ్య బంధ దూరంలో మార్పు వస్తుంది.

- * కొన్ని ఘన పదార్థాలను వేడిచేస్తే వీటి అణువుల మధ్య బంధ దూరం పెరగడం వల్ల ఆ పదార్థాలు వ్యాకోచిస్తాయి.
  ఉదా: Al, Cu, Fe...
- * కొన్ని ఘన పదార్థాలను వేడిచేస్తే వాటి అణువుల మధ్య బంధ దూరం తగ్గి పదార్థాలు సంకోచిస్తాయి.
  ఉదా: ప్లాస్టిక్, రబ్బర్, గాజు, సిల్క్ వస్త్రాలు, తల వెంట్రుకలు, ఫ్యూజు తీగ.
- * కొన్ని ఘన పదార్థాలను వేడి చేసినా లేదా చల్లబర్చినా వాటి అణువుల మధ్య బంధదూరం మారదు. కాబట్టి ఇలాంటి పదార్థాలు సంకోచ, వ్యాకోచాలు చెందవు.
  ఉదా: చెక్కదిమ్మ.

అనువర్తనాలు

- * రెండు వరుస రైలు పట్టాల మధ్యలో తగినంత ఖాళీ వదలడం వల్ల అవి స్వేచ్ఛగా సంకోచ, వ్యాకోచాలు చేయగలుగుతాయి.
  అందుకే రెండు విద్యుత్ స్తంభాలు లేదా టెలిఫోన్ స్తంభాల మధ్య తీగలను కొంచెం వదులుగా బిగిస్తారు.
- * ఒక అల్యూమినియం పాత్రలో ఇనుపపాత్ర బంధించి ఉన్నప్పుడు వాటిని విడదీయాలంటే వేడిచేయాలి. ఇనుము కంటే అల్యూమినియం ఎక్కువగా వ్యాకోచిస్తుంది. అందువల్ల ఇనుప పాత్ర పరిమాణం కంటే అల్యూమినియం పాత్ర పరిమాణం పెరుగుతుంది.
- * ఒకవేళ ఇనుప పాత్రలో అల్యూమినియం పాత్ర బంధించి ఉంటే వాటిని వేరు చేయడం కోసం చల్లబర్చాలి. ఈ సందర్భంలో ఇనుప పాత్ర కంటే అల్యూమినియం పాత్ర ఎక్కువగా సంకోచిస్తుంది.
- * గది ఉష్ణోగ్రత వద్ద ఒక లోహ పలక మధ్య బిందువు వద్ద ఒక రంధ్రం ఉంది. లోహ పలకను వేడిచేసినప్పుడు అది వ్యాకోచించడం వల్ల రంధ్రం వ్యాసం కూడా పెరుగుతుంది.
- * ఎడ్లబండి కొయ్య చక్రంపై వేడిచేసిన ఇనుప చక్రాన్ని అమర్చి నీటిని చల్లినప్పుడు అది సంకోచించి చక్రాన్ని గట్టిగా అదిమి పట్టుకుంటుంది.
- * విద్యుత్ బల్బులను సీల్ చేయడం కోసం ప్లాటినం(Pt)ను ఉపయోగిస్తారు. గాజు, ప్లాటినంల సంకోచ వ్యాకోచాలు పరస్పరం సమానంగా ఉండటమే దీనికి కారణం.
- * ఇంటి పైకప్పుల నిర్మాణంలో కాంక్రీట్‌తో పాటు స్టీలును ఉపయోగిస్తారు. ఆ రెండు పదార్థాల సంకోచం, వ్యాకోచాలు పరస్పరం సమానంగా ఉండటమే దీనికి కారణం.
- * ఇనుప బ్రిడ్జిలను నిర్మించాక వాటిని గోళాకారం లేదా స్థూపాకారం ఉన్న నిర్మాణాలపై ఉంచితే అవి స్వేచ్ఛగా సంకోచ వ్యాకోచాలు చెందుతాయి.
- * వేడి గాజు పలకపై చల్లటి ద్రవాన్ని చల్లితే గాజు పొరల మధ్య అసమాన సంకోచాల వల్ల అది పగిలిపోతుంది.
- * గాజు పలకపై వేడి ద్రవాన్ని చల్లితే గాజు పొరల మధ్య అసమాన వ్యాకోచాల వల్ల అది పగిలిపోతుంది.
- * ఇన్వార్ స్టీల్ అనే పదార్థంలో సంకోచ, వ్యాకోచాలు పరిగణనలోకి తీసుకోలేనంత తక్కువగా ఉంటాయి. కాబట్టి ఈ పదార్థాన్ని శృతి దండాలు, మీటర్ స్కేలు, గోడ గడియారాల్లోని లోలకాల తయారీలో ఉపయోగిస్తారు.

గతంలో వచ్చిన ప్రశ్నలు

1. ఏ ఉష్ణోగ్రత వద్ద నీటికి గరిష్ఠ సాంద్రత ఉంటుంది?
   ఎ) –4°C బి) 4°C
   సి) 60°C డి) 100°C
2. నీటి అసంగత వ్యాకోచ ధర్మాన్ని ఏ పదార్థ స్వభావంతో పోల్చవచ్చు?
   ఎ) రబ్బర్ బి) ప్లాస్టిక్
   సి) బైమెటల్ డి) పైవన్నీ
3. క్రిమి కీటకాల ఉష్ణోగ్రత కొలవడానికి ఉపయోగించే ఉష్ణోగ్రతా మాపకం?
   ఎ) సిక్స్–గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతా మాపకం
   బి) పైరోమీటర్
   సి) సీబెక్ ఉష్ణవిద్యుత్ ఉష్ణోగ్రతా మాపకం
   డి) అయస్కాంత ఉష్ణోగ్రతా మాపకం
4. ఉష్ణశక్తి యాంత్రికశక్తిగా ఎందులో మారుతుంది?
   ఎ) వాహనం బి) ఫ్యాన్
   సి) ఇస్త్రీపెట్టె డి) విద్యుత్ హీటర్
5. 80°C వద్ద ఉన్న వేడి టీ 70°Cకు చల్లారడానికి అయిదు నిమిషాల సమయం అవసరం. తిరిగి 70°C నుంచి 60°Cకు చల్లారడానికి కావాల్సిన సమయం?
   ఎ) అయిదు నిమిషాలు
   బి) అయిదు నిమిషాల కంటే ఎక్కువ
   సి) అయిదు నిమిషాల కంటే తక్కువ
   డి) ఏదీకాదు
6. ఒక ఇంధనం నుంచి వెలువడే ఉష్ణరాశిని దేనితో కొలుస్తారు?
   ఎ) ఉష్ణోగ్రతా మాపకం
   బి) సాధారణ కెలోరీమీటర్
   సి) బోలోమీటర్
   డి) బాంబు కెలోరీమీటర్
7. రాగి పాత్రలో వేడి ద్రవాన్ని నింపి ఇనుపబల్లపై ఉంచితే అది ఏ పద్ధతి వల్ల చల్లారుతుంది?
   ఎ) ఉష్ణవహనం బి) ఉష్ణ సంవహనం
   సి) ఉష్ణ వికిరణం డి) ఎ, బి
8. ఉష్ణోగ్రతను క్రమబద్ధీకరించేందుకు ఉపయోగించే థర్మోస్టాట్‌ను దేనితో తయారుచేస్తారు?
   ఎ) ఇనుము, ఇత్తడి బి) ఇనుము, రాగి
   సి) రాగి, ఉక్కు డి) ఇత్తడి, రాగి
9. థర్మాస్‌ఫ్లాస్క్‌లోని వేడిద్రవం ఏ పద్ధతి వల్ల ఉష్ణాన్ని నష్టపోదు?
   ఎ) ఉష్ణవహనం బి) ఉష్ణ సంవహనం
   సి) ఉష్ణ వికిరణం డి) పైవన్నీ
10. ఉష్ణోగ్రత మాపకం కనిష్ఠ రీడింగ్ ఎల్లప్పుడూ దేనికి సమానం?
    ఎ) మంచు ఉష్ణోగ్రత
    బి) పాదరస ఉష్ణోగ్రత
    సి) ఆల్కహాల్ ఉష్ణోగ్రత
    డి) నీటి ఆవిరి ఉష్ణగ్రత
11. ఇనుప పాత్రలో అల్యూమినియం పాత్ర ఉంచారు. వీటిని వేరు చేయాలంటే?
    ఎ) ఆ రెండు పాత్రలు వేడి చేయాలి
    బి) ఆ రెండు పాత్రలూ చల్లని నీటిలో ముంచాలి
    సి) ఆ రెండు పాత్రలను సుత్తితో కొట్టాలి
    డి) పైవన్నీ
12. నీటి అసంగత వ్యాకోచం తగ్గించేందుకు దానిలో ఏ ద్రవం కలపాలి?
    ఎ) ఇథైల్ గ్లైకాల్ బి) బెంజీన్
    సి) పెట్రోలు డి) కిరోసిన్
13. విద్యుత్ ఇస్త్రీపెట్టెను కనుగొన్నవారు?
    ఎ) ప్రివోస్ట్ బి) కూలుంబ్
    సి) హెన్రీషెలె డి) విలియం గిల్‌బర్ట్
14. పగటి సమయంలో చంద్రుడి సగటు ఉష్ణోగ్రత ఎంత?
    ఎ) 25°C బి) 50°C
    సి) 75°C డి) 100°C

సమాధానాలు

1) బి; 2) డి; 3) సి; 4) ఎ; 5) బి; 6) డి; 7) డి; 8) ఎ; 9) డి; 10) ఎ; 11) బి; 12) ఎ; 13) సి; 14) డి.

జనరల్ నాలెడ్జ్ ఫర్ గ్రూప్స్

వివిధ శాస్త్రాలు - అధ్యయనాలు

కార్పాలజీ	:	విత్తనాలపై అధ్యయనం
సైటాలజీ	:	మొక్కలు, జంతువుల కణాలపై అధ్యయనం
కార్డియాలజీ	:	గుండె వ్యాధులకు సంబంధించిన అధ్యయనం
కాస్మాలజీ	:	విశ్వం గురించిన అధ్యయనం
క్రిప్టోగ్రఫీ	:	రహస్య సంకేతాలతో రాసిన చేతిరాతలపై అధ్యయనం
సైటోపాథాలజీ	:	మొక్కల వ్యాధులపై అధ్యయనం

దొడ్డ ప్రభువు అనే బిరుదు ఎవరికి ఉంది?



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ చరిత్ర

తెలంగాణ కవులు – సాహిత్యం

కాకతీయుల కాలం

విశ్వేశ్వర దేశికుడు (1200–1290): ఇతడినే విశ్వేశ్వర దేశికుడు లేదా శివదేవుడు అంటారు. ఇతడు 'శివతత్వ రసాయనం' రచించాడు. శివ దేవుడు కేరళ ప్రాంతానికి చెందిన కీర్తి శంభుని శిష్యుడు. ఇతడు తెలంగాణకు వచ్చి స్థిర పడ్డాడు. ఇక్కడ అనేక మఠాలు (కాళేశ్వరం, ఏలేశ్వరం), దేవాలయాలు (మంథెన, వెల్లాల, గోళగి) నిర్మించాడు. ఇతడు కాకతీయ గణపతి దేవుడి దీక్షా గురువు. ఇతడు రుద్రమదేవి పాలనను, ప్రతాప రుద్రుడి యువరాజత్వాన్ని ప్రశంసించాడు. గణపతి దేవుడి నుంచి 'మందిరం', రుద్రమదేవి నుంచి 'వెలగపూడి' అనే గ్రామాలను పొందాడు. ఈ రెండింటినీ కలిపి 'గోళగి' అనే అగ్రహారంగా మార్చాడు. అక్కడ శివాలయం, ప్రసూతి వైద్యశాల నిర్మించాడు.

గోన బుద్ధారెడ్డి (1210–1240): రంగనాథ రామాయణం రాశాడు. ఇది తెలుగులో తొలి రామాయణం. ఇందులో.. ఇంద్రుడు కోడై కూయడం, లక్ష్మణుడు ఏడుగీతలు గీయడం, ఊర్మిళ నిద్ర, లక్ష్మణ దేవుడి నవ్వు లాంటి కథలు కూడా రాశాడు. దీన్ని ద్విపద కావ్యంలో రచించాడు.

శివదేవయ్య: 'పురుషార్థసారం' గ్రంథాన్ని రచించాడు. ఇతడు గణపతిదేవుడు, రుద్రమదేవి, ప్రతాపరుద్రుడి వద్ద మంత్రిగా పనిచేసి మన్ననలు పొందాడు. సంస్కృతాంధ్ర కవితా పితామహుడిగా కీర్తి పొందాడు.

ఈశ్వర భట్టోపాధ్యాయుడు (1262): ఇతడు మయూరసూరి పుత్రుడు. తన తల్లి పేరుతో, భార్య పేరుతో బూదపురంలో రెండు చెరువులు తవ్వించాడు. అక్కడ దేవాలయాలు నిర్మించాడు. ఇతడు బూదపుర శాసనాన్ని నిర్మించాడు. ఇది మహబూబ్‌నగర్ జిల్లాలో ఉంది.

కుప్పాంబిక (1230–1300): ఈమె తొలి తెలుగు/ తెలంగాణ కవయిత్రి. మొల్ల కంటే ముందే అనేక కవిత్వాలు రచించారు.

చక్రపాణి రంగనాథుడు: శివభక్తి దీపిక, గిరిజాది నాయక శతకం, చంద్రాభరణ శతకం, శ్రీగిరినాథ విక్రయం, వీరభద్ర విజయం (సంస్కృతం) రచించాడు. ('వీరభద్ర విజయం' తెలుగులో పోతన రాశాడు)

కపర్ది: అపస్తంభ శ్రౌత సూత్ర భాష్యం, భరద్వాజ గృహ్యసూత్ర భాష్యం, అపస్తంభ గృహ్యపరిశిష్ట భాష్యం, శ్రౌత కల్పకావృత్తి, దివ్య పూర్ణభాష్యం ఇతడి ప్రసిద్ధ గ్రంథాలు. ఇతడు ప్రఖ్యాత వ్యాఖ్యాత మల్లినాథసూరి తండ్రి. మెదక్ జిల్లా కొలిచెలిమివాసి. ఇతడు గొప్ప భాష్యకారుడు.

గంగాధర కవి: మహాభారతాన్ని నాటక రూపంలో రచించాడు.

అప్పయార్యుడు: జినేంద్రకల్యాణాభ్యుదయం రాశాడు.

మంచన: కేయూర బాహు చరిత్ర రాశాడు.

శేషాద్రి రమణ: ఇతడు సంస్కృతంలో యయాతి చరిత్ర, ఉషా రాగోదయం (నాటకం) రచించాడు. యయాతి చరిత్రను తెలుగులో పొన్నెగంటి తెనగానచార్యుడు గోల్కొండ రాజు ఇబ్రహీం కుతుబ్‌షా కాలంలో రాశాడు.

మారన (1289–1323): ఇతడు తెలుగులో తొలి పురాణమైన 'మార్కండేయ పురాణం' తెలుగులో తొలి వ్యాకరణ గ్రంథమైన 'ఆంధ్రభాషాభూషణం' రాశాడు.

కేతన: ఇతడు 'విజ్ఞానేశ్వరీయం' రాశాడు. ఇది తెలుగులో తొలి శిక్షాస్మృతి. ఇది యజ్ఞవల్క్యుడి స్మృతికి అనువాదం.

విద్యానాథుడు (1289–1323): ప్రతాపరుద్ర యశోభూషణం, ప్రతాపరుద్ర కల్యాణం గ్రంథాలను రాశాడు. వీటిలో ప్రతాపరుద్రుడి యశోగానం కనిపిస్తుంది.

కుమారస్వామి: 'సోమిపథి రత్నాపణ' గ్రంథాన్ని రాశాడు.

చిలకమర్రి తిరుమలాచార్యులు: 'రత్నశాణ' రచించాడు. భట్టుమూర్తి 'నరసభూపాతీయం' దీని అనువాదమే.

అగస్త్యుడు (1289–1323): బాల భారతం, కృష్ణచరిత్ర (గద్య కావ్యం), నలకీర్తి కౌముది (పద్య కావ్యం), మణిపరీక్ష (లక్ష్మీ స్తోత్రం), లలిత సహస్ర నామం, శివ సంహిత, శివస్తవం తదితర 74 గ్రంథాలు రచించాడు.

గంగాదేవి అగస్త్యుడి శిష్యురాలు. ఈమె విజయనగర రాజైన కుమార కంపరాయలను వివాహం చేసుకుంది. 'మధుర విజయం' గ్రంథంలో భర్త ఘన విజయాలను వివరించింది.

తిక్కన: ఈయన భారతాన్ని తెలుగులోకి అనువదించారు.

- 'నన్నయ' రాజరాజనరేంద్రుడి, 'తిక్కన' గణపతిదేవుడి, 'ఎర్రన' ప్రోలయ వేమారెడ్డి ఆస్థానంలో ఉన్నారు. ఈ ముగ్గురిని 'కవిత్రయం'గా పేర్కొంటారు.
- మల్లికార్జునుడు, హుళక్కి భాస్కరుడు, రుద్రదేవుడు.. ఈ ముగ్గురు కలిసి 'భాస్కర రామాయణం' రచించారు.

రేచర్ల పద్మనాయకులు

విద్యారణ్య స్వామి: ఈయన శృంగేరి పీఠాధిపతి. 'సంగీతసారం' గ్రంథాన్ని రచించారు. విద్యారణ్య స్వామి మహామేధావి, కవి, తాత్వికుడు. హరిహర రాయలు, బుక్కరాయలకు విజయనగర రాజ్యాన్ని స్థాపించడానికి ప్రేరణ ఇచ్చారు. విద్యారణ్యుడు ఏకశిలానగరవాసి అని 21వ శృంగేరి పీఠాధిపతి సచ్చిదానంద భారతి ఆస్థాన విద్వాంసుడైన కాశీ లక్ష్మణ శాస్త్రి 'గురువంశ కావ్యం'లో పేర్కొన్నాడు.

సాయనుడు: ఇతడు చతుర్వేదాలకు భాష్యం రాశాడు. పురుషార్థ సుధానిధి, ఆయుర్వేద సుధానిధి, యజ్ఞతంత్ర సుధానిధి తదితర రచనలు చేశాడు.

పద్మనాయక భూపాలుడు: ఇతడు సారంగధర చరిత్ర రాశాడు. ఇతడికి 'సర్వజ్ఞ' అనే బిరుదు ఉంది.

విశ్వేశ్వరుడు: చమత్కార చంద్రిక, వీరభద్ర విజృంభణ గ్రంథాలను రాశాడు.

కవిభల్లటుడు: గుణమంజరి, పదమంజరి, శూద్రక రాజచరిత్రం, బేతాళ పంచవింశతి ఇతడి ప్రసిద్ధ రచనలు.

మడికి సింగన: సకలనీతి సమ్మతం, పద్మపురోణోత్తర ఖండం, భాగవత దశమ స్కంధం (ద్విపదం), జ్ఞాన వాశిష్ఠ రామాయణం మొదలైనవి రచించాడు.

సర్వజ్ఞ సింగభూపాలుడు: రసావర్ణ సుధాకరం సంగీత సుధాకరం, కందర్ప సంభవం, కువలయావళి (రత్నపాంచాలిక) లాంటి రచనలు చేశాడు. ఇతడు బహుముఖ ప్రజ్ఞాశాలి. సంగీత నాట్య మర్మజ్ఞుడు. కవి, నాటకకారుడు. ఇతడు అనేక మంది కవి, పండితులను పోషించాడు. సారంగదేవుడు రచించిన 'సంగీత రత్నాకరం' గ్రంథానికి 'సంగీత సుధాకరం' పేరుతో వ్యాఖ్యానం చేశాడు. రసావర్ణ సుధాకరం అనేది అలంకార శాస్త్రం.

గౌరన: నవనాథ చరిత్ర (దీన్నే శ్రీగిరి పండితుడు చంపువుగా రాశాడు), లక్ష్మణ దీపిక, హరిశ్చంద్రోపాఖ్యానం లాంటి అనేక గ్రంథాలు రచించాడు. ఇతడికి 'సరస సాహిత్య లక్షణ చక్రవర్తి', 'ప్రతివాద మదగజ పంచాననుడు' అనే బిరుదులు ఉన్నాయి. మార్కండేయ, స్కంధ పురాణాల్లో ఉన్న హరిశ్చంద్ర మహారాజు కథే హరిశ్చంద్రోపాఖ్యానం మూలకథ. శ్రీగిరి పండితుడు రెడ్డిరాజుల కాలంలో నవనాథ చరిత్రను చంపువుగా రాశాడు.

బమ్మెర పోతన: పోతన 'వీరభద్ర విజయం', 'భోగినీ దండకం', 'మహాభాగవతం' (తెలుగులో) రచించాడు. ఈయన కొంతకాలం మూడో సింగ భూపాలుని ఆస్థానంలో ఉన్నారు. పోతన భాగవతంలో పేర్కొన్న ఏకశిలానగరం నేటి ఓరుగల్లే (వరంగల్). పోతన జన్మస్థలమైన బమ్మెర ఈ జిల్లాలోనే ఉంది. అంతకుముందు ఇది నల్లగొండ జిల్లాలోని గ్రామం. వీరభద్ర విజయంలోని మూలకథ.. శివుడిని ఆహ్వానించకుండా దక్షుడు యజ్ఞం నిర్వహించడం, శివుడి కోప సంకల్పంతో పుట్టిన వీరభద్రుడు దాన్ని ధ్వంసం చేయడం, దక్షుడి శిరస్సు ఖండించడం. భోగినీ దండకంలో నాటి పాలకుల భోగలాలసత్వాన్ని వర్ణించారు. పోతన భాగవతం తెలుగులో భక్తికి మారుపేరుగా నిలిచింది. ఇందులో ప్రహ్లాద చరిత్ర, గజేంద్ర మోక్షం, వామనావతార ఘట్టం, శ్రీకృష్ణ చరిత్ర మొదలైనవాటిని పోతన రమ్యంగా వర్ణించారు.

కొరవి గోపరాజు: 'సింహాసన ద్వాత్రింశిక' రచించాడు. ఇది కథాకావ్యం. ఈ గ్రంథానికి మూలం విక్రమార్క చరిత్ర అనే సంస్కృత కావ్యం. పాల్కురికి తర్వాత తెలంగాణ సాంఘిక జీవితాన్ని విస్తృతంగా వర్ణించిన కావ్యం ఇదే.

కుతుబ్‌షాహీల యుగం (1518–1687)

సుల్తాన్ కులీ: ఇతడికి బడే మాలిక్ (దొడ్డ ప్రభువు) అనే బిరుదు ఉంది.

జంషీద్: కూచిపూడి భాగవతులకు 'కూచిపూడి' గ్రామాన్ని దానం చేశాడు.

ఇబ్రహీం కుతుబ్‌షా: ఇతడిని మల్కిభరాముడిగా పేర్కొన్నారు. ఇతడి ఆస్థానంలో అనేక మంది కవులు ఉండేవారు. వీరిలో ముఖ్యమైన వారు..

అద్దంకి గంగాధరుడు: ఇతడు 1565లో తపతీ సుందరోపాఖ్యానం (తపతీ సంవరణోపాఖ్యానం) రచించి ఇబ్రహీం కుతుబ్‌షాకు అంకితం చేశాడు. 'వసుచరిత్ర'ను దీని ఆధారంగానే రాశారు(1570). అద్దంకి గంగాధరుడు రామరాజ భూషణుడితో పోల్చదగిన ప్రతిభావంతుడైన కవి.

కందుకూరి రుద్రకవి: సుగ్రీవ విజయం (తొలి యక్షగానం), నిరంకుశోపాఖ్యానం, జనార్దనాష్టక స్తోత్రం, గువ్వల చెన్నని శతకం మొదలైనవాటిని రచించాడు. అగ్రశ్రేణి కవుల్లో ఒకరైన రుద్రకవి నల్లగొండ జిల్లాలోని దేవరకొండ సమీపంలో ఉన్న కందుకూరు గ్రామ నివాసి. నిరంకుశోపాఖ్యానం శృంగార ప్రధానమైన సాంఘిక కావ్యం.

పొన్నెగంటి తెలగన: ఇతడు 'యయాతి చరిత్ర' రాశాడు. ఇది అచ్చ తెలుగులో రచించిన తొలి గ్రంథం.

మహమ్మద్ కులీకుతుబ్‌షా: ఇతడు తన ప్రేయసి భాగమతి పేరుపై భాగ్యనగరం నిర్మించాడు. బాగ్ అంటే 'ఉద్యానం' అని అర్థం. చార్మినార్ (1591), హైదరాబాద్ (1593)ను కూడా ఇతడే నిర్మించాడు. ఇతడు మీర్జా మహమ్మద్ అమిన్, వజీహీ, గవాసీ తదితర ప్రముఖ కవులను ఆదరించాడు. మహమ్మద్ కులీకుతుబ్‌షా ఉర్దూ కవితల సంకలనాన్ని దివాన్ పేరుతో అతడి అల్లుడు సుల్తాన్ మహమ్మద్ కుతుబ్‌షా వెలువరించాడు.

సారంగు తమ్మయ్య: హరిభక్తి సుదోదయం, వైజయంతీ విలాసం రచించాడు. సారంగు తమ్మయ్య కుతుబ్‌షాకు ఆప్తుడిగా వ్యవహరిస్తూనే.. కలంపట్టి కమనీయమైన కావ్యరచనలు చేశాడు. వైజయంతీ విలాసం గ్రంథం తెలుగు శృంగార కావ్యాల్లో ఒకటిగా ప్రసిద్ధి చెందింది. నాటి పాలకుల భోగలాలసతను మరో కోణం నుంచి చిత్రించిన కావ్యం ఇది.

నేబతి కృష్ణమంత్రి: 'రాజనీతి రత్నాకరం' అనే గ్రంథం రాశాడు.

ఎల్లారెడ్డి: బాలభారతం (అగస్త్యుడి రచనకు అనువాదం), కిరాతార్జునీయం (భారవి రచనకు అనువాదం) రాశాడు.

మల్లారెడ్డి: షట్చక్రవర్తి చరిత్ర, శివధర్మోత్తరం, పద్మపురాణం తదితర రచనలు చేశాడు.

అబ్దుల్లా కుతుబ్‌షా: సంస్కృత 'శుకసప్తతి'ని 'యతినామా' పేరుతో పర్షియన్ భాషలోకి అనువాదం చేశాడు. ఇతడి పాలనా కాలం ఉర్దూ భాషకు స్వర్ణయుగంగా ఉంది. ఇతడు కవి, పండిత పోషకుడే కాకుండా స్వయంగా గొప్ప కవి. అబ్దుల్లా పేరుతో కవితలు రాశాడు. ఇతడి ఆస్థానంలో అనేక మంది పండితులు ఉండేవారు. వారిలో ప్రధాన కవులు–వారి రచనలు..

- గవాసి ఇబిన్ నిషాత్ – **తోతినామా.**
- తబియా – **బహురావగుల్.**
- తులసీమూర్తి – **సంగీత విద్వాంసుడు.**
- క్షేత్రయ్య – **రాజుపై 12 వేల కృతులు రాశారు.**
- మరింగంటి వేంకట నరసింహాచార్యులు – **హరివాసర మాహాత్మ్యం.**
- చరిగొండ నరసింహ – **శశిబిందు చరిత్ర.**
- రాజలింగ కవి – **కూర్మపురాణం.**
- కోన నారాయణ – **వజ్రాభ్యుదయం.**
- పిల్లలమర్రి వేంకటపతి– **రాజేశ్వర విలాసం.**
- గోపతి లింగ కవి – **చెన్నబసవ పురాణం.**

సురభి మాధవరాయలు: చంద్రికా పరిణయం అనే ప్రౌఢ కావ్యాన్ని శ్లేష అనుప్రాసాది శబ్ద చిత్ర నిపుణత్వంతో రచించాడు.

- **ఎలకూచి బాలసరస్వతి:** సుభాషిత రత్నావళి, మాధవ రాఘవ పాండవీయం రాశాడు. ఇతడు భర్తృహరి సంస్కృతంలో రాసిన శృంగార, నీతి, వైరాగ్య శతకాలను సుభాషిత రత్నావళి పేరుతో అనువాదం చేసి మాధవ రాయల తండ్రి మల్లభూపాలుడికి అంకితం చేశాడు.
- **అప్పకవి:** సాధ్వీజన ధర్మం (ద్విపద కావ్యం), అనంతవ్రతకల్పం (కావ్యం), అంబికావాదం (యక్షగానం), కవి కల్పకం (లక్షణ గ్రంథం) రాశాడు.
- **పోనుగోటి జగన్నాథాచార్యులు:** కుముదవల్లి విలాసం (ఇది భక్తరామదాసు జీవితానికి దగ్గరగా ఉండటం గమనార్హం)
- **కంచర్ల గోపన్న:** దాశరథీ శతకం రాశారు. ఈయనను భక్తరామదాసుగా పేర్కొంటారు. ఈయన అక్కన్న, మాదన్న మేనల్లుడు. 1650లో భద్రాచలం తహశీల్దార్‌గా నియమితులయ్యారు.
- భద్రాచలంలో రామాలయం నిర్మించారు. అబుల్‌హసన్ తానీషా ఈయనను గోల్కొండలో బంధించాడు. గోపన్న భక్తికి మెచ్చి చివరకు విడుదల చేశారు.
- **పెన్నలూరి వెంకటాద్రి:** భువన మోహిని విలాసం రాశారు.
- **విశ్వనాదయ్య:** సిద్ధేశ్వర పురాణం (ద్విపదం) రచించారు.
- **అన్నంభట్టు:** తర్క సంగ్రహం రాశారు.
- **కృష్ణమాచార్యులు:** భగవద్గీత (ద్విపద) రాశారు.

What is the profession of Bharat?

Model Questions



Directions (Q.1-5): Study the following information to answer the given questions.

Seven friends, viz Manjit, Naveen, Parul, Hitesh, Tarun, Raghu and Sahil, are pursuing their PhD in different subjects Maths, History, Political Science, Chemistry, Economic, Accounts and Geography, but not necessarily in the same order. They study in three different universities, viz P, Q and S. At least two friends study in the same university. Hitesh is studying Political Science in university P. The one who is studying History is not from university S. Sahil is studying Geography in university Q with only Naveen. Manjit is not studying Economics and is not from university P. Raghu is studying Accounts and is not from university P. Tarun is studying Chemistry but not from university P. No one studies Maths or Economics in university P.

1. Which of the following represents the group that studies in university S?
   1) Hitesh, Naveen
   2) Parul, Raghu, Tarun
   3) Manjit, Tarun
   4) Tarun, Raghu, Manjit
   5) None of these
2. Parul is studying in which of the following universities?
   1) P 2) Q 3) S
   4) Can't be determined
   5) None of these
3. Which of the following combinations is true?
   1) Manjit-Economics-university S
   2) Naveen-History-university Q
   3) Parul-History-university S
   4) Tarun-Chemistry-university Q
   5) None of these
4. Naveen studies which subject in PhD?
   1) History 2) Maths
   3) Economics
   4) Can't be determined
   5) None of these
5. Who among the following is studying History in PhD?
   1) Naveen 2) Parul
   3) Raghu 4) Manjit
   5) None of these

Directions (Q.6-11): Read the following information carefully and answer the given questions.

Eight friends Aman, Bharat, Rohit, Dinesh, Ishant, Farhan, Aditya and Hirender are sitting around a circular table, facing the centre but not necessarily in the same order. Each of them has a different designation, viz Banker, Teacher, Company MD, Politician, Corporate Leader, General Manager, Specialist Officer and CEO. Aman sits third to the right of the CEO. Only two people sit between the CEO and Hirender. The Specialist Officer and the Company MD are immediate neighbours. Neither Aman nor Hirender is either a Specialist Officer or a Company MD. The Specialist Officer is an immediate neighbour of the CEO. The Banker sits second to the left of Ishant. Ishant is not an immediate neighbour of Hirender. The Banker is an immediate neighbour of both the Politician and the Corporate Leader. The Corporate Leader sits third to the right of Bharat. Bharat is not a Specialist Officer. Rohit sits on the immediate right of the Teacher. Aman is not a Teacher. Farhan is not an immediate neighbour of Aman. Aditya is not an immediate neighbor of the Banker.

6. Four of the following five are alike in a certain way based on the given arrangement and thus form a group. Which is the one that does not belong to that group?
   1) Farhan – Teacher
   2) Aditya – General Manager
   3) Dinesh – Banker
   4) Aman – Corporate Leader
   5) Bharat – CEO
7. Who amongst the following sits third to the left of Ishant?
   1) Banker 2) Aditya 3) Aman
   4) Corporate Leader 5) Bharat
8. Who among the following is a General Manager?
   1) Aman 2) Rohit
   3) Hirender 4) Aditya
   5) Dinesh
9. What is the profession of Bharat?
   1) Teacher 2) Banker
   3) Company MD
   4) Specialist Officer
   5) Corporate Leader
10. Who among the following is a Politician?
    1) Rohit 2) Farhan 3) Aditya
    4) Hirender 5) Aman
11. Which of the following is true with respect to the given seating arrangement?
    1) The Politician is an immediate neighbour of the Specialist Officer.
    2) Aditya sits second to the right of Dinesh.
    3) The Politician and the Company MD are immediate neighbours.
    4) The Teacher sits on the immediate left of the CEO
    5) None of these

Directions (Q.12-16): Study the following information to answer the given questions.

In a certain code language:

'firefighters are armymen' is written as 'tee mee kee',

'courageous people are armymen' is written as 'kee loo nee tee',

'courageous being enthusiastic' is written as 'loo pee jee',

'people are enthusiastic' is written as 'kee nee pee' and

'positive people are unpleasant'is written 'nee kee dee see'.

12. What is the code for 'being'?
    1) loo 2) jee
    3) kee 4) pee 5) None of these
13. Which of the following may be the possible code for 'unpleasant firefighters are positive'?
    1) dee see tee mee
    2) dee see kee mee
    3) see tee mee kee
    4) dee see jee lee
    5) None of these
14. What does 'pee' stand for?
    1) courageous 2) positive
    3) army men 4) enthusiastic
    5) None of these
15. Which of the following is represented by the code 'see jee tee pee dee kee loo'?
    1) unpleasant armymen enthusiastic being are positive firefighters
    2) unpleasant armymen enthusiastic courageous positive are being
    3) unpleasant armymen being enthusiastic are positive people
    4) unpleasant armymen being are enthusiastic people.
    5) None of these
16. Which of the following is the code for 'firefighters armymen belong to positive people'?
    1) tee kee cee que loo dee
    2) mee cee loo dee kee see
    3) mee tee cee too dee nee
    4) mee tee cee toe nee see
    5) Can't be determined

Directions (Q.17-21): Study the information and answer the given questions:

Seven people P, Q, R, S, T, U and V live on separate floors of a 7-floor building. Ground floor is numbered 1, first floor is numbered 2 and so on until the topmost floor is numbered 7. Each one of these is travelling to a different city, viz Delhi, Mumbai, Patna, Chennai, Kolkata, Bengaluru and Lucknow but not necessarily in the same order. Only three people live above the floor on which P lives. Only one person lives between P and the one travelling to Bengaluru. U lives immediately below the one travelling to Mumbai. The one travelling to Mumbai lives on an even-numbered floor. Only three people live between the ones travelling to Bengaluru and Patna. T lives immediately above R. T is not travelling to Patna. Only two people live between Q and the one travelling to Kolkata. The one travelling to Kolkata lives below the floor on which Q lives. The one travelling to Delhi does not live immediately above or immediately below Q. S does not live imme diately above or immediately below P. V does not travel to Chennai.

17. Which of the following is true with respect to V as per the given information?
    1) The one who lives immediately below V is travelling to Mumbai.
    2) V lives on floor no. 7
    3) V lives immediately below T
    4) V lives on the lowermost floor
    5) V is travelling to Bengaluru
18. Who among the following lives on floor no. 3?
    1) The one travelling to Chennai
    2) The one travelling to Kolkata
    3) R 4) V 5) T
19. Who lives on the floor immediately above T?
    1) P 2) Q 3) S 4) V 5) U
20. To which of the following cities is S travelling?
    1) Mumbai 2) Bengaluru
    3) Patna 4) Kolkata
    5) Chennai
21. How many people live between the floors on which S and the one travelling to Mumbai live?
    1) None 2) Two 3) One
    4) More than three 5) Three


Answers and Explanations

(1-5):

Friend	University	Subject
Manjit	S	Maths
Naveen	Q	Economics
Parul	P	History
Hitesh	P	Political Science
Raghu	S	Accounts
Sahil	Q	Geography
Tarun	S	chemistry

1. 4 **2.** 1 **3.** 5 **4.** 3 **5.** 2

(6-11):



6. 5 7. 4 8. 1
9. 3 10. 2 11. 4

(12-16):

firefighters are armymen → tee mee kee...(i)
courageous people are armymen → kee loo nee tee...(ii)
courageous being enthusiastic → loo pee jee...(iii)
people are enthusiastic → kee nee pee...(iv)
positive people are unpleasant → nee kee dee see...(v)
From (i), (ii) and (iv) are → kee
From (i) and (ii) armymen → tee
From (i) firefighters → mee
From (iii) and (iv) enthusiastic → pee
From (ii), (iv) and (v) people → nee
From (ii) and (iii) courageous → loo
From (iii) being → jee
From (v) positive/unpleasant → dee/see

12. 2 **13.** 2 **14.** 4 **15.** 2 **16.** 5

(17-21):

Person	Floor	City
S	7	Chennai
Q	6	Patna
V	5	Lucknow
P	4	Mumbai
U	3	Kolkata
T	2	Bengaluru
R	1	Delhi

17. 1 **18.** 2 **19.** 5 **20.** 5
21. 2